శ్రీ పార్వతీ రాజరాజేశ్వరాభ్యాం నమః

శ్రీ నీలకంఠ భాష్యము

(ఆంధ్రీకరణము - ప్రథమాధ్యాయము)


ద్వితీయ సంపుటము



అనువాదకులు - ప్రకాశకులు

నిర్మల శంకర శాస్త్రి

"శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వమన్యత్ పరిత్యజ్య"



శ్రౌత శివాద్వైత సిద్ధాంత ప్రవర్తకులు

శ్రీ నీలకంఠ శివాచార్యులవారు

కాళేశ్వరము.

శ్రీ మప్పిలకంఠ భగవత్పాదులవారి యవతార సమయమును గూర్చి దిగువ విధముగా గ్రహించి శైవులు తదితర పండిత ప్రకాండులును తమ సందేహమును విడనాడుదురు గాక !

కలియుగాది ౨౦౪౪ సంవత్సరమున స్వభాను సం॥ చైత్ర శుద్ధ దశమి, సోమవారము, పుష్య నక్షత్రమున కర్కాటక లగ్నమునందు శ్రీవారి ప్రాదుర్భావము.

జన్మలగ్న కుండలి

కు	ర బు	శ శు	
	కర్కాటకము జన్మలగ్నము		చ గు

శ్లో॥ చతుశ్చత్వారింశ దాత్త-సహస్ర ద్వితయాత్మసు,
కలౌ వర్షేషు వృత్తేషు-స్వభాను శుభవత్సరే॥
మాసి చైత్రే వళక్షే హి-పక్షేఽథ దశమీతిథౌ,
పుష్యమ్యా మిందువారే చ-లగ్నే కర్కటకాహ్వయే॥
గురౌ కర్కటరాశిస్థే-కుజే మీనంగతేఽపిచ,
మేషే రవౌ బుధయుతే-వృషే మందయుతే కవౌ
అభినంద్య సుతం జాతం-సన్నిభం జాతవేదసా॥

గ్రంథకర్త.

RASHTRAPATI BHAVAN,
NEW DELHI-4.
राष्ट्रपति भवन,
नई दिल्ली-4

August 29, 1963.

Dear Sri Sastri,

Thank you for your letter and the book. It is a valuable piece of work, explaining the significance of the first four _sutras_.

With the best wishes,

Yours sincerely,

(S. Radhakrishnan)

Sri Sankar Sastri 'Nirmal'
184, Marredpalli,
Secunderabad (Andhra Pradesh).

ఏతద్భాష్యానువాదమును ఆమోదించిన పండితప్రకాండులచే
ప్రేరేపింపఁబడి రాజ రాజ పోషకులుగా
విశేష సన్మానమును గావించిన
మహోదారులు

శ్రీ యు తు లు

నరాలసత్యనారాయణ, వెంకయ్య గుప్తగార్లు,

ప్రొ ప్ర యి టర్స్

మారుతీ బీడీ కార్యాలయము,

దూదిగామ, మరియు నిర్మల.
ఆం ధ్ర ప్ర దే శ్.

శ్రీ గణేశాయ నమః

శ్రీ శివాయ గురవే నమః

పండితాభిప్రాయములు

బ్ర॥ కె. వి. సుబ్రహ్మణ్యమ్
ప్రిన్సిపాల్
మున్నాలాల్ సంస్కృత కళాశాల,
లాలాగుడి, సికింద్రాబాద్, ఆం. ప్ర.

3-2-1967
శుక్రవారము.

పంచ పద్య పుష్పోపహారః

శ్లో॥ ఆచార్యస్య శివేతరక్షతిపటోః శ్రీ నీలకంఠ ప్రభోః,
భాష్యం విశ్వజనేషు భక్తిజనకం కర్తుం వ్యవస్యన్ ద్విజః ।
ఆంధ్ర్యా దైశికభాషయా సరళయా పూర్ణానువాదం వ్యధాత్,
బ్రహ్మశ్రీ పరిశోభితో విజయతే శ్రీ శంకరః పుణ్యదః॥ ౧

శ్లో॥ లోకే విశ్రుత నామ యస్య సుజనాః శృణ్వంతి రోమాంచితాః,
చేతో యస్య సదా స్మరత్యనుకలం శ్రీరుద్రపంచాక్షరీమ్ ।
అంబయ్యాఖ్య మహానుభావ గరిమా సంకల్పసిద్ధస్య భో,
తస్య ప్రేమపదానుజోఽద్య తనుతే శ్రీ నీలకంఠప్రథామ్॥ ౨

శ్లో॥ వ్యాసప్రోక్త మహావిభూతి లసిత శ్రీ బ్రహ్మసూత్రాణ్యహో,
భాష్యైర్భాంతి మహోజ్జ్వలై ర్దశయుతైః సంఖ్యాత్రిభి ర్భారతే ।
తత్ర శ్రీ శివపారమేశ్వర మహాభూతి ప్రసిద్ధం శుభం,
భాష్యం సార్వజనీన మద్య దయయా శ్రీశంకరార్యో వ్యధాత్॥ ౩

శ్లో॥ శ్రియః సంస్కృతభాషాయాః-దధతం భాష్యపోషణం,
శంకరార్యకృతం గ్రంథం-పూజయంత్వితి సజ్జనాన్॥ ౪

శ్లో॥ ప్రార్థయన్ భగవంతం చ-ప్రార్థయే మనసా శివమ్,
భాష్యానువాద గ్రంథస్య-తత్కర్తుశ్చ శ్రియై భువః॥ ౫

బి. ఓ. యల్. సంస్కృత కళా సముత్తీర్ణౌ
నిర్మల నీలకంఠ రామనాథ సోదరౌ
184 మారేడు పల్లి, సికింద్రాబాదు.

పరాభవ సం॥ మార్గశీర్ష కృ॥పంచమీ
రవివాసరః

శ్లో॥ భవానీశంకరౌ వందే - శ్రద్ధా విశ్వాస రూపిణౌ।
యాభ్యాం వినా నపశ్యంతి - హృదయస్థౌ పరాత్పరౌ॥
అయి భోః శాంభవదీక్షితాః విపశ్చితః !

తత్రభవతాం విదితచరమేవ; యత్ విశిష్టాద్వైత శైవసిద్ధాంతం ప్రతిపాదయతి సుష్ఠు నీలకంఠీయం సూత్రభాష్యమ్;

శ్రీ శివయోగినః మహోపాధ్యాయ బిరుదాంకితాః ముదిగొండ నాగలింగశాస్త్రి ఆరాధ్యవర్యాః భాష్యస్యైతస్య శివచింతామణి సమాఖ్యాం వ్యాఖ్యాం విరచ్య శివాద్వైత స్వరూపం శైవానాం జిజ్ఞాసూనాం వ్యుత్పన్నహృదయానాం సమ్యక్ జ్ఞాపయామాసుః;

తథాపి తత్ గైర్వాణీ పరిజ్ఞాన ప్రాచుర్యవతామేవ సుగమమితి మత్వా శైవాగ్రగణ్య సంప్రేరితాః ఆంధ్రజిజ్ఞాసూనా ముపకృతయే అస్మత్పితృవ్యచరణాః శ్రీ నిర్మల శంకరశాస్త్రిణః ఆంధ్రభాషాయాం మనోజ్ఞం నీలకంఠీయ బ్రహ్మసూత్రభాష్యస్యానువాదం సముల్లిఖ్య చతుః సూత్రీపర్యంతం ప్రథమభాగతయా ప్రకటయామాసుః,

అపిచ

సంప్రతి ప్రథమాధ్యాయాంత పర్యంతం ద్వితీయభాగత్వేన వ్యయప్రయాస క్లేశం సహంతః ప్రకటీకుర్వంతి॥ ఇత్థ మయంగ్రంథః అస్మాదృశానాం గైర్వాణీ ప్రణయినాం ఆంధ్రజననీ స్తనంధయానాం దుర్జ్ఞేయ స్వమత సిద్ధాంత పరిజ్ఞానం వితన్వన్ ముముక్షూణాం సర్వేషాం అవశ్యపఠనీయః ఆచంద్రతారార్కం విరాజతా మిత్యాశాస్మహే॥

మహేశ్వర మాహేశ్వర
సేవాపరాయణుఁడు,
శ్రీ ముదిగొండ ముక్తిలింగశాస్త్రి.

బందరు
బుట్టాయిపేట
4-7-1961

శ్రీ లోకారాధ్యులైన మల్లికార్జున పండితారాధ్యుల నిర్మల శంకరశాస్త్రిగారి పాదపద్మముల సన్నిధికి:

ముదిగొండ ముక్తిలింగశాస్త్రి అనేక శరణులు సమర్పించి చేయు విజ్ఞాపనము:

మాహేశ్వర ప్రవరా!

తాము రచించిన నీలకంఠభాష్యానువాదములో మొదటిభాగమును సాంతముగ చదివినాను. సంస్కృతభాషయందే గాక ఆంధ్రమునందు గూడ అపారమైన పరిశ్రమను చేసినట్లు తమ యనువాద గ్రంథమే చెప్పక చెప్పుచున్నది. తమ గ్రంథము మాదృశులకు కొంగుబంగారమువంటిది. ఈ గ్రంథమును చదివిన తరువాతనే సంస్కృతభాష్యములో గల దుర్జ్ఞేయవిషయములన్ని యవగతము లగుచున్నవి. సంస్కృతము రాని యాంధ్రులకు మీ యనువాదము నేత్రమనుటకు సందియములేదు. ఇదేవిధము భాష్యము నంతయు శీఘ్రకాలములో ననువదించినయెడల మీ యశస్సు భూమండలమున సర్వత్ర వ్యాపించుట ధ్రువము. మీ ప్రతిభం గురించి "జగమెఱిగిన బ్రాహ్మణునకు జందెంబేలా?" అన్నట్లు సర్వులకు తెలిసియే యున్నది గాన నేను ప్రత్యేకముగా వచింప నవసరముండదు.

ఇతి సర్వం శివమ్.

బ్ర॥ ముదిగొండ ఆంగీరసశర్మ
తెలుగు పండితులు
ప్రభుత్వ మాధ్యమికోన్నత పాఠశాల, సంగారెడ్డి

పరాభవ సం॥
పౌష కృ॥ ఏకాదశి.
5-2-1967

తరతరాల భారతీయ చరిత్ర పుటలలో శైవమత ప్రాబల్య ప్రాభవములు జగద్విఖ్యాతములుగా విలసిల్లినవి. పరమాత్మ స్వరూప స్వభావాదులను ఋషులు వేదయుక్తి అనుభవాత్మక విద్యతో సమన్వయముంజేసి భారతీయ తత్త్వశాస్త్ర సౌధమునకు ఉన్నత శిఖరము నేర్పరచినారు.

అట్టివారిలో శ్రీ నీలకంఠ శివాచార్యు లొకరు; వారి మేధాసంపత్తికి మూలమే శ్రీ నీలకంఠభాష్యము; అట్టి మహాభాష్యమును తెనిగించి తెనుగుప్రజకు శైవమత మౌలిక సిద్ధాంతమును దెలుపవలయునను సత్కాంక్షయే ప్రస్తుత యనువాద మహోద్యమము.

అద్యతన సంస్కృతాంధ్ర విద్వాంసులలో నగ్రశ్రేణికిచెందిన శాస్త్రిగారి వైదుష్యము మ ప్రతిభా వ్యుత్పత్తులను నే బేర్కొనుట జగమెరిగిన బ్రాహ్మణునకు జందెమన్నట్లుండును.

ఇఁక ప్రస్తుతము ఈ యనువాదము శైవవాఙ్మయోద్యానవనమున వికసించిన కుసుమగుచ్ఛము. తెలినీటి తేటవాఁకవలె సాగిన వీరి యనువాదసరణి గ్రాంధికులను పామరులను మెప్పింప గలిగినట్లు యున్నదనుటలో విసుమంతయు యతిశయోక్తి లేదు.

శైవమత సిద్ధాంతములను యందలి విశిష్టతను దెలిసికొనుటకు శ్రీ శాస్త్రిగారిచే చేయఁబడిన యీ ప్రయత్నము సంపూర్ణాంధ్ర ప్రజానీక గౌరవాదరణములను పొంద వలయునని, శ్రీవారింకను శివపారమ్యమునుఁ జాటు రచనా వ్యాపారమును నిర్విఘ్న ముగా కొనసాగించవలయునని ఆ శివమూర్తిని ప్రార్థించుచున్నాను.

నాయందలి ప్రేమాభిమానములచే యీ యవకాశము నిచ్చిన శ్రీ శాస్త్రిగారికి యెంతయో కృతజ్ఞుడను.

విధేయుఁడు : ఆంగీరస

శ్రీ అంబారిపేట విశ్వనాథారాధ్యులవారి ధర్మపత్ని, శ్రీమతి కామాక్షీదేవి, లచ్చుపేట, మెదక్ జిల్లా.

బ్రహ్మశ్రీ లోకారాధ్యులైన శ్రీ కంఠ విద్యాభూషణ, సంస్కృత సాహిత్య రత్న, పండిత, నిర్మల శంకరశాస్త్రిగారు తెనుగించిన నీలకంఠ భాష్యమును నా భర్త గారు చదువగా విని సంతసించితిని. ఇదానిని నావలె ఆంధ్రమహిళలు చదివి వినియు సంపూర్ణ ఆంధ్ర భాష్యమును తెలుసుకొనుటకు కుతూహల పడుదురుగాత!

"దీపమున్నపుడే ఇల్లు చక్కబెట్టుకొనవలె" నను సామెత ననుసరించి దేహ ములో జీవాత్మ యున్నపుడే శారీరక బ్రహ్మమీమాంసా సూత్రముల సారమును గురు తెఱఁగి తమ యజ్ఞానమును పోగొట్టుకొనవలసి యుండును. సతికి పతిభక్తి ముఖ్యమై నట్లు ముముక్షువుల కియ్యది బాహ్యాభ్యంతరశుద్ధిని కలుగజేసి శాంభవ దీక్షాసాఫల్యము నొనఁగూర్చునది. మరియు స్వల్పజ్ఞానవతులైన నాబోటి సోదరీమణులకు కరదీపిక వంటిది.

శ్రీ శాస్త్రిగారి ఆంధ్రీకరణము సర్వశాస్త్ర సమ్మతమై శ్రీ కంఠమణిప్రభా మయూఖమను పేరుతో విరాజిల్లుచు శివాద్వైత సిద్ధాంతమును శైవ సంప్ర దాయమును విశదీకరించుటలో నసమానమైనదని మత్ప్రాణేశ్వరుని సమ్మతితో నా యాశయము నిట్లు బయలు పఱచితిని.

వ్యాకరణ విద్యాప్రవీణ, భాషాప్రవీణ,
శ్రీ బులుసు సూర్యప్రకాశ శాస్త్రి,
తెలుగు పండితుడు.

భీమవరము,
పశ్చిమ గోదావరి జిల్లా.
తేదీ 8-12-61

C/o శ్రీ మానేపల్లి సూర్యమాణిక్యంగారు, భీమవరం

ఆస్తిక మహాశయుల కొక మనవి

పురుషార్థములు నాలుగు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు : అందు మోక్షము పరమ ప్రయోజనము. అందులకు సాధనములు శ్రవణ మనన నిధి ధ్యాసములు. వానిలో ప్రథమము శ్రవణము. శ్రవణమనగా గురువులకడ వినుట. ఏమి వినవలె ననగా ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భాష్యము. ఈ బ్రహ్మసూత్రములకు నీలకంఠాచార్య శివయోగీంద్రులు, శంకరాచార్యులు రామానుజాచార్యులు మధ్వాచార్యులను వారలు భాష్యములను వ్రాసిరి. భాష్యములయందు వారివారి మతములను ఆచార్యుల వారలు వ్యక్తము చేసి యున్నారు. వానిలో నీలకంఠాచార్య శివయోగీంద్రులవారిచే వ్రాయబడిన భాష్యము నీలకంఠభాష్యము. అందు శైవమతము చక్కగా ప్రకటింప బడెను. నీలకంఠభాష్యమును బ్రహ్మశ్రీ నిర్మల శంకరశాస్త్రిగారు తెనుగు బాస ననువదించిరి. నేను నీలకంఠభాష్యము అనువాదమును చూచితిని. పఠించితిని. శ్రీ నిర్మల శంకరశాస్త్రిగారి యనువాదము నాలుగు సూత్రములు మాత్రమే చదువుటకు లభించెను. మతములు భేదముగానున్నను గమ్య స్థాన మొక్కటియే. శ్రీ శంకరశాస్త్రి గారి యనువాదముమధురము ఆదరణీయమనుటలో సందేహము లేదు. ఇతర మతముల వారలు గూడ చదువుటలో దోషము లేదు. సర్వమతములును సమాదరణీయములు. స్వమతమును మాత్రము వీడరాదు. శ్రీ శంకరశాస్త్రిగారి నీలకంఠభాష్యానువాదములో నీలకంఠభాష్యము చక్కగా ప్రతిఫలించినది. కొన్ని స్థలములలో వారి మతమును సులభముగా ప్రతిపాదించిరి. కావున సమాదరణీయము, పాఠ్యము. ఇట్లు నీలకంఠ భాష్యము నంతటి ననువదించి ప్రకటించెదరు గాక యని భగవానుని ప్రార్థించు చున్నాను.

శ్రీ నీలకంఠ భాష్యము

వేదవ్యాసరచిత బ్రహ్మసూత్రములకు శ్రీ నీలకంఠాచార్యులవారు రచించిన భాష్యంలో చతుస్సూత్రి కి (మొదటి నాలుగు సూత్రాలకు) ఇది తెలుగు అనువాదము. లోగడ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు నీలకంఠభాష్యం మీద "శివచింతామణిప్రభ" అనే సంస్కృత వ్యాఖ్యానం రచించి భాష్యార్థాన్ని సుగమం చేశారు. అది అందరికీ అందుబాటులో లేదని యీ తెలుగు అనువాదానికి ఈ గ్రంథకర్త పూనుకొన్నారు. పెక్కురు పండితులు వీరి అనువాదరీతిని మెచ్చుకొన్నారు. శ్రీ నాగలింగారాధ్యకృత దక్షిణామూర్తి స్తోత్రము ఆంధ్రతాత్పర్యంతో వింద సంకలితం అయింది. శ్రీ నీలకంఠాచార్యులవారు శ్రీ శంకర భగవత్పూజ్య పాదులకంటె ప్రాచీనులనుటకు కొన్ని యుక్తులు వీరు చూపినారు. అది విశేష విమర్శ విషయం.

సూక్ష్మచిదచిద్విశిష్టుడగు కారణరూపశివుడు స్థూల చిదచిద్విశిష్టుడైన కార్యరూప (ప్రపంచరూప) శివుడు ఒక్కడేయని శివాద్వైత సిద్ధాంతము, నారాయణ (విష్ణు) నామ వినిమయమాత్ర భేదంగా వైష్ణవ సిద్ధాంతం ఇంతే. కార్యరూపమైన విశ్వం కేవలం మాయాకల్పితం మిథ్య. కార్య సాపేక్షంగా కల్పితమైన కారణత్వమే కాని వస్తుతః పరమాత్మయందు కారణత్వంకూడా లేదని శంకరాద్వైతం నిరూపిస్తుంది. పరస్పర విభిన్నములైన యీ ప్రస్థానాలు మూడింటికీ వేదములే ఆధారంగా ఉన్నాయి కాన యివి ఆస్తిక మతములుగా ఉపాదేయములై వున్నాయి.

ఎటొచ్చీ శివశబ్దమే బ్రహ్మపరం అని శైవులు, నారాయణ శబ్దమే బ్రహ్మపరం అని వైష్ణవులు అన్వయించి వ్యాఖ్యానించుకొన్నారు. అది అశబ్దం అన్నారు శంకరులు, ఆ స్థాయిని అందుకోడానికి ముందు ఉపాసన భక్తిస్థాయిలో శైవ వైష్ణవ ప్రస్థానాలు అందరికీ ఉపాదేయాలే. నాయనార్ల, ఆళ్వార్ల స్తోత్ర గ్రంథాలలో ఉన్న భక్తి రస మధుర సారస్వతం అంతా సర్వులకు ఆస్వాద్యం. అలాగే ఆయా శైవ వైష్ణవ సిద్ధాంత రీతులుకూడా అందరూ అవగాహనచేసికోవడం చాలా అవసరం. అది దోషమేమీ కాదు. ఆ దృష్టితో తేటతెనుగులో చక్కగా వివరింపబడిన యీ గ్రంథాన్ని అందరూ చదువవలసిందే శాస్త్ర మర్యాదలతోడి యీ గ్రంథం తెలిగింపు కూడ సులభంగానే ఉన్నది. ప్రశ్నోత్తర రూపంగా శాస్త్ర వాదోపవాదాలుకూడ తేలిక భాషలో వ్రాయుట విశేషమే.

ఆంధ్రప్రభ,
28-2-1967

—దీక్షితులు

-: ఆంధ్ర నీలకంఠీయము :-

శ్రీ నీలకంఠభాష్యము
తా నొక భాష్యంబ యగుటఁ దత్త్వవచన మాం
ధ్రానీక హృదయగోచర
మౌనట్లా లేఖ్య రుచిర మాకృతి వెలసెన్॥
భాష్య ఫక్కికఁ బాయని భాషలోనఁ
బరువులెత్తిన నిర్మలపండితేంద్ర
శంకరారాధ్యలేఖిని శాంకరియయి
తత్త్వవేదిక లాస్య నృత్యమ్ముఁ జూపు.
ధన్య మీ యాంధ్రలోకమ్ము తరుణచంద్ర
శేఖరాద్వైత సిద్ధాంత శేవధియయి
నీలకంఠీయ మాంధ్రాన నిరుపమాన
సరణి వెలయింప మీరలు శంకరార్య.

మూలంపల్లి
చంద్రశేఖర శర్మ,
25-1-1967.

दो बातें

मैंने श्री निर्मल शंकर शास्त्री जी का रचा हुआ श्री नीलकण्ठ भाष्य का आन्ध्रानुवाद अत्यन्त संयम एवं आसक्ति से पढ़ा है। यह ग्रन्थ 'चिन्तामणि प्रभा' नामक टोका के अनुसार रचा हुआ है। इसकी भाषा और शैली सरल तथा सुबोध है।

दर्शन-शास्त्र की कठिन समस्याओं का परिष्कार करने तथा भिन्न-भिन्न वादों का समन्वय करने के स्थलों में अनुवादक ने भाव की अभिव्यक्ति के लिए जो भाषा और शैलो अपनायी है, सचमुच प्रशंसनोय है। यद्यपि इस 'चतुस्सूत्रो' में शिवाद्वैत का ही प्रतिपादन किया गया है, तथापि वैष्णव धर्म और द्वैत का विरोध थोड़े हो मिलता है। अनुवादक ने वेदान्त को सर्व-सम्मत बनाने का भरसक प्रयत्न किया है। प्रज्ञातीत वस्तु का संप्रदर्शन इतनी सुगमता से विरले ही प्राप्त हो सकता है।

मेरी राय में यह ग्रन्थ हर एक हिन्दू धर्मावलंबी को अवश्य पढ़ने और मनन करने योग्य है।

तेनाली
16–11–60

मुदिगोंड विश्वनाथ शास्त्री,

CHAGANTY SANKARASASTRY, M.A., B.L.
Senior Advocate, Secretary
Sri Saiva Mahapeetham

Phone : 34897
3-4-866, Barkatpura,
Hyderabad-27 (A.P.)
Date.: 12-2-1967.

Appreciation of Neelakantha Bhasyam Translation

Author : Sri Lokaradhya Nirmala Sankarasastry

The author, Sri Lokaradhya Nirmala Sankarasastry, who belongs to an orthodox Aradhya Family of true piety and devotion to Parama Siva, a family which traces its descent from Sri Mallikharjuna Panditha, one of the Twelve distinguished Aradhyas of the Andhra Desa held in sublime reverence, is an erudite Sanskrit Scholar with profound proficiency in Saivaite Cult and religious lore. Sri Nilakantha-Acharya, himself one of the Historic Twelve Aradhyas is a superb exponent of Siva-Advitha Philosophy and Saivism, seated on a throne of unsurpassed fame, and adoration. His commentary on the Holy Sage Vyasa's Brahma Suthras, the renowned Nilakantha Bhasyam which unfolds and upholds the Supremacy of the said Philosophy or Sidhanta and religion, is a treatise of highest authority, commanding high respect and reputation in the realm of religion, and is sovereign where it reigns. His interpretations and Siddhanthas are indeed recognised by the Saivaites as the only correct ones. Sri Lokaradhya Nirmala Sankarasastry has rendered unique service by his able and impressive translation of Sri Nilakantha's Brahma Sutra Bhasyam into Telugu, making the Divine Knowledge embodied therein accessible to all the Telugu-knowing people, and also enriching the religious literature in general thereby. The first part of his work was published previously, and won wide approval and appreciation. This second part is now ready, and I hope that the public will receive it with equal acclamation deriving therefrom the valuable enlightenment which it is certain to impart to whoever will endeavour to obtain it and avail himself of its spiritual treasures.

The public at large, inclusive of those who belong to different schools of thought, philosophy and religious practices, will without any detriment to or disparagement of their own cherished firm faith in them, have an insight into the intrinsic excellence of the great Saivaite doctrine, by a dispassionate study of these works. Since the testimony of disinterested thinkers of western culture invariably commands more respect and inspires belief in modern Times, and it will not be treated or under estimated as partisan, partial or blind, it may be advantageous to extract in this context a few such opinions as samples. "The philosophy (Saiva Sidhanta) offers an excellent example of a total philosophy. Both by definition and development the *Saiva Siddhantha philosophy claims to be the acme of religious thought*". (John H. Piet P H D.) "The Saiva Siddhantha System is the most elaborate, influential and undoubtedly *the most intrinsically valuable of all the religions of India*". (Dr. G. U. Pope 19th Century).

Members of the Saiva Community in particular will do well to bear in mind that in the words of Rev. Goodle "This system of *Saiva Siddhanta* possesses the merit *of great antiquity*——. As a system of religious thought, as an expression of faith and life, *Saiva Siddhanta is by far the* best judged by its intrinsic merits *the Siddhantha represents the high water-mark of Indian Thought and Indian Feeling*". Such of them among us, who have the capacity to do so, therefore owe it to themselves and to the hoary community to which they belong, to examine this so highly admired Siddanta independently, be convinced of its infalibility and ardently practice as well as propagate the religion and the philosophy by making such contributions, as is done by our distinguished author Sri Lokaradhya Nirmala Sankarasastry and by his example, or as best as possible otherwise. Such of them among us, who have not such capacity, owe it to their progeny, and are hereby exhorted, to implicitly respect their wise ancestors whose unswerving spirituality and spiritual fervour are their safest guide and anchor at all times, and to transmit to that progeny the noble herdity and tradition which those ancestors transmitted to themselves, by following and fostering that ancestral religion and philosophy, giving no room for its slightest disregard discard or desertion. It is essential for us to remember that what is one's own is always more conducive to happiness and harmony, than any other one, borrowed

from outside and external. In an illustrious article on research in Ayurveda written recently, a great scholar practitioner of Ayurveda of high ability and ardour for that ancient Science, Pandit Sri Srirangam Subbarao Doctor of Ayurveda brought to light an interesting eternal truth enunciated by our Divinely inspired Rishis. He wrote that it is embodied in Charka's Crisp dictum that

యస్మిన్ దేశేహి యోజాతః
తస్య తజ్జౌషధమ్ హితమ్.


whoever is born in a particular country, to him the drug grown in his Native Soil is suitable". If drugs of one's Mother Earth are so efficacious in mending and weeding out bodily ills, religious faith, precept and practice, inhered from and nourished on the sacred soil of one's own mother pedigree, heredity and tradition, must undoubtedly be more efficacious and exclusively potential to eradicate all the accumalated spiritual ailments or sins, and confer the blessing of spiritual bliss of far greater moment on every such individual, and sect.

Turning once again to our learned Author Sri Lokaradhya Sankarasastry, no encomiumbestowed on, or encouragement extended to him will be an adequate acknowledgement of the deep debt of gratitude due to him for his valuable spiritual contributions. Finding none else better, I blend both my palms to offer my Pranamams to him in humble recognition of his scholarship and service (to the Saiva Community as well as the wider humanity). That scholarship and service are both of high order for which these two parts of translation of Nilakantha Bhasyam and his other similar works of eternal worth and everlasting vitality will be self evident elequent proofs.

SIVAYA NAMAHA.

CHAGANTY SANKARASASTRY
Advocate, Secretary
Saiva Maha Peetham
12-2-1967.

శిష్టాః సర్వే శివం ప్రపన్నాః



బ్రహ్మశ్రీ॥ లో॥ మూలంపల్లి శివలింగారాధ్యులవారు
తత్సతీమణి చండికాంబగారు
నివాసము - లచ్చుపేట, మెదక్‌జిల్లా, (ఆం. ప్ర.)

శ్లో॥ మూలంపల్ల్యబ్ధి సంభూతాన్ - సాంబయారాధ్యసంభవాన్,
నాగాంబాగర్భముక్తాభాన్ - శివలింగాఖ్యయోగినః ।
గణార్చనరతాన్ వందే - శ్రౌతశైవ గురూ నహమ్॥

లచ్చుపేటయందు పూర్వము బ్ర॥ మూలంపల్లి సాంబయారాధ్యులవారు అఖండ తపః సంపన్నులై నిరంతర మాహేశ్వరాన్నదానమును షట్కాల శివపూజనమును చేయుచుండెడివారు.

ప్రతివత్సరము మహాశివరాత్రిని రుద్రస్వాహాకారములను సూర్య (శూన్య) సింహాసనముపై గురుచరేశ్వరారాధనమును తమ జీవితాంతము వరకు గావించిన శివయోగనిష్ఠా గరిష్ఠులు;

శ్రీవారి జ్యేష్ఠపుత్రులు మన శివలింగారాధ్యులవారు. వీరును జనకునివలె నిత్యనక్తవ్రతము శివపంచాక్షరీజపము మొదలగు కఠిన నియమములతో శివప్రీతికి పాత్రులగుచున్నవారు. మఱియు ప్రతివత్సరము మాఘ బహుళమున శైవగణార్చనం జేయుచు అప్రతిమ కీర్తి నార్జించినవారు. ఉదారహృదయులున్ను;


వీరి యనుజుని పత్ని యగు భ్రమరాంబగారు సరళహృదయురాలు, వీరి జ్యేష్ఠపుత్రుడు బ్ర॥ రాజమల్లయ్యగారు, ఇ:క కనిష్ఠపుత్రుడు - బ్ర॥ రాజశేఖరశాస్త్రి అనువారు; న్యాయము వేదాంతము ఆయుర్వేదము ఇత్యాది విద్యలలో నిష్ణాతులగు శ్రీ శాస్త్రిగారు విజయవాడ, వరంగల్లు మొదలగు చోట్ల విద్వత్సభలయందు భాష్య ప్రవచనాదుల నొనర్చి పండిత ప్రకాండులను నిరుత్తరులం జేయుటయే గాక ముగ్ధులం గావించిన ప్రతిభతో విరాజిల్లువారు.

ఏతాదృశగుణగణములతో అపూర్వ ప్రభావముతోడను శ్రీ శివలింగారాధ్యుల వారి కుటుంబము ఆచంద్రతారార్కము విలసిల్లుగాత యనియు శ్రీ ఆరాధ్యులవారు ఈ ముద్రణకు విశేష సాహాయ్యము నొనర్చిరనియు తెలుపుటకు సంతసించుచున్నాను.

గ్రంథకర్త.



శ్రీ గురుమూర్తి, విద్వాన్, కామర్సు **చంద్రమౌళిశాస్త్రి** ఆరాధ్యులవారు,
మరియు వారి ధర్మపత్ని, విదుషీమణి, కామర్సు **కమలాదేవి,**
నిజాంసాగర్, ఆంధ్రప్రదేశ్.



श्री कामर्सु, चंद्रमौळि शास्त्री महाराज,
सौ. कमलादेवी, निजांसागर.



సౌభాగ్యవతి కామర్సు కమలాదేవి.

(బ్ర॥ కామర్సు చంద్రమౌళి శాస్త్రిగారి ధర్మపత్ని)

మహారాజ పోషకులు

బ్రహ్మశ్రీ లోకారాధ్యులైన విద్వాన్,

కామర్సు చంద్రమౌళి శాస్త్రిగారు, లచ్చుపేట, మెదక్ జిల్లా.

సంస్కృత సాహిత్యమునందు, ఆయుర్వేదమునందును సంపూర్ణ ప్రవేశముగల వీరు బ్రహ్మశ్రీ॥ లో॥ కామర్సు సుందరారాధ్యులవారికి మహాసాధ్వియగు రత్నాంబ

యందు కనిష్ఠపుత్రులుగా జన్మించిరి. వసిష్ఠగోత్రికులు. వీరి జ్యేష్ఠసహోదరులు (1) బ్ర॥ లింగమూర్తిగారు (2) బ్ర॥ రాజమౌళి ఆరాధ్యులు (3) బ్ర॥ వీరమౌళి గారు. ఇక నాలుగవవారే మన శాస్త్రిగారు.

శ్రీ శాస్త్రిగారు బాల్యకౌమారములయందు వేదశాస్త్రముల నభ్యసించి యౌవనము మొదలుకొని యనేక సభలయందు మహోపన్యాసములను పురాణ ప్రవచనములను గావించిన యంశము సుప్రసిద్ధమైయున్నది.

శ్రీశైల మహాక్షేత్రమున శివయోగము నభ్యసించిన ప్రతిభాశాలురు. శివభక్తి వీరికి, వీరిధర్మపత్నికిని కొంగుబంగారమువంటిది.

వీరిధర్మపత్ని - మైసూరురాష్ట్రములోని పాండవపురమున భారద్వాజగోత్రికులగు యన్. దాసప్ప, సౌ. వెంకటమ్మ అను వైదికపుణ్యదంపతులకు మూడవ కూతురుగా జన్మించిన సౌభాగ్యవతి పేరు కమలాదేవి.

అగస్త్యునికి లోపాముద్రవలె శ్రీ శాస్త్రిగారికి సహధర్మచారిణియై తోడు నీడవలె నుండును. ఇట్టి ఆదర్శదంపతులు కడుంగడు ప్రశంసనీయులని నివేదింపనైనది.

గ్రంథకర్త.

శ్రీ

ఏకశిలానగరము (వరంగల్లు) నందు

శ్రీ దుర్గేశ్వరస్వామివారి ఆలయమున

చతుఃసూత్రి అనువాదము (ప్రథమభాగము)ను నాతో ప్రవచనమును చేయించి ద్వితీయభాగ ముద్రణమునకై ప్రోత్సాహ మును కలుగఁజేసినవారు, మరియు ఈ (ద్వితీయభాగ) గ్రంథమును సముద్ఘాటనముఁగావించు మహోదారులు. వణిక్ ప్రవరులు నగు శ్రీయుత పడిశాల వీరభద్ర శ్రేష్ఠిగారు-శివాద్వైతసిదాంతాభి రుచిగలవారిలో నగ్రగణ్యులనియు, శ్రీముదిగొండ శంకరారాధ్యుల వారి శివభజన కీర్తనలు మున్నగు రచనల నచ్చొత్తించి యాగ్రంథ ములను మాహేశ్వరులకు నుచితముగా సమర్పించుచు ప్రతి శైవారాధ్యునకు నొక్కొక్క సువర్ణ(నవరస్) ముద్రిక మున్నగు వాని నొసఁగి యపారకీర్తి నార్జించిన వారనియు తెలుపుటకు మిగుల సంతసించుచున్నాను.

శ్రీ గణేశ కుమార వీరభద్రాది పరివార సహితులైన పార్వతీ రాజరాజేశ్వరులు శ్రేష్ఠిగారికి తదితర ప్రముఖులకును చిరాయురారోగ్యభాగ్యముల ననుగ్రహించి యవ్వారిని సకుటుంబ ముగా ననవరతము రక్షింతురు గాత !

గ్రంథకర్త.

శ్రీ గణేశాయనమః

పీఠిక

న్యాయవేదాంతాయుర్వేదాభిజ్ఞులు

బ్ర॥ మూలంపల్లి రాజశేఖరశాస్త్రిగారు, లచ్చుపేట

(శ్రీకంఠ భాష్యాంధ్రానువాదము ప్రథమ సంపుటము తరువాయి)

పై విమర్శచే శ్రీకంఠభాష్యము శంకరభాష్యమునకంటె ప్రాచీనమైనద సిద్ధమైనది.

శంకరాచార్యుల భాష్యరచనకు విశేషముగా తోడుపడినదిద్దియే; "అథాత బ్రహ్మజిజ్ఞాసా" అను ప్రారంభమునుండి చతుః సూత్రియు ఆనందమయా కరణము, ద్వితీయాధ్యాయంబు శాంకరభాష్యమున ఇంచుమించు శ్రీకం శివాచార్య గతానుగతిక మనకు తప్పదు.

శంకరుఁడు సూత్రగతార్థమునే నిరూపించెను గాని శ్రీకంఠాచార్యు ననుకరింప లేదననిచో కొన్ని మతములు సూత్రకారుని యనంతరము మరికొని తత్పూర్వము నేర్పడినట్లు తెలియుచున్నందున ద్వితీయాధ్యాయమున సూ కారుడు సూత్రములచేతనే కొన్ని ప్రాచీన మతములను ఖండింపగా బౌద్ధ జైనా మత నిరాసమును శ్రీకంఠాభిప్రేతముగా శంకరుడు వివరించుటను తత్తద కరణములలో చూడనగును. అయిన నర్వాచీనములగు బౌద్ధజైన వాదముల సూత్రకారుఁడు నిరసింపకున్నను శ్రీకంఠాచార్యులు తన్నిరాసమును ప్రా వాడగుటచే సూత్రానభిప్రేతార్థ ప్రతిపాదకత్వము శ్రీకంఠభాష్యమున కళంక మగుననుట సరిగాదు. సూత్రకారుని కాలమున బౌద్ధజైన నామము లేకున్నను తత్సదృశవాదములు బీజరూపమున పొడసూపగా నవ్వానిని తజ్జ్ఞ యాచార్యులు తదనంతరులగుటచే నవ్వాని నామధేయములఁబట్టి తత్సాదృశ్య ననుసరించి వివరించి నిరసించిరి. అట్టి పద్ధతినే తదితర వ్యాఖ్యాతలు ప్ర యున్నారు. అందువలన శంకరుల భాష్యరచనకు శ్రీకంఠీయ భాష్యము మ దర్శక మనుటలో సందియము లేదు.

"కథ మసతః సజ్జాయేత" అను శ్రుతి - బౌద్ధాంగీకృత అసత్కార్య వాదమును నిరసించినందున "బౌద్ధమతము తరువాతిది శ్రుతి" యనుట బాల భాషితము గాదా ?

కావున శ్రీకంఠపథము రాజమార్గముగా ఇతరాచార్యులకు ఐనదనుట సమంజసమగుచున్నయది.

శ్రీ కంఠాభిప్రేత సూత్రార్థ నిర్వచనము తాత్త్వికమగు నెడ నద్దానినే గ్రహింపక శంకరాచార్యులు భాష్యాంతర రచన నేల యారంభించిరనినచో నాలకింపుడు.

శంకరుడు సమయోచితప్రజ్ఞ గలవాడు. సర్వతంత్ర నిష్ణాతుడు: అప్పుడు కుమారిలభట్టు ఖండించిన బౌద్ధమత జ్యోతి చల్లారలేదు. లోలోన రాజుచుండుటను గమనించి బౌద్ధులగు గోవింద భగవత్పాదులను స్వపరమగురువులనుగా లోకమున కెరుకపఱచి బౌద్ధమతమునుండి మాయావాదమును గ్రహించి ఆస్తిక్యమును వైదికాచారములను కాపాడెను. అయ్యవి కాపాడబడునెడ "తదనంతరము వారు మాయావాద విరహిత కర్మజ్ఞాన సముచ్చయముతో (కూడిన) పరతత్త్వోపాసన మార్గమునకు శంకుస్థాపనఁ గావింతు" రని భావించిరి.

లేనిచో "ఋషిహృదయమును గుర్తెరుగుటకు ఋషియగువాడే తగు"నను నానుడి ననుసరించి బోధాయనవృత్తి సూత్రానుగతమైనదని గ్రహించినను అద్దానిని సమయోచితముగా కాదని పైరీతిగా స్వమతము నుపపాదించిరి. తథాఽపి శంకరాచార్యులు ప్రతారకులనుటకు వీలులేదు. రోగికి తదిచ్ఛానురూప వస్తు సమ్మిళితముగా చేసి మందు నిడు వైద్యునివలె బౌద్ధమత రోగగ్రస్త లోకమునకు తద్రూపకంచుకాంతరిత వైదిక ధర్మమును ఆస్తిక్యమును బోధించుట దోషావహము కాదు. ప్రత్యుత గుణావహమై యున్నది.

గోవింద భగవత్పాదులు బౌద్ధులెట్లనిన ? తద్రచిత గౌడపాద కారికల యందలి మంగళాచరణము ఆస్తికులెల్లరి కచుంబితరీతిని "ద్విపదాంవరమ్" అనునది నిదర్శనము. ఇద్ది దేవతావిశేషనామధేయము గాకుండుట గమనార్హము.

అట్లే అలాతోదాహరణము, నిర్వాణము సంవృతి మొదలగు పదజాలములు, రచనా పద్ధతియు, బౌద్ధగ్రంథరీతినే విశదపఱచునవి. అట్లైనచో శంకరా

చార్యులు కారికలకు వ్యాఖ్యానము నెందుకు వ్రాసినారనిన అవ్వాని కన్యార్థములను కల్పించి స్వాభిప్రేత వైదిక మార్గమునకు లాగినారని పైననే సూచింపంబడినది.

శ్రీకంఠుఁడు శంకరభగవత్పాదులకేగాక రామానుజాచార్యులకును మార్గదర్శకుడైనాడనుట వింతగాదు.

శ్రీ రామానుజాచార్య సమయమున శంకరాద్వైతము విభిన్న పద్ధతులలో మిక్కుటముగా తాండవ మాడుచుండెను. శ్రీకంఠీయము కనుమఱుగై యుండెను. అట్టితఱి శ్రీకంఠ శంకర భాష్యములలో సూత్రానుగత మెద్దియో కనుగొనందలచి రామానుజుఁడు స్వప్రజ్ఞాబలంబున శ్రీకంఠీయమే సూత్రానుగత తాత్పర్యోద్భాసితమని గ్రహించి శివపరత్వమును మాత్రము త్రోసిరాజని సూత్ర వ్యాఖ్యానమును మక్కికి మక్కి ఒనగూర్చినాడు.

ఒకానొక సర్వశాస్త్ర కోవిదుఁడగు మతాచార్యుఁడు పరమత భాష్యమును సంగ్రహించిరనుట చెల్లదనినచో స్వతంత్ర ప్రజ్ఞాసంపన్నులగు రామానుజ ఆచార్యుల దృష్టికి నీలకంఠీయాభిన్న సిద్ధాంతము కనుపడినదన్నను నీలకంఠాచార్య సిద్ధాంతమున కలంకారమే యగును.

అట్లుగాక నీలకంఠ శంకర రామానుజ భాష్యములను నిష్పక్షపాత బుద్ధితో చూచినచో శ్రీకంఠీయభాష్యము ప్రాచీనమని యంగీకరింపవలసివచ్చును. మృదుమధురమైన గంగానిర్ఝరిణివలె సాగిపోవుచు అల్పవాక్యమున విపులార్థ రచనం గలిగి స్వమత పోషణమందక్క నితర మత ఖండనయందు తత్పరత్వము లేకుండా శ్రీకంఠభాష్యము కన్పట్టుటకు హేతువెద్దియని పరీక్షకుల దృష్టికి దోపకబోదు. అద్దానికి శాంకరమతము శ్రీవారి కాలమున పుట్టకుండుట భాట్టమతము నైకశాస్త్రయ్యముతో సమర్థించుట కారణముగా నాస్తికమత విరాసముతో మాత్రము తృప్తినందిరి.

శంకరాచార్యులవారి కాలమందుననో భాట్టమతము విశేషముగా విజృంభించినదై దైవాస్తిత్వమునే నిరసించు నంతవరకు జనుటవలన నద్దానిని ప్రతిఘటింప రెండంతలు బలమవసరమైనది. దాన ప్రధానమల్ల నిబర్హణ న్యాయాదుల సమంజసములు గాకుండెను. తదనంతర ప్రాప్తమగు రామానుజ సిద్ధాంతమునకు అద్వైత మొక్కటే కడు కంటక ప్రాయముగా నుంటమి అద్దియు (అద్వైతము)

తదనంతరాద్వైతులు ప్రతిపాదించిన మెరుగులతో నాస్తికత్వసమాన ప్రతిపత్తికి బీజరూపమగుటను గాంచి శ్రీ రామానుజాచార్యులు సవిమర్శముగా నద్వైత మును ఖండింపవలసి వచ్చెను.

ఈ రీతిగా చూచినను శ్రీకంఠాచార్యులు ప్రప్రథములనక తప్పదు.

సూత్రానుగతభాష్యమెద్ది?

"ఋషిత్వమును ఋషియే కనుగొను" నని పైననే సూచింపఁ బడినది గాన బాదరాయణ సూత్రములను బోధాయనవృత్తి ననుసరించి శ్రీకంఠా చార్యులు వ్యాఖ్యానమును రచించిరి. గీతాభాష్యమును గూడ నట్లే వ్రాసిరి గీతకు బోధాయనవృత్తి యున్నట్లు (ఆనందగిరి ౨ అ. ౧౦ శ్లో॥) శాం కరగీతా భాష్యమున వివరింపఁ బడినది. **అట్టి వృత్తి నేతదనుగత భాష్యమునే శంకరులు ఖండించియుండనోపు.**

శ్రీకంఠభాష్యము సంప్రదాయానుగత మైనది. ప్రాచీన సంప్రదాయ మును సరకుగొనక కేవలతర్క ప్రతిభాప్రభావమున విలసిల్లినది శాంకరము; అందువలన నద్వైతేతర పండితులు శంకరుఁడు ప్రచ్ఛన్నబౌద్ధుడనియు విదేశీయ విమర్శకులు శంకరుని వ్యాఖ్యానము సూత్రానుగతమైనది కాదనియు తెలిపిరి.

భాష్యకర్తలందరు సూత్రముల ననుసరింపలేదు గాన శంకరుని భాష్యము సరిగాదననేల? (పుట 370, సంపుటము 2, ఇండియన్ ఫిలాసఫీ) ఇట్లనుటలో తాత్పర్యము-ఇతరుల తప్పులను చూపుచు తన పిల్లవాని తప్పును సమర్థించు తల్లి చందమున హాస్యాస్పదమగును. ఇందువలన తేలినదేమనగా? సూత్రకారునితో శంకరుఁడు భేదించినాడని విశ్వేశ్వరానంద రాధాకృష్ణులు గాక "నస్తౌమి తంవ్యాస మశేషమర్థం-సూత్రైః సమస్తైర్నబబంధ సమ్యక్, వినాఽపి తైః సంగ్రథితాఖిలార్థం-తం శంకరం నౌమి సురేశ్వరంచ, "స్వాభీప్సి తార్థమును నిర్వచించని వ్యాసులను నమస్కరింపననియు వ్యాససూత్రములలో లేని విషయముల ననువదించి కూర్చిన శంకరుని సురేశ్వరుని నమస్కరింతు" నని మధుసూదన సరస్వతి వ్రాయుచ్చెను. పై వివరణముచే సూత్రవిరుద్ధమైనది శంకర భాష్యమనుట నిస్సంశయము. మరియు ఆధునికులు పలువురు "శంకరుఁడు సూత్రములకంటె శ్రుతులకు సన్నిహితుడ"ని చెప్పినచో సూత్రవిరుద్ధార్థము శ్రుతు

లలో లేనందున శ్రుతిసన్నిహితుడగు శంకరుఁడు వేదప్రతికూలములగు సూత్రములకు వ్యాఖ్యానము నొనర్చుట నిష్ఫలంబగును. ఇంతియేగాక వ్యాసుఁడును వేదవిరుద్ధ సూత్రములను రచించినవాడగుటచే ప్రమాణభూతుఁడు కాకుండును.

వీరేగాక బౌద్ధులును "ఏతేన ఆధునికానాం వేదాంతి బ్రువాణా మపి మతం విజ్ఞాన వాదతుల్య యోగక్షేమతయా నిరస్తమ్"

విజ్ఞానభిక్షువు, సాం॥ప్ర॥భా. ౧

ప్రాచీనాగమ పురాణ భగవద్గీతోపనిషదము లనేకముల ననేక పర్యాయములుదాహరించి శ్రీకంఠీయము సంప్రదాయానుగతత్వమును చూపుచున్నది.

శైవమతము. తత్త్వశాస్త్రము.

ఆధునికులు పాశ్చాత్య విచార దర్పణములచే భారతీయార్ష సంప్రదాయములను విమర్శింప సమకట్టిరి. వారి యూహలు పాశ్చాత్యులకుగూడా నాశ్చర్యమును కలిగించునట్టివి. ఇట్లు పరవిచారానుకరణ బద్ధాదరులై అనాది సంప్రదాయములనే విమర్శింపఁబూనిరి.

ఆర్యులు భారతీయులు కారనియు అనార్యులే భారతీయులనియు వేదములు ఆర్యులప్పుడప్పుడు పాడిన పాటలనియు ఆగమము లనార్యులవనియు ఆగమములు వేరు, వేదములు వేరు, ఆర్యులు వేరు, అనార్యులు వేరు, అని భారతదేశ పవిత్ర సంస్కృతినే విభజింప సమకట్టిన అంధులను నామార్గము నవలంబింప వెనుకాడని యంధ పరంపరను జూడ జాలి గలుగుచున్నయది.

వైదిక సమాజ మొకరీతిగా నుండవలెననిన విభిన్నతకు తావులేదని వారు మొదలు నిర్ణయించుకొని వేదవిమర్శకు కడంగవలెను. అట్లుగాక వేదములలో నాగపూజనము వృక్షపూజనము ఏదైన చెప్పబడిన నద్ది యనార్య సంప్రదాయమనియో లోకవేద విరుద్ధ సంస్కృతికి సంబంధించినదనియో చెప్పుట యొకానొక ప్రహతమైనది.

ఒక సమాజమునందు సర్వవిధ ప్రకృతులు గలవారుండవచ్చునని యంగీకరించిన వైదికకాలమునందు నిమ్నశ్రేణియందు గల దేవతలను పూజించుటయు సమున్నతమైన పరమేశ్వరార్చనయు తత్త్వవిచారకశ్రేణి యుండవచ్చునని

యంగీకరింపవచ్చును గదా! ఋగ్వేదమును చదివిన పాశ్చాత్యు లెందరో యనేక స్థలములందు తత్త్వవిచారము కలదని నుడువలేదు.

"ఋగ్వేదకాలమున తత్త్వవిచారము కలదను నెడల నట్టి తత్త్వవిచార మలవడు నెట్లు? అట్లు స్ఫురించిన దనినచో నకాలమున తత్త్వవిచార మున్నత దశలో నున్నదని యంగీకరింపక తప్పదు.

అని యరవిందఘోషు విమర్శించెను.

తత్త్వజ్ఞానమునకు సంబంధించిన విషయము చాలా తక్కువ యనినచో మంత్ర సంఖ్య తక్కువ యున్నను తత్త్వవిచార మెంత గొప్పదియో తెలిసికొనుట యావశ్యకము.

లోకమున తత్త్వజ్ఞానుల సంఖ్య యితరుల కంటె తక్కువ యుండును. ఇతర గ్రంథముల దృష్ట్యా తత్త్వజ్ఞాన గ్రంథములు చాల తక్కువే గదా!

వాఙ్మయములో లేని విషయములను గ్రహించి కుతర్కముల నొనర్చుట పాశ్చాత్య విద్యావిదుల రెండవదోషము. ఋగ్వేదమున ఉప్పు లేదనియు ఉన్నచో నద్దాని నుదాహరింప లేదనియు వేదపురుషునికి సముద్రము గుర్తులేదనియు దోష భావమును గ్రహించినను పంజాబులో ఉప్పునకు సంబంధించిన ఖనిజరాసు లనేకములున్నవి గదా!

ఇట్టి దుర్వాదములను దూరమొనర్చి విచారించినచో ఋగ్వేదము సమస్త వస్తువులఁజెప్పు నిఘంటువగునెడ ఋగ్వేదమునందు సర్వవిషయములు సర్వవస్తువులును రావలసియుండును. ప్రసంగవశమున సర్వవిషయములు సర్వవస్తువులును సంపూర్ణముగా రావచ్చును రాకపోవచ్చును. ఋగ్వేదమునందు మొదటి మండలముననే 99వ సూక్తమున (1000) వేయి మంత్రములు నష్టమైనట్లు కాత్యాయన ఋషి యొక్క సర్వానుక్రమణికవలనఁ దెలియుచున్నది.

ప్రస్తుత వైదిక వాఙ్మయము పరదేశీయుల దాడులచే యెంత నష్టమై యుండవచ్చును? ఇద్ది సామాన్య చరిత్రజ్ఞానము గలవారికి గూడా తెలిసినదే; అవిచ్ఛిన్న సంప్రదాయము వేదమూలమైనదని మంగళాచరణమునకు న్యాయవాదుల వాద మిచ్చోట గనుగొనగలరని తెలుపుచున్నాడను.

వేద వేదాంతముల యందు చెప్పఁబడిన సిద్ధాంతములకు పూర్వము వానిపై గల విచారము (శంకాసమాధానాదికము) తార్కిక దృష్టితో వివరింపఁబడి యుండదు. తదనంతర విరచిత దర్శనములవలె సాధకబాధకములను విచారించి వ్రాయఁబడినది కాదు. అందువలన వేదవేదాంతములఁ జదివి యవ్వానియందు నిరూపింపఁబడిన దెద్ది? యని విచారించుట తప్పుగాదు. కాని మానవచరిత్ర ననుసరించు వైదిక వాఙ్మయచర్చ చేయవలెననుట సరిగాదు.

ఆధునిక పరిణామవాదులు-జడములు తదనంతరము చేతనులు జలచరములు పశువులు మానవులని చెప్పు స్వకపోలకల్పనలఁ జేయు వాదము మరియు నాలుగైదు వేలేండ్లకు పూర్వము సృష్టియే లేదను క్రీస్తువాదము, రెండు వేలేండ్లకు పూర్వము లేమిచే హాస్యాస్పదము లగుచున్నయవి. ఇక ననాది సర్గమునకు ప్రతిసర్గముఁ జెప్పు వేదముల విషయము నప్రామాణిక మనఁ జెల్లునా?

భాషాసాదృశ్యముచే సమాజైక్యమును సాధింప నెంచుటయు దోషమై యున్నది. స్వరయంత్రమునకు చెందిన మానవ ప్రకృతి సాదృశ్యమున విభిన్నవాసులకు సామ్యముగల పదములు కొన్ని యున్నంత మాత్రమున నేకదేశీయులుగా చిత్రింప నుంకించుటయు దోషమే గాన సంప్రదాయ సిద్ధచరిత్ర వలన నిర్ణయింపబడినదే సత్యము.

ఆగమములు శ్రుతులు పరస్పరము సహకారము కలిగి విరాజిల్లుచున్నయవి. వేదములకు శివాగమములకును భేదము లేదనియు ప్రాచీనుల యాశయము. వేదములుండగా ఆగమము లేలయన? అధికారి (ర) భేదము ననుసరించి శైలీభేదమేగాని అర్థభేద మావంతయు లేదని విద్యాస్థానవినిర్ణయమను గ్రంథమున మద్గురువర్యులగు బ్ర॥ ముదిగొండ నాగలింగశాస్త్రి గారిచే సోపపత్తికముగా నిర్ణయింపఁబడినది. కావున ఆర్యానార్య భేదకల్పనము - భారతదేశ సంస్కృతి ఐక్యమును వినాశ మొనర్పు తలంపున కల్పింపఁ బడిన పాశ్చాత్య వైదుష్యమునకు తావీయకుండుటే శ్రేయోదాయకము.

"ఆర్యుల చరిత్రము—— భారతదేశ చరిత్రమగును. భారతీయ సంస్కృతి ఆర్యులే మూలపురుషులు" అని ఇ. బి. హావెల్ పండితుఁడు "ఆర్యన్‌రూల్ ఇన్ ఇండియా" అను గ్రంథమున వ్రాసెను.

"భారతీయ సంస్కృతి సర్వస్వము వేదములయందు గలదు. ఈనాటి ప్రజా స్వామ్య పద్ధతికి నవసమాజ నిర్మాణమునకును బీజము లవ్వానియందే గల"వని రాధాకుముద ముఖర్జీ "గ్లింప్సెస్ ఆఫ్ వనిస్సెంట్ ఇండియా" అను గ్రంథమున వివరించిరి.

"తుష్యతు దుర్జనః" అను న్యాయము నంగీకరించి విచారింతము. ఆర్యులు రాకపూర్వము భారతదేశ సంస్కృతి యెద్ది ? ఆర్యుల సంపర్కమున పెంపొందిన దెద్దియో చూతము.

మెహంజోదోరోడ్, హరప్ప మొదలగు సింధుప్రాంత భూగర్భ పరిశోధన లో నర్చిన వారిలో బిషప్ కాల్డ్వెల్, శ్రీనివాస అయ్యంగార్ ముఖ్యులగువారు. మరికొందరు మారిమన్ వీలర్ పిగ్గాట్ మొదలగువారు. ఆనాటి ప్రజల నగర నిర్మాణ దక్షత, గృహనిర్మాణ విధానము, ఉపకరణములు, పాత్రలు, మృణ్మయ దర్పణములు, నీటిపారుదల, భోగములు, భూషణములు, ఉద్యాన కల్పనలు, వీధులు, కళాకౌశలము ఇత్యాది విశేషములు ప్రస్తుత నాగరికులకు దిగ్భ్రమను కలిగించునవిగా యున్నవని తెలిపినారు.

మరియు సంస్కృత భాషయందలి కదళీ కార్పాస నింబ జంబుక నారికేళ అలాబు శ్యామ పదములు నదీనామములు స్థల నామధేయములును నిషాద భాష నుండి వచ్చినవే యనియు, వ్యవసాయము, తోటలు వేయుట, చెరుకు పండించుట, పంచదార చేయుట, పసుపు కుంకుమ తాంబూలముల నిచ్చుటయు, నిషాదుల యాచారములు కావున నవ్వారి మతప్రచారము లీనాడు భారతీయులందరిలో చెల్లుచునేయున్నవి. వారారాధించు దైవములు-నాగదేవత, కాళీశక్తి, శివలింగ ములు నైయున్నవి. వారి వ్రాత విజ్ఞులకుగూడ తెలియరానిది. వివాహాది శుభ కార్యములు నవార్యులగు ద్రావిడుల యాచారములని వివరించిరి.

"భారతీయుల ఆర్థికవిధానము ఆచార వ్యవహారములు, వేషభాషలు, మత సంప్రదాయములును ఆర్యులకు పూర్వమే విస్పష్ట రూపమును ధరించి యున్నవి" ముజుందార్.

కర్ణాటక భాషా నిఘంటు నిర్మాతయగు కిట్టల్ దొరగారి వివరణ ప్రకా రము సుమారు 100 నిషాద శబ్దములు 450 ద్రావిడశబ్దములును సంస్కృతమున గలవని తెలియుచున్నది.

పై విశేషములు నాగరికతా మూలము లైన ననార్యుల యాచారములని నుడువుట నుడిగిన మానవత్వముగూడ నుండునాయని విజ్ఞులూహింతురు గాత!

అందువనే భారతీయ సంస్కృతి యనఁగా? ఆర్య సంస్కృతి మాత్రము కాదనియు భారతీయ సంస్కృతి వికాసమునకు నిషాద ద్రావిడజాతులే యార్య జాతికంటె నధికముగా దోహదమును చేసినవనియు శ్రీ కల్లూరి బసవేశ్వర రావు గారు ఆంధ్రపత్రిక సంచిక 1963 లో వ్రాసినారు.

శివుఁడు ద్రావిడుల దైవము. కృష్ణుఁడు వైదిక దేవతయగు ఇంద్రునికి విరోధి. విష్ణువు నల్లనివాడగుటచే ద్రావిడదైవము. విష్ణువాహనమగు గరుత్మంతుఁ డనార్యదైవము. అణ్, మంతి యనగా మగకోతియని ద్రావిడుల యర్థము. అద్దియే వికృతిఁజెంది హనుమంతుఁడాయెను. ఆర్యులు పత్ర పుష్పములతో పూజించ నెరుఁగరు. హోమము నెరుఁగుదురు. పూ. అను పదమునకు పూవనియు జె. యనఁగా చేయుటయనియు పుష్పకర్మఁజేయుట (The vedic age P.C. మజుందారు) "పత్రం పుష్పం ఫలం తోయమ్" అని ద్రావిడాచారము భగవద్గీతల వర కెగబ్రాకినది. దుష్టశిక్షణ శిష్టరక్షణలకై యవతారము నొందుట నిషాదుల సిద్ధాంతము. ఇదంతయుగాంచి విసుగొందిన రవీంద్రనాథ టాగోర్ గారు ఆర్యుల పరతత్త్వ చింతనము ద్రావిడుల రసభావమయ సృజనాత్మకమగు కళాశక్తితో సంగమించి నూతనసృష్టి నవతరింపఁజేసినది. భారతీయ సంస్కృతి ఆర్యనాగరికతకాదు. ద్రావిడనాగరికతయు కాదు.

అయ్యది భారతీయ నాగరికతయే (ఎ. విజన్ ఆఫ్ ఇండియన్ హిస్టరి).

హవనకుండమునకు యోనిఁ గల్పించుటయు శ్రీ చక్రమునకు రెండు త్రికోణముల సంయోగము నేర్పరచుటయుఁ జూడగా భగముగలవాడు భగవంతుఁడను నిర్వచనమును చేయనగును. ఇత్యాది విభిన్నాభిప్రాయముల నాధునికులు కల్పించి ప్రాచీన హైందవ ధర్మవిశ్వాసమును నాశమొందింప సమకట్టినారు. ఇట్టివారిని చూచియే వేదము భయపడునది.

"బిభేత్యల్పశ్రుతా ద్వేదో మామయం ప్రహరేదితి" ఏ బ్రాహ్మణులు భారతదేశమున వైదిక మతమును స్థాపించినారో వారే నేడద్దానిని హతమార్చుచున్నారు. ఇందుకు మన పూర్వులు తెలిపిన ప్రమాణము "రాక్షసాః కలి మాశ్రిత్య జాయంతే బ్రహ్మయోనిషు."

"శైవమత మనార్యులది" యనుటలో శివుడనార్యుఁడా? లేక మతము అనార్యులదా? అను ప్రశ్నలు పొడసూపును. అద్వైతాచార్యులు వైదికమత స్థాపకులునగు శంకరులు శివావతారమనియే వారు చెప్పుచున్నందున ప్రథమ పక్షము యుక్తముకాదు. ఇఁక రెండవది యెట్టిదనినచో శివలింగమును పూజించి నందువలననే శంకరాచార్యులు ప్రాదుర్భవించిరని చెప్పుటవలన శైవమతంబునార్యులది కాదని బోధపడును. సూత్రకర్త యనార్యుడగుచో తద్విరచిత సూత్రములు నభేద్యములగు నుపనిషదముల తాత్పర్యమును నిర్ణయించుటకు శిరోధార్యములగుట యెట్లు?

కృష్ణావతారలీలలు బలరాముని సురాపానాది ప్రసంగములు భగశబ్ద నిర్దిష్టమగు భాగవత సంప్రదాయము పాంచరాత్రాగమములు నివ్వానిపై చూపని దోషములను శైవులపై ప్రదర్శించునెడల సమాధానమును చెప్పెదము.

శైవమతము ఆసేతు హిమాచలము విరాజిల్లుచు వేదములకు వేదములను కనుగొనిన ఆర్యులకును ప్రాచీనమై సర్వతోముఖ వ్యాప్తిఁజెందినది. ఈ యంశమును ప్రాచీన ఆర్ష సంప్రదాయాభిజ్ఞు లంగీకరించునెడల వేదముల యపౌరుషేయత్వము కుంటుపడును గాన నవ్వాని ప్రాశస్త్యమే సన్నగిల్లును. అందువలన ఆర్యానార్య చర్చను లేవదీసి అనార్యతా నిమిత్తముగా శివునకు శైవమతమునకును న్యూనతఁ జూపుట పాడికాదు.

ముక్తినిరూపణ లేని వేదాంతమే లేదు. అట్లే ధర్మహీన మైనదియు లేదు. ధర్మము వేదవిహితాచరణ గలది. వర్ణాశ్రమ చతుష్టయ విశిష్టము. వీరశైవము చాతుర్వర్ణ్య విభాగము లేనిది. ఆది శైవులనఁబడు తంబళులు తాంత్రికులగుదురు.
శ్రీ నీలకంఠాచార్యుల వారు అష్టచత్వారింశత్సంస్కారముల నంగీకరించి యపశూద్రాధికరణమున శూద్రునకు బ్రహ్మోపదేశమును చేయగూడదని నిరసించుటఁ జూడగా వారు వైదిక శైవముఁ గూర్చియే ప్రస్థానములను రచించిరని విశదమగును.

అపౌరుషేయములు ఈశ్వర కర్తృకములునగు వేదము లనాదులగుటచే భిన్నకాలములకుఁ జెందినవని శ్రుతులను విమర్శింపరాదు. ఇందువలననే గదా బౌద్ధుడైనను ప్రాచీనములను నిరసింపక నమరకోశమున నమరసింహుఁడు "ఇతి వేదాస్త్రయ స్త్రయీ" అని చెప్పినాడు.

వేదాంతములనఁబడు ఉపనిషదములలో పదింటిని ప్రమాణములుగా భావించి ఆచార్యులు భాష్యములను వ్రాసిరి. ఇట్టి దశోపనిషదముల యందలి తత్త్వమును విచారించుటకు పురుషబుద్ధి కల్పిత నిర్ణయములు సదోషములగునవి సూత్రములను బాదరాయణులు వ్రాసియున్నారు.

బాదరాయణుఁడు పరమశైవుఁడు కావుననే గురువగు గౌతముని న్యాయశాస్త్రమును ఖండింపలేదు. గౌతముఁడును బాదరాయణ సూత్రములను ఖండింపలేదు. ఉభయులును సమకాలికులు. అంతియేగాదు. (న్యా. సూ. ౩.౧.౨౮.౩౦) ఆత్మశ్రుతి ప్రమాణమున తెలియునది. వేదాంత సిద్ధాంత మిందు సూచింపఁబడినది. గౌతముఁడు చాలచోట్ల బాదరాయణుని భావములను సరిగా ననుసరించును. (చూడుడు న్యా. సూ. 1, 64, 3, 2, 14, 16,) గౌతముని శిష్యుఁడని ప్రసిద్ధిఁ బొందిన వ్యాసుఁడు ముఖ్యముగా న్యాయసిద్ధాంత మీశ్వరుని యంగీకరించునదగుటచే ఖండింపనవసరము లేదని తలచియుండనోపు. రాధాకృష్ణ పండితుఁడు "భారతీయ న్యాయశాస్త్ర గత ద్వితీయాధ్యాయమునకు వేదాంతసూత్రములకును పెక్కు సామ్యము కలదని సూచించెను. గౌతమునకు అక్షపాదుఁడని నామాంతరము. వాత్స్యాయన ఉద్ద్యోతకర మాధవులును "గౌతముఁడు న్యాయసూత్రకర్త" యని నుడివిరి.

పద్మపురాణము ఉత్తరఖండము. స్కందపురాణము కాశీకాఖండము. ౧౭౨ గౌతముఁడు ధ్యానగతుడై నూతిఁబడి పోవగా నతనివి పరమేశ్వరుఁడు కరుణించి పాదమునకు నేత్రము నొసగుటచే యక్షపాదుడనఁబఱగెను.

ఈరీతిగా పరిశీలించినచో గౌతముని తర్కము కణాదుని వైశేషికము రెండును శైవదూరములు కావని నిరూపింపవచ్చును. నైయాయికులు శైవులనియు వైశేషికులు పాశుపతులనియు చెప్పుదురు. జినదత్తుఁడు వివేకవిలాసము నందు (౧౩వ శతాబ్దమున) న్యాయ వైశేషిక వాదులకు నిష్టదైవము శివుఁడని చెప్పినాడు. ఉద్ద్యోతకరుఁడు పాశుపత మతస్థుఁడు. సర్వజ్ఞుఁడు తన ధ్యానమున మహేశ్వర సాక్షాత్కారము నందినట్లు నుడివెను. శివుఁడే పరబ్రహ్మయని యుదయుని వాక్కు.

రాధాకృష్ణుఁడు:- భారతీయ తత్త్వశాస్త్రము. న్యాయసిద్ధాంతము ద్వితీయాధ్యాయము పుట 423.

న్యాయసారము, పుట 39, న్యాయకుసుమాంజలి 2-4, గుణరత్నుని షడ్దర్శన సముచ్చయ వృత్తి పుటలు 49-5,హరిభద్రుని షడ్దర్శన సముచ్చయము.

అతఃపాదమతే దేవః-సృష్టి సంహారకృచ్ఛివః

విభుర్నిత్యైక సర్వజ్ఞో-నిత్యబుద్ధి సమాశ్రయః॥

రాజశేఖరుని షడ్దర్శన సముచ్చయము-ఈ భావమునే చెప్పునని "కీత్. ఐ. యల్. వి. పుటలు 262, 263"

ఐతే న్యాయ వైశేషికానుబద్ధమై పాణిన్యాద్యార్ష పరంపరానుగతమై సూత్రానుగతమైన శివాద్వైతము, శైవమతము, శివోపాసనయు భారతదేశమున తదితర ఖండములలోను వ్యాపించియుండుట చారిత్రికులకు మరియు భూగర్భ పరిశోధన ప్రవీణులకును సువిదితము.

కాశ్మీరశైవము కాశ్మీరమున నభినవ గుప్తాది మహా మనీషిజన సమాచరితమైనట్లు లకులీశ పాశుపతమను శైవము సోమనాథమున ఘూర్జరమున నుండెడిది.

మహారాష్ట్రమున హరనాథ జ్ఞానేశ్వరాది యోగులచే రచింపఁబడిన జ్ఞానేశ్వరి, అమృతానుభవము, మొదలగు గ్రంథములవలన శైవము మూర్ధన్యమని తెలియవచ్చును. ఆంధ్రదేశమున నన్నెచోడుడు, నన్నయ, సోమనాథుఁడు మున్నగు కవితల్లజులచే శైవమతము 11-12 శతాబ్దముల పూర్వము వరకు మహోన్నతముగా భాసింపఁజేయఁ బడినట్లు చరిత్రవలన స్పష్టమగుచున్నది.

జ్ఞానేశ్వరుఁడు భాగవత సంప్రదాయ పరుడని కొందరు తలతురు గాని వారు జ్ఞానేశ్వరిని అమృతానుభవమును చక్కగా చదువకపోవుటయే అందుకు కారణమని తోచెడిని. జ్ఞానేశ్వరుల ఆచార్యులగు నివృత్తి నాథులవారు తమ గురువులగు గహనీనాథుల యోగ సంప్రదాయమును మనస్సునం దిడుకొని కలి కల్మష బాధిత ప్రజల నుద్ధరింప పూర్వాచార్య పరంపరానుగతమైన ధర్మమును భగవద్గీతలయందు నుపదేశింపుమని యాజ్ఞాపించిరి. జ్ఞానేశ్వరులు గురూపదేశము ననుసరించి శివలింగసన్నిధిని జ్ఞానేశ్వరిని వ్రాయఁగడంగిరి. గీత 18వ అధ్యాయమున శివాలయ నిర్మాణమైనదనియు లింగప్రతిష్ఠ ముందు జరుగుననియు శివాలయ నిర్మాణముఁ గూర్చియు మరాఠీఓవీలలో చెప్పిరి. శివలింగపూజ యనివార్యమనియు శివయోగము మానవునికి తరణోపాయమనియు నిర్వచించిరి. భగవద్గీత-శ్రీకృష్ణ

ప్రోక్తమగుటఁ జేసి కృష్ణస్తోత్రమును గూడ గావించిరి. వామన పండితుఁడు భగవద్గీతకు వ్యాఖ్యానముఁ జేయుచు "జ్ఞానేశ్వరులు భాగవతుఁడు కారనియు అన్యదేవతోపాసకులనియు జ్ఞానేశ్వరి ఆదిలోనే ఇతర దేవతాస్తవము లొనర్చిరనియు అందువలన జ్ఞానేశ్వరి భాగవతులకు ననుపాదేయ మనియు నిర్వచించెను. ప్రత్యుత జ్ఞానేశ్వరిలో "ఓం నమో ఆద్యా" యని యోగసంప్రదాయమున కాద్యుఁ డగు శివునిఁ గూర్చి మంగళాచరణమును చేసి భగవద్గీతా వ్యాఖ్యానము వ్రాయఁబడెను. చివరన "ఇతి మాహేశ్వరాన్వయ సంభూతః" అని తన వంశమును మహేశ్వర వంశముగా నుడివిరి. శివలింగోత్తమాంగుడగు విఠ్ఠలేశ్వరుఁడు శివభక్తులలో నగ్రగణ్యుడని భావించి విఠ్ఠలేశ్వరుని పూజించిరని వారి యభంగముల వలన విదితమగుచున్నయది.

ఇట్లే త్రిలింగదేశమున గూడా పోతనపూర్వులు పరమశైవులుగా నుండిరి. పోతనయు హరిహరాద్వైతవాది యనుటకు వీరభద్రవిజయము భాగవతమున్న సాక్షులు. ఐతే శివాద్వైతము సర్వజనాంగీకృత మైనను కలిప్రభావమున నేర్పడిన వైదికావైదిక మతముల యార్భాటమున మఱుగుపడి తిరిగి ప్రకాశించుచు సూర్యసన్నిభ మగుచున్నయది.

ఇఁక నీ భాష్యమున ప్రమితాధికరణమున సూత్రములన్నియు శివపరాత్పరత్వమును సమర్థించుచున్నవని స్పష్టముగా నిరూపింపఁబడినది. అనీశ్వరవాదము నానేశ్వరవాదము అనామక బ్రహ్మవాదంబు సూత్రకారునకు తన్మూలభూత ఉపనిషదములయం దప్రసిద్ధమగుటచే ననంగీ కార్యములనుట నిర్వివాదము. ఇట్లే యనేక విషయములను చెప్పుచు శ్రీ నీలకంఠ శివాచార్యులవారు తమ సూత్ర భాష్యమున నితరనింద లేకుండా స్వమత సిద్ధాంతమును చేసియున్నవారు. ఇయ్యది సర్వభాష్యముల కందని ఫక్కియని యొప్పుకొనక తప్పదు. శ్రీ నిర్మలశంకర శాస్త్రిగారి ఆంధ్రానువాదంబు నా పద్ధతిలో నడచినది గావున అమరభారతిని సంపూర్ణముగా నెరుగని శైవులకు శివాద్వైత పరిజ్ఞానమును కలుగజేయుటలో నసమానమని తెలుపుచు నా యీ పీఠికను విస్తరభీతితో విరమించుచున్నాను.

ఇట్లు

మూలంపల్లి రాజశేఖర శాస్త్రి

ఆరాధ్యులు.

నివేదన

పరమేశ్వరుని యనుగ్రహమున మన్మథవత్సరమున నిర్మలగృహమునందు ప్రారంభించి పదునొకండు వత్సరములలో శ్రీ నీలకంఠీయ శారీరక బ్రహ్మ మీమాంసా సూత్ర భాష్యమున చతుః సూత్రి యనువాదమును ప్రథమ సంపుటముగాను ప్రథమాధ్యాయ అనువాదమును ద్వితీయ సంపుటముగాను వ్రాసి ముద్రింపఁజేయఁ గలిగితిని.

ఇఁక రెండవ యధ్యాయము మొదలుకొని భాష్యాంతమువరకు తృతీయ సంపుటముగా వ్రాసి ముద్రింపఁజేయుటకు వలయు సమయ సంపదలకై నిరీక్షించుచు ఇద్ది నావలన నగునో కాదోనని యాందోళనఁ జెందుచుందును.

మఱియు శ్రీమద్భగవద్గీతకు శివపరముగా నర్థమును తెలుగున వ్రాయవలెనని విద్వన్మాహేశ్వరుల ప్రోత్సాహము పొడగట్టుచున్నది.

ఐతే ఈ యనువాదమున తత స్తతః శ్రుతులకు తదితరములకును తెనుగర్థము వ్రాయలేదు. అంతమాత్రమున నవ్వాని యర్థము ఇదే గ్రంథమున మరియొకచో లేదని కాదు. గైర్వాణీకోవిదుల కియ్యది యనపేక్షితమగుటయు ఆంధ్రభాషాఽభిజ్ఞులకు యనువాదము - అభిమానపాత్రము గాకుండుటయు ప్రాయశః అల్పజ్ఞులకు నర్థముగామి రుచింపకుండుటయు అనంతరానువాదమును వ్రాయ గడంగుటకు ననుత్సాహమును కలిగించుచున్నవి.

తథాఽపి కొందరు శైవసంప్రదాయలోలురు పండిత ప్రకాండాభినివేశముగల వారు శివాద్వైతసిద్ధాంతజిజ్ఞాసతో బాసటగా నున్నందున నింతవరకే యుద్యమమును కొనసాగింపఁ జాలితిని. శివానుగ్రహము కలదేని సంపూర్ణముగా భాష్యము ననువదించి కృతార్థుడను కాగలను.

సరసహృదయులగు మాహేశ్వరుల సాహాయ్యము, మరియు శివభక్తులగు ధనికుల ధర్మబుద్ధియు, మాతృభాషాఽభిమానులగు ఉదారుల తోడ్పాటున్ను శివానుగ్రహమును బలపఱచునవి యని నివేదన.

నిర్మల శంకరశాస్త్రి

విషయసూచిక

గ మ ని క

ఇందు అచటచట అచ్చుతప్పులు కొద్దిగా ఉన్నందున తప్పొప్పుల పట్టికను వేయలేదు. సాధ్యమైనంతవరకు జాగరూకతతో నా యీ అనువాదమును నిర్దుష్టముగా సర్వాంగ సుందరముగాను ముద్రించి యిచ్చినందులకు నాగేంద్ర ప్రింటింగ్ ప్రెస్ వారి నెంతయో అభినందించుచున్నాను.

గ్రంథకర్త

ఈ భాష్యానువాదము నామోదించి సత్కరించిన గౌరవనీయులు


1. శ్రీ రావుసాహేబు బూసగు మహదేవశ్రేష్ఠిగారు, సికింద్రాబాద్.
2. శ్రీ ఓనమాల వెంకయ్య శ్రేష్ఠిగారు, ,,
3. శ్రీ బెల్దెజగదీశ్వరయ్య శ్రేష్ఠిగారు, ,,
4. శ్రీ బెల్దె కుమారస్వామి శ్రేష్ఠిగారు, ,,
5. శ్రీ అమ్మనబోలు రాజయ్య శ్రేష్ఠిగారు, ,,
6. శ్రీ ఉప్పల గౌరీశంకర్ గుప్త (రాజయోగి) గారు, ,,
7. శ్రీ దాచేపల్లి నర్సయ్య శ్రేష్ఠిగారు, ,,
8. శ్రీ లింగా శేఖరయ్య శ్రేష్ఠిగారు, ,,
9. శ్రీ రాచకొండ నారాయణ శ్రేష్ఠిగారు, ,,
10. శ్రీ రావుసాహేబ్ చిదిరా దూర్వాసులు శ్రేష్ఠిగారు, ,,
11. శ్రీ ఉపలంచి బాబయ్య శ్రేష్ఠిగారు, మారేడుపల్లి, ,,
12. శ్రీ తొడుపునూరి పాపయ్య శ్రేష్ఠిగారు మారేడుపల్లి, ,,
13. శ్రీ పి. యమ్. రామదాసుగారు, బీడీఫ్యాక్టరీ, ముప్కాల్. ఆర్మూరు తా॥
14. శ్రీ బొంబై రాజారాం గుప్త మొదలగు శిష్యులు, సద్భక్తులున్నూ
15 శ్రీ గోలి ఈశ్వరయ్య గారు, పేపరుమర్చంట్, సికింద్రాబాద్.

భాష్య గ్రంథప్రచారకులు

1. బ్ర॥ లో॥ ముదిగొండ మల్లయ్యగారు, కవాడిగూడ, శంకర్‌బాగ్, సికింద్రాబాదు.
2. ,, ములుగు పండితయ్య ఆరాధ్యుల వారు, (ఈమని) సికింద్రాబాద్.
3. ,, కొడిమేల నాగమల్లికార్జున శర్మగారు, వరంగల్
4. ,, ముదిగొండ ఆంగీరసశర్మగారు, సంగారెడ్డి
5. ,, రామగిరి సిద్ధరామేశ్వర శర్మగారు, లచ్చుపేట
6. ,, గూడూరు సిద్ధరామేశ్వర శర్మగారు, ,,
(వీరు తమవాగ్దానముల నందజేసినారు)

,, ఇంకను ఆప్తులు, శిష్యులు, భక్తులున్నూ.

శ్రీ నీలకంఠాచార్య సద్గురూపదేశః సమభివర్ధతామ్



గ్రంథకర్త

నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులవారు, తత్కుటుంబమున్ను

నివాసము – నిర్మల, సికింద్రాబాద్.

శ్రీ పార్వతీరాజరాజేశ్వరాభ్యాన్నమః

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్రభాష్యము

[ఆంధ్రీకరణము]

చతుఃసూత్రి తరువాయి

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా" మొదలుకొని "తత్తు సమన్వయాత్" వరకు గల నాలుగు సూత్రములందు బాగుగా చెప్పఁబడిన బ్రహ్మలక్షణము ప్రధానము (ప్రకృతి) నందు వర్తించునని యాశంకించి దిగువ సూత్రమును శ్రీ వేదవ్యాసభగవాను లుదాహరించియున్నవారు.

సూ. ఈక్షతేర్నాశబ్దమ్. ౧-౧-౫

శబ్దప్రమాణముచే సాధింపరానిది అశబ్దమనంబడును. అనగా ప్రధానము జగత్కారణము కాదు. శ్రుతియందీక్షతిశబ్ద ముండుటవలన నని సూత్రార్థము.

"సదేవ సౌమ్యేద మగ్ర ఆసీ దేకమేవాద్వితీయమ్" ఛాందోగ్యము.

"తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" ,,

ఇఁట సృష్టికి పూర్వమగు సత్పదార్థము బ్రహ్మమా ? ప్రధానమా ? అని సందేహము.

ప్రశ్న : ప్రధానము జగత్కారణమగుట పొసగునది. ఎట్లనగా ?

"అజామేకాం లోహిత శుక్లకృష్ణాం
బహ్వీం ప్రజాం జనయంతీం సరూపామ్"

"రక్త శుక్ల కృష్ణవర్ణములతో రజః సత్త్వ తమో గుణములు కలదియు, నిత్యయు ఏకయు నగు ప్రకృతి - తనతో సమానములగు రూపగుణములు గల యనేక ప్రాణులను పుట్టించునది"

ఇట్లు శ్రుత్యంతరమున గానంబడుచున్నందున రజః సత్త్వ తమో రూపిణియగు సాంఖ్యప్రకృతియే జగత్కారణమని చెప్పవలెను. జీవా

త్మయు ప్రకృతి ననుసరించువాడగుటచే సచ్ఛబ్దవాచ్యు డగువాఁడు. ఇట్టి ప్రకృతికి రజోగుణము యొక్కయు సత్త్వగుణము యొక్కయు సంబంధమువలన క్రియాజ్ఞానశక్తుల సంయోగ మేర్పడుచున్నందున జగత్కారణత్వము సిద్ధించుచున్నయది. ప్రధానము అచేతన మగుటచే జగద్రూపముగా పరిణమించుట పొసగునది. పరమేశ్వరుఁడు - చేతనుఁడు కూటస్థుడు నగుటంజేసి జగదాకారముగా పరిణమించువాడు కాడు. పరిణామమనగా- కారణమునకు కలుగు వికారముగదా! ఇట్టి న్యాయము వలన శ్రుతిప్రమాణము వలనను ప్రధానమే సచ్ఛబ్దవాచ్యంబై జగత్కారణమగును కాదా ?

ఉత్తరము : "తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" అను వాక్యమున"ఆబ్రహ్మము అనేకము నగుదునుగాత యని తలచెను."గల చేతనధర్మ మగు బహుభవన సంకల్పము - అచేతనమగు ప్రకృతికి సంభవింపదుగదా! "బహ్వీం ప్రజాం" అను ప్రమాణము ననుసరించి సాంఖ్య ప్రకృతికి జగత్కారణత్వమును సాధింపరాదు. మున్ముందీ భాష్యమున "చమసవద విశేషాత్" అను సూత్రవివరణమునందు - మాయ (ప్రకృతి) పరమేశ్వరు నాశ్రయించియే బహుప్రజాజనయిత్రి యగునని నిరూపింపగలము గాన నిట విస్తరముగా చెప్పకుంటిమి.

మరియు రజఃసత్త్వరూపిణి యగుటచే క్రియాజ్ఞానశక్తి సంబంధము ప్రధానమునకు కలదని చెప్పుటయు సంగతముకాదు. సాంఖ్యమతమున ప్రకృతి - త్రిగుణాత్మిక యగుటచే తమోగుణమును విడదీసి రజఃసత్త్వ సంబంధమును చెప్పకూడదు. "తమస్సు క్షీణించినపుడు రజఃసత్త్వము లతిశయించుటచే ప్రధానమునకు క్రియా జ్ఞానసంబంధము పొసగు"నని చెప్పుటయు సరికాదు. సత్త్వరజస్తమో గుణముల మూడిటి సమానమైన స్థితి - ప్రకృతి యగునని సాంఖ్యులంగీకరించినవారు.

"కూటస్థుడగు పరమేశ్వరునకు జగదాకారముగా పరిణమించుట వికారహేతువగు"నని వక్కాణించుట - అజ్ఞానవిలసితము.

శివాద్వైత సిద్ధాంతమునందు పరమేశ్వరునకు సూక్ష్మము స్థూలము నను రెండు రూపములంగీకరింపఁబడినవి. సూక్ష్మమనగా - నామరూప విభాగముఁ జెందనిదియగును. స్థూలమనగా - నామరూపవిభాగముఁ జెందునది. ఇట్టి రూపద్వయము చిద్రూపిణి యచిద్రూపిణియునగు శక్తికి యేర్పడునట్టిది. శక్తితో నవినాభావసంబంధము కలిగియుండువాడగుటచే పరమేశ్వరుఁడు సూక్ష్మదశయందు కారణము స్థూలదశయందు కార్యము నగునని చెప్పునట్టి మా సిద్ధాంతమునందు "కారణముఁదగు వికారము కార్యము" అను న్యాయము ననుసరించిన లోపము సంభవింపదు గదా !

ప్రశ్న : ఓయీ ? "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీ దేకమేవాద్వితీయమ్" ఇత్యాది వాక్యముతో సద్రూపమగు వస్తువు ఎట్టి విశేషము లేనిదని "ఏవ" అను నవధారణవలన తెలియుచున్నది. ఇట్టితటి బ్రహ్మము కారణమగునపుడు సూక్ష్మప్రపంచముతో కూడియుండుట యెట్లు పొసగును ?

ఉత్తరము : "సదేవ" అను నవధారణవలన విశేషము తొలగింపఁబడుటలేదు. మరియెద్దియనగా - "అసద్వా ఇదమగ్ర ఆసీత్, తతోవై సదజాయత" "సృష్టికి పూర్వము అసత్తుండెను. ఇట్టి యసత్తువలన సత్తు జనించెను" ఇట్లు శ్రుత్యేక దేశమునందు వినంబడు అసత్కారణత్వము భ్రాంతి మూలకమని తెలుపుటకు "సదేవ" అను నవధారణ యుపయోగింపఁబడినది. మరియు "సదేవ" అను వాక్యమునందు బ్రహ్మము నిర్విశేషమగుట యెట్లు పొసగును ? "ఆసీత్" "ఉండెను" అనుటవలన ఉండుట యను క్రియావిశేషము కలదని తెలియుచున్నది. "అగ్రే" "ముందు" అను కాలవిశేషంబు పొడకట్టుచున్నయది. "ఏకమేవ" అను నవధారణ వలన జగము నధిష్ఠించు వస్తువు రెండవది లేదని విశదమగునది. అద్వితీయ మనగా - రెండవ వస్తువు - తనకంటె వేరైనది - అవసరము లేకయే జగమున కుపాదానకారణమగునది యని యర్థము. ఇందువలననే బ్రహ్మము సర్వజ్ఞము అనంతశక్తి విశిష్టంబు నగుచున్నయది. ఇట్టి సర్వజ్ఞత్వ సర్వశక్తి

మత్త్వ విశేషములు లేనిది బ్రహ్మము జగమునకు నిమిత్తకారణమగుట యుపాదానకారణ మగుట యెట్లు పొసగును ? అనఁగా పరమేశ్వరుడు సర్వజగమును తద్గత విశేషముల నొకే పర్యాయము తెలుసుకొనువా డగుటచే నిమిత్తకారణమగువాడు. సర్వవిధ శక్తులతో నెడబాసియుండు వాడు కాడు కావున నుపాదానకారణము నగువాడని గ్రహించునది.

సత్పదము - ప్రకృతి ప్రత్యయాత్మక మగుటచే నొకే వస్తువును తెల్పునదని చెప్పరాదు. ప్రకృతితో నొకదానిని ప్రత్యయముతో మరి యొకదానిని ప్రతిపాదించునట్టిది. ఎట్లనగా ?

అభియుక్తసూక్తి.

శ్లో. శక్తిః శివశ్చ సచ్ఛబ్ద ప్రకృతి ప్రత్యయోదితౌ
తౌ బ్రహ్మ సామరస్యేన సమస్తజగదాత్మకౌ.

సచ్ఛబ్దముఁ దగు ప్రకృతిచే శక్తియు ప్రత్యయముతో శివుఁడును అథవా ప్రకృతితో శివుఁడు ప్రత్యయముతో శక్తియు చెప్పంబడువారు. అట్టి శక్తి శివులు కూడి అనగా సమరసత గలవారై బ్రహ్మమగుచున్న వారు. వారే సమస్త జగద్రూపముగలవారున్ను.

ఇట్లు చెప్పుటవలన తేలినదేమనగా-స్థూలసూక్ష్మ చిదచిత్ప్రపంచ రూపిణియగు శక్తితో నిరంతరము కూడియుండువా డగుటచే పరమేశ్వ రుడు కార్యము కారణంబునగుచు సత్పదమునకు విషయమగుచున్న వాడు. మరియు సజాతీయుఁడగు జీవాత్మ, విజాతీయమైన జగము, స్వగతములగు జ్ఞానానందాది గుణములు అను విశేషములు కలవాడగు టచే నిర్విశేషము బ్రహ్మముకాదని విశదమైనది.

మరియొక యాశంకను నివారించుట కీ సూత్రము.

సూ. గౌణశ్చేన్నాత్మశబ్దాత్. ౧-౧-౬.

ప్రశ్న : చేతనుని ధర్మమగు ఈక్షణము అచేతన మగు ప్రధానము నందు గౌణము (అప్రధానము) గా సమన్వయింపఁ దగినది. ఎట్లనగా ? "తత్తేజ ఐక్షత" "తా అప ఐక్షంత" "తేజస్సువిచారించెను" "ఉదకములు

యోచించినవి" ఇత్యాది వాక్యములందు వినంబడు వీక్షణము జలతేజస్సు లకు గౌణమగునని యంగీకరింపఁబడినట్లు ప్రధానమునకును గౌణమగు నని చెప్పరాదా ?

ఉత్తరము : చేతనుని చెప్పు ఆత్మశబ్దముండుటవలన ప్రధానమునకు వీక్షణము గౌణమనికూడ చెప్పరాదు. మరియు "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్" ఇత్యాదివాక్యమును ప్రారంభించి "స ఆత్మా తత్త్వమసి" అని యుపసంహరించుటవలన తేజస్సు మొదలగువానికి నీక్షతిశ్రవణము గౌణము కాజాలదు. ముఖ్యమైతే కానట్టిదియే గదా! పరమేశ్వరుడే తేజస్సు మొదలగువానిలో ప్రవేశించి ఆయా రూపములతో తద్భిన్న రూపముల నావిర్భవింపఁ జేయువాడు.

ప్రశ్న : ఓయీ? చేతన వాచకమగు ఆత్మశబ్దమువలన నచేతనమగు ప్రధానము సద్రూపము జగత్కారణంబు కాజాలదని నిరూపించితిరి గదా! అచేతనమైన ప్రధానము ఆత్మశబ్దవాచ్యము కాదను నంశము సర్వసమ్మత మేను. చేతనుడైన జీవుఁడైతే ఆత్మశబ్దవాచ్యుండగువాడు కావున జీవాత్మ-సద్రూపముగలవాడై జగత్కారణమగునని చెప్పవచ్చునా ?

ఉత్తరము :

సూ. తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్. ౧-౧-౭.

సత్పదవాచ్యమునందు నిష్ఠగలవానికి సంసారబంధమునుండి మోక్షము "తస్య తావదేవచిరం యావ న్నవిమోక్ష్యేఽథ సంపత్స్యే" అను శ్రుతివాక్యమునం దుపదేశింపఁబడినది. కావున ప్రధానముగాని జీవుడుగాని యీ సందర్భమున సత్పదవాచ్యులు కాకుండును. ప్రధాన మును జగత్కారణముగా చెప్పునట్టి సాంఖ్యులుగూడ "ప్రధానమందు నిష్ఠగలవాడు ముక్తుడగు"నని యంగీకరించువారుకారు. వారి మతములో జీవాత్మ యేనాటికైనను ప్రకృతిని విసర్జింపవలసి యుండును.

జీవాత్మయందు నిష్ఠగలవానికిని మోక్షము సంభవింపదు. ఎందు కనగా ? "శివ ఏకోధ్యేయః శివంకరః సర్వ మన్యత్పరిత్యజ్య" అను శ్రుతి

వాక్యమునందు—శివం అనగా నిఃశ్రేయసమును కలుగజేయు శివు నొకనిని ధ్యానింపవలెను. శివేతరమగు చేతనాచేతనమునంతయు ధ్యాన మున పరిత్యజింపవలెను. ఇట్లు శివేతర ధ్యానము నిషేధింపఁబడుచున్న యది.

తన్నిష్ఠయనగా వస్తువును కనుగొనుట మాత్రముకాదు; తన యంతర్యామియని యుపాసించుట యగును. శ్వేతకేతువునుగూర్చి "తత్త్వమసి" సత్పదార్థము ఆత్మగా కలవాడవని యుపదేశించి "ఆచార్యవాన్ పురుషోవేద" అట్టి సత్పదార్థమును కనుగొనుటకు ఆచార్యునాశ్రయింపవలెనని యుపాయమును నిర్దేశించి "తస్య తావదేవచిరంయావన్న విమోక్ష్యేఽథ సంపత్స్యే" "ప్రారబ్ధ కర్మాధీనమగు శరీరమునుండి విడిబడుటయే తడవుగా శివోపాసకుఁడు శివుని పొందును" "అస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య" అను వాక్యాంతరమునగల శరీర విమోచన పూర్వకముగా బ్రహ్మప్రాప్తి యనంబడు ఫలము ఇట విశదీకరింపఁబడినది.

ఇట్టి నిష్ఠ— "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" ఇత్యాది శ్రుతివాక్యముల ననుసరించి శ్రవణమనన నిదిధ్యాసన రూపమగు శివారాధన మని తెలియుచున్నది.

మరియొక స్పష్టకారణమును ప్రధానమును నిరాకరించుటకు వ్రాయుచున్నవారు.

సూ. హేయత్వావచనాచ్చ. ౧-౧-౮.

ఇట ప్రధానమే సత్పదవాచ్యమై జగత్కారణముగా చెప్పఁబడినచో సాంఖ్యమతము ననుసరించి ప్రధానము త్యాజ్యమని చెప్పవలసి యుండెను. అట్టి హేయత్వము చెప్పఁబడనందునను "తత్త్వమసి" ఇత్యాది వాక్యముతో సత్పదవాచ్యము మోక్షహేతువగుటచే ధ్యానింపఁదగినదని తెలుపఁబడినందునను ప్రధానము జగత్కారణము కాదనుట సమంజసం బగుచున్నయది.

మరియు ప్రధాన పక్షమున విరోధము కలదని చెప్పుచున్నవారు.

సూ. ప్రతిజ్ఞా విరోధాత్. ౧-౧-౯.

"ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి" అను ప్రతిజ్ఞకు విరోధ మేర్పడుచుండుటచే ప్రధానము సత్పదవాచ్యము కానట్టిది. "యేనా శ్రుతం శ్రుతం భవతి" ఇత్యాది వాక్యముతో - సత్పదవాచ్యమగు తత్త్వమును తెలుసుకొనుటవలన తత్కార్యములగు చేతనాచేతన వస్తువు లన్నియు తెలియునట్టివి. అని ప్రతిజ్ఞ గావింపఁబడుచున్నయది. ప్రధానము కారణమగునెడ నీ ప్రతిజ్ఞ సార్థకము కాకుండును. చేతనునకు ప్రధానము కారణమగుట ప్రమాణయుక్తి దూరమగునుగదా !

ప్రశ్న : కారణమగు ప్రధానము తెలియునెడల జాడ్య వికారాస్పదము తత్కార్యమునగు ఈ ప్రపంచమంతయు తెలియునది. ఎట్లనగా? మన్ను తెలిసినచో మృత్కార్యమగు ఘటాదికము తెలియును. కావున శ్రుతిప్రోక్త ప్రతిజ్ఞకు విరోధ మెద్దియు గానరాదు.

ఉత్తరము :

సూ. స్వాప్యయాత్. ౧-౧-౧౦.

"స్వప్నాంతం మే సౌమ్య విజానీహి యత్రైతత్పురుషః స్వపితి నామ సతా సౌమ్య తదా సంపన్నో భవతి స్వమపీతో భవతి తస్మాదేనం స్వపితీ త్యాచక్షతే" "సౌమ్యుడా ? నావలన స్వప్నాంతమును అనగా సుషుప్తిని తెలుసుకొనుము ! ఎప్పుడీ పురుషుఁడు సత్పదార్థమగు పరమేశ్వరునితో కూడియుండునో అప్పుడు తనను మఱచును. అట్టితటి తత్త్వవేత్తలీ యాత్మను స్వపితియని చెప్పుచున్నవారు."

ఇట్లు చేతనుడైన జీవుడు బ్రహ్మముతో కూడియుండుట అనగా స్వవృత్తి లయముఁ జెందియుండుట స్వాప్యయ మనంబడుచున్న యది. అప్యయమనగా - ప్రళయము. ఇట్టి ప్రళయము చేతనునకు నచేతనమగు ప్రధానమునందు సంభవింపనట్టిది. కావున ప్రధానము సత్తు కాజాలదని సిద్ధాంతము.

బ్రహ్మమునకు జీవుడు శరీరమగుటచే జీవాత్మను విడిచి యొకప్పుడును బ్రహ్మము వేరుగా నుండనిదగుటవలన జీవాత్మ - స్వోపాదానమగు శివునియందు వృత్తి లయముఁ జెందుట పొసగుచున్న యది. జీవేశ్వరుల కనన్యత్వము - వ్రేలాడు చెవులుగల దేవదత్తుడు అనుచో లంబకర్ణములు దేవదత్తుడు వేరువేరుగా నుండనట్లు నపృథక్సిద్ధమైనదిగా చెప్పఁబడుచున్న యది. "నీలోఘటః" "నీలత్వ విశిష్టఘటము" అనుచో నలుపు, కుండయు కూడి యేర్పడుచున్నవి గదా! ఇవ్విధముగనే జీవేశ్వరులకు కార్యకారణభావము అనన్యత్వము వస్త్వనేకత్వంబును కలిగియుండునది. లయమనగా - స్వరూపవినాశము కాదు. స్వకీయవ్యాపారమును విరమించి స్వాంతర్యామియందు విశ్రాంతిఁ జెందుట యగును.

జీవేశ్వరులకు బొత్తుగా భేదములేదని చెప్పునెడ "సుషుప్త్యుత్క్రాంత్యోర్భేదేన" అను సూత్రముయొక్క భాష్యమున సిద్ధాంతీకరింపఁబడిన జీవేశ్వరభేదము విరోధించును కావున నవినాభావముతో కూడిన భేదము గలవారు జీవేశ్వరులని గ్రహింపవలెను.

సచ్ఛబ్దముతో పరమేశ్వరుడే ప్రతిపాదింపఁబడుచున్నవాడు. ప్రధానము కాదని చెప్పుచున్నవారు.

సూ. గతి సామాన్యాత్ ౧-౧-౧౧

ఈ ఛాందోగ్యమునందు సత్పదము పరమేశ్వరుని చెప్పునది యని యెట్లు గతికలదో అట్లే శ్రుత్యంతరములందును గానంబడుచున్నయది.

"పురుషోవై రుద్రః సన్మహో నమోనమః"

"పురుషుండగు పరమేశ్వరుఁడు సత్పదవాచ్యుండు, తేజోమయుండును. ఇట్టి పరమేశ్వరునకు నమస్కారము."

సూ. శ్రుతత్వాచ్చ ౧-౧-౧౨

"ఆత్మతః ప్రాణ ఆత్మత ఆకాశః" ఇది మొదలుకొని "ఆత్మన ఏవేదం సర్వమ్" అను వాక్యమువరకు పరమేశ్వరునివలన ప్రాణ ఆకాశాది సర్వంబు నావిర్భవించుచున్నది. ఇట్లే ఛాందోగ్యోపనిషదమునందే వినం

బడుచున్నది కావున జగత్కారణము సత్పదవాచ్యంబు బ్రహ్మమేకాని ప్రధానముకాదని విశదమైనది.

బహుభవన సంకల్పము చేతన ధర్మమగుటచే ప్రధానము జగత్కారణముకాదని నిరూపింపఁబడినదికదా ! పరమతమున జగము భ్రాంతి మూలమగుటచే స్థాణ్వాదులు భ్రమాధిష్ఠానము లగుటవలనను మిథ్య యగు ప్రధానమును నిషేధింపరాదు కావున శివాద్వైతమునందీ సమర్థనము సమంజసం బగుచున్నయది. ఇయ్యది ఈక్షత్యధికరణము.

ఆనందమయాధికరణము

శాస్త్రము వలననే గుర్తెరుగఁదగు జగత్కారణత్వ లక్షణము ప్రధానమునందు వర్తింపదని నిరూపించి చేతనుడైన జీవునియందును జగత్కారణత్వము చెల్లనేరదని ప్రతిపాదించున దీ యధికరణము.

సూ. ఆనందమయోఽభ్యాసాత్. ౧-౧-౧౩.

"తస్మా ద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః" మొదలుకొని "తస్మాద్వాఏతస్మాద్విజ్ఞానమయాత్ అన్యోఽన్తరఆత్మాఽఽనందమయః" వరకు ఆకాశాదిసర్వభూతకారణముగాను అన్నమయాదికోశములనంబడు కవచములలోన దాగియుండు వాడుగాను ఆనందవల్లియందు వినంబడు ఆనందమయుడైన ఆత్మ - జీవుడా ? పరమేశ్వరుడా ? అనిసందేహము.

ప్రశ్న : జీవధర్మములు నిట ప్రతిపాదింపఁ బడినందున ఆనందమయుఁడు జీవాత్మ కాదగును. ఎట్లనగా ? "పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యోఽన్నం, అన్నాత్పురుషః" ఇత్యాది వాక్యములతో ఐదు నంగములు గల శరీరము మొదలగునవి నిరూపింపఁబడుచున్నవి.

ఈ సందర్భమున అన్నమయమనగా శరీరమగును. ప్రాణమయమనగా శరీరాంతర్వర్తియగు ప్రాణము; మనోమయమనగా ప్రాణములోనుండు మనస్సగును. విజ్ఞానమయమనగా మనుస్సులోని బుద్ధి; ఆనందమయుడైతేనో అన్నమయాది సర్వకోశముల కాశ్రయుండగు జీవుండేను;

అన్నమయాది కోశములకు తలకాయ, రెక్కలు, వెన్ను, నడుము అను నవయవములను కల్పించుట యుపాసనకొరకని గ్రహింపవలెను. అన్నమయాది కోశములను బ్రహ్మముగా భావించుటవలన అన్నాది సమృద్ధి కలుగునని ఫలముగూడ చెప్పఁబడినది.

"సంసార సముద్రములో మగ్నుడై బాధపడుచున్న జీవున కానందమయత్వ మెట్లు సంభవించు" నని శంకింపఁ గూడదు. "ఆనందో బ్రహ్మ" అని శ్రుతి ప్రతిపాదించుచున్నందున ఆనందము పరబ్రహ్మ మగును. మయట్ ప్రత్యయము వికారార్థక మగుటంజేసి బ్రహ్మ కార్య మగు జీవుడే ఆనందమయుడు కాదగునని చెప్పవలసియున్నది. నిత్యము శివత్వముతో కూడియుండు బ్రహ్మము ఆనందమయమని అంగీకరించునెడ "అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయాఽఽనందమయా మే శుద్ధ్యంతామ్" అను శుద్ధిప్రార్థన - వ్యర్థమగునది. కావున ఆనందమయుఁ డగు ఆత్మ జీవుండేను. పరమేశ్వరుఁడు కాజాలడు.

ఉత్తరము : ఆనందమయుండైన ఆత్మ - పరమేశ్వరుండేను ఎట్లనగా ? బ్రహ్మానందము మిక్కిలి శ్రేష్ఠమైనదని శ్రుతియందు వక్కాణింపఁబడినది.

"సైషాఽఽనందస్య మీమాంసా భవతి" అని ప్రారంభించి మనుష్య శ్రేష్ఠుడు మొదలుకొని చతుర్ముఖబ్రహ్మవరకు "మనుష్యానందముకన్న గంధర్వానందము శతగుణ మధికము" అను రీతిగా చెప్పిన పిమ్మట "స ఏకో బ్రహ్మణ ఆనందః" బ్రహ్మానందము నిరతిశయమైనదని యభ్య సింపఁబడియున్నది. ఇట్టి అత్యంత శ్రేష్ఠమగు బ్రహ్మానందము కలిగియుం డుట సంసారియగు జీవునకు సంభవింపనట్టిది.

"ఆనందమయుడు పరమాత్మయగుచో నిత్యశుద్ధుడైన ఆనంద మయుని గురించి చేయఁబడు విశుద్ధిప్రార్థన యెట్లు పొసగునను ఆశంకకు సమాధాన మేమనగా ?

సంపూర్ణ ప్రకాశము గల చంద్రునకు నాచ్ఛాదకమైన మేఘము

తొలగిన యెడల ప్రకాశము ప్రసరించుటవలె నిత్యశుద్ధుడైన పరశివుని సాక్షాత్కారమునకు ప్రతిబంధకమగు తన యజ్ఞానమును పోగొట్టుకొనుటకు శుద్ధి ప్రార్థన సంగతంబగునది కావున నానందమయుఁడు పరమేశ్వరుండేను.

"యతో వాచో నివర్తంతే" అను వాక్యము మనోవాక్కుల కందరాని నిరతిశయత్వమును బ్రహ్మానందమునకు సమర్థించుచున్నయది "రసోవై సః, రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి" "పరమాత్మ రస స్వరూపుడు, ఇట్టి పరమాత్మను పొందియే జీవుండానందము ననుభవించువాడు" ఇద్దియే పరమపురుషార్థము - కావున తత్పూర్వము జీవుడు సంసారియగుటం జేసి యానందమయుఁడు కాజాలకుండును.

ప్రశ్న: ఆనందమే బ్రహ్మమని శ్రుతులందు చెప్పఁబడుచున్నది గదా! అట్టితఱి ఆనందవికారము గలవాడు ఆనందమయుడు కావలసి వచ్చును. మయట్ ప్రత్యయము వికారార్థము గలదగుటవలన ఆనంద వికారము గలవాడు పరమేశ్వరుఁడగునని చెప్పునెడ బ్రహ్మము తద్భిన్నమగును. అట్లంగీకరించినచో పరమేశ్వరుఁడు వికారరూపము కలవాడగును కావున ననిత్యుడగును.

సూ. వికారశబ్దాన్నేతిచే న్నప్రాచుర్యాత్ ౧-౧-౧౪

మరియు అన్నమయ ప్రాణమయ మనోమయాదులు అన్నప్రాణమనో వికారరూపము లగునట్లు ఆనందమయుండు నానందవికారము కలవాడగును. ఘటాదులు మృద్వికారములై మృణ్మయము లనంబఱగుచున్నవి గదా! ఇట్టితఱి పరమేశ్వరుఁడానందమయుఁడని వికారము నాపాదించుట సమంజసము కాదు గావున జీవుండనియే చెప్పవలెను.

ఉత్తరము: ఇఁట మయట్‌శబ్దము ప్రాచుర్యమను నర్థము గలదియగును. అన్నమయ ప్రాణమయ మనోమయముల వరకే మయట్– వికారార్థమును బోధించును. విజ్ఞానమయుండనగా - విజ్ఞానము మిక్కుట

ముగా కల జీవాత్మయగును. ఆనందమయుఁడనగా - ఆనందపరిపూర్ణుడగు పరమేశ్వరుఁడగును.

మయట్ శబ్దము వికారప్రకరణమునందు పఠింపఁబడినదగుటచే నన్నివిధములుగా వికారార్థము సముచితంబగు- నను నాశంకకు సమాధాన మీ సూత్రము.

సూ. తద్ధేతువ్యపదేశాచ్చ ౧-౧-౧౪

"ఏష హ్యేవానందయాతి" అను వాక్యము జీవాత్మల నానంద పఱచువాడగుటచే పరమేశ్వరుఁ డానందమయుఁడని చెప్పుచున్నయది. స్వయముగా పూర్ణానందము కలవాడు ఇతరుల నానందింపఁజేయుగదా! ఇందువలన పరమేశ్వరుడే ఆనందమయు డగువాడు.

మయట్ ప్రత్యయమునకు వికార ప్రాచుర్యార్థములు సాధారణములు కాగా "ఏష హ్యేవానందయాతి" అను వాక్యశేషమువలన ప్రాచుర్యార్థమే చెప్పఁదగియున్నది. దేవమానవాది జీవులనుభవించు విషయానందము బ్రహ్మానంద లేశమగునని "ఏతస్యైవానందస్యాన్యాని మాత్రాముపజీవంతి" అను వాక్యము తెలుపుచున్నయది. లోకమున సంపూర్ణ శ్రీమంతుడగువాడు పరులను ధనికులను చేయఁజాలునుగదా!

ఆనంద ప్రచురుఁడగు పరమేశ్వరుఁడానందమయుండని చెప్పినను బ్రహ్మాభిన్నుఁడని తెలియుచున్నది. ఎట్లనగా? "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అను వాక్యమువలన ఆనందమయునకు బ్రహ్మమాధారమగునని బోధపడునుగదా! పరమేశ్వరుఁడు బ్రహ్మము వేరువేరని యంగీకరించునెడ బ్రహ్మము పరతంత్రమగును కావున జగత్కారణత్వాది లక్షణము లుపపన్నములు కాకుండును.

ఇందువలన ఆనందమయుడు జీవాత్మయను పక్షము సమీచీనమైనదను శంకకు సమాధాన మీ సూత్రము.

సూ. మాంత్రవర్ణిక మేవచ గీయతే ౧-౧-౧౫

మంత్రవర్ణమునందు "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అను వాక్యముచే చెప్పఁబడిన బ్రహ్మమే "అన్యోఽంతర ఆత్మాఽఽనంద

మయః" అను వాక్యమువలన నానందమయముగా వక్కాణింపఁబడు చున్నయది. "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అను వాక్యములోని బ్రహ్మశబ్దము ప్రణవమును బోధించునది. ఇట్టి ప్రణవము పరమేశ్వరవాచకంబగుటచే పరమేశ్వరున కాధారంబగుచున్నయది.

"బ్రహ్మవిదాప్నోతి పరమ్" ఇత్యాది వాక్యములతో ఆనందవల్లి యందు నిరూపింపఁబడిన విషయము నంతయు సూచించున దీ సూత్రము. ఎట్లనగా ? బ్రహ్మము ఎద్ది ? బ్రహ్మమును తెలుసుకొనుట యెట్లు ? బ్రహ్మజ్ఞానమువలన లభించు పరమోత్కృష్ట ఫల మెద్ది ? అను ప్రశ్న త్రయమునకు "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" "యోవేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్" "సోఽశ్నుతే సర్వాన్ కామాన్" అను మూడు వాక్యములు సమాధానములుగా ప్రతిపాదింపఁబడియున్నవి.

ఇవ్విషయమై కొందరిట్లు అభిప్రాయపడుచున్నవారు.

సకలప్రపంచ ప్రకృతియగు చిదంబరశక్తి - ఆనందమయముకాని జగన్నిమిత్తమగు విశ్వాతీతమైన పరబ్రహ్మము కాదు. ఎందుకనగా ? "సత్యం జ్ఞాన మనంతం" అని బ్రహ్మము ప్రతిపాదింపబడినది. "తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః" ఆకాశాది ప్రపంచమునకు ప్రకృతిగా చెప్పఁబడిన పరమాకాశము (చిదంబరము) ఆనందమయము కాదగును. "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అను వాక్యము - ఆనందమయ చిదాకాశ మునకు బ్రహ్మ మాధారంబని తెలుపునది. "యదేష ఆకాశ ఆనందో నస్యాత్" అను వాక్యము - ఆకాశాది ప్రపంచ ప్రకృతియగు పరమాకా శము ఆనందమయంబని విశదీకరించినది. ఇందువలననే "సఏకో బ్రహ్మణ ఆనందః" ఆనందము బ్రహ్మాశ్రితమని శ్రుతి ప్రతిపాదించుచున్నయది.

మఱల నిట్టి యానందమే "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్, ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే" ఇత్యాది శ్రుతివాక్య ములతో సమస్తజగత్కారణముగా పేర్కొనంబడుచున్నయది.

ఇఁట "ఆనందో బ్రహ్మ" అనువాక్యముతో ఆనందమునకు చేయఁ బడిన బ్రహ్మత్వవ్యవహారము బ్రహ్మధర్మంబగుటచే నానందము బ్రహ్మ

భిన్నమను నుద్దేశముతో గావింపఁబడినది. మరియు "సైషా భార్గవీ వారుణీ విద్యా పరమేవ్యోమన్ ప్రతిష్ఠితా" బ్రహ్మధర్మ స్వరూపము గలదియు, పరమానందరూపము, ప్రపంచప్రకృతియు పరమశక్తియు నగు చిద్రూపమైన పరమాకాశమునందు వారుణీ (బ్రహ్మ) విద్య సమాప్తిఁ జెందినదని చెప్పఁబడినది కావున నిట్టి పరమశక్తి - ఆనందమయంబనియు పరబ్రహ్మము - ఆనందము ధర్మముగా కలదగుటంజేసి యానందమయ మున కాధారమగుననియు తెలియుచున్నది. విజ్ఞానమయుడు బ్రహ్మోపాసకుఁడగు జీవుండగును.

ప్రతిష్ఠయు ధర్మియు నగు బ్రహ్మమునకు ధర్మము శక్త్యాత్మకంబు నగు ఆనందమయమునకును భేదము గానరానందున నానందమయుఁడు బ్రహ్మంబను నభిప్రాయముతో సూత్రకారుడు "ఆనందమయోఽభ్యాసాత్" అను నీ సూత్రమును వచించినవాడాయెను.

"సత్యం జ్ఞానమనంతమ్" అను వాక్యములోని యానంత్యమును కారణప్రతిపాదక శ్రుతివాక్యము లనేకములు నిరూపించినవి. ఏవం అన్నమయాది కోశచతుష్టయాంతర్వర్తియగు గుహ-బ్రహ్మమునకు నివాసముగా అన్నమయాదివాక్యములు చెప్పుచున్నవి.

మరియు ఆనందమీమాంసవలన సర్వకామావాప్తిరూపమయిన ఫలము విశదీకరింపఁబడినది. హృదయ గుహాంతరాళమున బ్రహ్మనివాస ప్రదేశముగా నిర్దేశింపఁబడిన పరమాకాశము-ఆనందమయం బనియు అందుండు బ్రహ్మము తదాధారమనియు ప్రణవముకాదనియు తెలియునది.

భూమిపై నుండు పర్వతము భూధరమగునట్లు స్వశక్తియగు పరమాసనమందుండు పరబ్రహ్మము ఆనందమయ చిచ్ఛక్తికి ప్రతిష్ఠ యగుటలో విరోధ మెద్దియు గానరాదు.

శివునివలె శివసంబంధముగల చిచ్ఛక్తియు సృష్ట్యాదిపంచకృత్య కారణురాలు కానగును. పరమేశ్వరుఁడు శక్తివిశిష్టుడై తేనే శుద్ధము అశుద్ధమునగు సమస్తప్రపంచమునకుఁ జెందిన పంచకృత్యములను గావింపఁ జాలువాడు.

ఇందు కీ దివపురాణ శ్లోకములను కాననగును.

శక్తిః సాక్షాన్మహాదేవీ మహాదేవస్తు శక్తిమాన్
తయో ర్విభూతిలేశో వై సర్వమేత చ్చరాచరమ్.

వస్తు కించి దచిద్రూపం కించిద్వస్తు చిదాత్మకమ్
ఇదం శుద్ధ మశుద్ధం చ పరం చాపర మేవ చ.

యత్సంసరతి చిచ్చక్ర మచిచ్చక్రసమన్వితమ్
తదేవాశుద్ధ మపర మితరత్తు పరం శుభమ్.

అపరంచ పరంచైవ ద్వయం చిదచిదాత్మకమ్
శివస్యచ శివాయాశ్చ స్వామ్యంచైత త్స్వభావతః.

యథా శివ స్తథా దేవీ యథా దేవీ తథా శివః
నానయో రంతరం విద్యా చ్చంద్రచంద్రికయో రివ.

చంద్రో నఖలు భాత్యేవ యథా చంద్రికయా వినా
న భాతి విద్యమానోఽపి తథా శక్త్యా వినా శివః.

ఏవం పరస్పరాపేక్షా శక్తిశక్తిమతోః స్థితిః
న శివేన వినా శక్తి ర్నశక్త్యాచ వినా శివః.

శక్తో యయా శివో నిత్యం భుక్తౌ ముక్తౌచ దేహినామ్
యామాహు రఖిలేశస్య తైస్తై రనుగుణై ర్గుణైః.

సమానధర్మిణీ మేవ శివస్య పరమాత్మనః
యథా నజాయతే పుత్రః పితరం మాతరం వినా.

తథా భవం భవానీంచ వినా నైత చ్చరాచరమ్
స్త్రీపుంసప్రభవం విశ్వం స్త్రీపుంసాత్మక మేవచ.

స్త్రీపుంసయో ర్విభూతిశ్చ స్త్రీపుంసాభ్యా మధిష్ఠితమ్
తస్మా త్సహ తయా శక్త్యా హృది పశ్యంతి యే శివమ్.
తేషాం శాశ్వతికీ ముక్తి ర్నేతరేషా మితి శ్రుతిః.

from outside and external. In an illustrious article on research in Ayurveda written recently, a great scholar practitioner of Ayurveda of high ability and ardour for that ancient Science, Pandit Sri Srirangam Subbarao Doctor of Ayurveda brought to light an interesting eternal truth enunciated by our Divinely inspired Rishis. He wrote that it is embodied in Charka's Crisp dictum that

యస్మిన్ దేశేహి యోజాతః
త్యస తజ్జౌషధమ్ హితమ్.

whoever is born in a particular country, to him the drug grown in his Native Soil is suitable". If drugs of one's Mother Earth are so efficacious in mending and weeding out bodily ills, religious faith, precept and practice, inhered from and nourished on the sacred soil of one's own mother pedigree, heredity and tradition, must undoubtedly be more efficacious and exclusively potential to eradicate all the accumalated spiritual ailments or sins, and confer the blessing of spiritual bliss of far greater moment on every such individual, and sect.

Turning once again to our learned Author Sri Lokaradhya Sankarasastry, no encomiumbestowed on, or encouragement extended to him will be an adequate acknowledgement of the deep debt of gratitude due to him for his valuable spiritual contributions. Finding none else better, I blend both my palms to offer my Pranamams to him in humble recognition of his scholarship and service (to the Saiva Community as well as the wider humanity). That scholarship and service are both of high order for which these two parts of translation of Nilakantha Bhasyam and his other similar works of eternal worth and everlasting vitality will be self evident elequent proofs.

SIVAYA NAMAHA.

CHAGANTY SANKARASASTRY
Advocate, Secretary
Saiva Maha Peetham
12-2-1967.

సా దేవీ మాయయా సర్వం బ్రహ్మాద్యం సచరాచరమ్
మోహయత్యప్రయత్నేన మోచయత్యపి లీలయా.

యా సా మాహేశ్వరీ శక్తి ర్జ్ఞానరూపాఽతిలాలసా
వ్యోమసంజ్ఞా పరాకాష్ఠా సేయం హైమవతీ తథా.

సేయం కరోతి సకలం తస్యాః కార్య మిదం జగత్
న కార్యం నాపి కరణ మీశ్వరస్యేతి సూరయః.

సైషా మాహేశ్వరీ గౌరీ మమ శక్తి ర్నిరంజనా
శాంతా సత్యా పరానందః పరంపద మితి శ్రుతిః.

అస్యాః సర్వ మిదం జాత మత్రైవ లయ మేష్యతి
ఏషైవ సర్వభూతానాం గతీనా ముత్తమా గతిః.

జ్ఞానానంద స్వరూపిణియు, ఎల్లకాలము సూక్ష్మరూపము కలదియు శక్తి యనంబడును. చంద్రశేఖరుడైన శివుడు శక్తిమంతుడని చెప్పఁబడును. మహత్తు మొదలుకొని ఆదిశేషుడువరకుగల తత్త్వములు బ్రహ్మాది మూర్తులును తదితరము సమస్తంబును శక్తి కార్యములగుచున్నవి. బ్రహ్మాది ప్రపంచమునంతయు తన విచిత్ర సామర్థ్యముతో నప్రయత్నముగా మోహింపఁజేయునది, విలాసముగా విడుదలఁజేయించునదియు శక్తియే యగును. జ్ఞానము స్వరూపముగా కలదియు మిక్కిలి యనురాగము కలదియు చిదాకాశమను సంజ్ఞకలదియు ధ్యానముఁదగు పరమావధియునగు మహేశ్వరుని శక్తియే హైమవతి యనంబడును. ఇట్టి పార్వతీదేవియే సమస్తమును గావించుచున్నయది.

వస్తుతః మహేశ్వరుడు స్వయముగా (శక్తిద్వారా గాక) నేమియు చేయువాడు కాడు. అట్టి మాహేశ్వరీ శక్తి- ఎట్టి పుణ్యాపాపలేపము లేనిదై మహేశ్వరుని యధీనురాలుగా నుండునది. మరియు శాంత యనియు, సత్యస్వరూపిణియనియు, గౌరియనియు, పరానందమనియు, పరమపదమనియు శ్రుతులయందు పేర్కొనంబడుచున్నయది. ఈ ప్రపంచమంతయు మహేశ్వరప్రేరిత యగు శక్తి వలన నావిర్భవించునది. శక్తి

యందే సూక్ష్మదశ(ప్రళయము) నుపొందునది. ఇట్టి శక్తియే ప్రాణులందరు తాము గావించు శివోపాసనలో మొదట చూడదగిన చిదంబరమగుటం జేసి గతులలో నుత్తమగతిగా భావింపఁదగినది.

ఇట్లు శివలింగ కూర్మపురాణాదులందు శక్తి శివులకు ప్రత్యేకముగా చెప్పఁబడిన సృష్ట్యాది పంచకృత్యములు- పరస్పరాపేక్షతో నెరవేరునవి యని గ్రహింపవలెను. శివునికైనను శక్తికైనను నిషేధింపఁబడిన పంచ కృత్యములు పరస్పరాపేక్షలేని స్థితియందు వర్ణింపఁబడినవని తెలియునది.

తథాఽపి శివుడు సర్వాత్మనా స్వతంత్రుడనియు శక్తి శివుని విషయమై మాత్రము పరతంత్రురాలుగా నుండుననియు దిగువ ప్రమాణము విశదీకరించుచున్నయది.

> సైకా పరా చ చిద్రూపా శక్తిః ప్రసవధర్మిణీ
> విభజ్య బహుధా విశ్వం విదధాతి శివేచ్ఛయా
>
> ఏవ మేషా పరాశక్తి రీశ్వరేచ్ఛానువర్తినీ
> స్థిరం చరం చ యద్విశ్వం సృజతీతి వినిశ్చయః.

ప్రసవము ధర్మముగా గల చిచ్ఛక్తి యొకతే శివేచ్ఛ ననుసరించి ప్రపంచము ననేక రీతులుగా విభజించి నిర్మించుచున్నయది. మరియు పరమేశ్వరాజ్ఞాబద్ధురాలై చరాచరమునంతయు విపులీకరించుచున్నది. కావున శక్తిశివులకు గల బ్రహ్మాభావమునందు విశేషణ విశేష్యత- అనగా శక్తికి విశేషణభావము శివునకు విశేష్యభావంబును గ్రహింపఁదగినవి. ఇందువలననే శక్తిశివుల నారాధించుటలో పూర్వాపరక్రమమును శివ పురాణము విధించుచున్నయది.

> యథా దేవస్య దేవ్యాశ్చ కుర్యా త్స్నానాదికాం క్రియామ్
> నతు కశ్చి ద్విశేషోఽస్తి తత్ర తౌ సదృశౌ యతః.
>
> ప్రథమం దేవ ముద్దిశ్య కుర్యా త్స్నానాదికాం క్రియామ్
> పశ్చాద్దేవ్యై ప్రకుర్వీత దేవదేవస్య శాసనాత్.

శక్తికి శివునకును స్నానము మొదలగు నుపచారములను సమర్పించు

టలో విశేషమేమియు గానరాదు. ఎందుకనగా ? పూజ్యభావమున శక్తి శివు లుభయులును సమాన ప్రతిపత్తి కలవారు. కాని శివునకు మొదట, శక్తికి తరువాత స్నానాదులను సమర్పించవలసియుండును. ఇద్ది మహాదేవుని శాసనంబని గ్రహించునది.

ఇందుకు శ్వేతాశ్వతర మంత్రము ప్రమాణముగా చూపఁబడుచున్నయది.

"యుజేవాం బ్రహ్మపూర్వ్యం నమోభిర్వి శ్లోకా యంతి పథ్యేవ సూరేః, శ్రుణ్వంతి విశ్వే అమృతస్య పుత్రాః ఆయే ధామాని దివ్యాని తస్థుః"

"శక్తిశివులారా ? వాం - మీ యిరువురిలో పూర్వ్యం - విశేష్యమగుటచే మొదటిదియు ముఖ్యంబు నగు బ్రహ్మ - శివస్వరూపమును నమోభిః - (శివుఁడు సర్వనమస్కారపర్యవసానభూమి యగుటచే) నమస్కారాంకితములగు శ్లోకములతో యుజే - అనుసంధింపఁజేయుచున్నాను. ప్రార్థించుచున్నానని భావము.

సూరేః - శివస్వరూపమును తెలుసుకొనుటవలన ముక్తుడనగు నా విశ్లోకాః - వివిధ వర్ణనములు గల శ్లోకములు వాచిక శివనమస్కారసందర్భరూపము గలవి "అహం శ్లోకకృత్" ముక్తకృత్యములుగా శ్రుతి ప్రసిద్ధములైనవి పథ్యేవ-మార్గమున హితకరములగు మంచి గుఱ్ఱములవలె యంతి - నిరర్గళప్రవాహము వలె బయలువెడలుచున్నవి. అమృతస్య - "ఏతాని హవా అమృతస్య నామధేయాని" శ్రుతిప్రసిద్ధ అమృతనామధేయము గలిగినట్టి పరమేశ్వరుని యొక్క విశ్వేపుత్రాః - "దివ్యాగణా బహురూపాః పురాణాః" ఇత్యాది శ్రుతిప్రసిద్ధులగు స్కంద నందికేశ్వరాది పుత్రులందరును శ్రుణ్వంతి - (నా శ్లోకములను) ఆదరముతో వినుచుందురు. యే - స్కందనందికేశ్వరాదు లెవరో వారు దివ్యాని - చిదాకాశరూపమైన నిత్యకైలాసమున నుండు ధామాని - భవనములను ఆతస్థుః - ఆశ్రయించియున్నవారు.

ఇట్లు శక్తిశివులకు బ్రహ్మభావము స్ఫురించుచున్నను శివునకు

పూర్వభావముండుటచే విశేష్యత యేర్పడుచున్నది. కావున శక్తివిశేషణ విశిష్టమగు బ్రహ్మమును భావించుటలో తదేకదేశమగు శక్తికి బ్రహ్మత్వము వ్యవహరింపఁదగినది కాని ప్రత్యేకించి శక్తికి బ్రహ్మత్వమును భావింపరాదనియు, ఆనందమయము చిచ్ఛక్తి యనియు తదాధారము పరబ్రహ్మమనియు కేచిత్పక్షసారాంశము.

మరికొందరు దిగువవిధముగ తమ నిర్వచనముఁ దెలిపినవారు.

"అస్మాల్లోకా త్ప్రేత్య ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య" ఇత్యాది శ్రుతి వాక్యములందలి అన్నమయాదికోశములకు ప్రత్యేకము చేతనవాచకమగు ఆత్మశబ్దము సంబంధించుటచే సంసారబంధమునుండి విడిబడిన ముక్తపురుషునకు నన్నమయాదికోశానుమిత పృథివ్యాది పంచ భూతముల నధిష్ఠించు బ్రహ్మ విష్ణు రుద్ర మహేశ్వర సదాశివులనంబడు కారణపురుషులు వరుసగా పొందతగినవారు. (ఇట్టి ఐదుగురును శివస్వరూపులే యగువారు) అన్నమయాది ఆత్మల కాధారమగు సదాశివుండానందమయుం డగువాడు. ఇట్టి సదాశివునకు పరమశివాఖ్యమైన బ్రహ్మము కారణమై ప్రతిష్ఠయగుచున్నది. సదాశివుఁడు శివునితో నభిన్నుఁడగుటం జేసి పరబ్రహ్మముగా వ్యవహరింపఁబడుచున్న వాడు.

ఏతాదృశ మతత్రయమందు నానందమయుఁడు శక్తితోడ నవినాభావము గలిగియుండునట్టి సదాశివుఁడుగా వ్యవహరింపఁబడునట్టియు పరమేశ్వరుఁడే యగుచున్నవాడనియు జీవాత్మ ఆనందమయుడు కాడనియు ఈ మూడువిధములలో నెద్దానిని స్వీకరింపవలెనను విశేషవిచారము నిష్ప్రయోజనమనియు విశదమైనది.

ఇతరానుపపత్త్యధికరణము

పరమ శివాఖ్యమగు బ్రహ్మమునకు జగత్కారణత్వాది లక్షణము సమన్వయముతో నేర్పడినదిగదా! అట్టి లక్షణము ప్రధానమునందును జీవునియందును సంభవింపదని బాగుగా నిరూపించి జీవసమష్టి స్వరూపు

డగు హిరణ్యగర్భునియందును పొసగజాలదను నుద్దేశముతో దిగువసూత్ర ముదాహరింపఁబడినది.

సూ. "నేతరోఽనుపపత్తేః. ౧-౧-౧౭.

"యతః ప్రసూతా జగతః ప్రసూతీ
తోయేన జీవాన్ వ్యససర్జ భూమ్యామ్,
యదోషధీభిః పురుషాన్ పశూంశ్చ
వివేశ భూతాని చరాచరాణి"

జగమును విస్తరింపఁజేయు ప్రకృతి - పరమాత్మవలన నావిర్భవించు నట్టిది. మరియు పరమేశ్వరుఁడు భూలోకాదులందు జలప్రధానములగు పృథివ్యాది ద్రవ్యములతో దేవమానవాది ప్రాణులను సృజించుచున్న వాడు. ఓషధులు మున్నగు స్థావరములను సురనరాది పురుషులను పశు పక్ష్యాది తిర్యగ్జంతువులను చరాచరభూతముల నన్నిటి నంతర్యామిగా ప్రవేశించుచున్న వాడు."

ఇఁటు జగత్ప్రసూత్యాది కర్తగా వినంబడు పురుషుఁడు పరమే శ్వరుడా ? ఇతరుడా ? అని సందేహము.

ప్రశ్న : హిరణ్యగర్భుడే ప్రతిపాదింపఁ దగినవాడు. ఎట్లనగా ?

ఏకార్ణవేతు త్రైలోక్యే - బ్రహ్మా నారాయణాత్మకః
భోగిశయ్యాయుతః శేతే - త్రైలోక్య గ్రాసబృంహితః.

—విష్ణుపురాణము

లోకత్రయము సముద్రమయమగునపుడు బ్రహ్మదేవుఁడు మూడు లోకముల నొక కబళముగా పరిగ్రహించుటఁజేసి గొప్పదగు నారాయణ స్వరూపముగలవాఁడై సర్పశయనమున పవళించువాడు.

ఇట్లు చెప్పుటవలన చతుర్ముఖునకు సముద్రశాయిత్వమను లక్షణము విదితమగుచున్నది.

"యమంతః సముద్రే కవయో వయంతి" "ప్రజాపతిశ్చరతి గర్భే

అంతః" అను శ్రుతివాక్యముల వలనను సముద్రశాయిత్వము సర్వాను ప్రవేశంబు నీ యుపనిషత్ప్రారంభమునందు వినఁబడుచున్నయవి.

"సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్ దివంచ పృథివీంచ" ఇత్యాది సందర్భముతో నుపసంహారమందు సూర్యచంద్రాది సర్వజగత్కారణత్వము బ్రహ్మదేవునకు గలదని పొడగట్టుచున్నది కావున నుపక్రమోపసంహారములందు బోధపడు హిరణ్యగర్భుఁడు నవాంతరము లగు సముద్రశాయిత్వాది ధర్మములు కలిగియేయుండువాఁడు. మరియు "అద్భ్యః సంభూతో హిరణ్యగర్భ ఇత్యష్టౌ" అనుచో హిరణ్యగర్భుని ప్రతిపాదించు మరియొక సందర్భముయొక్క యుపసంహారము గావింపఁ బడినది. "అద్భ్యః సంభూతః" అనుచో "ప్రజాపతిశ్చరతి గర్భే అంతః" అను వాక్యము ననుసరించి హిరణ్యగర్భుడే ప్రతిపాదింపఁ దగినవాఁడు. "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే" అనుచో "ప్రజాపతిర్వై హిరణ్యగర్భః" అను వాక్యముఁబట్టి చతుర్ముఖుండనియే గ్రహింపవలెను. కావున జగత్ప్రసూతి మొదలగువాని కారణముగా హిరణ్యగర్భుఁడే ప్రతిపాదింపఁబడు చున్నవాఁడు.

మహోపనిషదమునందలి పూర్వానువాకమునకు పురుషసూక్తమునకు నేకవాక్యత యుండుటచే పురుషసూక్తము నారాయణపర మగును కావున నీ యుపనిషదము హిరణ్యగర్భుని బోధించుట యెట్లందు రేని పురుషసూక్తము విష్ణుపరము కాకుండుట యెట్లో విచారింతము.

"సహస్రశీర్షా పురుషః" ఇత్యాది మంత్రములు - శ్వేతాశ్వతరోపనిషదమునందు శివపరములుగా చెప్పఁబడి యున్నందున నవ్వానితో పరమేశ్వరుని ప్రశంసించి "తస్మాద్విరాడజాయత" పరమేశ్వరుని వలన విరాజమానమగు బ్రహ్మాండము యొక్కయు "విరాజోఽధిపూరుషః" బ్రహ్మాండమునుండి హిరణ్యగర్భుండను పురుషునియొక్కయు నావిర్భావము చెప్పఁబడినది.

ఇట్లు బ్రహ్మాండోత్పన్నుడైన హిరణ్యగర్భుని యొక్క ముఖము

మొదలగు నవయవములనుండి బ్రాహ్మణాదిప్రజలు ఇంద్రచంద్రాది దేవతలును జన్మించిరని విశదీకరింపఁబడినది కావున పురుషసూక్తము పరమేశ్వర ప్రతిపాదకమై బ్రహ్మాండ హిరణ్యగర్భాద్యుత్పత్తిని విశదీకరించునదని గ్రహింపవలెను.

శ్లో. లోకానాం తు వివృద్ధ్యర్థం ముఖబాహూరుపాదతః
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రం చ నిరవర్తయత్.

పరమేశ్వరుని బ్రహ్మాండమనంబడు నుదరమునుండి యావిర్భవించిన బ్రహ్మదేవుడు తన ముఖాద్యంగములనుండి బ్రాహ్మణాది ప్రాణులను పుట్టించెను. ఇట్లు మనుస్మృతియు చెప్పుచున్నది కావున బ్రాహ్మణాది సృష్టి - కేశవుని యవయవములనుండి కానట్టిది. మరియు "హ్రీశ్చ తే లక్ష్మీశ్చ" అనువాక్యము - ఉపక్రమగత ప్రజాపతిశబ్దము ననుసరించి హ్రీ పదము లజ్జావాచకమనియు లక్ష్మీపదము శ్రేష్ఠగుణవాచకమనియు తెలియునది కావున నుత్తరనారాయణంబు బ్రహ్మపరమే యగునది. ఇవ్విధము పురుష సూక్తము మహోపనిషదనువాకములు నేకవాక్యత కలిగి యుండుటంజేసి యిట హిరణ్యగర్భుఁడే జగత్కారణముగా ప్రదిపాదింపఁదగినవాడు కదా !

ఉత్తరము : పరమేశ్వరభిన్నుఁడగు హిరణ్యగర్భు డీ సందర్భమున జగత్కారణముగా ప్రతిపాదింపఁదగినవాడు కాడు. ఎట్లనగా ?

"యతః ప్రసూతా జగతః ప్రసూతీ" మొదలుకొని "అతఃపరం నాన్యదణీయసం హి పరాత్పరం యన్మహతో మహాంతమ్, యదేకమవ్యక్త మనంతరూపం విశ్వం పురాణం తమసఃపరస్తాత్" ఇత్యాది వాక్యములవరకు చెప్పఁబడిన సర్వోత్కృష్టత్వము మరియు తమోమయమగు ప్రకృతిమండలము నతిక్రమించియుండుటయు బ్రహ్మాండాంతర్వర్తి యగు హిరణ్యగర్భునకు పొసగనట్టివి. మరియు "య ఏనం విదు రమృతా స్తేభవంతి" "ఇట్టి తమోఽతీతుని తెలుసుకొనువారు ముక్తులగుదురు" అను వాక్యములో తెలుపఁబడిన ముక్తిజనకత్వంబును హిరణ్యగర్భునియం

దుపపన్నమగుటలేదు. "యదా చర్మవదాకాశం - వేష్టయిష్యంతిమానవాః, తదా శివ మవిజ్ఞాయ - దుఃఖస్యాంతో భవిష్యతి" అను ప్రమాణమువలన శివజ్ఞానము మోక్షకారణమని విదితమగుటఁజేసి ముక్తిప్రదత్వము పరమేశ్వరున కసాధారణలింగమగుచున్నయది.

"ఉపక్రమోపసంహారములఁబట్టి హిరణ్యగర్భుఁ డీ యుపనిషదము నందు ప్రతిపాద్యుఁ" డను నంశము నిష్ప్రయోజనమైనది.

ప్రజాపతి ధాతృశబ్దములు - అనుపపత్తి కారణముగా హిరణ్యగర్భుని విడనాడి పరమేశ్వరునే ప్రతిపాదించునవి. ప్రజానాం - ద్విపాచ్చతుష్పాత్ పశువులకు పతిః - నియామకుఁడనియు ధాతా - జగమును వహించువాడనియు గ్రహించునది. "అద్భ్యః సంభూతో హిరణ్యగర్భః" అనుచో పరమేశ్వరుఁడే నిర్వచింపఁదగినవాడు. "య ఈశే అస్య ద్విపద శ్చతుష్పదః" "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" విశ్వేశ్వరత్వము విశ్వాతీతత్వంబు పరమేశ్వర లక్షణములగుటంజేసి జగత్కారణత్వాది లక్షణముల యుపపత్తివలనను ప్రజాపతి ధాతృశబ్దవాచ్యుఁడు పరమేశ్వరుడే యగుచున్నవాడు. జగజ్జననియగు పరాశక్తి - పరమేశ్వరు నెప్పుడు నెడబాయనిదై ప్రపంచమహావృక్షమునకు నంకురంబగునది. ఇట్టిది "ప్రజ్ఞాచ తస్మాత్ప్రసృతా పురాణీ" అను వాక్యమువలన పరమేశ్వరుని వలననే యావిర్భవించునది యని విదితమగుచున్నయది. "తదేవ బ్రహ్మ పరమం కవీనామ్" పరమేశ్వరుఁ డసాధారణ బ్రహ్మశబ్దవాచ్యుఁడగుటఁజేసి త్రివిధ పరిచ్ఛేదరహితుఁడగువాడు. "తదేవ భూతం తదు భవ్య మాహుః" భూత భవిష్యద్వర్తమానమగు సమస్తప్రపంచము స్వరూపముగా కలిగియుండువాడు పరమేశ్వరుండేను. ధాతృశబ్దము - "అంభస్య పారే" అను సూక్తముఁదగు నుపసంహారముఁ జెందునదికాదు.

"పురుషస్య విద్మ సహస్రాక్షస్య మహాదేవస్య ధీమహి, తన్నో రుద్రః ప్రచోదయాత్"

"తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి, తన్నో రుద్రః ప్రచోదయాత్" ఇంతవరకు పరమేశ్వరుని సూక్తములు ముగిసినవి.

తరువాత రుద్రగాయత్రి తత్ప్రసంగవశమున గణేశగాయత్రి మొదలగు నవియు స్నానార్థము దూర్వాధారణార్థంబును ప్రవృత్తములగుటచే పరమేశ్వర సూక్తములలో చేరవని భట్టభాస్కరుఁడు సూక్తమర్యాదను నెలకొలిపియున్నవాఁడు.

ఇట్లు నుపక్రమోపసంహార పరామర్శవలన ప్రజాపతి శబ్ద ముప క్రమగతమైన నుపసంహారగత రుద్రమహాదేవ శబ్దములు ప్రబలములగుటచే నేతత్సూక్తము పరమేశ్వరపరంబగుట నిర్వివాదాంశము. ధాతృపద ముప సంహారగత మని యంగీకరించినను మధ్యగత బహుశ్రుతిలింగముల ననుస రించి యోగమువలన పరమేశ్వరపరంబగునని యంగీకరింపఁదగినది.

"వేదాహ మేతం పురుషం మహాంతమ్" అనుచో వినంబడు తమః పరత్వము, ఇతరముచే సాధ్యముకానట్టి శివజ్ఞానసాధ్యమైనట్టియు మోక్ష మును కలుగఁజేయుటయు, హిరణ్యాగర్భునియందు పొసగకుండును. కావున నుత్తరనారాయణంబు శివపరమే యని విశదమైనది.

పరమేశ్వరునకు హిరణ్యాగర్భునకును భేదము లేనందున హిరణ్యా గర్భుఁడు జగత్కారణము కావచ్చునను శంకకు సమాధాన మీ సూత్రము.

సూ. భేదవ్యపదేశాచ్చ. ౧-౧-౧౮.

పరమేశ్వరుఁడు కారణమనియు బ్రహ్మదేవుఁడు కార్యమనియు మహోపనిషదమునందు "యో దేవానాం ప్రథమం పురస్తాత్ - విశ్వా ధికో రుద్రో మహర్షిః, హిరణ్యాగర్భం పశ్యత జాయమానమ్" అనుచో పరమేశ్వర హిరణ్యాగర్భులకు కారణకార్యభేదము నిర్దేశింపఁబడినది. కావున హిరణ్యాగర్భాది సర్వప్రపంచమునకు కారణము పరమేశ్వరుడే యగు చున్నవాఁడు.

మరియొక యాశంకకు సమాధాన సూత్రము.

సూ. కామాచ్చ నానుమానాపేక్షా. ౧-౧-౧౯.

"ప్రజాపతి రకామయత ప్రజాః సృజేయ" ఇత్యాది శ్రుతివాక్యము లందు హిరణ్యాగర్భుఁడు జగత్సృష్టిని సంకల్పించినట్లు గానంబడుచున్నను

జగత్కారణమని యూహింపరాదు. ఎందుకనగా ? ఇట్టి సృష్టికామన అవాంతరసృష్టిఁ గూర్చి (హిరణ్యగర్భుఁడు) చేయునది. కాని వస్తుతః మున్ముందు భాష్యమున "సంజ్ఞామూర్తి క్లృప్తిః" అను సూత్రము దగు నధికరణమునందు పరమేశ్వరుఁడే హిరణ్యగర్భుని ద్వారా అవాంతరసృష్టిఁ జేయువాడని వివరింపఁబడును.

"అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" హిరణ్యగర్భస్వరూపముతో ప్రపంచమును ప్రవేశించు పరమేశ్వరునకు హిరణ్యగర్భునకు నభేదమే యంగీకరింపఁదగిన దను నాశంకకు సమాధాన మీ సూత్రము.

సూ. అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి. ౧-౧-౨౦.

ఈ యుపనిషత్తంత్రమునందే హిరణ్యగర్భుఁడు పరమేశ్వరునికి శేషమగువాడని "బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణోఽధిపతిః" అను మంత్రభాగము శాసించుచున్నది. కావున పరమేశ్వరుడే జగత్కారణమనియు హిరణ్యగర్భుఁడు తత్కార్యమనియు గ్రహింపవలెను.

"ఈశానః సర్వవిద్యానామ్" అను వాక్యముతో వేదాధిపత్యము "ఈశ్వరః సర్వభూతానామ్" అను వాక్యముతో బ్రాహ్మణాధిపత్యంబు నేర్పడుటవలన "బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణోఽధిపతిః" అను నభ్యాసముతో హిరణ్యగర్భాధిపత్యమే విధింపఁబడుచున్నయది.

ఇట్లు చెప్పుటవలన శ్రుత్యంతములందు హిరణ్యగర్భుని విషయమై ఆభాసించు పరత్వము మరియు పరమేశ్వరునితో నభిన్నత్వంబు నిరసింపఁ బడు చున్నవి.

ఏతదధికరణ సూత్రముల నానందమయాధికరణ శేషములుగా గావింపబడిన పరుల వ్యాఖ్యాన మనర్థావహమైనది.

శ్రీభాష్యకారులైతేనో ముక్తజీవు డానందమయ శబ్దవాచ్యుడు కాడని వ్రాసియున్నవారు.

"ఆనందమయోఽభ్యాసాత్" అను సూత్రమువలననే ముక్తా

ముక్త జీవని షేధ మేర్పడుటచే శ్రీభాష్యకారుల వ్యాఖ్యానంబు నసంగతం బగునది.

ఆనందతీర్థులవారు - చతుర్ముఖాదు లానందమయ శబ్ద ప్రతిపా ద్యులు కారని చెప్పియున్నను హిరణ్యగర్భుఁడు జగత్కారణమని సూచించు సూక్తములను స్వాభిమతమగు విష్ణుపరత్వమునం దన్వయింప శక్యములు కానందున నుపేక్షింపవలసి వచ్చెను గాన నీ వివరణయు గ్రాహ్యము కాకుండును.

అంతరధికరణము

శివతత్త్వము - సమస్తము నొకేమారు తెలుసుకొనునదియు, నిత్యతృప్తి కలిగియుండునదియు, ఆది చెప్పరాని పరిజ్ఞానము కలిగినదియు, తనకు తాను ప్రవర్తించునదియు, లోపించని శక్తులు కలదియు, అవధిలేని శక్తులతో కూడియుండునదియు, ప్రపంచమున కంతటికి నభిన్న నిమిత్తో పాదాన కారణ మగునదియు, ఉపనిషత్తంత్రములన్నిటి సమన్వయము వలననే తెలియునదియు, తనకుఁదాఁ బ్రకాశించునదియు, నిఖిల ప్రపంచ ముతో కూడినదైనను తనను విడచి రెండవదిలేని స్వభావము కలదియు, సద్రూపము చిద్రూపము ఆనందమయంబగునదియు, చిత్తు అచిత్తు అనువాని కన్న వేరైనదియు పరబ్రహ్మంబగునని యీ వరకు చెప్పఁబడిన అధికరణ న్యాయములతో నేర్పడియున్నదిగదా! అట్టి శివతత్త్వముయొక్క సాధ కుల సంసారవ్యాధిఁ బోగొట్టు నౌషధమువంటి, మనస్సు సమాధానపడు టకు వలయు ఒకానొక దివ్యస్వరూపమును ప్రదర్శించునదీ యధికరణము.

సూ. అంత స్తద్ధర్మోపదేశాత్. ॥౧-౧-౨౧॥

"య ఏషోఽంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్య శ్మశ్రు హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణస్తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ" ఛాందోగ్యము.

సూర్యునిలోనుండు హిరణ్మయుడైన పురుషుఁడు-పరమేశ్వరుడా? ఒకానొక దేవతయా? అని సందేహము.

ప్రశ్న : సర్వమున కాధారమగువాడు సూర్యాంతర్వర్తి యగుటయు సర్వవ్యాపకుడు పరిచ్ఛిన్నమగు హిరణ్మయరూపము కలిగియుండుటయు నెట్లు పొసగును ? పరమేశ్వరుఁడు తన యిష్టముతో స్వరూపము గలవాడగునని యంగీకరించునెడ – "పుండరీక మేవ మక్షిణీ" "కమల సదృశములగు రెండు నేత్రములు" అను వాక్యమువలన మూడు కన్నులు కలిగియుండుట నియతము కాకుండును. ఒకవేళ సర్వరూపములను స్వేచ్ఛతో పరిగ్రహించువాడందురేని జీవులకు దేహప్రవేశము దుఃఖమును కలిగించునట్లు పరమేశ్వరునకును శరీరస్వీకారము క్లేశావహామగును. ఒకానొకడు తన యిష్టముతో నిప్పునంటిన యెడల నద్ది కాల్చకుండునా ? అందువలన పరమేశ్వరునికి శరీరసంబంధమును చెప్పుట పాడికాదు.

ఒకానొక దేవతయని చెప్పుట యుక్తమని తోచెడిని.

ఉత్తరము : ఆదిత్యాంతర్వర్తియగు హిరణ్మయపురుషుఁడు పరమేశ్వరుండేను.

"స ఏష (8) సర్వేషాం లోకానా మీష్టే, సర్వేషాం కామానామ్ తస్యోదితినామ, స ఏషః సర్వేభ్యః పాప్మభ్య ఉదితః" ఇది మొదలగు వాక్యములతో సర్వలోకేశ్వరత్వము సర్వకామేశ్వరత్వము సర్వపాపరాహిత్యము మొదలగు పరమేశ్వర లక్షణములు ప్రతిపాదింపఁబడినవి. మరియు "ఏకోరుద్రో న ద్వితీయాయ తస్థుః, య ఇమాన్ లోకానీశత ఈశనీభిః" "ఏకో బహూనాం యో విదధాతి కామాన్" ఇత్యాది వచస్సులు పరమేశ్వరుండద్వితీయుఁడనియు లోకశాసకుఁడనియు ఉపాసకుల మనోఽభీష్టముల నన్నిటి నొసగువాడనియు విశదీకరించినవి.

సర్వాధారుఁడు సర్వగతుఁడునగు పరమేశ్వరుఁడు సూర్యాంతర్వర్తి యెట్లగుననగా ? సాధకుల ననుగ్రహించుటకై ఒకానొక హిరణ్మయ రూపము గలవాడగుట పరమేశ్వరుని సర్వవ్యాపకత్వమునకు సర్వాధారత్వమునకు భంగము నాపాదించునది కాదు. ఇందుకే సూర్యమండలము నధివసించువాడు.

నిరూపింపఁబడుచున్నవాడు. సూర్యునికి నంతర్యామి యగుటచే సూర్య శబ్దముతో చెప్పఁబడుట సంగతమగునది.

ప్రశ్న : ఓయీ ? నీలకంఠుడగు పరమాత్మ- సూర్యునిలో నుండు వాడు కాడు. ఎందుకనగా ? "ధ్యేయః సదా సవితృమండల మధ్యవర్తీ- నారాయణః సరసిజాసన సన్నివిష్టః" "నారాయణుఁడు సూర్యమండల మధ్యమున కమలాసనమందు కూర్చున్నవాడుగా ధ్యానింపఁదగినవాడు" అని తఱచుగా లౌకికులు పఠించుచుందురు. మరియు పుండరీకాక్షుఁడను ప్రసిద్ధివలన కమలములతో సమానములగు రెండు నేత్రముల సంబంధము నారాయణునకే పొసగును కావున మరియొకరీతిగా ప్రతిపాదించు పరిశ్రమ యెందులకు ?

ఉత్తరము : హిరణ్మయపురుషునియందు గానంబడు పరమేశ్వరుని యసాధారణ లక్షణములు నారాయణునియం దుపపన్నములు కావు. ఎట్లనగా ? సూత్ర విషయమగు వాక్యము సందేహింపఁబడినపుడు సందిగ్ధ ములుకాని మరియొక శ్రుతివాక్యములతో విషయనిర్ణయమును చేయుట సమంజసమగును. మహోపనిషదమునందలి "ఆదిత్యోవా ఏష ఏతన్మండలం తపతి" ఇత్యాది సందర్భమును విచారించెదము గాత !

అందు "య ఏతస్మిన్ మండలేఽర్చి ర్దీప్యతే" అను వాక్యముతో సూర్యమండల కాంతిని వక్కాణించి "య ఏష ఏతస్మిన్ మండలేఽర్చిషి పురుషః" మండలాభిమాని దేవత యగు సూర్యుని నిర్దేశించి "ఏషోఽం తరాదిత్యే హిరణ్మయః పురుషః" హిరణ్మయస్వరూపము గల పురుషుని సూర్యాంతర్వర్తిగా నుపదేశించి తరువాత "ఆదిత్యోవై తేజ ఓజో బలం యశః" "సూర్యుడే తేజస్సు పరాక్రమము బలము కీర్తియు నగుచున్న వాడు"అని సూర్యస్వరూపముగల పరమాత్మయొక్క విభూతిని విశదీకరించి "ఏష పురుష ఏష భూతానా మధిపతిః" అనుచో సూర్యాంతర్వర్తియగు వాని భూతాధిపతిగా వర్ణించి మరియు హిరణ్మయపురుషుఁ డెట్టివాడను నెడ "సర్వో వై రుద్రః" అని యారంభించి "నమో హిరణ్యబాహవే

హిరణ్యపతయేఽంబికాపతయ ఉమాపతయే" అని యుపసంహారము గావింపఁబడినది. ఇచట బాహుపదగ్రహణము మొత్తము స్వరూపమునకుపలక్షణ మగుటచే శివుఁడు హిరణ్యస్వరూపుఁడని భావింపఁదగినది. కావున బంగారముతో సరిపడు రూపముగల ఉమాపతి- ఆదిత్యమండలవర్తి యగువాఁడని విశదమైనది.

ఈ సందర్భమున నీలగ్రీవత్వము ఉమాపతిత్వంబు మొదలగునవి పరమేశ్వరుని విశేషలింగము లనఁబడుచున్నవి. ఇట్టి విశేషములు పరమేశ్వరునికంటె నితరులకు సంబంధింపనట్టివి. "పుండరీకాక్షుఁ"డను లక్షణము సాధారణమైనది. నారాయణేతరులందు నీ లక్షణమును గాననగును. కమలాక్షియగు వనిత, కమలలోచనుఁడగు పురుషుఁడు, అను ప్రయోగములు పెక్కు కలవు. కావున విశేష లింగముతో సామాన్య లింగము కొట్టుబడును గదా!

"ధ్యేయః సదా" అను శ్లోకము భక్తులచే కల్పింపఁబడినదగుటచే లౌకికమనఁబడుచున్నయది. ఇట్లు చెప్పుటవలన - సువర్ణసమానరూపము గలవాడును, త్రిలోచనుండును, నీలకంఠుఁడును, ఉమాపతియు, లోకములన్నిటియందలి కోర్కెల నొసగు అధికారము గలవాడును, సర్వపాపములచే నొకప్పుడును స్పృశింపఁబడనివాడును, షడ్గుణైశ్వర్యసంపన్నుఁడునగు పరమేశ్వరుఁడే సూర్యునిలో నుండువాడై గాయత్రీమంత్రప్రతిపాద్యుఁడుగా ముముక్షువులు ధ్యానింపఁదగినవాడని విశదమైనది.

ఈ సూత్రమందలి చకారమువలన సూర్యుడేగాక నారాయణుఁడును పరమేశ్వరభిన్నుఁడని తేటపడును. "ధ్యేయః సదా" అను శ్లోకము పౌరాణికము, పౌరుషేయమునగును. మరియు విష్ణుపూజావసానమున నారాయణు నాదిత్యమండలమున ధ్యానింపవలెనని మాత్రము తెలుపునది కాని సూర్యాంతర్యామియని ప్రతిపాదించునది కాదు.

శ్లో. ఆదిత్యమండలాసీనం రుక్మాభం పురుషం పరమ్
ధ్యాయన్ జపేత్తదిత్యేత న్నిష్కామో ముచ్యతే ద్విజః.

"ద్విజుఁడు (బ్రాహ్మణక్షత్రియ వైశ్యులు) పరశివుని బంగారువన్నె గలిగి సూర్యమండలములో నుండువానిగా ధ్యానించుచు శివప్రతిపాదక మగు గాయత్రీమంత్రమును నిష్కాముఁడై జపించునెడల సంసారబంధము నుండి ముక్తుఁ డగును."

"ఆదిత్య మండలాంతస్థం - పరం బ్రహ్మాధిదైవతమ్."

"పరబ్రహ్మము-సూర్యమండలములోనుండునది, గాయత్రీ మంత్ర మున కధిదేవత యగునది" ఇత్యాది స్మృతివచనములు - గాయత్రీ ప్రతి పాద్యమగు పరబ్రహ్మము శివుఁడే యని విశదపఱచుచున్నవి.

ప్రశ్న : గాయత్రీమంత్రమునకు విశ్వామిత్రుఁడు ఋషి యనియు ఛందస్సు గాయత్రి యనియు దేవత సూర్యుఁ డనియు సంధ్యావందనము నందు కలదు గావున పరశివుఁడు గాయత్రీ ప్రతిపాద్యుఁ డెట్లగును ?

ఉత్తరము : సూర్యవాచకమగు సవితృపదము - సూర్యాంతర్వర్తి యగు పరశివునందు పర్యవసానముఁ జెందునది. "సవితుర్వరేణ్యమ్" అను పదముతో గాయత్రీ మంత్రమునందు "శివుఁడు సూర్యునిచే నుపాసింపఁ బడువా" డని తెలియుచున్నది. "యేన సూర్య స్తపతి తేజసేద్ధః" అను మంత్రము - సూర్యునకు తేజః ప్రదుడగుటచే సూర్యునిచేత నాశ్రయింపఁ దగినవాడు సూర్యాంతర్యామియు నగు పరమశివునే సమర్థించుచున్న యది.

ఈ యధికరణము - శుద్ధాద్వైతులకు సంగతము కానిది. ఇందు పరబ్రహ్మము - హిరణ్మయరూపముగలదని నిర్ణయింపఁబడుటవలన నిర్గుణ తత్త్వమునకు సరిపడకుండును. హిరణ్మయరూపము కల్పితమనియు స్తుతి రూప మనియు బ్రహ్మము సాకారమను నంశమును సమర్థించునెడ వేద ప్రామాణ్యమున విశ్వాసము లేనివారగుటఁజేసి యాస్తికతయే భంగ పడునది.

ఇఁక భగవానుఁడు హిరణ్మయవర్ణము గలవాడని చెప్పుటచే మిక్కిలి నలుపువన్నె యొడలుగల లక్ష్మీపతి యట్టివాడు కానందున నీ యధికర

ణము శ్రీభాష్యకారులకును ప్రతికూలమగును. మరియు నంతరాదిత్య విద్యయం దుపాసింపఁదగిన తత్త్వమును నిర్ణయింపఁ బ్రవర్తించిన మహోపనిషదమునందు చెప్పఁబడిన భూతపతిత్వము అంబికాపతిత్వము మొదలగు లక్షణములు శివుని కసాధారణములగుటచే నారాయణునియందు సమర్థింపనలవిగానట్టివి. ఇందువలననే శ్రుతప్రకాశికా వేదాంతసార వేదాంత దీపికాది గ్రంథకర్తలును మౌనము నవలంబించినవారైరి.

ఆకాశాధికరణ ప్రాణాధికరణములు

సర్వజ్ఞత్వము మొదలగు గుణములుగల పరబ్రహ్మమగు శివుని పరమమంగళాస్పదమైనట్టి యుపాస్యరూపమును నిర్వచించి నామరూఢి నిమిత్తముగా ఇతరవస్తువునందు పరశివుని లక్షణము పొడగట్టునను మందబుద్ధి గలవారి యాశంకకు సమాధానమును దిగువసూత్రములతో చెప్పుచున్నవారు.

సర్వజ్ఞత్వాది గుణవిశిష్టుఁడగు పరమేశ్వరుడు-లోకోత్తర సౌందర్యశాలి యగుటచే "యత్రాకృతి స్తత్ర గుణాః" అను న్యాయము ననుసరించి పరమ మంగళగుణములు కలవాడగుచున్నవాడు.

సూ. "ఆకాశ స్తల్లింగాత్." ౧-౧-౨౩.

"అత ఏవ ప్రాణః." ౧-౧-౨౪.

"సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యంతే ఆకాశం ప్రత్యస్తం యంతి."

"సర్వాణి హవా ఇమాని భూతాని ప్రాణమేవాభిసంవిశంతి ప్రాణ మభ్యుజ్జిహతే."

ప్రాణులందరి యుత్పత్తి స్థితి లయకారణములుగా ప్రాణాకాశ శబ్దములు పరమేశ్వర పరములా? భూతాకాశ ప్రాణవాయువులను బోధించునవియా? అని సందేహము.

ప్రశ్న : "ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే, ప్రాణేన జాతాని జీవంతి. ప్రాణం ప్రయంత్యభిసంవిశంతి" "ఆకాశాద్వాయుః" ఇత్యాది వాక్యములవలన సకల జగత్కారణములుగా బోధపడుచున్నం దున ప్రాణాకాశములే యిట ప్రతిపాదింపఁ దగినవి గదా ?

ఉత్తరము : ప్రాణశబ్దముతోడ నాకాశశబ్దము తోడను పరమేశ్వరుఁడే చెప్పఁబడువాడు. సర్వకారణత్వాది లక్షణములు ప్రాణవాయువు నందు ఆకాశమునందును సంభవింపనట్టివి. ఈ సందర్భమున ఆనందస్వరూప మగు బ్రహ్మము సర్వకారణమను వాదమునందు తాత్పర్యము గనఁబడు చున్నయది. "ప్రాణాద్ధ్యేవఖలు" ఇత్యాది శ్రుతివాక్యములు - "ప్రాణ వాయువు జగత్కారణ" మను వాదమునందు తాత్పర్యము కలవి కావు. "బ్రహ్మము జగత్కారణ" మను వాదము ననువదించునట్టివి. ఆకాశము పంచభూతములలో చేరుటచే సర్వశబ్దముతోడనే గ్రహింపబడునది కావున నాకాశము ప్రత్యేకము జగత్కారణమని చెప్పనలవి కానిది. "ఆత్మన ఆకాశః సంభూతః" అనువాక్యము- పరమేశ్వరుని వలననే ఆకాశాది సర్వభూతము లావిర్భవించునవి యని తెలుపుచున్నది గావున భూతాకాశ ప్రాణవాయువులకు సర్వభూత కారణత్వము ఉపపన్నము కాజాలదు.

ఆకాశమునకు "భూత" అను నుపపదము - పరప్రకృతియగు చిదాకాశము సర్వభూత కారణమగునను నంశము ప్రామాణికమగుటం జేసి చిదాకాశముకన్న వేరైనది భూతాకాశంబని తెలుపుటకు సార్థక మగుచున్నయది. ఐతే పరమేశ్వరుండెట్లు జగత్కారణమగుననగా? చిదా కాశమునకు పరమేశ్వరునకును భేదము లేనందున పరమేశ్వరుండని చెప్పఁ బడుచున్నయది.

శుద్ధమనియు మిశ్రమనియు మలినమనియు త్రివిధముగా చెప్పఁ బడు భూతాకాశమునకు జగత్కారణమగు యోగ్యత గానరాదు.

పరబ్రహ్మము ఆకాశశబ్ద వాచ్యమగుట - శరీర శరీరిభావమునందే పొసగును కావున నిర్గుణ వాదమునందు శరీరాత్మభావము నంగీకరింప కుండుటచే నీ యధికరణద్వయము సంగతము కాకుండును.

ఆకాశవాయువులు పరమేశ్వరుని అష్టమూర్తులలో చేరుటవలన "ప్రాణానాం గ్రంథిరసి" అను వాక్యము పరమేశ్వరుఁడు ప్రాణగ్రంథి యగువాఁడని తెలుపుటవలన నితర వ్యాఖ్యలును సమంజసములు కానట్టివి.

జ్యోతి రధికరణము

లోకములన్నిటి నేలికయు దోషములన్నిటి వాసనలనఁబడు కళంకములన్నియు బొత్తుగా లేనివాఁడును మిక్కిలి గొప్పవగు మంచి గుణములకు సముద్రమువంటివాఁడు నుమాపతియునగు పరబ్రహ్మమునకు సూర్యమండలము ఒకానొక నివాసస్థానమని యీవరకు నిరూపింపఁబడినది.

ఈ యధికరణమునందు మరియొక నివాసము చెప్పఁబడుచున్న యది.

సూ. జ్యోతిశ్చరణాభిధానాత్. ॥౧-౧-౨౫॥

ఛాందోగ్యమునందు విషయవాక్యము.

"అథ యదతః పరో దివో జ్యోతి ర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేష్వనుత్తమేషు లోకేష్విదం వావ తద్యదిద మస్మిన్నంతః పురుషే జ్యోతిః"

లోకములనన్నిటిని వ్యాపించునట్టి, యంతరిక్షము నతిక్రమించి యుండు పరంజ్యోతి - పరమేశ్వరుడా? ఇతరుడా? అని సందేహము.

ప్రశ్న: ద్యుశబ్దము ఆకాశవాచకముగదా! ఆకాశముపైనుండు సూర్యుఁడే పరంజ్యోతియని చెప్పవలెను. అథవా "అంతఃపురుషే జ్యోతిః" అను వాక్యమువలన పురుషునిలోనుండు జఠరాగ్నియైనను జ్యోతి యగును కాదా?

ఉత్తరము: సర్వోత్కృష్టమగు పరంజ్యోతి - పరమేశ్వరుండేను; "పాదోఽస్య విశ్వా భూతాని" ఇట్టి పరంజ్యోతియొక్క నాల్గవభాగముగా ప్రాణులందరు చెప్పఁబడుచున్నవారు.

సూర్యుఁడు కాని జఠరాగ్ని కాని పరిచ్ఛిన్నము లగుటచే దివఃపర మగు జ్యోతిస్సు కాజాలరు.

సూర్యునిలో నుండు సదాశివుఁడు తన్మండలమునం దెట్లుండు ననగా ? పర్యంకమున నుండు రాజు - మేడపై నుండువాడని వ్యవహరింపఁబడినట్లు పరమశివుండును సూర్యాంతర్యామియై సూర్యమండలము నందు వసించువాడని గ్రహించునది.

"దివఃపరః" అను పదమునకు "సర్వోత్తరమ్" అని చెప్పుటవలన సంసారమండలము నతిక్రమించి యుండువాడను నర్థము తెలుపఁబడినది. "త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః" అను వాక్యమున చరణశబ్దము చెప్పఁబడుటచే చరణచతుష్టయాత్మకుండగు పరమపూరుషుఁడు జ్యోతిఃశబ్దముతో ప్రతిపాదింపఁబడువాడని విశదమగునది.

"పరంజ్యోతి రుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే" అను శ్రుతి వాక్యమునందు గల పరంజ్యోతిఃపదము పరమేశ్వరునే తెలుపుచున్నయది. మనోవాక్కులు సూర్యచంద్ర నక్షత్రాదులు నపరజ్యోతిస్సులగును. "తమేవ భాంత మనుభాతి సర్వమ్ తస్యభాసా సర్వమిదం విభాతి" అను వాక్యము సూర్యచంద్రాది సమస్తమును ప్రకాశింపఁజేయువాడగుటచే సమస్తసాక్షియగుటను పరమేశ్వరుఁడు పరంజ్యోతి యగునని విశదపఱచుచున్నది.

"గాయత్రీవా ఇదం సర్వం భూతమ్" "గాయత్రీమంత్రమే ఈ సమస్త చరాచరము" అను వాక్యముచే గాయత్రీమంత్రము సర్వాత్మకముగా ప్రతిపాదింపఁబడుచున్నది కావున నిద్ది గాయత్రీప్రకరణ మగుచున్నది. "పాదోఽస్య విశ్వాభూతాని" అను వాక్యము - ప్రపంచము గాయత్రిలో ఏకాంశమని చెప్పుచున్న దను నాశంకకు దిగువ సూత్రము సమాధానము.

ఛందోఽభిధానా న్నేతిచేన్న,

తథా చేతోఽర్పణనిగదా త్తథాహి దర్శనమ్ ౧-౧-౨౬

"గాయత్రీ వా ఇదం సర్వం భూతమ్" అనువాక్యముచే గాయత్రి

యనఁబడు ఛందస్సు చెప్పఁబడుటచే పరమేశ్వరుండిట ప్రతిపాదింపఁబడుచు లేడను నంశము గ్రాహ్యముకాదు. గాయత్రి ఛందస్సుమాత్రము కావున సర్వభూతాత్మకము కాజాలదు. గాయత్రీమంత్రానుష్ఠానము వలె పరమేశ్వర ధ్యానమును చేయవలెనని యీ సందర్భమున తెలుపఁబడినది. గాయత్రీమంత్రము - ఆరు నక్షరములు గల పాదముతో నాల్గు చరణములు గలది యగునట్లు పరమేశ్వరుఁడు చతుష్పాద్విభూతి గలవాడగును. సర్వాత్మకత్వ లక్షణముతో గాయత్రీప్రకరణము బాధింపఁబడును గాన పరమేశ్వరుడే జ్యోతియగువాడు.

చేతోఽర్పణ మనగా ? అనుసంధానము, భావన, ధ్యానము అను పర్యాయపదములతో పరమేశ్వరుని భావించుటయగును. గాయత్రీపదమును గౌణవృత్తితో పరమేశ్వరపరముగా వ్యాఖ్యానించవలెను. గాయత్రీ మంత్రమును ప్రస్తావించు సందర్భముతోడ నేకవాక్యతఁ జెందియుండుటచే తత్పూర్వసందర్భము నందుండు శ్రుతిలింగములు పరమేశ్వరుఁడే గాయత్రీ శబ్ద వివక్షితుండగునని విశదపఱచునవి.

సూ. భూతాది పాద వ్యపదేశోపపత్తేశ్చైవమ్. ౧-౧-౨౬

ప్రాణులు పృథివి శరీరము హృదయము అను నాల్గుపాదములు కలిగియుండుట గాయత్రీ ఛందస్సునకు పొసగఁజాలదు కావున పరమేశ్వరుడే చతుష్పాద్విభూతి గలవాడని గ్రహింపనగును. సూత్రగతమగు చకారమువలన "ఏతావానస్య" అను పురుషసూక్తమంత్రంబు పరబ్రహ్మ పరమని సూచింపఁబడినది. మరియు హృదయకమలధ్యేయమగు పరమాకాశ మనంబడు స్వర్గము భావలింగాత్మకమై పరమేశ్వర రాజధాని యనఁబఱగుచున్నది. ఇట్టి స్వర్గలోకమునకు ద్వారపాలురు ప్రాణవాయువు మొదలగునవి. ఇవ్వాని బ్రహ్మపురుషులనుగా కీర్తించుట యనునది పరమేశ్వరలింగముగావున గాయత్రీపదము పరమేశ్వర వాచకమేయగునది.

సూ. ఉపదేశభేదాన్నేతి చేన్నోభయస్మి న్నప్యవిరోధాత్

౧-౧-౨౭

ప్రశ్న : "పాదోఽస్య విశ్వాభూతాని - త్రిపాదస్యామృతం దివి"

అనుచో ద్యుశబ్దముయొక్క ప్రత్యభిజ్ఞానము (గుర్తు) వలన జ్యోతిర్వాక్యమునందును పరమేశ్వరుఁడు ప్రతిపాదింపఁబడుట లేదని చెప్పవలెను. "త్రిపాదస్యామృతం దివి" "పరోదివో జ్యోతిః" అను సప్తమీ షష్ఠీ విభక్తులవలన నగు నుపదేశభేదముచే పరమేశ్వరుని ప్రత్యభిజ్ఞానము సిద్ధించుట లేదు కావున గాయత్రీ ప్రకరణము పరమేశ్వరపరమగుట విరుద్ధము కాదా?

ఉత్తరము : పై రెండువాక్యములందును పరమేశ్వర ప్రతిపాదన విషయమై విరోధమేమియు గానరాదు. ఎట్లనగా ? "చెట్టుకొనయందు డేగపక్షి, చెట్టుకొన పైన డేగపక్షి" అని వ్యవహరించుట యందు నుభయత్ర వృక్షపరత్వమే బోధపడునట్లు ప్రస్తుత ప్రకరణమునందును రెండు చోటులలో దివః పరత్వమే గ్రాహ్యమగునది.

ఇత్యాది సందర్భముతో పురుషసూక్తమున వర్ణింపఁబడినవాడు పరమేశ్వరుడే యని యేర్పడుచున్నయది. "పాదోఽస్య విశ్వాభూతాని" "సమస్త ప్రాణులు పురుషునికి నొక భాగము" ఇట్లు పురుషసూక్తము నందును కలదు కావున నిఖిలప్రపంచము తన యేకాంశమువరకే ముగియునట్టి, సకలభువనాతీత ప్రదేశమునందు ప్రకాశించు పరంజ్యోతి పరమేశ్వరుఁడే యగును.

పురుషసూక్తము విష్ణుపరమని చెప్పుటకు చూపఁబడిన నెనిమిది కారణములను ఖండించి పదునెనిమిది యోగ్యహేతువులతో శివపరమగునని నిర్ణయించిన యంశమును మహోపాధ్యాయ శ్రీ శివయోగి ముదిగొండ నాగలింగశాస్త్రిగారి వైష్ణవపథ ప్రతిషేధమునందు సహృదయులు గాననగును.

ఇంద్రప్రాణాధికరణము

పూజనీయమగు సూర్యమండలమునందు ప్రత్యక్షముగా నుపాసింపఁదగినవాడని నిర్దేశింపఁబడిన పరమేశ్వరునికి నంతరధికరణమునందు విశ్వాత్మకత్వము నిరూపింపఁబడినది. కావున తదితరులు పరమేశ్వరుం

డంతర్యామిగా కలవారగుటచే ధ్యానింపఁదగినవారగుదురు. అన్యథా నుపాస్యులు కాజాలరని విశదపఱచునదీ యధికరణము.

సూ. ప్రాణ స్తథాఽనుగమాత్ ౧-౧-౨౯

కౌషీతకోపనిషదమునందు విషయవాక్యము.

"ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా తం మా మాయు రమృత మిత్యుపాస్వ" ఇంద్రవచనము.

ఉపాసనా విషయముగా ప్రాణశబ్దముతో నిర్దేశింపఁబడువాడు ఇంద్రుఁడా ? పరమేశ్వరుడా ? అని సందేహము.

ప్రశ్న : "ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా తంమామ్" అనుచో ప్రాణ శబ్దమునకు నింద్రునితో సమానాధికరణ భావము పొడగట్టుచున్నయది. "మాముపాస్వ" అను వచనము ఇంద్రు నుద్దేశించి యుపాసనావిధిఁ జెప్పుచున్నది. ఇంద్రునకు ప్రాణత్వము - వర్ష ముద్వారా సకలప్రాణులను కాపాడుట కారణముగా సమర్థింపఁబడునది. "ఇంద్రోరాజా జగతో య ఈశే" అను శ్రుతివాక్యమువలన గొప్ప ఐశ్వర్యముకలవాడని తెలియుచున్నందున సకలోపాస్యుండగువాడు గదా !

ఉత్తరము : పరమేశ్వరుఁడు ప్రాణశబ్దముతో నిట చెప్పఁబడును. ఎందుకనగా ? ఆనందము, జరారాహిత్యము అమృతభావము, ప్రాజ్ఞత్వము మున్నగు పరమేశ్వరుని యసాధారణ ధర్మములు ప్రాణశబ్దవాచ్యుని యందు అనుగమించునవి. "ఏష ప్రాణ ఏవ ప్రజ్ఞాత్మాఽనందోఽజరోఽమృతః" అను శ్రుతివాక్య మిందుకు ప్రమాణము.

"ఇంద్రోరాజా" అను శ్రుతివాక్యమునందు గల ఇంద్రశబ్దము - ప్రకరణవశమున పరమేశ్వరవాచకమని బోధపడుచున్నయది. "ఇంద్రస్యాత్మానం దశధా చరంతమ్" ఇత్యాది పూర్వాపరమంత్రములు - పరమేశ్వరుఁడు ఇంద్రాంతర్యామి యని తెలుపుచున్నందున నిద్ది పరమేశ్వరప్రకరణమే యగును.

సూ. నవక్తురాత్మోపదేశా దితిచే
దధ్యాత్మసంబంధభూమా హ్యస్మిన్. ౧-౧-౩౦

ప్రశ్న : ఇట నుపాస్యుడు పరమేశ్వరుఁడు కాడు. ఎట్లనగా? ఉపక్రమమున "మామేవ విజానీహి త్రిశీర్షాణం త్వాష్ట్రి మహనమ్" "మూడు శిరస్సులు గల వృత్రాసురుని సంహరించిన నన్నే కనుగొనుము" ఇత్యాది వాక్యముతో తాను జీవుడనను పరిజ్ఞానముగల ఇంద్రుఁడు తన నుపాసింపవలసినదిగా నుపదేశించినందున నుపసంహారంబు నింద్రపరముగా నన్వయింపవలెను.

ఉత్తరము : ఉపక్రమము మొదలుకొని యీ ప్రకరణమునందు పరమేశ్వరలక్షణము లధికముగా చెప్పఁబడినవి. ఎట్లనగా? "యం త్వం మనుష్యాయ హితతమం మన్యసే" "మనుష్యోపలక్షితుఁడగు ప్రతిజీవునకు మిక్కిలి హితకరమగు నుపాసన యెట్టిది" అని హితతమోపాసనమును గురించి ప్రారంభించుట పరమేశ్వరు నుద్దేశించి యగును. మోక్షసాధనమగు పరమేశ్వరోపాసనమే హితతమమగునదికదా! ఏతత్ప్రకరణ మధ్యమున - "ఏష ఏవ సాధు కర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే, ఏషఏవాసాధుకర్మ కారయతి తం యమధో నినీషతే" "ఏ జీవాత్మ నీ లోకములనుండి యూర్ధ్వలోకములకు గొంపోవఁదలచునో అట్టి జీవునితో మంచిపనిచేయించువాడు మరియు నధోలోకములను పొందింపఁదగిన జీవునితో చెడుపని చేయించువాడును పరమాత్మయే" ఇట్లు శుభాశుభ కర్మకారయితృత్వము వినంబడుచున్నయది. మరియు "తద్యథా రథస్యారేషు నేమి రర్పితా నాభా వరా అర్పితా ఏవమేవైతా భూతమాత్రాః ప్రజ్ఞామాత్రా స్వర్పితాః ప్రజ్ఞామాత్రాః ప్రాణేఽర్పితాః" "రథచక్రముఁదగు ఆకులపై కమ్ములుంచబడును. ఆకులు నాభివలెనుండు వలయాకారమునందు నెలకొలుపఁబడును. ఇట్లే పంచభూతములు ఇంద్రియములును జీవాత్మలయందాధారపడియుండును. జీవాత్మలు - ప్రాణశబ్ద నిర్దిష్టుఁడగు పరమాత్మయందు విశ్రాంతిఁ జెందువారు" ఇవ్విధము చేతనాచేతన సమ్మి

శ్రమగు సకలప్రపంచమున కాధారమగుటయు గానంబడుచున్నయది. ఇదియు పరమేశ్వరధర్మంబేను. కావున నిట పరమేశ్వరధర్మబాహుళ్య ముండుటంజేసి యుపాస్యుఁడు ఇంద్రుడగుటలేదు.

దేవేంద్రుడు ఒకానొక జీవాత్మ యగుటచే నుపాసింపఁదగినవాడు కాడుగదా! ఐనను తన నుపాసింపవలసినదిగా నెట్లుపదేశించు నను ఆశంకకు సమాధానము దిగువ సూత్రము.

సూ॥ శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్. ౧-౧-౩౧

"అనేన జీవేనాఽత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" "జీవాత్మ ద్వారా ప్రపంచమును ప్రవేశించి నామరూపముల నేర్పఱచు వాడను" అను వాక్యమువలన జీవగత నామరూపకరణము తనవరకు నవధిగలదని భావింపఁదగినదగుటచే పరమేశ్వరుఁడు శబ్దములన్నిటితో చెప్పఁబడువాడని తెలియుచున్నది. ఇఁట నింద్రుఁడు తా శరీరముగా కలవాడగు పరమేశ్వరుని స్వశబ్దవాచ్యునిగా నుపాస్యునిగా నుపదేశించెను. కావున నింద్రశబ్దముతో పరమేశ్వరుని శాస్త్రదృష్టితో బోధించుట యని గ్రహింపవలెను.

శాస్త్రదృష్టి యనగా - శాస్త్రము మూలముగా గల దృష్టి; పరమేశ్వరుడు సర్వాత్మకుఁడు అనివక్కాణించు శాస్త్రము నవలంబించి తన యంతర్యామియగు పరమేశ్వరు ననుసంధించు భావన యనఁబఱగుచున్న యది. ఇవ్విషయమై వామదేవుని దృష్టాంతమును గాననగును.

పూర్వము వామదేవుఁడను ఋషి - స్వాంతర్యామి పరమేశ్వరుఁ డను భావనతో "అహం మను రభవం సూర్యశ్చ" "నేను మనువును సూర్యుడనై తిని".

ఇట్లు మను సూర్యాది ప్రపంచ మంతయు తానుగా నిర్దేశించి నట్లు ఇంద్రుఁడును ప్రతర్దనుఁడనువానికి నుపదేశించినవాడు.

ఇంతియే గాక మరియొకవిధముగా నివ్విషయమును గ్రహింప నగును.

వేదాంతములను తెలుసుకొనుటవలన నేర్పడునట్టి శివజీవ సామరస్య భావనతో, మరియు భక్త మాహేశ్వర ప్రసాద ప్రాణలింగ శరణ ఐక్యములనంబడు ఆరు భూమికలలో గావింపఁబడు శివోపాసనతోడను త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వా ఘ్రాణములు మొదలగు నింద్రియములందు నవ్వాని ప్రేరేపించువాడుగా నుండునని భావింపఁబడు సర్వాంగలింగ సాహిత్యముతోడను శివభావమును పొందినవాడును మనుష్యాదిదేహ సంబంధముగా నేర్పడిన యహంకార సంకోచమును పోగొట్టుకొనిన వాడును విశ్వాకారమును పొందియుండు పరాహంభావము కలవాడు నగు వామదేవుఁడు తాను సర్వగతుండనని తెలుసుకొనినవాడగుటచే మను సూర్యాది ప్రపంచభావమును వెల్లడించినవాడు. ఇట్లు ఇంద్రుఁడును సర్వాత్మభావనతో ప్రతర్దనున కుపదేశము నొనర్చినవాడని తెలియునది.

"ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా" అనుచో ప్రాణశబ్దముతో పరమేశ్వరుఁడు చెప్పఁబడుచున్నవాడు. పరబ్రహ్మము - ఆనందస్వరూపమగుటం జేసి చరాచరము నంతయు నుజ్జీవింపఁజేయునది. "ప్రాణ ఏవ ప్రజ్ఞాత్మా ఽఽనందోఽ జరో ఽమృతః" "ప్రాణమే ప్రజ్ఞాత్మ యనియు ఆనందమనియు జరామరణములు లేనిదనియు పేర్కొనంబడును" అను శ్రుతి వాక్య మిందుకు ప్రమాణము. మరియు "అహం బ్రహ్మాఽస్మి" "మాముపాస్స్వ" ఇట్లు బ్రహ్మాత్మభావనతోడ నుపదేశించుట సరిపడుచున్నయది. ఇవ్విధమే శ్రీకృష్ణుఁడు మొదలగువారు అర్జునుఁడు మున్నగువారికి "మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు" "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" "అహం సర్వస్య ప్రభవః మత్తః సర్వం ప్రవర్తతే" బ్రహ్మాత్మభావనాదార్ఢ్యవశమున స్వశబ్ద నిర్దేశముతో గీతల నుపదేశించినవారని గ్రహింపవలెను.

సూ. జీవముఖ్య ప్రాణలింగా న్నేతి చేన్న ఉపాసా త్రైవిధ్యా దాశ్రితత్వా దిహ తద్యోగాత్. ౧-౧-౩౨.

ప్రశ్న : జ్ఞానాత్మకమగు బ్రహ్మోపాసనతో బ్రహ్మభావమును

పొందినవాడును జీవభావము తొలగినవాడును బ్రహ్మస్వరూపమునందు గల నిష్ఠతో తానుపాస్యుడగుటను సర్వాత్మభావము కలిగియుండుట నుపదేశించుట యుక్తం బేను. కాని యిట "త్రిశీర్షాణం త్వాష్ట్రి మహనమ్" "యావదధ్యస్మిన్ శరీరే ప్రాణో వసతి తావదాయుః" "త్రిశిరస్కుడైన వృత్రాసురునిఁ జంపితిని" "ఈ శరీరమున ప్రాణవాయువుండునంత వరకు జీవిత మనఁబడును" ఇత్యాది సందర్భమున జీవలింగము ముఖ్య ప్రాణలక్షణంబు కనఁబడుచున్నయవి కావున పై రీతిగా ఇంద్రుఁడు ప్రతర్దనున కుపదేశించుట యుక్తముకాదుగదా!

ఉత్తరము : బ్రహ్మోపాసనము మూడు విధములగుట కారణముగా జీవప్రాణశబ్దములతో పరమేశ్వరుఁడు చెప్పఁబడుట సముచితమైనది. ఇఁట పరమేశ్వరుని నిజరూపము నుపాసించుట మొదటి విధమగును. కర్మఫలభోక్తయగు జీవునిద్వారా పరమాత్మ నారాధించుట రెండవవిధ మగును. ప్రకృతిద్వారా పరాత్పరుని పూజించుట మూడవ విధమగును. ఇట్టి త్రివిధోపాసనములలో ప్రథమమున తానే యుపాసింపఁబడుటయు ద్వితీయమున తృతీయమందును జీవప్రకృతులచే నాశ్రయింపఁబడి పూజింపఁబడుటయు గమనింపఁ దగినవి.

ఐతే పరమేశ్వరుని ఉమాసహాయత్వాది లక్షణ విశిష్టమగు నిజరూపమును భావించుట శీఘ్రముగా మోక్షావహామగునది. తదితరములైన యుపాసనలు రెండు నాలస్యముగా ముక్తిహేతువులగునట్టివి. కావున నింద్రుఁ డిచట పరమేశ్వరుఁ డంతర్యామిగా కలవాడనను భావన వలన నుపాస్యుం డగుచున్నవాడు.

ఇయ్యది ప్రథమాధ్యాయగత ప్రథమపాదము

శ్రీ పార్వతీరాజరాజేశ్వరాభ్యాన్నమః

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్రభాష్యము

[ఆంధ్రీకరణము]

ప్రథమాధ్యాయగత ద్వితీయపాదము

సర్వత్ర ప్రసిద్ధాధికరణము

పరబ్రహ్మమును బోధించు వేదాంతవాక్యము లనంతములగుటచే ప్రతివాక్యమును విచారింప వలనుకాదు. కావున సందిగ్ధములగు కొన్ని వాక్యములను విచారించిన యెడల తద్రీతిగా తాదృశవాక్యము లన్నిటి యర్థము నిర్ణయింపఁబడునని భావించి కొన్ని వాక్యములు తాత్పర్య లింగ సమన్వయముతో బ్రహ్మబోధకము లగునని సూత్రములందు సూచింపఁబడినది. అట్టి వాక్యములలో బ్రహ్మలక్షణములను స్పష్టపఱచు నట్టి కొన్నిటిని ప్రథమపాదమునందు విచారింపనైనది.

అతి స్పష్టములుకాని కొన్ని వాక్యములను ద్వితీయపాదమున విచారించువారము.

సూ. సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్. ॥౧-౨-౧॥

"మనోమయః ప్రాణశరీరో భారూపః సత్యసంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః" ఛాందోగ్యము.

మనోమయత్వము మొదలగు ధర్మములు కల పురుషుఁడు పరమేశ్వరుఁడా ? జీవుడా ? అని సంశయము.

ప్రశ్న : జీవాత్మ - మనోమయాది వాక్యమునకు సమీపవర్తియగు వాడు. ఎట్లనగా ? "అథ ఖలు క్రతుమయః పురుషో, యథాక్రతు రస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి, సక్రతుంకుర్వీత" "ఈలోకము నందు పురుషుఁడు గావించు సుకృతము ననుసరించి మరణానంతరము

పరలోకములందు ఫలము ననుభవించును. కావున నిత్యనైమిత్తికాది సుకృతముల నవశ్య మాచరింపవలెను."

ఇఁట కర్మవశమున నిహపరలోకములందు సంచరించు జీవాత్మ ప్రశంసింపఁబడినవాడు. ఇందువలననే జీవుఁడు మనోమయత్వాది ధర్మములు గలవాడగును. మనోమయత్వము ప్రాణశరీరత్వము మొదలగు లక్షణములు - సంసారియగు జీవునివేకాని పరమేశ్వరునివి కావు.

సతి - యథార్థమునందు అసంకల్పః - సంకల్పము లేనివాడను నర్థముతో సత్యసంకల్పత్వమును జీవునకు సమర్థింపవచ్చును. కావున సర్వథా మనోమయత్వాది ధర్మములు కలవాడు జీవాత్మయేకాని పరమాత్మ కాజాలడు.

ఉత్తరము : పరమేశ్వరుఁడే మనోమయత్వాది ధర్మములు గలిగియుండువాడు. ఎందుకనగా ? ఛాందోగ్య ప్రారంభమునందు "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత" అను వాక్యము పరబ్రహ్మయగు పరమేశ్వరుడే సర్వకారణముగా నుపాసింపఁ దగినవాడని యుపదేశించుచున్నయది.

శ్రుత్యర్థము - సృష్టి స్థితి లయములు బ్రహ్మాధీనము లగునవి. చిదచిన్మయమగు జగమంతయు బ్రహ్మాత్మకమని శమదమాది సంపత్తి గలవాడై భావింపవలెను. సముద్రమున జనించి లయించు నురుగు బుద్బుదములున్ను సముద్రమయములుగా కనఁడునట్లు శక్తివిశిష్టుడైన శివునివలన నేర్పడు సృష్టి స్థితి లయాదులు శివమయములగునని భావింపదగినవి. కావున శివేతరమగు వస్తు వెద్దియు గ్రాహ్యము కాకున్నయది.

మరియు నథర్వశిరమునందు "అహ మేకః ప్రథమ మాసం వర్తామి చ భవిష్యామి చ నాన్యః కశ్చి న్మత్తో వ్యతిరిక్తః" "సృష్టికి ముందున్నవాడను ప్రస్తుత ముండువాడను ఇకముందుండగలిగినవాడనగు నన్నుఆశ్రయింపక నెవఁడు నుండఁజాలడు" ఇట్లు పరమేశ్వరుఁడు వక్కాణించినవాడు. తరువాత "బ్రహ్మోహం" ఇత్యాది వాక్యముతో తన విశ్వరూపతను చాటినవాడు. "సోఽంతరా దంతరం ప్రావిశత్" "పరమేశ్వరుఁడు

సర్వాంతరమగు జీవునికంటె నంతరమును అనఁగా లోనఁబ్రవేశించిన వాఁడు". ఇట్టి అనుప్రవేశము పరమేశ్వరుని విశ్వరూపత్వమునకు తాత్పర్యముగా పేర్కొనఁబడుచున్నయది.

కావున శివుని విడిచియుండు సృష్టి స్థితిలయాదులు లేని జగము-శివేతరము కానిదని విశదమైనది.

గాలి వీచుటవలన పైపైన సంచలనము కలుగుటచే తరంగములు, నురుగు, బుద్బుదములు అనునవి సముద్రమున కేర్పడునట్లు శివేచ్ఛవలన సంచలనముఁ బొందు శక్తియొక్క పరిణామము సర్వప్రపంచము కావున "బ్రహ్మము ప్రపంచాత్మకము" అనుటవలన బ్రహ్మమున కెట్టి హానియు గానరాదు.

శ్లో. శక్తయోఽస్య జగత్కృత్స్నం - శక్తిమాంస్తు మహేశ్వరః
శక్తిస్తు శక్తిమద్రూపాత్ - వ్యతిరేకం న గచ్ఛతి॥
తాదాత్మ్య మనయో ర్నిత్యం - వహ్నిదాహికయోరివ
శక్తి శక్తిమతో ర్యస్మా - దభేదః సర్వదా స్థితః॥
అత స్తద్ధర్మధర్మిత్వాత్ - పరాశక్తిః పరాత్మనః
న వహ్నే ర్దాహికా శక్తి - ర్వ్యతిరిక్తా విభావ్యతే॥

అభియుక్తసూక్తి.

శక్తి విశిష్టుడగు మహేశ్వరుని శక్తుల పరిణామము సమస్త ప్రపంచము. కావుననే శక్తి-శివుని స్వరూపమును విడిచియుండునది కాదు. అగ్నికి జ్వాలకునువలె శక్తి శివులకు తాదాత్మ్య ముండుటఁజేసి యభేద మొప్పారుచున్నయది. పరాశక్తి ధర్మముగా కలవాడగుటచే పరమేశ్వరుఁడు శక్తిని విడిచియుండువాడు కాడు. అగ్ని-దహనశక్తిని విడనాడి యుండునది కాదుగదా !

శివమహాపురాణములోని వాయుసంహిత యందు

శక్త్యాది చ పృథివ్యంతం - శివతత్త్వ సముద్భవం
తేనైకేన తు తద్వ్యాప్తం - మృదా కుంభాదికం యథా॥

పరాఽస్య వివిధా శక్తిః - ప్రబోధానందరూపిణీ
ఏకానేక స్వరూపేణ - భాతి భానోరివ ప్రభా॥

శక్తి మొదలుకొని భూమివరకుగల ప్రపంచమంతయు శివతత్త్వము నుండి యావిర్భావముఁ జెందునది కావున మన్ను - కుండలు మున్నగు వాని వ్యాపించునట్లు శివుఁడు ప్రపంచమంతట నిండియుండువాడు. జ్ఞానానంద స్వరూపిణియగు పరమేశ్వరునిశక్తి - సూర్యప్రకాశమువలె ఏకముగా ననేకముగాను ప్రకాశించునది యగును.

వాస్తవముగా శక్తి యొకటియే; ఐనను తెలుసుకొనుట, కోరుట, చేయుట, పుట్టించుట, కాపాడుట, గిట్టించుట, మఱుగుఁబఱచుట, అనుగ్రహించుట యను ధర్మములతో ననేకరూపములను పొందునదని సారాంశము.

"పరాఽస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ" "ఏకో రుద్రో న ద్వితీయాయ తస్థు ర్య ఇమాఀ లోకా నీశత ఈశనీభి ర్జననీభిః పరమశక్తిభిః" ఇత్యాది వాక్యములు - పరమేశ్వరుని శక్తి సహజమైనదనియు ఆనందమనియు సృష్టి స్థితిలయాది భేదములఁ జెందునదనియును వక్కాణించుచున్నవి.

ఇంతియేగాక

శ్రుతి స్మృతీతిహాసపురాణముల యొక్కయు అభియుక్తసూక్తుల యొక్కయు ప్రామాణ్యామువలన తెలియునదేమనగా? చిదచిత్ప్రపంచమంతయు మహావిభూతియనఁదగును. ఇట్టి విభూతి సచ్చిదానందములఁ జెందిన గొప్ప సత్త (ఉనికి) యగును. ఇయ్యది దేశకాలాదిపరిచ్ఛేదము లేనిదై స్వభావసిద్ధమగు పరమశక్తియనఁబడును. ఇద్దియే పరమేశ్వరునకు స్వరూపము గుణము నగునది. ఇట్టి పరమశక్తిలేనిది సర్వజ్ఞత్వము సర్వశక్తిమత్త్వము సర్వకారణత్వము సర్వనియామకత్వము సర్వోపాస్యత్వము సర్వానుగ్రాహకత్వము సర్వపురుషార్థప్రదత్వము సర్వగతత్వము మొదలగు ధర్మములు పరబ్రహ్మమునకు సంభవించునవికావు.

మరియు భగవానుడు - మహేశ్వర శివ మహాదేవ రుద్రాదిశ్రేష్ఠ నామధేయములతో నిర్వచింపఁబడుటయు పొసగనట్టిది. చిదచిత్ప్రపంచము పరమేశ్వరుని శరీరమగుటఁజేసి శరీర విశిష్టబ్రహ్మము శబ్దములన్నిటితో నిర్వచింపఁబడునట్టిది. "నీలోత్పలమ్" అనుచో నీలశబ్దము నలుపురంగునే గాక కలువనుగూడ తెలుపునట్లు ప్రపంచశబ్దము ప్రపంచమునేగాక బ్రహ్మమునుగూడ బోధించునది. కావుననే "సర్వోవై రుద్రః" ఇత్యాది వాక్యములు బ్రహ్మము సర్వశబ్దవాచ్యంబనియు "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యము సర్వచిదచిత్ప్రపంచము శరీరముగాగల యట్టిది బ్రహ్మంబనియు విశదీకరించినవి. ఇట్లు ప్రపంచము బ్రహ్మస్వరూపమగుటచే ద్వేషాస్పదము కానందున శాంతుడై బ్రహ్మము నుపాసింపవలెనని విదితమైనది.

ఇవ్విషయమునే సమర్థించు పురాణశ్లోకములను గాననగును.

విగ్రహం దేవదేవస్య - జగదేతచ్చరాచరమ్ ।
ఏతమర్థం న జానంతి - పశవః పాశగౌరవాత్ ॥
విద్యేతి చేతనాం ప్రాహు - స్తథాఽవిద్యామచేతనామ్ ।
విద్యావిద్యాత్మకం సర్వం - విశ్వం విశ్వగురోర్విభోః ॥
రూపమేవ న సందేహో - విశ్వం తస్యవశేయతః ॥
వృక్షస్య మూలసేకేన - శాఖాః పుష్యంతివై యథా ।
శివస్య పూజయా తద్వత్ - పుష్యత్యస్య వపుర్జగత్ ॥

చరాచర ప్రపంచము శివశరీరంబని పశుతుల్యులైన జీవాత్మలు - సంసారపాశ భారముచే క్రుంగినవారగుటచే తెలియకున్నవారు. చేతనాచేతనాత్మక జగము విద్యావిద్యాత్మకమై విశ్వనియామకుని స్వరూప మనుటలో సందియములేదు. చెట్టుమొదట పోయఁబడు నీరు కొమ్మలు మొదలగు వృక్షమునంతయు పోషించునట్లు శివారాధనముతో జగమంతయు సంతసించునది.

కావున నిట నుపక్రమమున నుపాస్యముగా నిరూపింపఁబడిన బ్రహ్మమే మనోమయత్వాది ధర్మములు కలిగియుండునది. సంసారిజీవునకు

మరియు భగవానుడు - మహేశ్వర శివ మహాదేవ రుద్రాదిశ్రేష్ఠ నామధేయములతో నిర్వచింపఁబడుటయు పొసగనట్టిది. చిదచిత్ప్రపంచము పరమేశ్వరుని శరీరమగుటఁజేసి శరీర విశిష్టబ్రహ్మము శబ్దములన్నిటితో నిర్వచింపఁబడునట్టిది. "నీలోత్పలమ్" అనుచో నీలశబ్దము నలుపురంగునే గాక కలువనుగూడ తెలుపునట్లు ప్రపంచశబ్దము ప్రపంచమునేగాక బ్రహ్మమునుగూడ బోధించునది. కావుననే "సర్వోవై రుద్రః" ఇత్యాది వాక్యములు బ్రహ్మము సర్వశబ్దవాచ్యంబనియు "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యము సర్వచిదచిత్ప్రపంచము శరీరముగాగల యట్టిది బ్రహ్మంబనియు విశదీకరించినవి. ఇట్లు ప్రపంచము బ్రహ్మస్వరూపమగుటచే ద్వేషాస్పదము కానందున శాంతుడై బ్రహ్మము నుపాసింపవలెనని విదితమైనది.

ఇవ్విషయమునే సమర్థించు పురాణశ్లోకములను గానవగును.

విగ్రహం దేవదేవస్య - జగదేతచ్చరాచరమ్ ।
ఏతమర్థం న జానంతి - పశవః పాశగౌరవాత్ ॥
విద్యేతి చేతనాం ప్రాహు - స్తథాఽవిద్యామచేతనామ్ ।
విద్యావిద్యాత్మకం సర్వం - విశ్వం విశ్వగురోర్విభోః ॥
రూపమేవ న సందేహో - విశ్వం తస్యవశేయతః ॥
వృక్షస్య మూలసేకేన - శాఖాః పుష్యంతివై యథా ।
శివస్య పూజయా తద్వత్ - పుష్యత్యస్య వపుర్జగత్ ॥

చరాచర ప్రపంచము శివశరీరంబని పశుతుల్యులైన జీవాత్మలు - సంసారపాశ భారముచే క్రుంగినవారగుటచే తెలియకున్నవారు. చేతనా చేతనాత్మక జగము విద్యావిద్యాత్మకమై విశ్వనియామకుని స్వరూప మనుటలో సందియములేదు. చెట్టుమొదట పోయఁబడు నీరు కొమ్మలు మొదలగు వృక్షమునంతయు పోషించునట్లు శివారాధనముతో జగమంతయు సంతసించునది.

కావున నిట నుపక్రమమున నుపాస్యముగా నిరూపింపఁబడిన బ్రహ్మమే మనోమయత్వాది ధర్మములు కలిగియుండునది. సంసారిజీవునకు

ఇట్టిది పొసగకుండుటచేసి బ్రహ్మలక్షణమే బాగుగా ప్రతిపాదింపబడినదని సారాంశము.

మనోమయత్వమనగా ? నిరతిశయమైన ఆనందము ననుభవించుటకు వలయు పరిపూర్ణమనస్సు కలిగియుండుట యగును. ప్రాణమయత్వ మనగా ? జీవుల నందరిని నియమించు సామర్థ్యము కలిగియుండుట యగును.

ప్రశ్న : ప్రారంభమున చెప్పబడిన బ్రహ్మమే మనోమయత్వాది ధర్మములు కలదియని చెప్పునెడ నవాంతరమందు చూపబడిన జీవప్రసంగము వ్యర్థమగునుగదా ?

ఉత్తరము :

సూ. "వివక్షిత గుణోపపత్తేశ్చ" ౧-౨-౨

ఇట సత్యసంకల్పత్వము సత్యకామత్వము మొదలగు గుణములు చెప్పబడినందున బ్రహ్మముననకే పొసగునట్టివి. జీవాత్మయైతేనో బ్రహ్మో పాసకుడుగా నిర్ధారింపబడువాడు. ఎందుకనగా ? ఉపాస్యమునకు నుపాసకుని యవసరము అనివార్యంబైనది.

సత్యసంకల్పత్వము :— వ్యర్థములు కానట్టి సంకల్పములు కలిగియుండుట యగును.

సర్వకర్మత్వము :— ప్రపంచము కర్తవ్యముగా కలిగియుండుటయగును.

సత్యకామత్వము :— చేతనుల కోరికలను నిర్వహించు బాధ్యతయగును. అథవా సర్వకల్పములయందు జీవులకు వలయు భోగ్యముల నన్నిటి నేర్పరచుటయని చెప్పవచ్చును.

ప్రపంచమును వ్యాపించియు ప్రపంచగతములైన నింద్రియ విషయముల సంబంధము లేకుండుట మున్నగు లక్షణములు బ్రహ్మమునందే యుపపన్నములగునవి.

అనుపపత్త్యధికరణము

సర్వసాధారణముగా జీవునకు నుపాస్యత్వము లేదనియు నుపాసక భావము కలదనియు పూర్వాధికరణమునందు నిరూపింపఁబడినది మరియు సకల జీవోపాదానమగు నారాయణుఁడును విశ్వాతీత పరబ్రహ్మము నుపాసించువాఁడుకాని ముముక్షూపాస్యుఁడు కాజాలఁడని చెప్పున దీ యధికరణము.

సూ. "అనుపపత్తేస్తు న శారీరః" ౧-౨-౩

ఇఁట విషయవాక్యము మహోపనిషదము నందలిది.

"పతిం విశ్వస్యాత్మేశ్వరం శాశ్వతం శివ మచ్యుతమ్. నారాయణం మహాజ్ఞేయమ్"

విశ్వపతిత్వము మొదలగు లక్షణములు కలిగిన నారాయణశబ్ద వాచ్యుఁడైన మూర్త్యాత్మ - పరమాత్మయా ? మరియొకఁడా ? అని సందేహము.

ప్రశ్న : "సహస్రశీర్షం దేవం" మొదలుకొని సహస్రశీర్షత్వాది లక్షణములు గలవాడు మూర్త్యాత్మయగు నారాయణుఁడే యని యభ్యసింపఁబడినది. ఎట్లనఁగా ? "సముద్రేఽంతం విశ్వశంభువమ్" అనుచో సముద్రశాయిత్వము మొదలగు నారాయణలక్షణములు, అచ్యుతహార్యాది పర్యాయవాచక శబ్దంబులు నుండుటఁజేసి మూర్త్యాత్మయగు నారాయణుఁడే విశ్వపతిత్వాదిలింగములు కలవాడని చెప్పనగును కాదా ?

ఉత్తరము : నారాయణుని యంతరాత్మయగు పరమేశ్వరుఁడే విశ్వపతిత్వాది లక్షణములు గలవాఁడు. కావున శివేతరుఁడగు నారాయణునియందయ్యవి యుపపన్నములు కాకుండును. "పశూనాం పతయే" "వృక్షాణాం పతయే" "జగతాం పతయే" ఇత్యాదివాక్యములు పరమేశ్వరునియందే నిఖిలలోకాధిపత్యముగలదని యభ్యసించుచున్నయవి. "ఏకోహి

రుద్రో న ద్వితీయాయ తస్థు ర్య ఇమాన్ లోకా నీశత ఈశనీభిః" అను వాక్యంబును శివేతరులకు జగన్నాథత్వమును నిషేధించినది. "విశ్వాధికో రుద్రః" అను శ్రుతియు శంకరునకే విశ్వాతీతత్వమును సమర్థించుటం జేసి విశ్వపతిత్వాది లక్షణములు గలవాడును నారాయణాంతర్యామియు పరమేశ్వరుడే యగుననుట సమంజసమగుచున్నయది.

ప్రశ్న : "అగ్నిర్వై దేవానా మవమో విష్ణుః పరమః" అను శ్రుతివలన నారాయణుడు సర్వదేవతాశ్రేష్ఠుడని తెలియుచున్నది కాదా?

ఉత్తరము : "యజ్ఞోపవీతం పరమం పవిత్రమ్" అనునట్లు "తస్మాద్దానం పరమం వదంతి" అనునట్లును పై శ్రుతివాక్యము అర్థవాదమగునట్టిది. అథవా పై వాక్యమును ప్రమాణముగా భావించి గ్రహింపబడు పరత్వము - బ్రహ్మాదిదేవతలకంటె పరుడను నర్థమున నుపయుక్తంబగునది. కాని శివునికన్న నధికుడను నర్థమున కాజాలదు. "తత్పరా త్పరతో బ్రహ్మ - తత్పరా త్పరతో హరిః, తత్పరా త్పరతో హీశః" అను శ్రుతిం బట్టియు హరికిగల పరత్వము ఆపేక్షికమైనదని తెలియునది. విష్ణుశబ్దము- "వినా=పక్షిణా, ష్ణాతి=గచ్ఛతీతి విష్ణుః" అను వ్యుత్పత్తి ననుసరించి నారాయణుని బోధించును. "విష్లు వ్యాప్తౌ" అను ధాతువు ననుసరించి వ్యాపించువాడు నను నర్థమున "సర్వేదేవాః సం విశంతీతి విష్ణుః" "తస్మాత్సర్వగతః శివః" ఇత్యాదిశ్రుతులంబట్టియు శివాభిధానమగుచున్న యది.

ప్రశ్న : పరమేశ్వరుడు నారాయణాంతర్యామియనుట యుక్తము కాదు. ఎందుకనంగా ? "నారాయణ పరంబ్రహ్మ" అనుచో నారాయణుడు పరబ్రహ్మంబని చెప్పి "పద్మకోశప్రతీకాశం" ఇత్యాదివాక్యమున జీవుని హృదయపుండరీకమును పేర్కొనియు "తస్యమధ్యే వహ్నిశిఖా" ఇత్యాదిని జీవుని స్వరూపమును నిరూపించి "తస్యాః శిఖాయా మధ్యే - పరమాత్మా వ్యవస్థితః" పరమాత్మయనియు జీవాంతర్యామియనియు చెప్పినందున నారాయణుడు ఉపాస్యుడని తెలియుచున్నయది. మరియు "సబ్రహ్మ స శివః" అనుచో బ్రహ్మశివాదులు నారాయణుని విభూతిలో

చేరినవారనియు విశదమగుటఁజేసి విశ్వపతియు జీవాంతర్యామియు ఉపాస్యుండును నారాయణుఁడే యని చెప్పవలెను కాని శివుడు నారాయణాంతర్యామియగుటచే హరిపరుండనియు హరిచే నుపాసింపఁబడువాడనియు చెప్పుట సమంజసంబగునా ?

ఉత్తరము :

సూ. "కర్మకర్తృవ్యపదేశాచ్చ" ౧-౨-౪

మహోపనిషదమునందు పరమేశ్వరుఁడు ధ్యానింపఁదగినవాడగుటచే కర్మయనియు నారాయణుఁడు ధ్యానించువాడగుటచే కర్తయనియు నిరూపింపఁబడినది. "పద్మకోశ ప్రతీకాశం" అనుచో ప్రస్తుత నారాయణునిదే హృదయము పద్మకోశమువలె ప్రకాశించునదనియు "పరమాత్మా వ్యవస్థితః" అనుచో పరమేశ్వరుఁడే పరమాత్మయనియు నారాయణ హృదయాంతర్వర్తిగా ధ్యానింపఁదగినవాడనియు గ్రహింపనగును. కావుననే శివకేశవులు ధ్యేయధ్యాతృ సంబంధము గలవారై కర్మ కర్తృభావములను పొందుచున్నవారు. అందువలన నారాయణునికంటె వేరగు పరమాత్మ (శివుఁడు) ఉపాసింపఁదగినవాడని విశదమైనది.

"సబ్రహ్మ సశివః" ఇత్యాది వాక్యములయందు బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాది ప్రపంచము విభూతిగా గలవాడు శివుఁడని యుపదేశింపఁబడినది.

మహోపనిషదమునందు విభూతిలో విష్ణువును గ్రహింపకున్నను కైవల్యోపనిషదమునందు విష్ణుగ్రహణమును గాననగును. ఎట్లనఁగా ? "హృత్పుండరీకం విరజం" ఇత్యాదిని హృదయకమలమును పరిశంసించి "ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం - త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్, ధ్యాత్వాముని ర్గచ్ఛతి భూతయోనిం - సమస్తసాక్షిం తమసః పరస్తాత్॥ సబ్రహ్మ సశివః సేంద్రః సోఽక్షరః పరమః స్వరాట్, స ఏవ విష్ణుః సప్రాణః సకాలోఽగ్నిః" "పరమేశ్వరుఁడు - ఉమాసహాయుఁడనియు జగన్నియామకుఁడనియు త్రిలోచనుఁడనియు నీలకంఠుఁడనియు ప్రశాంతుఁ

డనియు ప్రాణులకందరికిని జనకుఁడనియు చేతనుల సమస్తకర్మలకు సాక్షియనియు తమస్సు (ప్రకృతి) నతిక్రమించినవాఁడనియు ధ్యానించు శివభక్తుఁడు - శివపదము నొందువాడగును. ఇట్లు ధ్యేయుఁడై ప్రాప్యుఁడైన పరమేశ్వరుఁడే బ్రహ్మరుద్రేంద్రరూపములు గలిగియుండును. మరియు నాతడే అక్షరుడనఁబఱగును. పరముఁడును స్వరాట్టున్ను విష్ణుమూర్తియు ప్రాణంబును కాలంబు నగ్నియునగువాడు" ఇట్టి కైవల్యోపనిషన్న్యాయము నీ మహోపనిషదమునందు స్వీకరింపనగును.

"యోవై రుద్రః సభగవాన్ భూర్భువః సువ ర్యశ్చ బ్రహ్మ, తస్మైవై నమోనమః" "యశ్చవిష్ణుః" "యశ్చమహేశ్వరః" ఇత్యాది ఆథర్వణశ్రుతియు పై యంశమును సమర్థించుచున్నయది

మహోపనిషదమునందు బ్రహ్మరుద్రులమధ్య విష్ణువు శివోపాసకుఁడగుటచే గ్రహింపఁబడలేదనియు ఉపాసకుఁడుగా ప్రశంసింపఁబడినవాడనియు వివేకము.

ప్రశ్న : పురుషసూక్తమున "సహస్రశీర్షా పురుషః" మొదలుకొని ప్రశంసింపఁబడిన పురుషుఁడు "పాదోఽస్య విశ్వాభూతాని" అనుచో - తనలో జగము ఏకాంశముగా గలవాడని చెప్పఁబడినది. అట్టివాడే "సహస్రశీర్షం దేవం" ఇత్యాదిని నారాయణుడుగా బోధింపఁబడుచున్నవాడు. మరియు "నారాయణ పరంబ్రహ్మ" అనుచో పరబ్రహ్మముగాను చెప్పఁబడుచున్నవాడు. బ్రహ్మమగువాడే సర్వోపాస్యుఁడగును గదా! సర్వోపాస్యుఁడైన నారాయణుఁడు శివోపాసకుఁడు కాదగునా ?

ఉత్తరము :

సూ. "శబ్దవిశేషాత్" ౧-౨-౫

"నారాయణ పరంబ్రహ్మ" అను శబ్దవిశేషమే "నారాయణాత్ పరంబ్రహ్మ" అను నంశమును ప్రతిపాదించుచున్నది. కావున నారాయణునికన్న నితరమగునదియే పరబ్రహ్మముగా నుపాసింపఁదగినదని తెలియ

నగును. పరమేశ్వరుఁడు సహస్రశీర్షత్వము మొదలగు ధర్మములతో కూడి యుండు నారాయణుడనఁబఱగు పురుషుని స్వరూపము గలవాడై జగదు పాదాన మగువాడు.

పరమేశ్వరుఁ డంతర్యామిగా గల నారాయణుఁడు - జగదూపుఁ డని ప్రకృత్యధికరణమునందు బాగుగా నిరూపింపఁబడును.

శ్రీ సుదర్శనాచార్యచరణులు - తాత్పర్య సంగ్రహమునందు "నారాయణః పరంబ్రహ్మ" అని వ్యస్తపదముగా గ్రహించి "నారాయణు నకు పరబ్రహ్మత్వము - పరమేశ్వరునితో నభిన్నమైన (శివోఽహం) భావన గలవాడగుటఁ జేసి విశ్వపతిత్వాది లక్షణములున్ను పొసగు"నని దిగువ శ్లోకము నుదాహరించినవారు.

బ్రహ్మోచ్యతే పరమసౌ పరమంచ తత్త్వం
జ్యోతిఃపరంచ పరమేశ్వర ! పద్మనాభః ।
త్వద్భావనైకనిరత స్త్వదనన్యభావాత్
మంత్రీ యథా గరుడభావనయా గరుత్మాన్ ॥

నారాయణుఁడు శివోపాసకుఁడను నంశమున మరియొక ప్రమాణ మును దిగువ సూత్రము నుదాహరించినవారు.

సూ. "స్మృతేశ్చ" ౧-౨-౬

శ్లో॥ ఏవ ముక్త్వా తతో రాజన్ - మహాయోగీశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ - పరమం రూప మైశ్వరమ్ ॥ భ. గీ.

ఇఁట నారాయణుఁడు మహాయోగస్వామి యని చెప్పఁబడుటచే పరమేశ్వర ధ్యానమనఁబడు సమాధియోగముగలవాడని వ్యక్తమగు చున్నయది. మరియు

శ్రీకృష్ణుని యోగనిష్ఠను వక్కాణించి అట్టి యోగనిష్ఠుఁడగు మహిమవలన పార్థునకు చూపెట్టిన రూపము "ఐశ్వరం" అనఁబడుటచే శివధ్యానయోగముగలవాడు శ్రీకృష్ణుఁడని సువ్యక్తము చేయఁబడినది.

లోకములో గరుత్మన్మంత్రోపాసకుఁడు భావించు గరుడభావన లేనిది గారుడరూపము ఏర్పడనట్లు పరమేశ్వరభావన దృఢముగా లేనిది శ్రీకృష్ణుఁడు శివరూపమును చూపజాలఁడుగదా! దధీచిమహర్షియు పరమేశ్వర భావనాదార్ఢ్యమువలననే విశ్వరూపమును ప్రదర్శించినవాడని లింగపురాణామలయందు దక్షదధీచ సంవాదమున నుల్లేఖింపఁబడినది.

శ్లో॥ అహం యథావదారాధ్యః - కృష్ణేనాక్లిష్ట కర్మణా ।
తస్మాదిష్టతమః కృష్ణా - దన్యోమమ న విద్యతే॥ మహాభారతము

"లోకకల్యాణ కార్యముఁజేయు శ్రీకృష్ణుఁడు నన్ను విధివిహితముగా నారాధించువాడు కావున కృష్ణునికన్న మిక్కిలిప్రియుఁడు మరియొకఁడు గానరాడు" అని పరమేశ్వరుఁడు అశ్వత్థామఁ గూర్చి వక్కాణించెను.

ఏవమాది సందర్భమువలన నారాయణభిన్నమైన శివాఖ్యమగు తత్త్వము ఉపాస్యంబని విశదమైనది.

మరియొక అనుపపత్తిని నివారింపఁ దిగువసూత్రము.

సూ. "అర్భకౌకస్త్వాత్తద్వ్యపదేశాచ్చ నేతిచేన్న,
నిచాయ్యత్వా దేవం వ్యోమవచ్చ" ౧-౨-౭

"నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా, తస్యాః శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః" అనుచో హృదయకమలమందు మిక్కిలి చిన్నదగు అగ్నిజ్వాలలో ఆశ్రయము స్వల్పమగుటచేత నందు గలవాడు నల్పుఁడనఁబడును కావున సర్వవ్యాపియగు పరమేశ్వరుఁడు ప్రతిపాదింపఁబడుచులేడని యాశంకింపగూడదు.

పరమేశ్వరుఁడు ఉపాస్యుఁడగుటచే హృదయగుహాంతర్వర్తియని చెప్పఁబడియెను. కాని యల్పస్వరూపముగలవాడని కాదు. పరబ్రహ్మము కాశమువలె స్వల్పమైనదియు మహత్తునగును. ఘటాదులలో గలమాకాశము స్వల్పమగుటయు, స్వరూపతః మహత్తునగుటయు సుప్రసిద్ధముగావున విరోధమెద్దియులేదని భావము.

మరియు నొక యాశంకకు సమాధానము దిగువ సూత్రము.

సూ. "సంభోగప్రాప్తిరితిచేన్న, వైశేష్యాత్" ౧-౨-౮

"నారాయణపరంబ్రహ్మ" అనుచో నారాయణునికంటె నతీతం బనియు ఉపాస్యంబనియు చెప్పఁబడిన పరబ్రహ్మమే "ఋతం సత్యం పరం బ్రహ్మ - పురుషం కృష్ణపింగళమ్, ఊర్ధ్వరేతం విరూపాక్షమ్" అనుచో పరమశక్తియనఁదగు ఉమాదేవితో కూడి నానావర్ణములు కలదగుటచే కృష్ణపింగళమనియు అగ్నిరేతస్సుగా గలవాడగుటచే నూర్ధ్వరేతస్కం బనియు మూఁడు కన్నులు గలవాడగుటచే విరూపాక్షంబనియు పూర్వోక్త దహరపుండరీకమనఁదగు పురమున శయనించువాడగుటచే పురుషుఁడనియు మనోవిపర్యాసము లేనందున ఋతంబనియు వాగ్విపర్యాసము లేనందున సత్యంబనియు పేర్కొనఁబడినది.

కావున "పరబ్రహ్మమునకు త్రిలోచనత్వము మున్నగు లక్షణములు గల శరీరముఁదగు సంబంధమువలన శరీరగతములైన సుఖదుఃఖాదుల యనుభవము సమకూరు"నని చెప్పఁగూడదు. ఎందుకనఁగా? జీవేశ్వర శరీరములకు వైలక్షణ్యము గానఁబడుచున్నయది. పరమేశ్వరుని శరీరమైతేనో స్వేచ్ఛా గృహీతము; జీవశరీరములు కర్మమూలకములగునవి. ఇందువలననే "అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసః, సత్యకామః సత్య సంకల్పః" అనుచో సంసారి శరీరధర్మములగు పాపము ముసలితనము మరణము దుఃఖము ఆకలి దప్పి లేనివాడనియు యథార్థము లగు సృష్ట్యాదివాంఛలు గలవాడనియు సఫలములగు రచనలు గలవాఁ డనియు పరమేశ్వరుఁడు పేర్కొనఁబడుచున్నవాఁడు. సంసారి జీవుఁడు పతాదృశుఁడు కాజాలడు. పరమేశ్వరుని శరీరములు ప్రాకృతములుకాని వనియు పాప జరామరణ శోకాదిరహితములనియు స్వేచ్ఛాసంపాదితము లనియు లీలామంగళరూపములనియు "స్థిరేభి రంగైః పురురూప ఉగ్రః"

ఇత్యాది వాక్యములయందు స్థిరములనియు నిత్యములనియు ప్రతిపాదింపఁబడినది. అందువలన పరబ్రహ్మమగు శివునికి జీవునికిని భేదముండుటఁ

జేసి జీవునికివలె శరీరాదిగత దోషములు పరమేశ్వరునకు సంభవింపఁజాలవని సారాంశము.

ఇఁట నుపక్రమాది లింగములతో విరూపాక్షుమైన పరబ్రహ్మము సర్వోత్కృష్టముగా నుపాస్యంబనుట సమంజసంబగుచున్నయది. ప్రారంభమున "అణోరణీయాన్" మొదలుకొని "మహిమాన మీశమ్" వరకు పరమేశ్వరుఁడు-ప్రాణులందరి హృదయ గుహాలయంను నివసించుచు తన యనుగ్రహాతిశయమున సంసారదుఃఖమును తొలగించుకొనిన మహాపురుషునకు దర్శనీయుఁడగు గొప్ప మహిమగలవాడని ప్రశంసింపఁబడినవాడు. మఱియు "సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" అనుచో పరమశక్తి సంపన్నుడైన శివుఁడే ప్రాణశబ్దితములైన మనోబుద్ధి జ్ఞానేంద్రియ పంచకములు మున్నగు జగమునకు నుపాదాన మగువాడని నిరూపింపఁబడెను. అనంతరము "యో దేవానాం ప్రథమం పురస్తాత్ - విశ్వాధికో రుద్రో మహర్షిః, హిరణ్యగర్భం పశ్యత జాయమానమ్" అనుచో విశ్వాధికుఁడనియు సర్వజ్ఞుఁడనియు సకలకార్య ప్రథముఁడగు హిరణ్యగర్భుని పుట్టించి యనుగ్రహించువాడగుటచే జగత్కారణమగుననియు శివుఁడు పరామర్శింపఁబడెను. అట్టి పరమాత్మయే "పరేణనాకమ్" అనుచో పరాకాశమనఁదగు గుహలో నుండువాడనియు ఫలాపేక్షారహితముగా కర్మల నాచరించి వేదాంతముల తాత్పర్యమును గురుతెఱిగిన జితేంద్రియులకు "పరామృతాత్ పరిముచ్యంతి" అనుచో పరామృతరూపముగా ప్రాప్యుఁడనియు వర్ణింపఁబడెను. అట్టి శివుని పొందుటకు నుపాయ మెద్దియనఁగా "దహరం విపాప్మమ్" అనుచో దహరోపాసనమని ప్రారంభించి "తస్మిన్ యదంత స్తదుపాసితవ్యమ్" అనుచో దహరపుండరీకమునఁగల వస్తువు ఉపాసింపఁదగినదని సామాన్యముగా చెప్పి "యఃపరః సమహేశ్వరః" అనుచో మహేశ్వరుఁడను పేరుగల పరబ్రహ్మము విశేషించి నిర్ధారింపఁబడినది. ఉపాస్యము ఎట్టి రూపము గలదనునెడ "ఋతం సత్యమ్" ఇత్యాది వాక్యమున విరూపాక్షత్వాది స్వరూపము గలదియని యుపసంహరింపఁబడెను.

"యో దేవానాం" అను మంత్రము తరువాతిదగు "యస్మాత్పరం నాపరమస్తి కించిత్" అను మంత్రము శివపరమగునని ఆశ్వలాయనుఁడు దిగువ శ్లోకములతో సమర్థించెను.

"యస్మాత్పరతరం నాస్తి - నాపరంచ పరాత్మనః ।
నజ్యాయోఽస్తి న చాణీయో - నమస్తస్మై స్వయంభువే ॥
యేనేద మఖిలం వ్యాప్తం - యన్మయా మూర్తయః స్మృతాః ।
తస్మై శివాయ మహతే - నమః సూక్ష్మాక్షరాత్మనే" ॥

మహోపనిషదమునందు నవాంతర వాక్యసిద్ధుఁడగు నారాయణుఁడు పూర్వాధికరణ న్యాయము ననుసరించి యుపాసకుఁడుగా నిర్ణయింపఁబడు చున్నవాడనియు జీవులందరికి శివోపాసనాధికారము ఉన్నను విశిష్ట పురుషాస్థితమగుటచే శివోపాసనము సర్వోత్తమమైనదని భావించి నారాయణుఁడు శివోపాసకుఁడుగా గ్రహింపఁబడెననియు ఉపాస్యంబగు విరూపాక్ష బ్రహ్మముతో తదుపాసకుఁడైన నారాయణుఁడు నభిన్నమగు భావన గలవాడగుటచే శివధర్మములగు విశ్వపతిత్వాదులతో ప్రతిపాదింపఁబడెననియు శివాంతర్యామికుఁడు శివకార్యంబు నగు నారాయణునకు జగద్రూపత్వాదులు పొసగుననియు సిద్ధాంతము.

అత్త్రధికరణము

సూ. "అత్తా చరాచరగ్రహణాత్" ౧-౨-౯

విషయవాక్యము "యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః, మృత్యు ర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్రసః"

ఇఁట మృత్యువును వ్యంజనముగా గ్రహించి బ్రహ్మక్షత్రోపలక్షితమైన జగమును కబళముగా స్వీకరించు సర్వసంహర్త - పరమేశ్వరుఁడా? తదితరుఁడగు సంహారరుద్రాది రూపములుగల దేవతావిశేషమా? అని సందేహము.

ప్రశ్న : పరమకారుణికుఁడు సర్వానుగ్రాహకుఁడు నగు భగవానుఁడు సకల భక్షకుఁడనుట యనుచితము. ఇతరుల ప్రాణములను తీయుట - హింసారూపముగదా! హింసాప్రవృత్తికి క్రోధమే మూలాంకురమగునది అమంగళగుణమగు క్రోధమునకు మోహమే కారణమని తెలియునది. సర్వసంహార నిదానమైన మోహమునకు తమోగుణమే జన్మస్థానమగును కావున సర్వసంహర్తయు తామసుఁడు కావలసివచ్చును. తామసత్వమనఁగా? జ్ఞానాది సద్గుణములను మఱుగుపఱచు ప్రకాశరాహిత్యముగదా! బ్రహ్మము సర్వసంహర్తయని చెప్పునెడ - నిత్యశుద్ధము నిరుపాధికమంగళాత్మకము సంసారకళంకరహితమునగు బ్రహ్మమునకు అజ్ఞాన తమో మోహ క్రోధాదికములైన అమంగళ గుణములు సంభవించునని చెప్పవలసివచ్చును. మరియు బ్రహ్మస్వరూప లక్షణముగా నిర్ణయింపఁబడిన సర్వజ్ఞత్వ నిత్యతృప్తత్వాదికము వ్యర్థమే యగునది. అందువలన పూర్వోక్త గుణములుగల మరియొక దేవతావిశేషము - సంహర్తయగువాడని యంగీకరింపవలెను గాదా?

ఉత్తరము : బ్రహ్మమే సర్వసంహర్తయని చరాచరగ్రహణమువలన తెలియుచున్నయది. "చరాచరమునంతయు భక్షించుట యుచితముగా" దని చెప్పుట సరికాదు. అద్దియే బ్రహ్మమగుటకు లక్షణముగదా! పరిమిత శక్తిగల జీవాత్మకు చరాచరమునంతయు సంహరించు సామర్థ్యము లేకుండును. "తస్మాదుపసంహర్త్రే మహాగ్రాసాయవై నమోనమః" అను అథర్వశిరోవాక్యమున పరమేశ్వరుఁడు సర్వసంహర్తయని ప్రతిపాదింపఁబడినది. కాని జీవాత్మ - సర్వ సంహర్తయని యెందును చెప్పఁబడలేదు. మరియు "య ఇమా విశ్వా భువనాని జుహ్వదృషిర్హోతా నిషసాదపితానః, స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛదో వర ఆవివేశ" "సకలవేద ద్రష్టయు మమ్ము పుట్టించువాడు నగు శివుఁడు - లోకముల నన్నిటిని స్వగర్భవహ్నియందు హోమముఁ జేయుచు తానుమాత్ర ముండువాడు. ఇట్టి పరమాత్మ - స్వేచ్ఛాశక్తిచే స్వవిభూతి యనఁదగు ప్రపంచమును

బంగారముతో కుండలమునువలె సృజింపఁదలచెను. నిజసంకల్పమాత్ర సృష్టమగు ప్రపంచము ఆవరణముగా గలవాఁడై ప్రపంచమునఁ బ్రవేశించెను" అనుచో పరమేశ్వరుఁడు నిజప్రకాశవహ్నియందు నిఖిలభువన హవ్యములను హోమముఁజేయు వాఁడని విదితమగును. హవ్యకోటిలో చేరిన జీవునకు ఇట్టి సామర్థ్యము లేదుగదా! స్వభిన్నమగు చరాచరములతో నిండియుండు చిదచిత్ప్రపంచము నంతయు తనలో నుపసంహరించి (శివుఁడు) యుండు తఱి - జగమంతయు సూర్య చంద్రాది ప్రకాశము లేనిదగుటచే దివా రాత్ర్యాది కాలవిభాగము లేనిదియు నామరూప విశేషరహితమగుటచే దేవమానవాది స్థూలవిభాగము లేనిదియు తమోమాత్రముగా నుండెడిది. ఆ సమయమున పరమేశ్వరుఁడు ఒకఁడే నిరంకుశ ప్రకాశముగలవాఁడై సర్వసాక్షిగా నుండువాఁడు. ఇందుకు శ్రుతిప్రమాణము "యదా తమస్త న్న దివా న రాత్రి - ర్న సన్న చాసచ్ఛివ ఏవ కేవలః"

ప్రశ్న : నిత్యప్రకాశముగలవాఁడై శివుఁడు ఉన్నపుడు జగము తమోమయంబగుట పొసగదుగదా! అట్లైనచో శివుని నిత్యప్రకాశమునకు భంగము చేకూడును గాదా?

ఉత్తరము : జగము తమోమయముగా నున్నను స్వయంప్రకాశమానుఁడు సర్వసాక్షియు నగు శివునకు హాని యేమియు లేదు. ప్రళయకాలము నామరూపశూన్యమగుట నింద్రియశక్తులను గోల్పోయిన జీవాత్మలు - శరీరాది పరికరములు లేనివారై సృష్టియందువలె ప్రపంచము ననుభవింపఁజాలనివారగుదురు. మఱియు ననాదిమలత్రయముచే నిజజ్ఞానము మఱుగువడియుండు కతన శివుఁడు స్వప్రకాశుఁడైనను జీవులకు దర్శనీయుఁడు కాకుండును. అందువలన సమస్త కార్య విశేషజ్ఞానము లేనట్టి (జీవుల) పరమ సుషుప్తియనఁదగు మహావస్థ - తమస్సు అనఁబడుచున్నయది.

ఆసీదిదం తమోభూత మప్రజ్ఞాత మలక్షణమ్, స్మృతి.

"ఈ జగము - ప్రళయమున నామరూపవిభాగములేనిదై తమోమాత్రముగ నుండినది" అప్రజ్ఞాతమనగా - నామవిభాగము తెలియరానిది, అలక్షణమనగా - రూపవిభాగముఁ జేయరానిది యగును.

"శివ ఏవ కేవలః" అనుచో కేవలపదమునకు సూక్ష్మ (నామరూప విభాగరహిత) చిదచిత్ప్రపంచ విశిష్టుఁడను నర్థముఁజెప్పి ఏవకారమునకు స్వసమానమైన ద్వితీయవస్తువు లేనివాడని నిర్వచనముఁజేయవలెను. మఱల సృష్టికాలమున స్వసంకల్పమువలననే యత్కించి దుపకరణము లేకయే తననుండి ప్రప్రథమముగా ఇచ్ఛాశక్తిని స్ఫురింపఁజేయువాడును వెనువెంటనే పూర్వపూర్వ నామరూపములతో ఇంద్రాది చేతనులను పృథివ్యాద్య చేతనములను సృజించువాడును శివుఁడనియే గ్రహింపవలెను.

శ్లో॥ చిదాత్మైవహి దేవోఽంతః - స్థిత మిచ్ఛావశా ద్బహిః ।
యోగీవ నిరుపాదాన - మర్థజాతం ప్రకాశయేత్॥ అభియుక్తసూక్తి.

చిదానందస్వరూపుడగు పరమేశ్వరుఁడే తనలో సూక్ష్మరూపముతో నుండు చరాచరమునంతయు యోగిపురుషునివలె నెట్టి సాధనము లేకయే స్థూలరూపముతో బయలుపఱచువాడు.

ప్రశ్న : "మాయాంతు ప్రకృతిం విద్యా - న్మాయినంతు మహేశ్వరమ్" అనుచో (మాయ జగమున కుపాదానమనియు) మహేశ్వరుడు మాయావిశిష్టుండని విశదమగుచున్నందున మహేశ్వరుడు గావించు సృష్టి కార్యమునకు మాయ యుపాదానమగునని బోధపడుచున్నయది. మరియు "తస్మాద్విరాడజాయత" అనుచో పురుషుడును జగదుపాదానముగా పేర్కొనంబడుచున్నవాడు కావున పరమేశ్వరుడు నిరుపాదానముగా జగమును సృజించు ననుట యెట్లు పొసగును ?

ఉత్తరము : కుమ్మరివాడు చేయు ఘటమునకు వేరుగా మృత్పిండ ముపాదానముగా కనఁబడునట్లు మాయాద్యుపాదానములు పరమేశ్వరుని విడచియుండునవి కావు. పరమేశ్వరుడే మాయాది రూపములఁదాల్చి

జగమును పుట్టించువాడు కావున "నిరుపాదానమ్" అనుటలో విరోధ మేమియు లేదు. స్వరూపములగు సూక్ష్మమాయాపురుషులతో నవినాభావముగల పరమేశ్వరుఁడే స్వయముగా నుపాదానమనియు చెప్పఁబడువాడు.

"ధ్యాయీతేశానం ప్రధ్యాయితవ్యమ్, సర్వమిదం
బ్రహ్మవిష్ణురుద్రేంద్రాస్తే సంప్రసూయంతే, సర్వాణి చేంద్రియాణి,
సహభూతై, ర్నకారణం కారణానామ్, ధాతా ధ్యాతా కారణంతుధ్యేయః
సర్వైశ్వర్య సంపన్నః సర్వేశ్వరః శంభు రాకాశమధ్యే"

అథర్వశిఖోపనిషత్తు.

"ధ్యేయుఁడగు పరమేశ్వరుని ముముక్షువు ధ్యానింపవలెను. బ్రహ్మ విష్ణురుద్ర మహేశ్వరులు, సర్వప్రపంచంబు సర్వేంద్రియములు, పంచభూతములును పరమేశ్వరునివలన నావిర్భవించునట్టివి. జగత్కారణములుగా నిర్దేశింపఁబడు పంచభూత దశేంద్రియాదులకు కారణుఁడైన పరమాత్మ మాత్రము ఎద్దానివలన నావిర్భవించువాడు కాదు. ఇట్లు జగమునంతయు నిర్మించువాడు తదుపయుక్తమైన వస్తుసామగ్రిని కనిపెట్టువాడు నగు పరశివుఁడు - సర్వజ్ఞత్వము మొదలగు కల్యాణగుణముల సమృద్ధిఁగలవాడనియు సమస్త ప్రపంచమును శాసించువాడనియు హృదయపుండరీక గతమగు చిదాకాశమునందు ధ్యానింపఁదగినవాడు" ప్రాణులందరు సంహరింపఁబడుటకు నిలయమెద్దియో నద్దానినుండియే జీవుల యావిర్భావమగుటంజేసి యవధిలేనట్టి జీవాత్మలు - అనంతశక్తి విశిష్టుఁడగు పరమేశ్వరునందే విశ్రాంతిఁ జెందుదురని విశదమగుచుండుటచే బ్రహ్మశబ్దాభిధేయుండగు శివుఁడే సర్వసంహర్త యగువాడు.

"సర్వజగత్సంహారము హింసారూపమగుటచే హింసామూలములగు క్రోధాద్య నర్థగుణములు బ్రహ్మమునకు సంబంధించు"నని చెప్పుట యవివేకమగును. ఎందుకనఁగా ? క్రోధాదిగుణములకు మూలమగు తమోగుణము ప్రాకృతముగదా ! "ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం"

మొదలుకొని "సమస్త సాక్షిం తమసః పరస్తాత్" వరకుగల పూజ్యమగు శ్రుతియే - పరమేశ్వరుఁడు తమోఽతీతుఁడని చెప్పుటకు - పరమప్రమాణ మగుచున్నయది.

మఱియు - పరమాత్మ మోహాదులను తొలగించు జ్ఞానాదిగుణ ములతో నిత్యసంబంధము గలవాడని - పౌరాణికవాక్యము విశదీక రించినది.

శ్లో॥ జ్ఞానం వైరాగ్య మైశ్వర్యం - తపః సత్యంక్షమా ధృతిః
స్రష్టృత్వ మాత్మసంబోధో - హ్యధిష్ఠాతృత్వ మేవచ ॥
అవ్యయాని దశైతాని - నిత్యం తిష్ఠంతి శంకరే ॥

జ్ఞానము, విరాగము, ఈశ్వరభావము, తపస్సు (సృష్టి సామగ్రి నాలోచించుట) సత్యము, సహనము, ధైర్యము, నిఖిల ప్రపంచమును సృజించుట, తనను తాను గుర్తెరిగియుండుట, సృష్టజగము నంతర్యామిగా నధిష్ఠించుటయు నీ పది నిత్యగుణములు పరమేశ్వరునియం దెల్లకాలము వర్తించునవి.

శ్లో॥ అశేషవిషయామోఘ - శుద్ధబుద్ధి విజృంభణః
ఆత్మశక్త్యమృతాస్వాద - ప్రమోదరసికో యువా ॥

పరమేశ్వరుఁడు - నిరుపయోగము కానట్టి శుద్ధమైనట్టి నిత్యాభి వృద్ధి గలిగినట్టియు స్వకీయవిజ్ఞానమున చరాచరమంతయు విషయముగా గలవాడును, నిజశక్తిరూపమైన నమృతము నాస్వాదించుటవలన కలుగు ప్రమోదముచే రసికుడగువాడును, నిత్యయువకుఁడు నగుచున్నవాడు.

నిగ్రహము - అనుగ్రహోద్దేశముతో పుత్రాదులనుగురించి చేయఁ బడునదియు, గొప్పవారి ననుగ్రహించుటకై తదితరములను వేట మొద లగువానియందు హింసించునదియు, ప్రజలను తద్బాధకులగు చోరాదుల ననుగ్రహించు నుద్దేశముతో గావింపఁబడునదియు నగుచు త్రివిధంబగును. ఏతాదృశ త్రివిధ నిగ్రహము హింసారూపమైనను దోషావహము కానట్టిది.

ఇందుకు ప్రమాణము.

శ్లో॥ ఏకస్మిన్ యత్ర నిధనం - ప్రాపితే దుష్టచారిణి
బహూనాం భవతిక్షేమం - తత్ర పుణ్యప్రదో వధః ॥

దుర్మార్గు నొకనిని సంహరించునెడ బహుజనమునకు క్షేమము కలుగునేని యట్టి నిగ్రహము పుణ్యప్రదమగునది.

శ్లో॥ రాజభి ర్ధృతదండాస్తు - కృత్వా పాపాని మానవాః
విమానైః స్వర్గమాయాంతి - సంతః సుకృతినో యథా ॥

పాపములఁ జేసిన మానవులు రాజదండనఁ బొందినచో పుణ్యాత్ముల వలె విమానములలో స్వర్గమునకు వెళ్ళుదురు.

ఐతే ఇమ్మూడు విధములగు నిగ్రహములుగాక నాల్గవదైన ద్వేష మూలక నిగ్రహము దోషావహ మగుటచే పరిహరింపఁదగినదని భావము.

మహాప్రళయకాలమున పరమేశ్వరుఁడు గావించు సర్వసంహారము - అనుగ్రహరూపమగునది. ఎట్లనఁగా ? చాలకాలమునుండి సంసారమార్గ మున రాకపోకలచే నలసటఁ జెందియుండు జీవులకు మహాసుషుప్తి యనఁ దగు గొప్ప విశ్రాంతిని కలుగఁజేసి యనుగ్రహించుట యగును.

స్థితికాలమున చేయఁబడు రాక్షస సంహారము - దేవతలను రాక్షసుల నుభయుల ననుగ్రహించుటయగును. మఱియు హింసించు తిర్యగ్జంతువు లను వధించుట - భక్తులను కాపాడునది. పాపాత్ములను నరకములందు బాధింపఁజేయుట - వారి పాపములను బోకార్చి యనుగ్రహించునది;

ఇట్లు పరమేశ్వర కృతములైన నిగ్రహములన్నియు దోషావహ ములు గాకుండుటను గుణము లగుటను శివమహాపురాణాంతర్గత వాయు సంహితయందు గాననగును.

శ్లో॥ యే పుత్రనిగ్రహాః కేచిత్ - బ్రహ్మాదిషు నిదర్శితాః
తేఽపి లోకహితాయైవ - కృతాః శ్రీకంఠమూర్తినా ॥
అండస్యాస్యాధిపత్యం హి - శ్రీకంఠస్య న సంశయః
శ్రీకంఠాఖ్యాం శివో మూర్తిం - క్రీడంతీ మధితిష్ఠతి ॥

సదోషా ఏవ దేవాద్యా - నిగృహీతా యథోచితమ్
తత స్తేఽపి విపాప్మానః - ప్రజాశ్చ విగతజ్వరాః ॥
నిగ్రహోఽపి స్వరూపేణ - విదుషాం న జుగుప్సితః
అతఏవహి దండ్యేషు - దండో రాజ్ఞాం ప్రశస్యతే ॥
యత్సిద్ధి రీశ్వరత్వేన - కార్యవర్గస్య కృత్స్నశః
న స చే దీశతాం కుర్యా - జ్జగతః కథ మీశ్వరః ॥
హితే సదా నిషణ్ణానా - మీశ్వరః స్యా న్నిదర్శనమ్
స కథం దూష్యతే సద్భి - రసతా మేవ నిగ్రహాత్ ॥
సర్వోఽపి నిగ్రహో లోకే - న చ విద్వేషపూర్వకః
న హి ద్వేష్టి పితా పుత్రం - యో నిగృహ్యాపి శిక్షయేత్ ॥

పరమేశ్వరుఁడు శ్రీ కంఠమూర్తికి బ్రహ్మాండాధిపత్యము నొసఁగి విహరించు నమ్మూర్తి నావహించియు తద్వారా లోకహితమునకై బ్రహ్మాదులను పుత్రభావనతో శిక్షించినవాడు. ఇట్లే దేవతలు మున్నగువారు నపరాధులై నపుడు నవ్వారిని నిగ్రహించుటఁ జేసి దేవతలు ప్రజలును నిర్దోషులై సుఖముగా మనుచుండువారు. ఇట్టి నిగ్రహము - వస్తుతః జ్ఞానులచే నిందింపఁబడునది కాదు. కావుననే రాజులు చోరాదులను శిక్షించుట - న్యాయమగుచున్నయది. ఈశ్వరుడనఁగా - బ్రహ్మాదికార్యవర్గము నంతయు శాసించువాడగును. ఒకవేళ శాసింపకుండునెడ జగత్ప్రభుఁ డెట్లగును? లోకమున దుర్మార్గులను మాత్రము శిక్షించుచు నవ్వారి హితముఁ గోరు మహానుభావులకు పరమేశ్వరుఁడే నిదర్శనమగువాడు. కావున నట్టివారు పరమేశ్వరునివలె నదూషితులగుదురు.

జనకుఁడు - పుత్త్రుని నిగ్రహించినను ద్వేషింపనట్లు పరమేశ్వరుని సర్వవిధ నిగ్రహంబు ద్వేషపూర్వకము కానట్టిది.

ప్రశ్న : దైత్యులు మొదలగువారిని చంపుటయందు క్రోధ మనివార్యమగుటచే క్రోధ మూలమగు తమోగుణము కలవాడు పరమేశ్వరుఁ డని చెప్పవలెఁ గాదా?

ఉత్తరము : "తమసః పరస్తాత్" అను శ్రుతివాక్యము ననుసరించి పరమేశ్వరునికి వలయు క్రోధము తమోగుణమువలన నేర్పడదని తెలియు చున్నది.

"తమస్సులేనిది క్రోధము కలుగ" దని శంకింపఁగూడదు. "క్రోధ మాహారయన్ తీవ్రమ్" అని శ్రీ రామాయణమునందు చెప్పినరీతిగా దుష్టనిగ్రహమునకై క్రోధము తెచ్చుకొనఁబడున దగుటచే పరమేశ్వరుని యధీన మగునట్టిది.

అసంకుచితమగు వైభవముగల పరమేశ్వరుఁడు - సృష్టిఁజేయఁదలచి "సోఽకామయత బహుస్యామ్" విశాల ప్రపంచము సిద్ధమగుటకు మాయా స్వరూపిణియగు ఇచ్ఛాశక్తి నాశ్రయించువాఁడు. పిమ్మట "సతపోఽ తప్యత" తపఃస్వరూపిణియగు జ్ఞానశక్తితో జీవాత్మలందరి కర్మలకు వలయు నానావిధ శరీరము లనంబడు సామగ్రి నాలోచించువాఁడు. తరువాత సంకల్పించినవాటి నన్నిటిని నిర్మించు నేర్పుగల క్రియాశక్తితో "ఇదం సర్వమసృజత" ఇచ్ఛాశక్తి - భిత్తియందు సమస్త జగచ్చిత్రమును బయలుఁ బఱచువాఁడు. "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్" బ్రహ్మాది కార్యవర్గము నంతయుఁ బ్రవేశించి ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తిత్రయ సంబంధముతో రజ స్తమః సత్త్వ గుణత్రయముతో నేర్పడు బ్రహ్మ విష్ణు రుద్రులు మొదలగు ప్రపంచముగా పరిణమించువాఁడు. కావున సర్వవిధ సామర్థ్యములు గలిగిన యట్టి సర్వజ్ఞుఁడగునట్టియు శివుని మహిమ - ఏతన్మాత్రమని యెవఁడు గురుతెఱుఁగఁజాలును? ఎవనికిని తెలియనలవి గానిదని భావము.

ఇందువలన సర్వమును సంహరించువాఁడు పరమేశ్వరుఁడే యని విదితమైనది.

సూ. "ప్రకరణాచ్చ" ౧-౨-౧౦


"మహాంతం విభు మాత్మానం మత్వాధీరో నశోచతి"

"నాయమాత్మా ప్రవచనేన లభ్యః"

"గొప్పవాడు సర్వవ్యాపకుఁడునగు పరమాత్మను ధీరుఁడు భావించు నెడల సంసార దుఃఖమును పొందఁజాలఁడు"

"ప్రసంగముతో పరమాత్మ - తెలియువాడు కాదు"

ఇట్టి పరమేశ్వర ప్రకరణ మిందున్నందునను పరంబ్రహ్మమగు పరమేశ్వరుఁడే సర్వ సంహర్తయగును కాని యితరుఁడు కాజాలఁడని సిద్ధాంతము.



మహారాజ రాజపోషక వర్గము :
బ్రహ్మశ్రీ లోకారాధ్యులైన ఘట్టేపల్లి నాగమల్లయారాధ్యులవారు, ఘట్టేపల్లి భద్రయ్య శంకరయ్య ఆరాధ్యులు, రామగిరి రాజలింగారాధ్యులు, ముత్యంపేట చంద్రమౌళి ఆరాధ్యులు
తదితర శైవ ప్రముఖయువకులు, బాలబాలికలు.
నివాసము : సిద్ధిపేట, మెదక్ మండలము - (ఆం. ప్ర.)

గుహాఽధికరణము

పూర్వాధికరణమున సర్వ సంహార్తగా నేర్పడిన పరమేశ్వరుఁడు "ద్వాసుపర్ణా" ఇత్యాది శ్రుతివాక్యములందు ప్రసిద్ధమగు జీవ సాహచర్యము గలవాడని తెలుపునదీ యధికరణము.

సూ. "గుహాం ప్రవిష్టా వాత్మానౌ హి, తద్దర్శనాత్" ౧-౨-౧౧

"అత్త్రధికరణమున త్రిమూర్త్యాతీతుఁడు పరమేశ్వరుఁడని ప్రతిపాదించి యట్టి పరశివుని ముముక్షువులు - సకలేతర దేవతా పరిత్యాగ పూర్వకముగా నుపాసించి సాక్షాత్కరించుకొనవలెనని సూచింపఁబడినది గదా! ఇద్ది యుక్తము కాదు. ఎందుకనగా?

హరిశ్చాహం చ రుద్రశ్చ - తథాఽన్యేచ సురాసురాః
తపోభిరుగ్రై రద్యాపి - యస్య దర్శన కాంక్షిణః ॥

"విష్ణుమూర్తి నేను రుద్రుఁడును తదితరులగు దేవతలు రాక్షసులును తీవ్రములగు అనుష్ఠానములతో నిప్పటికిని పరమేశ్వరుని దర్శింపఁ గోరుచుందుము."

ఇట్లు చతుర్ముఖబ్రహ్మ వక్కాణించిన సందర్భము ననుసరించి బ్రహ్మాదులకును చూడనలవి గానట్టి పరమాత్మను మన బోంట్లు గావించు నుపాసనతో దర్శింపవలనుపడ" దను నాశంకకు పై సూత్రము సమాధానమగుచున్నయది.

విషయ వాక్యము : "ఋతం పిబంతౌ సుకృతస్య లోకే - గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే, ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి-పంచాగ్నయో యేచ త్రిణాచికేతాః"

"సుకృతమునకు నిలయము, ఉత్కృష్ట బ్రహ్మవిద్య నాపాదింపఁ జేయునదగుటచే పరమము, శివోపాసనాత్మక శ్రేష్ఠప్రయోజనము గలదియు నగు బ్రాహ్మణాది శరీరమునందు కర్మఫలము ననుభవించు (అనుభవింపజేయు) వారు, నీడ వెలుఁగులవంటివారు నగు జీవేశ్వరులు హృదయ

గుహాం బ్రవేశించినవారని పంచాగ్న్యుపాసకులగు బ్రహ్మవిదులైన నచి కేతులు వక్కాణింతురు."

జీవాత్మయందు నిండు వాత్సల్యము గలవాడై పరమాత్మ - జీవ సాహచర్యము నంగీకరించినవాడు. జీవుఁడు స్వభూతిలో చేరినవాడగుటచే తండ్రికి కుమారునియందువలె జీవాత్మయందు వాత్సల్యము కలవాడగును.

ఇఁట - సుకృతలోక, పరమ, పరార్ధ విశేషణములతో శివోపాసన యందధికారము గలిగినట్టి బ్రాహ్మణాదుల ననుగ్రహించుటకును హృదయ గుహాయందు భావలింగస్వరూపముతో సాక్షాత్కరించుటకును పరమేశ్వ రుఁడు జీవసహచరుండాయెనని విశదార్థము.

సుకృతస్థానము పరార్థము నగు బ్రాహ్మణాది శరీరమునందు హృదయ గుహాం బ్రవేశించినవారు ఫలభోక్తలు, ఛాయాతపములవలె భిన్నస్వరూపము గలవారును బుద్ధిజీవులా? జీవపరమేశ్వరులా? అని సంశయము.

ప్రశ్న : హృదయగుహాం బ్రవేశించినవారు బుద్ధిజీవులగుదురు. "ఋతం పిబంతౌ" "కర్మఫలము ననుభవించువా" రని చెప్పుటవలన కర్మ ఫలభోగము పరమేశ్వరునకు సంభవింపదుగదా! "అనశ్నన్నన్యో అభిచాక శీతి" "జీవభిన్నుడైన పరమాత్మ - కర్మఫలము ననుభవింపనివాడై ప్రకా శించువాఁడు" బుద్ధిజీవులకైతే భోక్తృత్వము ప్రసిద్ధమగుటను జీవేశ్వరు లిరువురును చేతనులగుటచే ఛాయాతపములవలె వైలక్షణ్యము లేనివా రగుటను బుద్ధి యచేతనము కావున జీవవిలక్షణమగుట నిట బుద్ధిజీవులే ప్రతిపాదింపఁదగినవారు.

ఉత్తరము : హృదయ గుహాం జెందియుండువారు జీవ పరమేశ్వరు లేను; "తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురా ణమ్" అనుచో జీవునితోసహా గుహాప్రవేశము పరమేశ్వరునకు వినంబడు చున్నయది. పరమేశ్వరునకు భోక్తృత్వము సంభవింపదని చెప్పుట

యుక్తముకాదు. "ప్రాణారామం మన ఆనందమ్" అనుచో బ్రహ్మము ఆత్మారామమైనను మనోమాత్ర విషయమగు స్వరూపానందము ననుభవించునదని విదితమగుచున్నయది.

కావుననే

శ్లో॥ ఆత్మశక్త్యమృతాస్వాద ప్రమోదరసికో యువా
అనంత పరమానంద మకరంద మధువ్రతః ॥

"నిజశక్తి యనఁబడు అమృతము నాస్వాదించుటవలన కలుగు ప్రమోదముచే రసికుఁ డగువాడు నిత్యయువకుఁడు నిరవధికమగు శ్రేష్ఠమైన ఆనందమను పూదేనెఁ గ్రోలుటయందు తుమ్మెదవంటివాడును" అని పురాణవాక్య ముద్ఘోషించుచున్నయది.

జీవుఁడైతే తాజేసిన కర్మయొుక్క ఫలితము ననుభవించుట ప్రసిద్ధము గదా! ఇట్లు జీవేశ్వరులకు భోగము సాధారణమైన నందు విశేషము పాటింపఁబడునది. "రాజు భృత్యుఁడును భోజనమును చేయుచున్నా"రను నెడ వారివారికి తగు అన్నమును భుజించువారేకాని సమానమైన ఆహారము ననుభవించువారు కారని భావింపవలెను. "జీవేశ్వరులకు వ్యత్యాసములేద"ని చెప్పుట యుక్తముకాదు. "నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానామ్" అను శ్రుతి వాక్యముతో జీవేశ్వరులకు నిత్యత్వ చేతనత్వాది సామ్యము వినంబడుచున్నను అనాదికాలమునుండి సంబంధించియున్న అజ్ఞానము జీవాత్మకుండుట పరమాత్మకు లేకుండుట యను వైషమ్యము సిద్ధమగుచున్నయది. మఱియు "జ్ఞాజ్ఞౌ ద్వావజా వీశానీశౌ" ఇత్యాది శ్రుతివలన పరమేశ్వరుఁడు - సర్వజ్ఞుఁడు నిత్యుఁడు స్వతంత్రుఁడు ననియు, జీవుఁడు - కించిజ్ఞుడు నిత్యుఁడు పరతంత్రుఁడు ననియు వైలక్షణ్యము బోధపడుచున్నయది.

ప్రశ్న : జీవేశ్వరులకు శరీరసంబంధము సమానమైనను ఒకనికి అజ్ఞత్వాది అనర్థముల సంబంధము మఱియొుకనికి నజ్ఞత్వాది అనర్థముల సంబంధము లేకుండుట యెట్లు పొసగును ?

ఉత్తరము : సుఖదుఃఖానుభవమునకు ఏకాశ్రయత్వము సాధకము కాదు. స్వతంత్ర పరతంత్ర భావములే సాధకములగును. "సమానే వృక్షే పురుషో నిమగ్నోఽనీశయా శోచతి ముహ్యమానః, జుష్టం యదా పశ్యత్యన్యమీశ మస్య మహిమాన మితి వీతశోకః" ఇద్దానికి సాంప్రదాయికార్థము వ్రాయఁబడుచున్నది.

"ఈ జీవాత్మ - అనాదియగు కర్మబంధముతో కట్టుబడి ఆయా కర్మఫలముల ననుభవించుటకు వలయు మాయామయ అనేక శరీరములలో ప్రవేశించి భరింపరాని బాధల ననుభవించుచు పరతంత్రుఁడగుటచే నివారింపశక్యము గానందుననే మోహముఁ జెంది మహామోహమువలన నేర్పడు దుఃఖసముద్రమునందు మునుగుచున్నవాడు. జీవేశ్వరు లిరువురు నొకే సంసారవృక్షమం దధిరోహించువారైనను జీవుఁడు పూర్వసుకృతబలమున ప్రసరించు శివానుగ్రహమువలన తనను ప్రేరేపించువాడుగా హృదయగుహాయందుండువాడనియు సమస్తజీవుల ననుగ్రహించువాడనియు ఉమాసహితుఁడనియు పరమేశ్వరుని భావించుతటి పరమేశ్వర సంపూర్ణ కటాక్షముఁ జెంది ప్రత్యక్షముగా నవలోకించువాడు. మరియు నీ పరమాత్మ యొక్క యత్యంతశ్రేష్ఠమగు మహిమను పొందువాడు."

ఇందువలన స్వతంత్రుఁడు అనాదిముక్తుఁడు నగు శివునకు శరీర సంబంధమున్నను జీవునికివలె శరీరగతదోషములు సంభవించునవి కావు. కావున జీవపరమేశ్వరులే హృదయగుహఁ జెందియుండువారు.

సూ. "విశేషణాచ్చ" ౧-౨-౧౨

ఈ ప్రకరణమునందు జీవపరమేశ్వరులు విశేషించి చెప్పఁబడినవారు. ఎట్లనఁగా ? "న జాయతే మ్రియతే వా విపశ్చిత్" ఇత్యాదివాక్యముచే జీవాత్మయు "అణోరణీయాన్ మహతో మహీయాన్" ఇత్యాది వాక్యముతో పరమేశ్వరుఁడును ప్రశంసింపఁబడినవారు. ఇట్టి విశేషణములు (విపశ్చిత్, అణుః, మహాన్ అనునవి) జీవబుద్ధులు గుహాగతము లను పక్షమున నెట్లు పొసగునవి ? ఇందువలన జీవపరమేశ్వరులే హృదయగుహఁ

ప్రవేశించి ప్రేర్యప్రేరక భావముతో శరీర శరీరిభావముతోడను కూడి యుండువారని విశదమగునది.

ఇఁట జీవేశ్వరుల భేదము - కంఠరవేణ చెప్పఁబడుటచే నవ్వారి యభేదము నిరూపింప నలవిఁగానిది. జీవత్వము అవిద్యాకృతమనియు ఈశ్వరభావము పారమార్థిక మనియు చెప్పఁబడిన శాస్త్రార్థము నిర్మూల మగునదని గ్రహింపవలెను.

అంతరధికరణము

హృదయగుహాయందుపాస్యుఁడుగా నిరూపింపఁబడిన పరమాత్మ నుపాసించుటకు మరియొక స్థానము గలదని యిందు ప్రతిపాదింపఁబడు చున్నయది.

సూ. "అంతర ఉపపత్తేః" ౧-౨-౧౩

ఛాందోగ్యమునం దీ సూత్రమునకు విషయవాక్యము.

"య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవాచ, ఏత దమృత మభయమేతద్బ్రహ్మ" "కంటియందు కనఁబడు ఈ పురుషుఁడు పరమాత్మయనియు అమృతుఁడనియు అభయుఁడనియు బ్రహ్మమనియు పేర్కొనఁబడువాడు"

ఇఁట అమృతత్వాది లక్షణములు కలవాడు నేత్రములో నుండువాడు నగు పురుషుఁడు - పరమేశ్వరుడా? ఇతరుడా? అని సంశయము.

ఉపకోసలుఁడను కామలాయనుఁడు సత్యకాముఁడను ఆచార్యు నాశ్రయించి సత్యకాముని యగ్నులను పండ్రెండు వత్సరములు పరిచర్యఁ జేయుచుండెను. ఇట్టితఁటి కామలాయనునకు బ్రహ్మోపదేశముఁ జేయ కయే స్వస్థానమునుండి సత్యకాముఁడు వెళ్ళగా తన యాచార్యుని అగ్నులను సేవించుచు ఆధివ్యాధులకు లోనై నుపవాసములఁ జేయుచున్న కామలాయనునియం దనుగ్రహము కలిగి గార్హపత్య దక్షిణ ఆహవనీ యాగ్నులు మూడును కూడి "ప్రాణో బ్రహ్మ కం బ్రహ్మ ఖం బ్రహ్మ"

ఇత్యాది వాక్యములతో బ్రహ్మవిద్య నుపదేశించి ప్రత్యేకముగా నొక్కొక్క విద్యను "య ఏష ఆదిత్యే పురుషో దృశ్యతే సోఽహమస్మి స ఏవాహమస్మి" "య ఏష చంద్రమసి పురుషో దృశ్యతే" "య ఏష విద్యుతిపురుషో దృశ్యతే" అని యుపదేశించినవి. తరువాత మేము చెప్పిన బ్రహ్మ విద్యను నీవు ఆచార్యునివలన దృఢపఱచుకొందువుగాత యని వక్కాణించినవి. పిమ్మట స్వస్థానమున కేతెంచిన ఆచార్యుఁడు - ప్రసన్న ముఖుఁడగు నుపకోసలుని గాంచి సౌమ్యుడా! నీ ముఖము బ్రహ్మవిదుని ముఖమువలె ప్రకాశించుచున్నది. ఎవరు నీకు బ్రహ్మవిద్య నుపదేశించిరని ప్రశ్నింపగా కామలాయనుడు అగ్నులును సమాధానముఁ జెప్పుటకు భయపడినవారైరి. అప్పుడగ్నులే యుపదేశించినవని నిశ్చయించుకొని యక్షిపురుషుని గురించి యుపదేశమును గావించి "ఏష దేవపథో బ్రహ్మపథః, ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే". అను వాక్యమువరకు అక్షిపురుషోపాసకునకు అర్చిరాదిమార్గప్రాప్తిపర్యంతము పునరావృత్తిరహితఫలమును సత్యకాముఁడు వాక్రుచ్చినవాడాయెను.

ప్రశ్న : "దహరం విపాప్మమ్" "పద్మకోశ ప్రతీకాశమ్" ఇత్యాది వాక్యములందు - పరమాత్మ హృదయ పుండరీకమందుండువాడని చెప్పఁబడుటచేతను జీవుఁడు రూపాదులను గ్రహించుటకు మనః సంబంధమువలన చక్షురింద్రియాది ప్రవేశముఁ జేయువాడగుటచేత నిట యక్షిపురుషుఁడు జీవుండేను, అథవా ఛాయాపురుషుఁడు కాదగును.

ఉత్తరము : అత్యంతః పురుషుఁడు పరమేశ్వరుఁడేను; ఎట్టి యుపాధి లేనట్టి అమృతత్వము అభయత్వము మొదలగు ధర్మములు పరమేశ్వరుని యందే నుపపన్నము లగునవి.

పరమేశ్వరునకు నేత్రాంతర్వర్తియగుట శ్రుతియందు గానరాదను వాశంకకు సమాధానము దిగువ సూత్రము.

సూ. "స్థానాది వ్యపదేశాచ్చ" ౧-౨-౧౪

"యశ్చక్షుషి తిష్ఠన్ చక్షుషోఽంతరః, యం చక్షు ర్న వేద, యస్య చక్షుః శరీరం, య శ్చక్షురంతరో యమయతి, ఏష త ఆత్మాఽంతర్యా మ్యమృతః"

"నేత్రములోనుండి నేత్రమును ప్రేరేపించువాడు, ఐతే నేత్రము పరమాత్మను కనుగొనునదికాదు, పరమేశ్వరునకు శరీరంబగునది, ఇట్టి పర మేశ్వరుఁడు నీకు నంతర్యామి యగువాడు"

ఇట చక్షుః స్థితి నియమనాదులు పరమేశ్వరునివి యని వినఁబడు చున్నవి కావుననే "దృగంగే శివలింగం స్యాత్" సర్వాంగలింగ సాహిత్య ప్రకరణమున వాతూలోత్తరమను శివాగమము "కంటియందు శివలింగ మను సంజ్ఞతో నుండువాడు పరమాత్మ" యని వక్కాణించియున్నది.

ఛాయాపురుషుఁడును ప్రతిపాదింపఁబడుచు లేడని తెలుపున దీ సూత్రము.

సూ. "సుఖవిశిష్టాభిధానాదేవ చ" ౧-౨-౧౫

"కం బ్రహ్మ ఖం బ్రహ్మ" అను వాక్యముతో నేత్రాంతర్వర్తియగు వాడు సుఖవిశిష్టుఁడని చెప్పినందువలనను ఛాయాపురుషునియందు సుఖ సంపత్తి సంభవింపదు గావున నిట పరమేశ్వరుఁడే ప్రతిపాదింపఁబడుచున్న వాడు.

"అక్షిపురుషుఁడు - జీవుఁడు" అను పక్షమును నిరాకరించున దీ సూత్రము.

సూ. "అతఏవ స బ్రహ్మ" ౧-౨-౧౬

సంసారభయమువలన బాధపడి బ్రహ్మమును తెలియగోరిన నుపకోస లునకు "కం బ్రహ్మ ఖం బ్రహ్మ" "బ్రహ్మతత్త్వము సుఖరూపమైనది. ప్రకాశమానంబగునది" యని యుపదేశమును ప్రారంభించి "యదేవ కం తదేవ ఖం, యదేవఖం తదేవకమ్" "ఏద్ది సుఖరూపమో నద్దియే ఆకాశ రూపంబును ఎద్ది ఆకాశరూపమో నద్దియే సుఖరూపంబు నగును" అని

యాచార్యుఁడు వక్కాణించినవాడు. కావుననే ఖ శబ్దముతో చెప్పఁబడు ఆకాశము పరబ్రహ్మమగుచున్నయది. ఇట్టి యుపపత్తి జీవాత్మకు నుండ జాలదుగదా! మరియు జీవాత్మ నిరతిశయసుఖము గలవాడును కాదు.

ఇందువలన నపరిచ్ఛిన్న సుఖము రూపముగా గలవాడని పూర్వము ప్రశంసింపఁబడిన బ్రహ్మమే నేత్రమున కాధారముగా ప్రతిపాదింపఁబడు చుండుటఁజేసి నేత్రాంతర్వర్తియగు పురుషుఁడు పరమేశ్వరుండేను.

అక్షిపురుషోపాసనకంటె నితరములగు నుపాసనలఁ జేసినవారిని గూర్చి శవకర్మను చేయకుండునెడ నర్చిరాది మార్గప్రాప్తికి విలంబమగును కాని యక్షిపురుషోపాసనకు మాత్రము శవకర్మ గావింపఁబడకున్న నర్చిరాది మార్గప్రాప్తికి నాలస్యము కాకుండును.

ఇందుకు శ్రుతిప్రమాణము.

"అథ ఖలు చైవాస్మిన్ శవ్యం కుర్వంతి యదుచ నార్చిష మేవాభి సంయంతి"

"నేత్రములోనుండు శివలింగము నుపాసించువాడు మరణింపగా పుత్రులు మున్నగువారు శవకర్మయగు పితృమేధ మను సంస్కారమును చేయునెడ చేయకున్నను అర్చిరాదిమార్గమును పొందఁజాలును".

జీవుఁడు ఛాయాపురుషుఁడు అను రెండు పూర్వపక్షములకు సమాధాన మీసూత్రము.

సూ. "శ్రుతోపనిషత్క గత్యభిధానాచ్చ" ౧-౨-౧౬

బ్రహ్మ స్వరూపమును కనుగొనినవారికి నర్చిరాదిగతి యనివార్య మని చెప్పుచు నక్షిపురుషోపాసకులకు నర్చిరాదిగతి "అర్చిష మేవాభిసంభవ త్యర్చిషోఽహ రహ్నః" ఇత్యాది వాక్యముతో చెప్పఁబడుచున్నయది. మఱియు "తత్పురుషోఽమానవః స ఏతాన్ బ్రహ్మ గమయతి స ఏవ దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే" "తేజోఽభిమాని దేవతనుపొంది యటనుండి దినము నభిమా

నించు దేవతను పొందుదురు. ఇట్లు విద్యుల్లోకమువరకు వెళ్ళిన పిమ్మట నటనుండు దివ్యపురుషుఁడు ముక్తపురుషులను శివపదమువరకు గొంపోవువాడు. ఇద్దియే దేవపథము బ్రహ్మపథంబు నీ మార్గముద్వారా శివలోకముఁ బ్రవేశించువారు మఱల నీ మానవలోకమును పొందువారు కారు."

ఇవ్విధము చెప్పుటవలన జీవాత్మగాని ఛాయాపురుషుఁడుగాని యిట నిరూపింపఁదగినవారు కారనియు పరమేశ్వరుఁ డక్షివిద్య యందుపాస్యుఁ డగుననియు విశదమైనది.

అనవస్థిత్యధికరణము

సూ. "అనవస్థితే రసంభవాచ్చ నేతరః" ౧-౨-౧౭.

సకల జగదీశ్వరత్వము విశ్వభుక్త్వము మొదలగు ధర్మములు ప్రాణవాయువునందు అనవస్థితేః - నిలచియుండునవి కాకుండుటవలన, అసంభవాచ్చ - ఉండునని చెప్పుట పొసగనందువలనను, ఇతరః - ప్రాణవాయువు ఉపాస్యము న - కాదు అని సూత్రార్థము.

విషయవాక్యము: "అంగుష్ఠమాత్రః పురుషోఽంగుష్ఠంచ సమాశ్రితః, ఈశః సర్వస్య జగతః ప్రభుః ప్రీణాతి విశ్వభుక్"

ఇట అంగుష్ఠమాత్రత్వము మొదలగు ధర్మములతో కూడినవాడు పరమేశ్వరుడా? ఇతరుడా? అని సంశయము.

ప్రశ్న: ప్రాణాగ్నిహోత్ర ప్రకరణమగుటచే అంగుష్ఠమాత్రుఁడని స్వల్ప స్వరూపమును చెప్పుటవలన నాహుతిపంచకము ననుభవించు ప్రాణవాయువే ప్రతిపాదింపఁదగినది. "ఆపశ్చ పృథివీ చాన్నం మత్తారౌ వహ్నిమారుతౌ" "ఉదకము భూమియును ఆహారమును వాయువు అగ్నియు ననుభవించువారు" ఇత్యాది శ్రుతులందు వాయువు భోక్తగా నేర్పడుచున్నవాడు. కావున సర్వథా ప్రాణవాయువిట నంగుష్ఠమాత్రుఁడగునని చెప్పవలెను గాదా?

ఉత్తరము : పరమేశ్వరుఁడే అంగుష్ఠమాత్రుఁడుగా నీ ప్రకరణము నందు ప్రతిపాదింపఁదగినవాఁడు. ఎట్లనగా ? సమస్త ప్రపంచమునకు ప్రభువగుటయు విశ్వము ననుభవించుటయు మొదలగు ధర్మములు పరమేశ్వరుని కంటె నితరములైన ప్రాణవాయువు మున్నగు వానియందు పపన్నములు కానట్టివి. "ప్రాణానాం గ్రంధి రసి రుద్రోమా విశాంతకః" "రుద్రుఁడా ? పంచప్రాణముల నొకచో నిలిపియుంచువాఁడవు గాన కాలాగ్ని రుద్ర స్వరూపముతో నాలో ప్రవేశించి యాహారమును జీర్ణింపఁజేసి తత్సార ముతో నుజ్జీవింపఁజేయుము !" అను వాక్యమునందు పరమేశ్వరుఁడు ప్రాణాధారుఁడనియు ప్రాణవాయువుగా నుపాసింపఁ దగినవాఁడనియు వినంబడుచున్నయది.

శివరూపమనియు ఘోరరూపమనియు పరమాత్మ - ద్వివిధ స్వరూపములు గలవాఁడు. జఠరాగ్నిజ్వాల శమించుటకు లోన నన్నభోక్తగా నుండునది - శివ స్వరూపము. భోజనానంతరము భుక్తాన్నమును పరిణమింపఁజేసి దేహమును పోషించుటచే ప్రాణవాయువులు స్థిరముగా శరీరమందుండుటకు రుద్రరూపముతో లోన నాహారమును పచనముఁ జేయునది - ఘోర రూపము.

అంగుష్ఠమాత్రుఁడని పరిమాణముఁ జెప్పుట - ఉపాసింపఁబడుటకు గావున విరోధ మేమియులేదు. ప్రాణవాయువు భోక్తగా నేర్పడినను విశ్వభోక్త కాజాలకుండును. కావున పరమేశ్వరుఁడే ప్రాణమను అగ్నిహోత్రమునందు నారాధింపఁదగినవాఁడుగా ప్రాణస్వరూపుఁడగునని ప్రతిపాదింపఁబడుచున్నవాఁడు.

"న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన, ఇతరేణతు జీవంతి యస్మిన్నేతా వుపాశ్రితౌ" అను శ్రుతిననుసరించి పరమేశ్వరు నాశ్రయించియుండు ప్రాణాపానములతో జీవులు బ్రతుకుచున్నవారనియు కేవల ప్రాణముతోగాని కేవల అపానముతోగాని జీవించువారు కారనియు తెలియనగును.

దక్షిణ పాదాంగుష్ఠమునందు హస్తముతో నుదకమును సమర్పించుతటి - బ్రహ్మాండమునకు మూలాధారమగు లోకమునందు గల కాలాగ్ని రుద్ర స్వరూపమును శరీరమున కాధారమగు పాదాంగుష్ఠమునందు ధ్యానించి తత్ప్రీత్యర్థము చరణాభిషేకమును చేయుచు "అంగుష్ఠమాత్రః" అను మంత్రము నుచ్చరింపవలెనని విదితమగుచున్నయది.

అంతర్యామ్యధికరణము

సర్వజ్ఞుఁడు సర్వశక్తిసంపన్నుఁడు సర్వానుగ్రాహకుఁడు పరబ్రహ్మమునగు శివుని సూర్యమండలమునందు పురుషహృదయ పుండరీకాదులందు నుపాసనఁ జేయుటకు నివాసము నిర్ధారింపఁబడినది. అట్టి నివాసము నంతటఁ జూపుటకీ యధికరణము చెప్పఁబడినది.

సూ. అంతర్యామ్యధిదైవాదిషు తద్ధర్మవ్యపదేశాత్ ౧-౨-౧౮

సూత్రార్థము : పృథివ్యాద్యచేతనములు అధిదైవములనంబడును. లోకములన్నిటియందు అను నర్థమున "అధిలోకం" అను శబ్దముపయోగించును. ఇట్టి అధిదైవములు మున్నగువానియందు - విశ్వాధికత్వము అనాదిముక్తత్వము మొదలగు తద్ధర్మములు అనగా పరమేశ్వర ధర్మములు శ్రుతియందు వ్యపదేశాత్ - ప్రతిపాదింపఁబడుటవలన అంతర్యామి యగువాడు పరమాత్మయే.

విషయవాక్యము - అంతర్యామి బ్రాహ్మణమునందు

"యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అంతరో యం పృథివీ న వేద యస్య పృథివీ శరీరం, యః పృథివీ మంతరో యమయతి ఏష త ఆత్మాఽంతర్యామ్యమృతః"

"భూమిలో నున్నను భూమికి తెలియనివాడు భూమిని ప్రేరేపించువాడు భూమి శరీరముగా కలవాడు భూమిని శాసించువాడు నగు పరమాత్మ - సర్వాంతర్యామియై అమృతుడనఁబఱగును".

ఇట్లు పృథివి మొదలుకొని అవ్యక్త ఆత్మతత్వములవరకు ప్రతి వస్తువునం దంతర్యామియని ప్రతి పర్యాయము వినంబడువాడు - పరమాత్మయా ? జీవాత్మయా ? విరాట్ పురుషుఁడా ? ప్రధానమా ? అని సంశయము.

ప్రశ్న : తా నొనర్చిన విచిత్రకర్మల ఫలము ననుభవించుటకు పంచభూతములలో ఇంద్రియములందును జీవుఁడు ప్రవేశించువాఁడు. అథవా చేతనులందరికి నుపాదానమగు విరాట్ పురుషుఁడు ప్రాణులలో చేరియుండువాడని చెప్పుట సమంజసము. లేక ప్రకృతి - మహత్తు మున్నగు రూపములతో పరిణమించునదగుటచే సర్వవ్యాపియగు ననుట సముచితంబగును. ఎందుకనఁగా ? పరమేశ్వరుఁడు "విశ్వాధికోరుద్రః" అను ప్రమాణము ననుసరించి పృథివ్యాది ప్రకృతి వికారములను మించియుండు వాడగుటఁజేసి విశ్వాధికుఁడు గావున వికారాత్మక ప్రపంచమును వ్యాపించియుండుట పొసగఁజాలదు. అందువలన పరమేశ్వరుఁడు దక్క జీవాదులలో నొకఁడు సర్వాంతర్యామి కాదగును.

ఉత్తరము : పృథివ్యాద్యంతర్యామిగా వినంబడువాడు పరమేశ్వరుండేను; సర్వాంతర్యామిత్వము మొదలగు ధర్మములు - పరమేశ్వరుని యందే ఉపపన్నములగుచున్నవి. ఎట్లనఁగా ? అథర్వశిరమునందు "సోఽంతరాదంతరం ప్రావిశత్" అను వాక్యమువలన పరమేశ్వరుఁడే యంతర్యామిగా సమస్తమందుండువాడని తెలియుచున్నది. మఱియు "సత ఆత్మాంతర్యామ్యమృతః" శివుఁడే అనాదిముక్తుఁడగుటచే అమృతుఁడని చెప్పఁబడువాడు. "ఏతాని హవా అమృతస్య నామధేయాని" "పూర్వోక్త నామధేయములన్నియు అమృతునివే" యని శ్రుతి పేర్కొనియున్నది. "విశ్వాధికోరుద్రః" అను వాక్యముచే పరమేశ్వరునకు విశ్వాధికత్వము చెప్పఁబడినట్లు "సర్వోవై రుద్రః" ఇత్యాది వాక్యములతో విశ్వరూపత్వము నిరూపింపఁబడుచున్నది కావున పృథివ్యాది ప్రకృతివికారములందు ప్రవేశము కలవాడైనను తద్వికార స్పర్శ లేశముగూడ లేనివాడని ప్రతి పర్యాయము అమృతశబ్ద ప్రయోగము గావింపఁబడినది.

అథర్వశిరమునందు "యో వై రుద్రః స భగవాన్ యశ్చ బ్రహ్మ భూర్భువః సువ స్తస్మై వై నమోనమః" ఇత్యాది వాక్యములతో బ్రహ్మ విష్ణు రుద్ర మహాలక్ష్మీ సరస్వతీ గణపతి కుమార దేవేంద్రాది లోకపాలురు మఱియు భూరాది సప్తలోకములు, పృథివ్యాది పంచభూతములు, సూర్య చంద్రాది నవగ్రహములు, నక్షత్రములు కాలము మున్నగు స్వరూపములు గలవాడని ప్రతిపర్యాయము పరమేశ్వరునిగురించి యభ్యాసము గావింపఁ బడినది. అందును "పరమేశ్వరుఁడు చిదచిన్మయములగు సకల తత్త్వముల యందు ప్రవేశించువాడగుటఁజేసి శరీరాది తత్త్వములకు సంబంధించి యుండు దోషముల నంటియుండువాఁడు" అను నాశంకను నివారించుటకు ఐశ్వర్యము మొదలగు మంగళగుణముల సంబంధమును చెప్పు భగవచ్ఛబ్దము ప్రయోగింపఁబడినది. కావున సర్వాంతర్యామియగు శివుఁడు-పరమేశ్వరుఁ డని చెప్పుట సమంజసంబేను;

ప్రధానము మొదలగువాని కంతర్యామిత్వము సముచితము కాదని నిరూపించున దీ సూత్రము.

సూ. "న చ స్మార్త మతద్ధర్మాభిలాపాత్ శారీరశ్చ" ౧-౨-౧౯

ప్రధానము - సాంఖ్యస్మృతి సిద్ధమగుటచే స్మార్త మనఁబడును. ప్రకృతి ధర్మములగు వికార జడత్వాదులు శ్రుతియందు చెప్పకుండుటవలన ప్రధానము సకల నియామకత్వాది ధర్మములు లేనివాడగుటచే విర్రాట్పురుషుఁడును సర్వాంతర్యామి కాఁజాలరని సూత్రార్థము.

సకల కల్పములలో చేతనాచేతనములను నియమించు నసంకుచిత సామర్థ్యము - మూర్త్యాత్మయగు హిరణ్యగర్భునకు నారాయణునకును సంభవింపనట్టిది. సూత్రగత శారీరపదము "అనుపపత్తేస్తు న శారీరః" అనుచో చెప్పినట్లు జీవుండను నర్థము కలదియేగాక హిరణ్యగర్భ నారాయ ణాద్యర్థము గలదిగా చెప్పఁబడుచున్నయది.

సుబాలోపనిషదమునందు "కిం తదాసీత్" "జగత్కారణము ఎట్టిది" అని ప్రశ్నించి "పరమాత్మ స్వరూపం ప్రథమ మాసీత్" "పరమాత్మ-

మొదటి స్వరూపముగా నుండెను" అని సమాధానము చెప్పఁబడియెను. తరువాత "తత స్తమ స్తమసో భూతాదిః" "పరమాత్మవలన తమస్సు, తమస్సువలన నాకాశము" ఇట్లు భూతపంచకమును నిరూపించి యవ్వాని వలనఁ బ్రహ్మాండ మావిర్భవించుటను బ్రహ్మాండమున సహస్ర శీర్షములు సహస్ర నేత్రములు సహస్ర పాదములు సహస్ర భుజములుగల పురుషుఁ డావిర్భవించినట్లు చెప్పి "బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్" అను పురుష సూక్త ప్రక్రియ ననుసరించి పురుషుని హృదయాద్యవయవములనుండి బ్రాహ్మణాదిచేతనులయొక్కయు అచేతనములయొక్కయు నావిర్భావము వర్ణింపఁబడినది. మఱియు పురుషుని నిశ్వాసమునుండి వేదములు బయలు దేరినవనియు పురుషుఁడే సగము శరీరముతో స్త్రీ భావము సగము శరీ రముతో పుంభావమును పొంది దేవర్షి యక్ష రాక్షసాదులను తిర్యగ్జంతు వులను పుట్టించు స్త్రీ పురుష రూపములు గలవాడగుననియు వర్ణింపఁ బడినది.

మఱల నుపసంహరించు సమయమున త్రైలోక్య భస్మీభావము నుపక్ర మించి "పృథివ్యప్సు లీయతే" "భూమి - జలమందు లీనమగును" ఇత్యాది వాక్యము మొదలుకొని "తమః పరస్మి న్నేకీభవతి" "తమస్సు పరమాత్మ యందేకీభవించును" అను వాక్యమువరకు జగత్ప్రళయము నిరూపింపఁ బడినది.

ఇట్లు సుబాలోపనిషదమున ప్రథమానుశాసనమందు పరమాత్మ - జగదాదికారణుఁడనియు పరమాత్మచే బ్రహ్మాండ మధ్యమున సృజింపఁ బడిన పురుషుఁడు - అవాంతర సృష్టి స్థితిలయములఁ జేయువాడనియు వర్ణించి "తత్రతదండం హిరణ్మయం సమభవత్" అని బ్రహ్మాండమును నిర్దేశించి "దివ్యః సహస్రశీర్షా సహస్రాక్షః సహస్ర బాహుః పురుషోఽ జాయత" సహస్ర శీర్షత్వాది లక్షణములు గల దివ్యపురుషుని తృతీయాను శాసనమున "దివ్యో దేవ ఏకో నారాయణః" అను వాక్యముతో నారా యణునిగా ప్రకటించి పరమేశ్వరాభేదదృష్టితో సకల జగదుపాదానము

నారాయణుఁడని ప్రతిపాదింపఁబడినది. కావున నారాయణుఁడు దేవ మానవాది ప్రజాజనకుఁడైన నవాంతర సృష్టిలయములఁ గావించు వాఁడనియు నారాయణాది సకల జగదాది కారణము సకల నియామకుఁడును పరమేశ్వరుఁడే యనియు సారాంశము.

జీవాత్మయు సర్వాంతర్యామి కాడను నంశమును సమర్థించున దీ సూత్రము.

సూ. "ఉభయేఽపి హి భేదే నైన మధీయతే" ౧-౨-౨౧

కాణ్వులు మాధ్యందిన శాఖవారున్ను జీవపరమాత్మలను భేదము గలవారిగా చెప్పుచున్నవారని సూత్రార్థము.

"యో విజ్ఞానే తిష్ఠన్" "య ఆత్మని తిష్ఠన్" ఇత్యాదివాక్యములతో "పరమేశ్వరుఁడు జీవాత్మలో నుండువా"డని జీవపరమేశ్వరులను వేఱువారిగా శ్రుతులు ప్రతిపాదించుటచే పరమేశ్వరుఁడే సర్వాంతర్యామి యనియు ప్రధాన విరాట్ పురుష జీవాత్మలు - సర్వాంతర్యాములు కారనియు సిద్ధాంతము.

అదృశ్యత్వాధికరణము

"ప్రత్యక్షముగా కనఁబడు పృథివ్యాదికము పరమేశ్వరునిచే నియమింపఁబడునదగుటచే శివునకు శరీరమగునని పూర్వము చెప్పఁబడినది కావున పృథివ్యాదులందుఁ బ్రవేశించియుండు పరమేశ్వరుఁడు - ఒకానొక గృహమందున్న పురుషునివలె కనఁబడువాఁడగు" నను ఆ శంకను నివారించుటకు సర్వత్రవ్యాపించువాఁడైనను పరమాత్మ పరిదృశ్యమానుఁడు కాఁజాలడని "న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్" ఇత్యాది ప్రమాణముల ననుసరించి యీ యధికరణమునందు ప్రస్తావింపఁబడుచున్నయది.

సూ. "అదృశ్యత్వాదిగుణకో ధర్మోక్తేః" ౧-౨-౨౨

సర్వజ్ఞత్వాది ధర్మముల నీ యుపనిషదమందు చెప్పినందువలన సర్వశ్యత్వాది గుణములు కలవాడు పరమేశ్వరుండేనని సూత్రార్థము.

విషయవాక్యము : "అథ పరా యయా తదక్షర మధిగమ్యతే; య త్తదద్రేశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణ మచక్షుఃశ్రోత్రం తదపాణిపాదం నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయమ్ యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరాః"

"అక్షరశబ్ద వాచ్యమగు పరబ్రహ్మమును కనుగొనునది - పరవిద్య యనంబడును. అట్టి అక్షరము నిర్దేశింపరానిది, గ్రహింప నలవికానిదియు, గోత్రవర్ణములు లేనిదియు నేత్రములు చెవులు హస్తములు పాదములు లేనిదియు, నిత్యమైనదియు, సర్వవ్యాపకంబు, మిక్కిలి సూక్ష్మంబు, వినాశములేనిదియు సకలప్రాణులకు కారణమైనదియు; ఇట్టి తత్త్వమును ధీరపురుషులు కనుగొందురు".

ఇట నక్షరము ప్రధానమా? జీవుండా? పరమేశ్వరుండా? అని సంశయము.

ప్రశ్న : ఈ సందర్భమున నక్షర శబ్దము ప్రధానమునే చెప్పును. ఎట్లనంగా? మహత్తు మొదలగు తత్త్వముల రూపముగా పరిణమించు ప్రకృతి - ప్రాణులందరికి కారణము కాదగును. అథవా జీవాత్మ "క్షరం ప్రధాన మమృతాక్షరమ్" అను ప్రమాణముతో నక్షరవాచ్యుండగువాడు. మరియు తాజేయు కర్మ ననుసరించి పృథివ్యాది పంచభూతములకు తద్వికారమగు జగమునకును కర్తయగువాడు కావున ప్రధానముగాని జీవాత్మగాని యక్షరులు కాదగినవారు.

ఉత్తరము : పరమేశ్వరుండే అక్షరపదవాచ్యుండు; "యః సర్వజ్ఞః సర్వవిద్యస్య జ్ఞానమయం తపః" ఇత్యాది వాక్యములు - పరమేశ్వరుని సర్వజ్ఞత మున్నగు లక్షణములను చెప్పుచున్నవి. పరమేశ్వర భిన్నుడైన జీవునియందు సర్వజ్ఞత్వాది ధర్మములు సంభవించునవి కావు. "ప్రకృతిగాని జీవుడుకాని సమస్త కారణము కాదగినవార"ని చెప్పుట యుక్తము

కాదు. జీవుడు సర్వజ్ఞుఁడు కాకుండుటను ప్రకృతి చేతనము కాకుండుట నవ్వానికి సర్వకారణత్వ సామర్థ్యము అలవడకుండును.

సాలెపురుగు తన శరీరములోని చొల్లుతో దారముఁ గావించునట్లు పరమేశ్వరుఁడు స్వశక్తిలేశముతో ప్రపంచమును పుట్టించుటను చంపుటను గాననగును. మఱియు భూమినుండి భూమిని విడువకయే యావిర్భవించు ఓషధులవలె ప్రపంచము పరమేశ్వరు నెడబాసియుండనిదగుటచే పరమేశ్వర శక్తియఁదొక భాగ మగుచున్నయది. శరీరమునుండి జనించు కేశ నఖాదు లున్నను పోయినను పురుషుఁడు వికారముఁ జెందనట్లు స్వరూపైకదేశ మగు ప్రపంచము భద్రముగా నున్నను వినాశముఁ జెందినను పరమేశ్వరుఁడు - సంతోషమును దుఃఖమును పొందువాడు కాడు. ఐతే పురుషుఁడు తన శరీరములో నొక భాగమగు హస్తములు పాదములు మొదలగు నవయవములను పట్టుదలతో కాపాడుకొనునట్లు పరమేశ్వరుఁడు స్వశరీరమగు శక్తిలో నొక భాగమగు ప్రపంచము నవశ్యము రక్షింపవలసియుండును.

మఱియొక ఉపపత్తిఁ జెప్పుచున్నవారు.

సూ. "విశేషణ భేద వ్యపదేశాభ్యాం చ నేతరౌ." ౧-౨-౨౩

ఇఁట "ఏక విజ్ఞానముతో సర్వ విజ్ఞానము కలుగు"నను ప్రతిజ్ఞ చేయఁబడుచున్నది. "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" "ఎద్దానిని కనుగొనినచో నీ సమస్తము తెలియు"నను ప్రశ్న ననుసరించి చెప్పఁబడిన ప్రతిజ్ఞ యనఁబడు విశేషణము నుపయోగించుటవలన నక్షరము ప్రధానము కాజాలదు. "అక్షరా త్పరతః పరః" "ప్రకృతికంటె పరుఁడగు జీవుఁ డక్షరుఁడైన నవ్వాని నతిక్రమించినవాడు పరమాత్మ" యను ప్రమాణముఁబట్టి జీవునకు పరమేశ్వరునకును భేదము కనఁబడుటవలన నిట నక్షర పదము జీవవాచకంబు కానట్టిది.

సూ. "రూపోపన్యాసాచ్చ" ౧-౨-౨౪.

"అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ, దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః, వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య. పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాంతరాత్మా"

"పరమాత్మకు (ఇటు నగ్నిశబ్దముతో స్ఫురించు తేజస్సు నిండియుండు ప్రదేశమని యర్థము ననుసరించి) ద్యులోకము శిరస్సనియు, సూర్యచంద్రులు నేత్రములనియు, దిశలు చెవులనియు, విస్తృతములైన వేదములు వాక్స్థానీయములనియు వాయువు ప్రాణమనియు విశ్వమంతయు హృదయమనియు భూమి పాదములనియు త్రైలోక్యస్వరూపము ప్రతిపాదింపఁబడినది కావున సకలాంతర్యామియగు పరమేశ్వరుఁడే అక్షర పదముతో చెప్పఁబడుచు భక్తులు కానివారికి కనఁబడువాడు కాడని విశదమైనది.

వైశ్వానరాధికరణము

ప్రాణవాయువున కాధారముగా నుపాసింపఁదగినవాడని చెప్పఁబడిన పరమాత్మ నిట జఠరాగ్ని స్వరూపముగా నుపాసింపవలెనని యుల్లేఖింపఁబడుచున్నయది.

సూ. "వైశ్వానరః సాధారణ శబ్ద విశేషాత్" ౧-౨-౨౪

వైశ్వానరశబ్దము సాధారణముగా వహ్నిపరమైనను బ్రహ్మశబ్దము మున్నగు శబ్దవిశేషమువలన పరమేశ్వర పరమేయగునని సూత్రార్థము.

విషయవాక్యము : "యస్త్వేత మేవం ప్రాదేశమాత్ర మభివిమాన మాత్మానం వైశ్వానర ముపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేష్వాత్మ స్వన్న మత్తి" ఛాందోగ్యము.

"ప్రాదేశమాత్ర స్వరూపుడు అంతట వ్యాపించు అపరిచ్ఛిన్న స్వరూపము గలవాడు నగు పరమేశ్వరుని వైశ్వానరునిగా నుపాసించు పురుషుఁడు లోకములన్నిటియందలి పంచభూతములం దావిర్భవించునట్టి జీవాత్మలంద రనుభవించునట్టియు ఆహారము ననుభవించిన తృప్తిఁబడయ గలుగును".

ఇటు నుపాస్యుడుగా చెప్పఁబడిన వైశ్వానరుఁడు పరమేశ్వరుడా? ఇతరుడా? అని సంశయము.

ప్రశ్న : వైశ్వానర శబ్దముతో జఠరాగ్ని చెప్పఁబడునదిగదా! ఎట్లనగా ? "అయమగ్ని ర్వైశ్వానరో యేనేదం పచ్యతే యదిద మద్యతే, తస్యైష ఘోషోభవతి యమేతత్కర్ణా వపిధాయశ్రుణోతి, స యదోత్క్ర మిష్యన్భవతి నైనం ఘోషం శ్రుణోతి" "భుజ్యమానమగు అన్నమును జీర్ణింపఁజేయునది వైశ్వానరాగ్ని యనఁబడును. ఇట్టి వైశ్వానరుని ధ్వని లోన నున్నట్లు చెవులు మూసుకొని విననగును. మరణించు సమయము నందు మాత్రము జాఠరాగ్ని ధ్వని వినఁబడునది కాదు". ఇట్లు జఠరాగ్ని యందు వైశ్వానరశబ్దము ప్రయోగింపఁబడియున్నది. అథవా మహా భూతములలో మూడవదగు అగ్నియైనను వైశ్వానరుఁడు కావలెను. "ఏషఏవాగ్ని ర్వైశ్వానరః" ఇత్యాది వాక్యములందు వైశ్వానరశబ్దము అగ్నియందు వాడఁబడినది గదా! అగ్నిదేవతనైనను వైశ్వానరశబ్ద వాచ్యునిగా నిరూపింపవలసియున్నది.

"వైశ్వానరం ద్వాదశకపాలం నిర్వపే త్పుత్రే జాతే" "కుమారుఁడు జన్మించినచో ద్వాదశకపాల మనఁబడు అగ్నిదేవతాకమైన క్రతువును గావింపవలెను" అను ప్రమాణము - ఇష్టికి దేవతగా ఫలము నిచ్చువాడు అగ్నిదేవుఁడని విశదపఱచుచున్నది కావున ప్రాదేశమాత్రుఁడను పరిచ్ఛేదమువలనను వైశ్వానర శబ్దముతో పరమేశ్వరుఁడు చెప్పఁబడువాడు కాడు.

ఇవ్విషయమై యొక ఆఖ్యాయిక వేదమునందు కలదు. ఔపమన్యవుఁడు మొదలగు ఐదుగురు మహర్షులు కూడి "కోను ఆత్మా కిం బ్రహ్మ" అను ఆకాంక్ష గలవారై - వైశ్వానరోపాసకుఁడగు నుద్దాలకు నాశ్రయించి ప్రశ్నించగా "అశ్వపతి యనఁబఱగు కేకయుఁడు ప్రస్తుతము వైశ్వానరుని పూర్తిగా గుర్తెరిగినవాడ"ని భావించి యవ్వారి నశ్వపతి చెంతకు గొంపోయి వైశ్వానరునిగూర్చి ప్రశ్నించినవాడు.

ఉత్తరము : పరమేశ్వరుఁడే వైశ్వానరుండగును. ఎట్లనగా ? వైశ్వానరశబ్దము - జఠరాగ్ని మున్నగువానికి సాధారణమైన నీ ప్రకరణము

నందు "ఆత్మాన మేవేమం వైశ్వానరం సంప్రత్యధ్యేషిత మేవనో బ్రూహి" "ఈ వైశ్వానరుని పరమేశ్వరునిగా ప్రస్తుతము భావించుచున్నావు. అట్టి వైశ్వానరుని గురించియే మాకు బోధించుము" ఇత్యాదివాక్యములందు పరమేశ్వరుని కసాధారణము లగు బ్రహ్మశబ్దము మొదలగువానితో వైశ్వానరుఁడు విశేషింపఁబడుచున్నవాడు. కాని జఠరాగ్ని మున్నగువాని యందు వైశ్వానర విశేషణము సంభవించునది కాదు. కావున పరమేశ్వరుఁడే వైశ్వానరుఁడగువాడు.

వైశ్వానరుఁడు పరమేశ్వరుఁడను పక్షమున ప్రమాణాంతరమును చెప్పుచున్నవారు.

సూ. "స్మర్యమాణ మనుమానం స్యాదితి" ౧-౨-౨౬

"అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ" ఇత్యాదివాక్యములందు పరమేశ్వరునకు స్వర్గలోకము మొదలుకొని పృథివివరకు గల స్వరూపము దిగువవిధము వర్ణింపఁబడినది. "తస్య హవా ఏతస్యాత్మనో వైశ్వానరస్య మూర్ధైవసుతేజా శ్చక్షు ర్విశ్వరూపః ప్రాణః పృథగ్వర్త్మాఽత్మా సందేహో బహులో వస్తిరేవ రైః పృథివ్యేవపాదౌ" "వైశ్వానరుఁడుగా చెప్పఁబడు పరమాత్మకు తేజోమయమగు స్వర్గము శిరస్సనియు సూర్యచంద్రులు నేత్రములనియు వాయువు ప్రాణమనియు జీవాత్మ - నాభి మొదలుకొని కంఠమువరకుగల శరీరమనియు వర్షము మూత్రమనియు పృథివి పాదము లనియు భావింపవలెను" అనుచో స్మరింపఁబడు లక్షణము వైశ్వానరుఁడు పరమేశ్వరుఁడగుటకు నిదర్శన మగుచున్నయది.

సూ. "శబ్దాదిభ్యోఽంతః ప్రతిష్ఠానాచ్చ నేతిచేన్న, తథా
దృష్ట్యుపదేశా దసంభవాత్పురుషమపి చైనమధీయతే" ౧-౨-౨౭

ప్రశ్న : స ఏషోఽగ్ని ర్వైశ్వానరో హృదయం గార్హపత్యో మనోఽన్వాహార్యపచన ఆస్య మాహవనీయం తద్యద్భక్తం ప్రథమ మాగచ్ఛే త్తద్ధోమీయం సాయం ప్రథమ మాహుతిం జుహుయాత్"

"ఈ జఠరాగ్ని వైశ్వానరుఁడగును. పురుషుని హృదయము గార్హపత్యాగ్నియనియు మనస్సు అన్వాహార్యాగ్ని యనియు ముఖము ఆహవనీయాగ్ని యనియు మొదట భుజింపఁబడునది హవనద్రవ్యమనియు భావించి ప్రతిదినము పగలు సాయంకాలంబు భోజనారంభమున సమంత్రకముగా ప్రాణాహుతులను సమర్పించవలెను."

ఇత్యాది వాక్యములందు లభించు అగ్నిశబ్దము అగ్నిత్రయకల్పనము ప్రాణాహుత్యాధారత్వము అనువానివలన "సయో హైన మేవ మగ్నిం వైశ్వానరం పురుషవిధం పురుషేఽంతః ప్రతిష్ఠితం వేద" అనుచో తెలియంబడు పురుషునిలో ప్రతిష్ఠించియుండుటయను లక్షణమువలనను వైశ్వానరుఁడు జాఠరాగ్నియే కాని పరమేశ్వరుఁడు కాజాలడుగదా!

ఉత్తరము : పరమేశ్వరుని జాఠరాగ్ని స్వరూపునిగా నుపాసింపవలెనని శ్రుతి యుపదేశించినది. కేవలము జఠరాగ్ని - త్రైలోక్య శరీరుఁడగుట మొదలగునది సంభవింపనట్టిది. మఱియు వాజసనేయశాఖవారు "సఏషోఽగ్నిర్వైశ్వానరో యత్పురుషః" అను వాక్యముతో వైశ్వానరుని పురుషునిగా వాక్రుచ్చుచున్నవారు. "తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్" అను ప్రమాణముతో ఎట్టి యుపపదములేని పురుష శబ్దము పరమేశ్వరునే చెప్పునదని తెలుపఁబడుచున్నయది.

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా - ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపానసమాయుక్తః - పచామ్యన్నం చతుర్విధమ్॥

"నేను ప్రాణుల శరీరములో జఠరాగ్ని స్వరూపముగా నివసించి ప్రాణాపానవాయువులతో కూడుకొని ఆహారమును నాలుగు విధములుగా జీర్ణింపజేయుదును." ఇట్లు స్మృతులందును జఠరాగ్ని - పరమేశ్వర స్వరూపంబని యుపపాదింపఁబడుటచేతను పరమేశ్వరుఁడే వైశ్వానరుఁడని చెప్పుట సమంజసంబగుచున్నయది.

సూ. "అత ఏవ న దేవతా భూతం చ" ౧-౨-౨౭.

వైశ్వానరుఁడు త్రైలోక్యశరీరుఁడు పురుష శబ్దవాచ్యుఁడు నగుట వలననే అగ్నిదేవతకాని భూతాగ్నికాని వైశ్వానర శబ్దవాచ్యములు కాజాలవు.

ఇట్లు పరమేశ్వరుని జఠరాగ్ని స్వరూపముగా నుపాసింపవలెనని యేర్పడిన పిమ్మట నా పరమాత్మ - అగ్నిశబ్దవాచ్యుఁడగుటకు మహర్షులు చూపెట్టిన విధానములను దిగువ సూత్రములతో నుల్లేఖించినవారు.

సూ. "సాక్షా దప్యవిరోధం జైమినిః" ౧-౨-౨౮

అగ్నిస్వరూపముగా నుపాసింపవలెనని చెప్పుటవలననే పరమేశ్వరునకు అగ్నిశబ్దవాచ్యత్వముకాదు. "అగ్రం నయతీత్యగ్నిః" "పుణ్యాత్ములగు శాంభవదీక్షితుల నౌన్నత్యముఁ జెందించువాడను వ్యుత్పత్తి ననుసరించియు పరమేశ్వరునందే అగ్నిశబ్దము సాక్షాత్తు వర్తించునదగుటచే వాచ్యవాచక సామానాధికరణ్యమును చెప్పుటలో విరోధమేమియు గానరాదు. "అగ్నిః కస్మా దగ్రం నయతి" అను నిరుక్త నిర్వచనము నిర్విషయమై గాననగును. మఱియు మహాభారతమున

శ్లో॥ యస్మా చ్చాయం నయత్యగ్రాం - గతిం విప్రాన్ సుపూజితః
తస్మాచ్చ నయనాద్రాజన్ - వేదేష్వగ్ని రితీర్యతే॥

శుద్ధ శ్రోత్రియులు - శాంభవదీక్షాపురస్సరముగా నారాధించుటవలన ప్రసన్నుడై అగ్రగతిని అనఁగా స్వసమానస్థితినిఁ బ్రసాదించువాడగుటచే పరమాత్మ వేదములం దగ్నియని చెప్పఁబడువాడు.

విశ్వానర మహర్షిగారి కుమారుఁడు వైశ్వానరుఁడను నర్థమ్మువలె విశ్వేషు నరేషు=సమస్త జీవులం దంతర్యామిగా నుండువాడను నర్థంబు భాసగునదని జైమిని మహర్షిగారి నిర్వచనము.

"అభివిమానం" అను శ్రుతిగతపదముతో నపరిచ్ఛిన్నుఁడుగా చెప్పఁబడిన పరమాత్మ స్వర్గము మొదలుకొని పృథివివరకు గల ప్రదేశము స్వరూ

పముగా కలవాడని యొకానొక పరిచ్ఛేదముఁ జెప్పుట యెట్లు పొసగునను ఆశంకను నివారించునది దిగువ సూత్రము.

సూ. "అభివ్యక్తే రిత్యాశ్మరథ్యః" ౧-౨-౩౦

పరమేశ్వరునకు ప్రాదేశమాత్రత్వమును పృథివ్యాది స్వర్గలోకాంత స్వరూపమును చెప్పుట యుపాసకులకు వ్యక్తమగుటకొరకని ఆశ్మరథ్యముని నిర్వచించెను.

సూ. "అనుస్మృతయ ఇతి బాదరిః" ౧-౨-౩౧

ఆకాశము మొదలుకొని పృథివివరకు శిరస్సు మున్నగు పాదముల వరకు గల నవయవములను కల్పించుట బ్రహ్మప్రాప్తికొరకని బాదరి వచించెను. ఉపాసకుల బుద్ధియందధిరోహించుటకు పై విధము పరిచ్ఛేదము చెప్పఁబడినది. ప్రతిదినము గావింపఁదగిన ధ్యానమనఁదగు స్మృతి - బ్రహ్మ ప్రాప్తికొరకని గ్రహించునది.

సూ. "సంపత్తే రితి జైమిని స్తథాహి దర్శయతి" ౧-౨-౩౨

"ఉర ఏవ వేది ర్లోమాని బర్హి ర్హృదయం గార్హపత్యో మనోఽన్వాహార్యపచనమాస్య మాహవనీయః" "పరమేశ్వరోపాసకుని వక్షఃస్థలమే వేదికయనియు వెండ్రుకలు బర్హిస్సనియు హృదయము గార్హపత్యాగ్ని యనియు మనస్సు అన్వాహార్యాగ్ని యనియు ముఖము ఆహవనీయాగ్ని యనియు పేర్కొనఁబడుచున్నవి" ఇట్లు శివోపాసకుని వక్షస్సు మొదలగు వానికి వేదిక మొదలగు యజ్ఞాంగములను కల్పించుట బ్రహ్మవిద్యాంగ మగు ప్రాణాహుతి - అగ్నిహోత్రమని భావించుటకొరకని జైమిని యభిప్రాయము.

ఇందుకు "అథ య ఏవం విద్వా నగ్నిహోత్రం జుహోతి" అను శ్రుతివాక్యము ప్రమాణముగా చెప్పఁబడుచున్నయది.

"సయ ఇద మవిద్వా నగ్నిహోత్రం జుహోతి, యథాఽంగారా నపోహ్యా భస్మని జుహుయాత్తాదృక్ తత్స్యాత్, అథ య ఏత దేవం విద్వా

నగ్నిహోత్రం జుహోతి తస్య సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వే
ష్వాత్మసు హుతం భవతి, తద్యథైషీకతూల మగ్నౌ ప్రోతం ప్రదూయే
తైవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే"

"విద్వాంసుఁడు కానివాడు అగ్నియందు చేయు హోమము-నిప్పు
శమించిన పిమ్మట భస్మయందు చేయఁబడిన హోమమువంటిది; విద్వాం
సుఁడు జఠరాగ్నియందు చేయు హవనమువలన లోకములన్నిటియందలి
ప్రాణులందరియందు ఆత్మలయందును హవనమును గావించినట్లగును.
దూది అండెము అగ్నిలో పూర్తిగా నశించునట్లు వైశ్వానరోపాసకుని
పాపములన్నియు నశించునవి."

సూ. "ఆమనంతి చైన మస్మిన్" ౧-౨-౩౩

పరమేశ్వరుఁడు ఉపాసకుని శరీరములో ప్రాణాహుతి సమయమున
భోక్తయగునని "శివో మావిశాప్రదాహాయ" "ప్రభుః ప్రీణాతి విశ్వభుక్"
అను ప్రమాణములతో తైత్తిరీయులు నిరూపించుచున్నారు. ఇట్లు సక
లాచార్యమతముల ననుసరించియు న్యాయముగాను పరమేశ్వరుఁడు - జఠ
రాగ్ని స్వరూపుఁడనియు ప్రాణాగ్నిహోత్రస్వరూపుఁడనియు విశదమగు
చున్నయది.

ఇయ్యది ప్రథమాధ్యాయగత ద్వితీయపాదము.

శ్రీ పార్వతీరాజరాజేశ్వరాభ్యాన్నమః

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్రభాష్యము

(ఆంధ్రీకరణము)

ప్రథమాధ్యాయగత తృతీయపాదము

ఈ మూడవ పాదమునందు కొద్ది స్పష్టముగా కొద్ది యస్పష్టముగాను బోధపడు బ్రహ్మలక్షణములు గల వేదాంత వాక్యములు విచారింపఁబడుచున్నవి. మరియు శివోపాసనయం దధికారము గలవాని లక్షణమున్ను చెప్పఁబడును.

సూ. "ద్యుభ్వాద్యాయతనం స్వ శబ్దాత్" ౧-౩-౧

స్వర్గము మొదలగువాని యాధారము - పరమేశ్వరవాచకమగు ఆత్మశబ్ద మిందుండుటవలన - పరమేశ్వరుఁడే అగునని సూత్రార్థము.

విషయవాక్యము : ముండకోపనిషత్తు

"యస్మిన్ ద్యౌః పృథివీ చాంతరిక్ష మోతం మనః సహ ప్రాణైశ్చ సర్వైః, తమేవైకం విజానథ ఆత్మాన మన్యావాచో విముంచథ, అమృతస్యైష సేతుః"

"స్వర్గము భూమి ఆకాశము ఇంద్రియములన్నిటితో కూడిన మనుస్సు ఇత్యాది ప్రపంచమున కాధారమగు పరమాత్మ నొకనినే కనుగొనుఁడు! తదితరములను చెప్పు వాక్యములను విడనాడుడు! ఎందు కనగా ? అమృత (మోక్ష) మునకు పరమావధియగువాడు పరమాత్మయే."

ఇచట స్వర్గాద్యాధారముగా వినఁబడువాడు పరమేశ్వరుఁడా ? ఇతరుడా ? అని సంశయము.

ప్రశ్న : పరమేశ్వర భిన్నుడగు వాయువే స్వర్గాద్యాధారమని తెలియుచున్నది. "వాయునావై గౌతమ సూత్రేణాయంచ లోకః పరశ్చ

లోకః, సర్వాణి భూతాని సందృబ్ధాని భవంతి" - "గౌతముడా ? ఇహపర లోకములు సమస్త ప్రాణులున్ను సూత్రప్రాయుడగు వాయువుచే భరింపఁ బడుచున్నవి" అను శ్రుతివాక్యమునందు వాయువు సర్వాధారమని విశదీకరింపఁబడినదిగదా !

ఉత్తరము : పరమేశ్వరుఁడే స్వర్గాదులకు నాధారమగువాడు. "తమేవైకం విజానథ ఆత్మానమ్" అనుచో గల ఆత్మశబ్దము పరమేశ్వరున కసాధారణమగుటచే వాయువు సర్వాధారమని చెప్పరాదు.

సూత్రాత్మయగు వాయువునందు ఆత్మశబ్దము వర్తించునెడ దోష మెద్దియను శంకను నివారించునదీ సూత్రము.

సూ. "ముక్తోపసృప్య వ్యపదేశాచ్చ" ౧-౩-౨

"యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం - కర్తార మీశం పురుషం బ్రహ్మ యోనిమ్, తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ - నిరంజనః పరమం సామ్యముపైతి"

"శివారాధనఁ జేయువాడు - బంగారువన్నె కలిగిన శరీరము గలవాడు, సమస్త జగత్కర్తయు జగమును శాసించువాడు, పరిపూర్ణుఁడు, వేదరచయితయు జగదుపదానంబు నగు పరమేశ్వరుని సాక్షాత్కరింపఁజేసు కొని పుణ్యము పాపము అవ్వాని లేపమున్ను బొత్తుగా లేనివాడై పరమేశ్వరునితో పూర్తిగా సామ్యమును పొందువాడు."

"యథా నద్యః స్యందమానాః సముద్రే - అస్తం గచ్ఛంతి నామ
[రూపే విహాయ
తథా విద్వాన్ నామరూపా ద్విముక్తః - పరాత్పరం పురుష
[ముపైతి దివ్యమ్"

"నదులు ప్రవహించుచు తమ నామరూపముల (స్థూలదశ)ను విడ నాడి సముద్రమునఁ గలియునట్లు శివోపాసకుడగువాడు ప్రాకృతనామ రూపముల సంబంధము లేనివాడై సర్వాతీతమగు ప్రకాశమానమైన అంత

రిక్షమునందు విరాజమానుఁడగు పరమపురుషు (పరమేశ్వరు) నిఁ బొందు వాఁడగును."

ఇట్లు పుణ్యపాపముల ప్రాకృత నామరూపములున్ను లేనట్టి ముక్త పురుషులకు ప్రాప్యుండగునని చెప్పుటవలన నిట సూత్రాత్మయగువాడు పరమేశ్వరుండేనని తెలియవలెను. ఇట్టి స్వర్గాద్యాధారత్వ లక్షణము వాయువునందెట్లు పొసగును? పరమేశ్వరుని యష్టమూర్తులలో చేరిన వాడగుటచే వాయువు సూత్రాత్మ యని చెప్పఁబడినవాడు. కావున వాయువు స్వర్గాద్యాధారము కాజాలడని నిర్ణయము.

"తమేవ ధీరో విజ్ఞాయ - ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః" "శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వమన్య త్పరిత్యజ్య" అను శ్రుతివాక్యములవలన శివేతరముల నన్నిటిని విడనాడి శివుఁడే ముఖ్యముగా తెలుసుకొనఁదగినవాడని బోధపడుచున్నయది. మఱియు "నానుధ్యాయా ద్బహూ౯ శబ్దా౯ వాచో విగ్లాపనం హితత్" అను వాక్యము "ఇతర వాక్యములను పరిశీలింపకూడదు. ఎందుకనఁగా? శివేతర సమర్థకములగు వాక్యములను విచారించుట శబ్దములయొక్క నిరుపయోగ కృత్యమగు" నని తెలుపుచున్నయది.

కేనోపనిషదమునందు "దేవతలు పరమేశ్వరానుగ్రహమున రాక్షసులను జయించి గర్వపడియుండుతఱి దేవతల గర్వమును పరిహరింప నుద్దేశించి పరమేశ్వరుఁడు యక్ష రూపముతో నావిర్భవింపగా దేవేంద్రుడు యక్షుని పరామర్శించుటకు పంపిన వాయువును "నీ వెవరు? నీ సామర్థ్య మెట్టిది? అని పరమేశ్వరుఁడు ప్రశ్నించెను. "గొప్ప బలము కలిగి మూడు లోకములనుగూడ కదలించువాడ" నని వాయువు చెప్పగా "ఇద్దానిని కదలించు" మని వాయువుముందు పరమేశ్వరుఁడు ఒకానొక గడ్డిపుడకఁ బడవేశినవాడు. అప్పుడు వాయువు తన సంపూర్ణ సామర్థ్యముతో తృణశలాకను కదలింపఁజాలకుండెను" అను నాఖ్యాయిక వినఁబడుచున్నయది. మఱియు నదే యుపనిషదమున "బ్రహ్మాహి దేవేభ్యో విజిగ్యే" అను

వాక్యము - పరమేశ్వరుఁడు దేవతలకు విజయమును ప్రసాదించెనని విశద పఱచుచున్నయది.

ప్రకృతిగాని జీవాత్మగాని స్వర్గాద్యాధారము కాజాలరని దిగువ సూత్రములతో వివరించుచున్నవారు.

సూ. "నానుమాన మతచ్ఛబ్దాత్ ప్రాణభృచ్చ" ౧-౩-౩

అనుమానగమ్యమగు ప్రధానము సర్వోపాదాన మగుటచే స్వర్గాద్యాధార మగునని చెప్పఁగూడదు. ఎందుకనఁగా? ఈ శ్రుతియందు గల ఆత్మశబ్దము ప్రధానమును చెప్పునది కాదు.

జీవుఁడణుమాత్రుఁ డగుటచే, శివేతరమును విసర్జించి యుపాసించుటవలన లభించు అమృతత్వమునకు కారకుఁడు కానందువలనను, స్వర్గాద్యాధారమున కుపయోగించు వ్యాప్తియను నర్థముగల ఆత్మశబ్దముండుట వలనను జీవాత్మయు స్వర్గాద్యాధారము కాజాలదు.

జీవపక్షమును నిరాకరించుటకు మఱియొక కారణమును చెప్పుచున్నవారు;

సూ. "భేదవ్యపదేశాత్" ౧-౩-౪

ఇఁట జీవపరమేశ్వరులు భిన్నులని శ్రుతి ప్రమాణముచే నిర్దేశింపఁబడినది.

"సమానే వృక్షే పురుషో నిమగ్నోఽనీశయా శోచతి ముహ్యమానః, జుష్టం యదా పశ్యత్యన్య మీశ మస్య మహిమాన మితి వీతశోకః"

శ్రుత్యర్థము - సమానే - ఒక, వృక్షే - వృక్షమువలె ఛేదింపఁబడగిన శరీరమునందు; నిమగ్నః - భూతపంచభాగముల సముదాయమునందు పడియున్న నీటిచుక్కవలె శరీరతత్త్వమును కనుగొనఁజాలనివాఁడై, ముహ్యమానః-శరీరగత దోషములు తనవిగా మోహపడునట్టి, పురుషః-జీవాత్మ. అనీశయా - శరీరదోషములను పోగొట్టు శక్తి లేకుండుటచే, శోచతి-దుఃఖ

పడుచుండును, యదా-ఎప్పుడు, జుష్టం-భక్తిచే ప్రసన్నుడైన, అన్యం-తనకంటెవేరైన, ఈశం-పరమేశ్వరుని, పశ్యతి-చూచునో, తదా-అప్పుడు, వీతశోకః - సంసారదుఃఖమును పోగొట్టుకొని, అస్య - ఈ పరమేశ్వరుని యొక్క, మహిమానం - సత్యసంకల్పత్వము మొదలగు ఐశ్వర్యమును, ఇతి (ఏతి) - పొందుచున్నవాడు.

ఏతన్మంత్రమునందు - స్వతఃసిద్ధము అత్యంతశ్రేష్ఠమునగు మహిమ గల పరమేశ్వరుడే ఈశ శబ్దముతో నిర్దేశింపబడువాడు. ఇక జీవాత్మ - పరమేశ్వరానుగ్రహమున ముక్తదశయందు సత్యసంకల్పత్వాది మహిమ కలిగియుండువాడు గదా! ఏతాదృశ జీవేశ్వర తారతమ్యమువలన అనాదికాలమునుండి ఐశ్వర్యము కలవాడే స్వర్గాద్యాధారమగుట పొసగుచున్నందునను పరమేశ్వరుడే స్వయముగా స్వర్గాద్యాధార మగువాడని తెలియవలెను.

సూ. "ప్రకరణాత్" ౧-౩-౫

ముండకోపనిషదమందలి యీ ప్రకరణము "కస్మిన్ను భగవో విజ్ఞాతే" మొదలుకొని ప్రాణులందలి యుత్పత్తికారణమగు అక్షరశబ్ద వాచ్యుడైన పరమేశ్వరునిదే యని "అథ పరా, యయా తదక్షర మధిగమ్యతే" ఇత్యాది వాక్యములవలన దెలియుచున్నది.

జీవాత్మను నాడీ సంబంధము హృదయము ద్వారా నేర్పడున దగుటచే హృదయమందు భావలింగముగా నుపాసింపదగిన పరమేశ్వరుడు "అజాయమానో బహుధా విజాయతే" అనునట్లు ఐచ్ఛికముగా ననేక విగ్రహములు బరిగ్రహించువాడని తెలియునది.

సూ. "స్థిత్యదనాభ్యాం చ" ౧-౩-౬

"ద్వా సువర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి"

"మంచివన్నె కలిగిన రెండు పక్షులు (జీవపరమేశ్వరులు) శరీర రూపమగు ఒకే వృక్షమునందు నిరంతరము కూడి స్నేహితులవలెఁ బ్రవర్తించునవి. ఈ రెంటిలో నొక పక్షి - రుచికరమైన కర్మఫలము ననుభవించునట్టిది. మరియొక పక్షి - యెట్టి యనుభవము లేకయే ప్రకాశించునట్టిది".

ఇట్లు జీవునకు కర్మఫల భోగమును పరమేశ్వరునకు కర్మభోగము లేకయే శరీరస్థితిని శ్రుతి నిర్దేశించుచున్నందున జీవునికంటె వేరైన పరమేశ్వరుఁడే స్వర్గాద్యాధారమగునని విశదమైనది.

సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞానము - విశిష్ట శివాద్వైత సిద్ధాంతమునందే పొసగునది. ఎట్లనఁగా ? "బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" అనుచో ఏవకారమునకు ఇవార్థముఁ జెప్పవలెను. జీవాత్మ-ముక్తుడగునెడ బ్రహ్మ సదృశుఁడగుననియు "అస్యమహిమానమితి" అనుచో బ్రహ్మసదృశ మహిమ లభించుట బ్రహ్మభిన్నత్వమునందే పొసగుననియు "యదా పశ్యః పశ్యతే" అను అనంతర మంత్రమునందు పరమేశ్వరునితో పరమసామ్యముఁ జెందుట ముక్తిస్వరూపమనియు "ఏషోఽణురాత్మా" అనుచో అణువుగా చెప్పఁబడిన జీవాత్మ "తస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా" ముక్తదశయందు విభువగునని ముక్తదశయందును జీవస్థితి నంగీకరించుటచే జీవేశ్వరభేదము పారమార్థికమైనదనియు ఏవంసత్యేవ "బ్రహ్మమును కనుగొనినవాడు జగమునంతయు తెలుసుకొనువాడగు" నను ప్రతిజ్ఞ సరిపడుననియు గ్రహింపవలెను.

భూమాద్యధికరణము

ముక్తప్రాప్యుఁడుగా చెప్పఁబడిన పరమేశ్వరునిపొందుటకు ప్రయోజనమగు నిరతిశయ సుఖమును ప్రదర్శించుచున్నవారు.

సూ. "భూమా సంప్రసాదా దధ్యుపదేశాత్" ౧-౩-౭

సూత్రార్థము - సంప్రసాదుఁడనఁగా జీవాత్మయగును. ఇట్టి సంప్రసాదునికంటె నధికముగా శ్రుతియం దుపదేశింపఁబడుటవలన పరమేశ్వరుడే భూమశబ్ద నిర్దిష్టుడగువాడు.

ఛాందోగ్యమునం దీ సూత్రమునకు విషయవాక్యము.

"యత్ర నాన్యత్పశ్యతి నాన్య చ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా" "ఎద్ది లభించినచో ఇతరమును చూడకుండుటయు అన్యమును వినకుండుటయు వేరుదానిని తెలియకుండుటయు నగునో అట్టిది భూమ యనఁబడును".

మనోవాక్కుల కందరాని యతిశయముగల ఆనందము భూమ శబ్దార్థమగును. ఇట్టిది ఒకానొక ధర్మినాశ్రయించునదగుటఁజేసి నిరతిశయానందము కలిగియుండు పరమేశ్వరుఁడు భూమశబ్ద నిర్దిష్టుడగువాడు.

ఇట్టితటి భూమశబ్దముతో నిర్దేశింపఁబడువాడు పరమేశ్వరుఁడా? తదితరుడా? అని సందేహము.

ప్రశ్న : పరమేశ్వరునికంటె నితరుఁడగు ప్రాణవాయువే భూమ శబ్దముతో చెప్పఁబడవలెను. ఎందుకనఁగా? ఛాందోగ్యమునందు భూమ వాక్యమునకు ముందు "అస్తి భగవో నామ్నో భూయః" ఇత్యాది వాక్యములతో నారదుఁడు ప్రశ్నింపగా సనత్కుమారుఁడు "వాగ్వావ నామ్నో భూయసీ" "పేరుకన్న వాక్కు శ్రేష్ఠమైనది" ఇట్లు నామాది తత్త్వములను గురించి చెప్పిన తరువాత ప్రశ్నోత్తరములు లేకయే నిర్దేశింపఁబడిన భూమశబ్దము సంబంధించుటచే ప్రాణవాయువే ఇట ప్రతిపాద్యము కాని పరమేశ్వరుఁడు కాజాలడు గదా!

ఉత్తరము : సుషుప్తియందు అథవా ముక్తదశయందు బాగుగా ప్రసన్నుడగువాడగుటచే సంప్రసాదుడనఁబడు జీవాత్మ నతిక్రమించియుండువాడని చెప్పఁబడుటవలన పరమేశ్వరుఁడే భూమశబ్దవాచ్యుండగువాడు. "అథ యఏష సంప్రసాదః" సంప్రసాదుఁడగు జీవుఁడు ప్రాణశబ్దముతో

నిర్దేశింపఁబడును. ఇట్టి జీవునికన్న మరియొక ఆత్మగా భూమయగువాడు "ఏషతువా అతివదతి యః సత్యేనాతివదతి" "ఎవడు సద్రూపముతో ప్రకృతి నతిక్రమించువాడో వాడే మిక్కిలి సంభాషించువాడు అనఁగా గొప్ప వాడు పరమాత్మ" అనుచో నుపదేశింపఁబడుచున్న వాడు.

ఈ సందర్భమున పూర్వము "సవా ఏష ఏవం పశ్య న్నేవం మన్వాన ఏవం విజానన్నతివాదీ భవతి" "జీవుఁడు శ్రుతిప్రోక్తరీతిగా పరమాత్మను భావించుచు చూచువాడై మిక్కిలి తెలివిగలవాడు మరియు మహిమ గల వాడగును" ఇట్లు అతి వాదియగు జీవునిఁ జెప్పి యటుపిమ్మట "ఏష తువా" అను వాక్యములోని "తు" శబ్దముతో ప్రాణశబ్దవాచ్యుండగు జీవునికన్న సత్యస్వరూపుఁడగు పరమేశ్వరుఁ డతీతుఁడుగా తెలుపబడుచున్న వాడనియు "అథాత ఆత్మాఽదేశః" అనుచో ఆత్మగా చెప్పఁబడుచున్న వాడనియు గ్రహింపనగును కావున జీవాత్మాధికుఁడగు ఆత్మ (పరమేశ్వరుఁడు) భూమ యగువాడే యని సిద్ధాంతము.

సూ. "ధర్మోపపత్తేశ్చ" ౧-౩-౮

"స భగవః కస్మిన్ ప్రతిష్ఠితః" "భగవానుఁ డెద్దానియందు ప్రతిష్ఠింపఁబడినవాడు ?" "స్వేమహిమ్ని" "తన మహిమయందు ప్రతిష్ఠింపఁబడినవాడు" "ఆత్మైవేదం సర్వమాత్మనః ప్రాణ ఆత్మన ఆకాశః" "జగమంతయు ఆత్మస్వరూపమే, ఆత్మనుండి ఆకాశము ప్రాణము అన్నియావిర్భవించినవి" ఇత్యాది ప్రశ్నోత్తర వాక్యములందు గల స్వమహిమ ప్రతిష్ఠితత్వము, సర్వాంతర్యామిత్వము సర్వకారణత్వము మొదలగు ధర్మములు - ప్రాణశబ్ద నిర్దిష్టుడగు జీవునియందు ఉపపన్నములు కాకుండుటచే పరమేశ్వరునియం దుపపన్నములగుటను భూమాఖ్యుఁడు పరమేశ్వరుఁడేను;

ప్రశ్న : పూర్వాధికరణమునందు "నిరంజనః పరమం సామ్యము పైతి" అను వాక్యము ననుసరించి ముక్తపురుషులకు శివసాదృశ్యము చెప్పఁబడినది కావున సాయుజ్యముక్తి గలవారు బ్రహ్మములో లీనులుగాక

బ్రహ్మమునకంటె వేరుగా నుందురని బోధపడుచున్నదిగదా! ఏవంసతి "యత్ర నాన్య త్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా" అను వాక్యము పరమాత్మ నవలోకించిన పిమ్మట బ్రహ్మములోనుండు ప్రపంచమును చూచుట మొదలగువాని నిషేధించుట యెట్లు పొసగును?

ఉత్తరము : నిరతిశయ సుఖస్వభావముగల పరమాత్మ - సాక్షాత్కరింపగా - ఇంద్రియానందము ననుభవించు నుద్దేశముతో రూపాది విషయములను గాంచుటయందు ప్రవృత్తి గలవాడు కాకుండును. ఇట్టి యానందమును కలుగఁజేయు బ్రహ్మము భూమయనఁబడుచున్నది. ఇంద్రియసుఖ విశేషములన్నియు బ్రహ్మానందలేశమున పరమాణువులవంటివి.

ఇవ్విషయమునే "ఏతస్యైవానందస్య అన్యాని భూతాని మాత్రాముపజీవంతి" "ఈ బ్రహ్మానందముయొక్క యల్పాంశము నాశ్రయించియే ప్రాణులన్నియు జీవించుచున్నవి" యని శ్రుతి ప్రతిపాదించుటచే "నాన్యత్పశ్యతీ" త్యాది నిషేధము బ్రహ్మగతమగు ప్రపంచమునకు కాజాలదు.

ప్రశ్న : ప్రపంచము ఉండునపుడు ము కపురుషులకు ప్రపంచ దర్శనములేదని శ్రుతి చెప్పుట యెట్లు పొసగును?

ఉత్తరము : ప్రపంచము సత్యమైనను ముక్తపురుషులకు కనఁబడునదికాదు. నిరతిశయానంద స్వరూపమగు బ్రహ్మమే ప్రపంచాకారముగా కనఁబడునది యగును. "వృక్ష" మనెడు పదము పత్రపుష్పాదులతో కూడిన స్థావరమును చెప్పునట్లు "భూమ" శబ్దము స్థూలసూక్ష్మ చేతనాచేతనములతో నిండియుండు ప్రపంచముతో కూడియుండు పరమేశ్వరుని తెలుపునట్టిది. వృక్షమును చూచువాడు మూలము మొదలుకొని శాఖాగ్రములవరకు నెటఁ జూచినను వృక్షమునే చూచునట్లు ముక్తపురుషుఁడు ప్రపంచమును ప్రపంచాకారముతో గాక బ్రహ్మాకారముగా నవలోకించువాడగును. ఇందువలననే "యత్ర నాన్యత్పశ్యతీ" త్యాది నిషేధమును శ్రుతి చెప్పుట సమంజసంబగుచున్నయది.

ఇవ్విషయమై తైత్తిరీయశ్రుతి "ఏత త్తతో భవతి, ఆకాశశరీరం బ్రహ్మ, సత్యాత్మ, ప్రాణారామమ్" "పరిదృశ్యమాన జగము - ముక్తావస్థ నొందిన మహాపురుషునకు చిదాకాశ స్వరూపత్వము మొదలగు లక్షణములతో కూడిన బ్రహ్మముగా గోచరించును" "ఆప్నోతి స్వారాజ్యం, ఆప్నోతి మనసస్పతిమ్" "స్వః - స్వర్గమనఁదగు పరమపదమునందు ప్రకాశించువాడు కావున స్వారాట్ అనఁబడును. స్వారాట్టు భావము స్వారాజ్యమగును. ఇట్టి సుఖైకర సస్వరూపముగల పదమును మఱియు జ్ఞానశక్త్యధిష్ఠాతయగు పరమేశ్వరుని పొందఁజాలును" అని ముక్తపురుషుని గురించి వాక్రుచ్చియున్నది.

అట్టితఱి ముక్తపురుషుఁ డెట్టివాడను నాకాంక్ష యుదయింపగా "వాక్పతిః" ఇత్యాది వాక్యములతో - నప్రాకృతములు విశుద్ధములు స్వాధీనములు నగు వాగింద్రియాదుల సంబంధము కలవాడని - తెలుపబడుచున్నయది.

భూమవిద్యయందు ప్రపంచమును దుఃఖరూపముగా చూడనివాడై ఎట్టి దుఃఖసంసర్గములేని బ్రహ్మముగా నవలోకించువాడగునవి విశదమైనది.

"న పశ్యో మృత్యుం పశ్యతి, న రోగం నోత దుఃఖతాం, సర్వం హి పశ్యః పశ్యతి, సర్వమాప్నోతి సర్వశః"

ప్రపంచమును బ్రహ్మముగా నవలోకించువాడు మృత్యుమయమగు సంసారమునుగాని రోగాది వికారములనుగాని దుఃఖమునుగాని పొందువాడు కాడు. కావున శివుని సర్వాంతర్యామిగా గాంచువాడు సర్వవిధములుగా పరమేశ్వరునే పొందువాడగును."

అందువలన శ్రుతిప్రోక్త ప్రపంచ నిషేధమునకు విరోధము లేనందున ముక్తపురుషులు శివసములై శివునికి వేరుగాని ప్రపంచమును శివమయముగా గాంచుట యుపపన్నంబగుచున్నయది.

అక్షరాధికరణము

సూ. "అక్షర మంబరాంత ధృతేః" ౧-౩-౯

బృహదారణ్యకమునం దీ సూత్రమునకు విషయవాక్యము.

"ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి, అస్థూల మనణ్వ హ్రస్వ మదీర్ఘ మలోహిత మస్నేహ మచ్ఛాయమ్"

ఇట నక్షరశబ్దార్థము ప్రణవమా ? జీవాత్మయా ? పరమేశ్వరుఁడా ? అని మూడు విధములుగా సందేహింపఁబడుచున్నది.

ప్రశ్న : ప్రణవము కాని జీవుఁడు కాని యక్షరశబ్దవాచ్యుఁడు కాదగును. ఎందుకనఁగా ? అక్షర మనునది వర్ణమునకును పర్యాయ మగుటచే ప్రణవవాచకంబగుటయు "పురుషోఽక్షర ఉచ్యతే" అను ప్రమాణము ననుసరించి జీవుఁడక్షరశబ్దముతో చెప్పఁబడుటయు గమనింపఁదగినవి.

ఉత్తరము : ఇఁట నక్షరపదము పరబ్రహ్మమునే చెప్పునది. ఎందువలన ననఁగా ? ఆకాశావధిక ప్రపంచమును ధరించుట యను లక్షణము ప్రణవ జీవులకు పొసగనట్టిది.

ఈ సందర్భమున నక్షరమును గురించి యొక యాఖ్యాయిక గలదు.

జనకమహారాజు - స్వక్రియమాణ యజ్ఞమునకు కురుపాంచాలాది దేశములనుండి యనేక బ్రాహ్మణులు రాగా వీరిలో నెవరు బ్రహ్మిష్ఠులని తెలుసుకొనఁగోరి "మీలో బ్రహ్మిష్ఠులగువారు సువర్ణాలంకార భూషితము లగు వేయి ఆవులను తీసుకొనుఁడ"ని ప్రకటించెను. అప్పుడు నేను బ్రహ్మజ్ఞుడనను దృఢవిశ్వాసముతో యాజ్ఞవల్క్య మహర్షి తన శిష్యునికి జనక ప్రదత్తగోవులను మన యాశ్రమమునకు గొంపొమ్మని చెప్పగా నచటి బ్రాహ్మణులు క్రుద్ధులై నందున ఆశ్వలుడనువాడు "నీవేనా బ్రహ్మిష్ఠుడవు" అని యాజ్ఞవల్క్యుని ప్రశ్నించెను. అట్టితఱి యాజ్ఞవల్క్యుఁడు "మేము బ్రహ్మవిదుని నమస్కరించువారము కాని ఆవులను మాత్రము కోరుదుము"

అని చెప్పగా ఇద్ది గర్వోక్తి యని శంకించి యాశ్వలాదులు గావించిన ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుఁడు సదుత్తరములను చెప్పినందున సభ్యులందరు మిన్నకుండిరి.

పిమ్మట ఈ జగము ఎద్దానియందు ఆధారపడియుండునని ప్రశ్నింపగా నీటియం దాధారపడి యుండునని సమాధానముఁ జెప్పెను. మరి కొన్ని ప్రశ్నలకు తగిన సమాధానములను యాజ్ఞవల్క్యుఁడు చెప్పి బ్రహ్మలోకములు సర్వాధారములగునని నిరూపించిన తరువాత బ్రహ్మలోకములు కిమాధారకములని ప్రశ్నింప "గార్గీ? అధికముగా ప్రశ్నింపకుము! మిక్కిలి ప్రశ్నలను గావింపనివారియందే దేవతలు ప్రసన్నులుగా నుందురని యాజ్ఞవల్క్యుఁడు సక్రోధముగా వచించినందున గార్గి యూరకుండెను.

అట్టితటి బ్రహ్మవిదుఁడని ప్రసిద్ధుడైన నుద్దాలకుఁడు - సర్వాంతర్యామియగు సూత్రాత్మను గురించి ప్రశ్నింపగా యాజ్ఞవల్క్యుఁడు సరియైన సమాధానమును చెప్పుటఁజేసి "పృచ్ఛకులందరు పరాజితులగుచున్నవారని గమనించి సభాసదుల యనుమతిని యాజ్ఞవల్క్యుని క్రోధము నిరుపయోగమని గ్రహించియు" గార్గి మరల సర్వాధారమగునది యెద్ది యని ప్రశ్నింపగా - "యదూర్ధ్వం గార్గి దివో యదర్వాక్ పృథివ్యా యదంతరా ద్యావాపృథివీ ఇమే యద్భూతంచ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షత, ఆకాశఏవ తదోతంచ ప్రోతంచ."

"గార్గీ! స్వర్గమునకు పై క్రింది భాగములు పృథివీభాగము భూమ్యంతరిక్షముల నవకాశంబును భూత భవిష్యద్వర్తమానకాలీన జగమంతయు ఆకాశమునం దాధారపడియున్నవి" అని యాజ్ఞవల్క్యుఁడు వచింపగా ఆకాశమునకు ఆధారము ఎద్దియని ప్రశ్నించినది.

"ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి" అను వాక్యము మొదలుకొని "ఏతస్మిన్ ఖల్వక్షరే గార్గి బ్రాహ్మణా అభివదంతి" అను

వాక్యమువరకు వచింపఁబడిన ఆకాశావధికమైన ప్రపంచమును భరించుట - అక్షరపదవాచ్య మగుదానికే పొసగుచున్నయది.

ఇట్టి ప్రపంచధారణము పరమేశ్వరునికి దక్క నితరముల కెట్లు ఉపపన్నంబగును? అందువలన నక్షరపదాభిధేయుఁడు పరమేశ్వరుఁడే యగుచున్నవాడు.

అక్షరపదవాచ్యము ప్రణవము కానట్లు జీవాత్మయు నక్షరపదవాచ్యుఁడు కాజాలడని దిగువ సూత్రము నుదాహరించినవారు.

సూ. "సాచ ప్రశాసనాత్" ౧-౩-౧౦

"ఏతస్యైవాక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః" ఇత్యాది వాక్య సందర్భముతో సూర్య చంద్రాది సకల ప్రపంచ ధారణము శ్రేష్ఠమగు నక్షరముఁ దగు కార్యమని విశదమగుచున్నయది. ఇట్టి జగచ్ఛాసనము జీవాత్మవలన నేర్పడునది కాదుగదా!

"ఏక ఏవ రుద్రో న ద్వితీయాయ తస్థుః" అను తైత్తిరీయ శ్రుతి వాక్యము పరమేశ్వరునికి దక్క జీవాత్మకు జగమును శాసించుట యను లక్షణము సంభవించునది కాదని తెలుపుచున్నయది.

ఇఁట జగచ్ఛాసనమందు మాత్రము తనకంటె రెండవ వస్తువు లేదనియు వస్తుతః రెండవ వస్తువు కలదనియు దిగువ వాక్యములు తెలుపుచున్నయవి.

"య ఇమాన్ లోకా నీశత ఈశనీభిః" శ్వేతాశ్వతర శ్రుతి.

"య ఇమాన్ లోకా నీశత ఈశనీయః" అథర్వశిరోపనిషత్తు.

ఇందువలనను పరమేశ్వరుఁడే అక్షరనామధేయుఁ డగువాడు.

సూ. "అన్యభావ వ్యావృత్తేశ్చ" ౧-౩-౧౧

"తద్వా ఏతదక్షరం గార్గి అదృష్టం ద్రష్టృ, అశ్రుతం శ్రోతృ, అమతం మంతృ, అవిజ్ఞాతం విజ్ఞాతృ"

"జీవసముదాయము ఒకానొక వస్తువుఁ జూచునపుడు ఆపాతతః గోచరమగునెడ నట్టిదగు రూపమును సాక్షాత్కరింపఁజేయునదియు ఒకానొక శబ్దము అస్పష్టముగా వినఁబడునెడ శ్రావ్యశబ్దమును విశదముగా విన గలుగఁజేయునదియు "స్థాణువా? పురుషుఁడా? అని సందేహించునపుడు విచారణీయవస్తువును భాసింపఁజేయునదియు, స్థాణువనియో పురుషుఁడనియో నిర్ణయించునపుడు నిర్ణీతమగు వస్తువును గోచరింపఁజేయునదియు నగు నక్షరము ఈవరకు చెప్పఁబడిన పరబ్రహ్మమే యగు" నని గార్గిని గురించి చెప్పుటవలన "పరమేశ్వరుఁడే నక్షరమగును కాని వేరు కాద"ని నిరూపితమైనది.

అనేక విద్వాంసులు నివసించు గ్రామమున "చైత్రుఁడే పండితు" డని చెప్పునెడ ననేక శాస్త్రవిదుఁడగు పండితుఁడు చైత్రునితో సమానుఁడు మరియొకఁడు లేడను నర్థము స్ఫురించునట్లు "రుద్రుఁ డద్వితీయుఁడ"ను నెడ జగచ్ఛాసకుఁడు ద్వితీయుఁడు లేడని విశదమగునది.

"అదృష్టం - ద్రష్టృ" అనుచో సర్వద్రష్ట, సర్వాధారుఁడు, సర్వ శాసకుఁడు నగు పరమేశ్వరునితో సమానుఁడు మరియొకఁడు లేడని "నాన్యదతోఽస్తి ద్రష్టృ" ఇత్యాది వాక్యము నిరూపించుచున్నది కాని అనేకులు చూచువారు లేరను నిషేధమును మాత్రము చెప్పుటలేదు. ఐతే అనేక ప్రమాణములు - ద్రష్టలు శ్రోతలు భావించువారు విజ్ఞాతలు నగు జీవాత్మ లనేకులు గలరని చాటుచున్నవిగదా!

బ్రహ్మమే ద్రష్టయని చెప్పుట - బ్రహ్మమునకు ద్రష్టృత్వాది విశేషములు లేవని చెప్పు స్వమతమునకే విరుద్ధమగుటచే యథోక్తమైన సమర్థనమే విహితఁబగుచున్నయది. ఇఁక ప్రణవమునకుగాని జీవాత్మకుగాని ఏతాదృశ మహిమ లేనందున పరమేశ్వరుఁడే నక్షరపదాభిధేయుఁడగు వాడని సారాంశము.

ఈక్షతికర్మాధికరణము

ప్రత్యక్షాది ప్రమాణముల నతిక్రమించి యుండువాడైనను పరమ కారుణికుఁ డగుటచే పరమేశ్వరుఁడు స్వోపాసకులకు ప్రత్యక్షమగువాడని ప్రతిపాదించున దీ యధికరణము.

సూ. "ఈక్షతి కర్మ వ్యపదేశా త్సః" ౧-౩-౧౨

"యః పునరేతం త్రిమాత్రేణో మిత్యేతే నైవాక్షరేణ పరం పురుష మభిధ్యాయీత స తేజసి సూర్యే సంపన్నో యథా పాదోదర స్త్వచా వినిర్ముచ్యత ఏవం హైవ స పాప్మనా వినిర్ముక్తః స సామభి రున్నీయతే బ్రహ్మలోకం స ఏతస్మా జ్జీవఘనాత్ పరాత్పరం పురిశయం పురుషమీక్షతే"

"అకార ఉకార మకారము లనఁబడు మాత్రలు మూడిటితో నేర్పడు ఓంకారముతోడను తదనుస్యూతమగు శివపంచాక్షరీ మంత్రము తోడను పరమేశ్వరుని ధ్యానించువాడు - తేజోమయుఁడగు సూర్యుని దర్శించి - పాము కుబుసమును విడచునట్లు - కర్మబంధమునుండి విడిబడి సామవేదాభిమానముగల దేవతల తోడ్పాటుతో శివపదమును పొందు వాడగును. తరువాత జీవసమష్టి స్వరూపుఁడగు హిరణ్యగర్భు నతిక్రమించి యుండు నారాయణునికన్న పరుఁడగు పరమేశ్వరుని దర్శించువాడగును."

ప్రశ్నోపనిషదమునందు - సత్యకాముఁడనువాడు ప్రశ్నించినపుడు పిప్పలాదమహర్షి నిర్వచించు పై సందర్భమును గాననగును.

ఇఁట దర్శింపఁబడువాడు పరమేశ్వరుడా? ఇతరుడా? అని సందే హము.

ప్రశ్న: "స సామభి రున్నీయతే బ్రహ్మలోకమ్" అనుచో హిరణ్యా గర్భుని లోకమును చెప్పవలసియుండును. ఎట్లనఁగా? ప్రణవోపాస కుఁడు ఇంద్రియాతీతుఁడగు జీవునికంటె నతీతుఁడగు హిరణ్యగర్భుని చూచు వాడగును. లేక జీవఘనుఁడగు హిరణ్యగర్భునికన్న పరుఁడగు నారాయణుని

జీవఘనుఁడగు హిరణ్యగర్భునికన్న నుత్కృష్టుఁడైన నారాయణుని కంటె నతీతుఁడును సర్వాంతర్యామియు దేహమను పట్టణము నెలకొని నందున పురుషశబ్దముతో చెప్పఁబడువాడు నగు పరమేశ్వరుని ప్రణవ పంచాక్షరితో నుపాసించువాడు సాక్షాత్కరించుకొనువాడగునని విశదార్థము.

"నారాయణ పరంబ్రహ్మ" "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ-పురుషం కృష్ణపింగళమ్, ఊర్ధ్వరేతం విరూపాక్షమ్" అను వాక్యముల ననుసరించి పరబ్రహ్మము నారాయణాతీతంబనియు మనోవాగ్వికారములు లేనట్టి దనియు దేహములోని హృదయపుండరీకమున నివసించుటచే పురుషశబ్ద వాచ్యంబగునది యనియు మూడు కన్నులు కలదియగుటచే విరూపాక్షంబనియు ప్రణవగత అకార ఉకార మకారములను వ్యత్యాసముగా (ఉ=మ్=అ) పలుకుటచే నేర్పడు ఉమాశబ్దముతో చెప్పఁబడు పరశక్తితో కూడినదై "తస్య ప్రకృతిలీనస్య యః పరః స్సమహేశ్వరః" అను వాక్యము ననుసరించి ప్రణవాభిధేయం బగునది యనియు అనేక వర్ణములు కలది యగుటచే కృష్ణపింగళంబనియు, సర్వాతీతమగుటచే పరంబనియు "పరాత్పరం పురిశయం పురుషమీక్షతే" అను వాక్యము ననుసరించి సోపాసకులకు సాక్షాత్కరించునదనియు చెప్పుట సమంజసంబగునది.

"తద్విష్ణోః పరమం పదమ్" అనుచో విష్ణువునకుగల ప్రపంచస్వరూపముదక్క నిరతిశయానంద స్వభావము గల పరమ స్వరూపమే శివాభిధేయమగు బ్రహ్మమగునని చెప్పునెడల విరోధమెద్దియు గానరాదు. ఎందుకనఁగా ? ఉపాదానకారణమగు విష్ణుమూర్తికిని నిమిత్తకారణమగు పరమేశ్వరునకును అవస్థాభేదమేకాని స్వరూప భేదము పాటింపఁదగినదికాదు.

ఇట్లు హరి బ్రహ్మాది ప్రపంచాతీతుఁడైనను ఉపాసకుల ననుగ్రహించుటకు పరమేశ్వరుఁడు దేహమున నివసించుచు పురుషుఁడనఁబఱగి పరమశక్తియగు ఉమాదేవితో కూడినవాడై సాక్షాత్కరించుట - సకల సంసారము తొలఁగుటద్వారా స్వప్రాప్తిని కలిగించునది యగును. ఇట్టి

మోక్షము శివవాచకమగు ప్రణవపంచాక్షరీ మంత్రముతో శివాను సంధానమును చేయువారికే సంభవించునని విశదమైనది.

నిత్యముక్తత్వమనఁగా ? సంసారకళంకములు ఎల్లకాలము లేకుండుటయేకాదు, మరియు నెప్పుడును సర్వశ్రేష్ఠమగు స్వకీయానందము ననుభవించుట యగును. ఇట్టి యానందానుభవము పరమేశ్వరుని యవస్థా విశేషమగు నారాయణునకు సంభవించునది కాజాలదు.

ప్రశ్న : "యో దేవానామ్" అను మంత్రము ననుసరించి పరమేశ్వరుఁడు హిరణ్యగర్భుని మించినవాడగుటఁజేసి "నారాయణ పరం బ్రహ్మ" అను మంత్రమునఁ గల నారాయణ శబ్దమునకు బ్రహ్మార్థమును చెప్పవలసియుండును - కావున శివుఁడు బ్రహ్మాతీతుఁడేగాని నారాయణాతీతుఁడు కాజాలడుకదా !

ఉత్తరము : ఋతగ్ం సత్యం పరం బ్రహ్మ" అను తదనంతరానువాకమునందు శివుఁడే నారాయణునికన్న నతీతంబగు బ్రహ్మమగునని ప్రదర్శింపఁబడినది కావున చతుర్ముఖునికంటెఁ బరుఁడు నారాయణుఁడనియు నారాయణునికన్న నతీతుఁడు శివుఁడనియు దిగువ వ్రాయఁబడిన శివసంకల్పోపనిషదంబు ననుసరించి విశదమగునది.


"పరా త్పరతరో బ్రహ్మ తత్పరా త్పరతో హరిః"

తత్పరా త్పరతో హీశః"...............శివసంకల్పోపనిషత్తు.

ప్రణవమునకు గల నక్షరములను వ్యత్యాసముగా పలికినచో నేర్పడు "ఉమ" అను నామధేయము గౌరీప్రణవమగునను నంశమును లింగపురాణ వాక్యములు తేటపఱచినవి.

శ్లో॥ త్వదీయః ప్రణవః కశ్చిత్ - మదీయః ప్రణవ స్తథా
త్వదీయో దేవి మంత్రాణాం - శక్తిభూతో న సంశయః॥
అకారోకార మకారా - మదీయే ప్రణవే స్థితాః
ఉకారం చ మకారం చ - అకారం చ క్రమేణతు॥
త్వదీయ ప్రణవం విద్ధి - త్రిమాత్రం ప్లుత ముత్తమమ్।

బ్రహ్మలోకమనఁగా ? బ్రహ్మము సంపూర్ణముగా ప్రకాశించునది యగును. విష్ణుపదమనఁగా ? విష్ణువునకు గల యప్రాకృత నిరతిశయా నంద స్వభావమగును గావున నిట్టి పదద్వయము ఏకార్థమునే బోధించు చున్నవని గ్రహింపవలెను.



మహారాజపోషకులు :

బ్రహ్మశ్రీ, లోకారాధ్యులు, శివయోగి, రామగిరి శంకరారాధ్యులవారు

నివాసము లక్ష్మీపురము, మెదక్ జిల్లా.

ఏతద్భాష్యానువాద ప్రోత్సాహక ప్రముఖులు, ఉదార హృదయులున్ను.

దహరాధికరణము

దేహమను పట్టణమున నివసించువానిగా స్వహృదయమున పరమేశ్వరు నుపాసింపవలెనని వ్యక్తపఱచున దీ దహరాధికరణము.

సూ. "దహర ఉత్తరేభ్యః" ౧-౩-౧౩

"అథ యదిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ, దహరోఽస్మి న్నంతర ఆకాశ స్తస్మిన్ యదంత స్తదన్వేష్టవ్యమ్, తద్వావ విజిజ్ఞాసితవ్యమ్" ఛాందోగ్యము.

"బ్రహ్మపురమనఁదగు ఈ శరీరమునందు కమలాకారముగల హృదయములోని దహర (సూక్ష్మాతిసూక్ష్మ) ఆకాశ (ప్రదేశ) మునఁగల వస్తువును కనుగొనుటకు యత్నింపవలెను." ఇఁట దహరాకాశము భూతాకాశమా? జీవుఁడా? పరమాత్మయా? అని సందేహము.

ప్రశ్న: ఆకాశపదము భూతాకాశమునందు రూఢి కలదగుటచే దహరాకాశము పంచభూతములలోని ఆకాశము కాదగును. అథవా స్వల్ప రూపము కలవాడగుటఁజేసి జీవాత్మయగును. ఎట్లనఁగా అణువగు జీవాత్మయందు దహరాకాశత్వము సంభవించునట్టిది. కాని సర్వవ్యాపకుఁడగు పరమేశ్వరుఁడు దహరము కాజాలడుగదా! ఒకవేళ దహరాకాశము పరమేశ్వరుఁ డగునెడ దేహము నశించిన పిమ్మట "ఒకానొక ఘటము భిన్నమైనచో నందలి దధిక్షీరాదులు అంతరించునట్లు" బ్రహ్మము వికారముఁ జెందును.

ఉత్తరము: ఛాందోగ్యమునందు నుత్తరభాగమున చెప్పఁబడిన అపహతపాప్మత్వాది లక్షణములనుబట్టి దహరాకాశము పరమేశ్వరుఁడగును. మరియు ముదుసలితనము వధింపఁబడుట మొదలగువానివలన వినాశముఁ జెందునది కానట్టి దహరాకాశము సత్యమైనది కావున నిట్టి దహరాకాశమునకు నిలయమగు సూక్ష్మశరీరము బ్రహ్మపుర మనఁదగును.

"ఏష ఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః"

"పరమేశ్వరుఁడు - బొత్తుగా పాపములు లేనివాడు; ముసలితనము, చావు, ఇడుములు, ఆకలిదప్పులును లేనివాడు; యథార్థ మనోరథములు గలవాడు; సంకల్పముల సదుపయోగము కలవాడు నగును."

ఇట్టి గుణములు ఆకాశమునందుగాని జీవాత్మయందుగాని వర్తింపవు గావున నపహతపాప్మత్వాది గుణములు గల పరమేశ్వరుఁడే దహరాకాశ మగువాడు.

సూ. "గతిశబ్దాభ్యాం తథాహి దృష్టం లింగంచ" ౧-౩-౧౪

"తద్యథా హిరణ్యనిధిం నిహిత మక్షేత్రజ్ఞా ఉపర్యుపరి సంచరంతో న విందేయు రేవ మేవేమాః సర్వాః ప్రజాఅహరహ ర్గచ్ఛంత్యేతం బ్రహ్మలోకం న విందంతి అనృతేన ప్రత్యూహిఢాః"

"భూమిలోని ద్రవ్యనిధిని పైపైన నడచుచున్నవారు కనుగొనఁజాలనట్లు ప్రజలందరు నజ్ఞానావృతమనస్కులై బ్రహ్మలోకశబ్దవాచ్యుఁడగు పరమాత్మను దినదినము సుషుప్తియందు కలుసుకొనుచున్నను కనుగొనఁజాలకున్నవారు."

అనుచో వినఁబడు ప్రాణుల దహరాకాశ గమనమువలన బ్రహ్మలోక శబ్దమువలనను దహరాకాశము పరమేశ్వరుఁడే యగును.

ఇట్లే మరియొక శ్రుతియందు జీవాత్మ సుషుప్తియందు దహరాకాశముఁ జెందుటను గాననగును. "ఏవమేవ ఖలు సౌమ్యేమాః ప్రజాః సతి సంపద్య న విదుః సతి సంపత్స్యామహే" "సౌమ్యుఁడా? ఈ ప్రాణులన్నియు పరమాత్మయందు విశ్రాంతిఁ జెందుచున్నను పరమేశ్వరుని పొందుచున్నామని తెలుసుకొనఁజాలకున్నవి."

"ఏష బ్రహ్మలోకః సంరాడితి హోవాచ"

"ఇద్ది బ్రహ్మలోకము బాగుగా ప్రకాశించునదియు"

ఇదిగాకను శ్రుత్యంతరములందు గల గతి శబ్దముతో నవసరము లేకయే నీ ప్రకరణమునందును వినఁబడు ప్రతిదిన దహరాకాశగమనము బ్రహ్మలోక శబ్దంబును పరమేశ్వరుఁడు దహరాకాశ మగుటను పూర్తిగా సమర్థించు నిదర్శనములగుచున్నవి.

సూ. "ధృతేశ్చ మహిమ్నోఽస్యాస్మి న్నుపలబ్ధేః" ౧-౩-౧౫

"అథ య ఆత్మా స సేతుర్విధృతి రేషాం లోకానా మసంభేదాయ"

"ఎవఁడు పరమాత్మయనఁబఱగి దహరాకాశ మగుచున్నవాఁడో వాడే లోకములన్నిటి యవధిగా నుండువాఁడై బ్రహ్మాండమును ధరించుచు సుస్థిర మొనర్చువాఁడు."

శ్రుత్యంతరములందు పరమేశ్వర మహిమగా చెప్పఁబడిన జగద్విధృతి యీ ఛాందోగ్యమునందు దహరాకాశమునకే ప్రతిపాదింపఁబడుచున్నందున దహరాకాశము పరమేశ్వరుఁడే యగునని నిర్ణయింపఁబడినది.

మఱియు దిగువ శ్రుతివాక్య మిందుకు ప్రోద్బలకమగునట్టిది.

"ఏష సర్వేశ్వర ఏష భూతాధిపతి రేష భూతపాల ఏష సేతు ర్విధారణ ఏషాం లోకానా మసంభేదాయ"

"సర్వేశ్వరుఁడు ప్రాణులను శిక్షించుచు రక్షించుచు లోకము లన్నియు కళవళపడకుండునట్లు నవ్వాని మోయుచున్నవాఁడు".

సూ. "ప్రసిద్ధేశ్చ" ౧-౩-౧౬

"దహ్రం విపాప్మం పరవేశ్మభూతం-యత్పుండరీకం పురమధ్యసంస్థమ్,
తత్రాపి దహ్రం గగనం విశోక-స్తస్మిన్ యదంత స్తదుపాసితవ్యమ్"

"పరమేశ్వరుని నివాసము, దేహమను పట్టణము నడుమ నుండునది, ఎట్టి కళంకములు లేనిదియు, పరిశుభ్రంబు సూక్ష్మంబునగు హృదయపుండరీకమునందు నిర్వికారము మిక్కిలి సూక్ష్మము నగు చిదాకాశము గలదు. అందు గల జ్యోతిర్లింగాత్మక శివు నుపాసింపవలెను."

"హృత్పుండరీకం విరజం" అను వాక్యము మొదలుకొని "ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుమ్" ఇత్యాది వాక్యమువరకు కైవల్యోపనిషదమునందు పరమేశ్వరుని దహరపుండరీక మధ్యవర్తిగా నుపాసింపవలెనని ప్రసిద్ధముగా నిరూపింపఁబడినది. కావున నిట్టి ప్రసిద్ధిఁబట్టియు పరమేశ్వరుఁడు దహరాకాశమనఁ దగినవాఁడు.

దహరాకాశము తదంతర్వర్తియగు పరమేశ్వరుఁడను నెడ "తనలో తానుండుట" యను ఆత్మాశ్రయ దోషము సంభవించునని శంకించి-హృత్పుండరీకమందలి దహరాకాశము చిచ్ఛక్తియగును కావున శక్తిశక్తిమంతులకు నభేదమగుటచే శక్తిమయమగు దహరాకాశము శక్తివిశిష్టుఁడగు శివుఁడనుటలో విరోధ మెద్దియు గానరాదు.

ఇందువలననే హంసోపనిషదమునందు

"ఏషోఽసౌ పరమహంసో భానుకోటి ప్రకాశో యేనేదం వ్యాప్తం తస్యాష్టధావృత్తి ర్భవతి"

"కోటి సూర్యులతో సమానముగా ప్రకాశించువాఁడు, జగము నంతయు వ్యాపించువాఁడు, పరమహంసయు నగు పరమాత్మ - ఎనిమిది విధములగు స్వరూపవృత్తి కలవాఁడు."

మఱియు జీవాత్మకు వైరాగ్యము హృదయపుండరీక మధ్యమున నేర్పడును. హృదయకమలముయొక్క కేసరమునందు జాగ్రదవస్థయు, కర్ణికయందు స్వప్నావస్థయు హృదయకమల మధ్యగత చిదాకాశములోని జ్యోతిర్లింగమున సుషుప్తియు సంభవించును."

ఇట్లు చేతనుల గాఢనిద్రా సమయమునకు ఆధారమగు దహరాకాశము శివలింగస్వరూపమగుట ప్రసిద్ధమై యున్నది.

ఒకవేళ నిట పరమేశ్వరుఁడు లింగస్వరూపుఁడు కాఁడనినచో-హృదయకమలమున కేసరము కర్ణిక మధ్యప్రదేశముదక్క నాలుగవది లేనందున "లింగే సుషుప్తిః" అను వాక్యము సార్థకము కాకుండును. కావున సమస్త

జీవ సుషుప్తి కాల నివాసముగా చెప్పఁబడిన శివలింగము పరబ్రహ్మంబని విశదార్థము.

"ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుమ్" అని కైవల్యమునందు "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ పురుషం కృష్ణపింగళమ్" అని యుపనిష దంతరమునను సాకారరూపము ప్రతిపాదింపఁబడినట్లు "తమాది మధ్యాంత విహీన మేకం - విభుం చిదానంద మరూప మద్భుతమ్" అని శ్రుత్యంతరము లందు నిరాకారత్వము నిరూపింపఁబడియున్నది. కావున చిదంబరశక్తి విశిష్టుఁడగు పరమేశ్వరునకు లింగస్వరూపము విహితమగుచున్నదిగదా!

శ్లో॥ "ఆధారే కనకప్రఖ్యం - హృదయే విద్రుమప్రభమ్,
భ్రూమధ్యే స్ఫటికచ్ఛాయం - లింగం యోగీ విభావయేత్"

"శివోపాసకుఁడు తన దేహములోని ఆధారచక్రమునందు బంగారు వన్నె గలదిగాను హృదయమున పగడపుకాంతి కలదిగాను భ్రూమధ్యమున స్ఫటికమయముగాను శివలింగమును భావింపవలెను."

ఇవ్విధము సాకారుఁడు నిరాకారుడు నగు మహేశ్వరుని లింగ స్వరూపమే సాధకులకు ధ్యానమునందు పూజనాదులందును విహితమైనది యు చేతునులందరి నను్గ్రహించు పరమేశ్వరుఁడు జీవహృదయమున సహజలింగ స్వరూపముతో సన్నిహితు డగునని యు తేటపడుచున్నయది.

పరమేశ్వరుని సాకారునిగానైనను నిరాకారునిగానైనను ధ్యానించుటకు పూజించుటకు నీ మహాలింగ స్వరూపమే ముఖ్యమైనదని మహాభారతములోని ద్రోణపర్వమునందలి అశ్వత్థామనుగురించి వేదవ్యాసుని వచనము విశదపఱచుచున్నయది.

శ్లో॥ జన్మకర్మ తపోయోగా - స్తయో స్తవచ నిర్మలాః ।
తాభ్యాం లింగేఽర్చితో దేవ- స్త్వయాఽర్చాయాం యుగేయుగే॥

"అశ్వత్థామా? కృష్ణార్జునులయొక్కయు నీయొక్కయు జననము పవిత్రమైనది. మరియు కర్మాచరణ, ఉపాసన, ధ్యానము ఇత్యాది

యోగములన్నియు నిర్దోషములేను; కాని కృష్ణార్జునులు ప్రతియుగమున మహాదేవుని లింగస్వరూపమునం దారాధించుచున్నవారు, నీవై తేజో మూర్తియం దారాధించుచున్నావు. కావున మూర్తిపూజకంటె లింగారాధనము శ్రేష్ఠమగుటంజేసి కృష్ణార్జునులకు ప్రతి సమయమునందు విజయము చేకూరుచున్నయది" ఇందువలననే "ధిగ్గ్రామ మశివాలయమ్" అను ప్రమాణము ననుసరించి ప్రతి గ్రామమునందు పుణ్యక్షేత్రములందును దేవతలుగాని మహర్షులుగాని శ్రీరామచంద్రుండు మున్నగు మహాపురుషులు గాని ఆలయములలో లింగములను ప్రతిష్ఠించిరను నంశము సుప్రసిద్ధమై యున్నది.

లింగస్వరూపము – పరమేశ్వరుని పంచవింశతి లీలా విగ్రహములలో మొదటిది కావున బ్రహ్మవిష్ణువులు కలహించినపుడు శివుండు లింగస్వరూపముతో సాక్షాత్కరింపవలసిన వాడయ్యెను

"లీయతే గమ్యతే యస్మిన్ – యతః సర్వం చరాచరమ్"

"ప్రపంచమంతయు ప్రళయకాలమున దాగియుండుటకు నెలవగునదియు సృష్టికాలమున నామరూప విభాగార్హమగుటకు కారణమగునదియు లింగ మనంబడును. ఐతే తన నారాధించువారికి మహాలింగస్వరూపమును కనంబఱచి భక్తులకు వరముల నొసగునపుడే గంగాధరత్వాది రూపము కలవాడగుచున్నవాడు. ఇంతియేగాక పరమాత్మ వాత్సల్యజలనిధి యగుటచే జీవుల నుద్ధరించుటకే హృదయమున సూక్ష్మాతి సూక్ష్మమైన జ్యోతిర్మయమగు లింగస్వరూపముతో నివసించువాడని చెప్పుట ముమ్మాటికి నొప్పారుచున్నయది.

మహాలింగము హృదయ పుండరీక మధ్యవర్తియగుటచే సూక్ష్మాతి సూక్ష్మమగునది. అవిరక్తుని హృదయమున భోగస్థానములు సుఖదుఃఖ భోగ సాధనములును దాగియుండునవి. విరక్తుని హృదయమునందై తేజో ప్రియములగు పుత్ర విత్తాదులకన్న నతిప్రియము చిదంబరాత్మకమునగు పరశివ స్వరూపమే ప్రకాశించునది.

ఇట్టి మహాలింగమే స్థూలతనువునందు ఇష్టలింగమనఁబఱగి సూక్ష్మ శరీరమునందు ప్రాణవాయువుతో నవినాభావమును పొందు శివపంచాక్షరీ మంత్రము ననుసంధించుటగా ప్రాణలింగమనఁబడుచు కారణశరీర సన్నిహితమగు దహరాకాశమున పరమానందమై నివసించు భావలింగముగా పేర్కొనఁబడుచున్నయది. ఇందువలననే క్రియాసారమను గ్రంథమున "శ్రీ నీలకంఠ భగవత్పాదులవారు దహరాధికరణమును భావలింగోపాసన పరముగా నిర్ణయించి" రని వ్రాయఁబడియున్నది.

సూ. "ఇతర పరామర్శా త్స ఇతి చేన్న అసంభవాత్" ౧-౩-౧౭

"అథ య ఏష సంప్రసాదోఽస్మా చ్ఛరీరా త్సముత్థాయ పరం జ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభి నిష్పద్యతే ఏష ఆత్మేతి హోవాచ"

ఇట సంప్రసాదశబ్దముతో జీవాత్మ పరామర్శింపఁబడుచున్నవాఁడు. కావున దహరాకాశము జీవుఁడే యగునని శంకించునెడ - పూర్వోక్త అపహత పాప్మత్వాది లక్షణములు జీవునియందు సంభవింపనివగుటఁజేసి దహరాకాశము తదంతర్వర్తియు పరమేశ్వరుఁడేను.

సూ. "ఉత్తరా చ్చే దావిర్భూత స్వరూపస్తు" ౧-౩-౧౮

ఛాందోగ్యమునందు తరువాత గల ప్రజాపతి వాక్యము.

"య ఆత్మాఽపహత పాప్మా, విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః, స సర్వాన్ లోకానాప్నోతి సర్వాంశ్చ కామాన్, య స్తమాత్మాన మనువిద్య విజానాతి"

ఇందు చెప్పఁబడిన లక్షణములు జీవాత్మను బోధించునవి, మరియును జాగ్రత్స్వప్న సుషుప్తులనఁబడు నవస్థలయందు వర్తించుట జీవలక్షణమే గదా!

ఎట్లనఁగా ?

"య ఏషో౽క్షిణి పురుషో దృశ్యతే ఏష ఆత్మేతి హోవాచ"

జాగ్రదవస్థ.

"య ఏష స్వప్నే మహీయమాన శ్చరతి ఏష ఆత్మేతి హోవాచ"

స్వప్నావస్థ.

"తద్యత్రైతత్ సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాత్యేష ఆత్మేతి హోవాచ" సుషుప్త్యవస్థ.

ఇందువలన దహరాకాశము జీవుఁడే యనునెడ – జీవునకు అనాది కాలమునుండి చేయఁబడు కర్మలవలన నగు కళంకముల సంబంధముచేత నేర్పడు శరీరములందు అపహత పాప్మత్వాది లక్షణములు మఱుగుపడి యుండును. ఎప్పుడు శివోపాసనవలన శివానుగ్రహపాత్రుడై పరంజ్యోతి (శివు) నాశ్రయించిన పిమ్మట సహజము నపహతపాప్మత్వాది లక్షణ విశిష్టమునగు రూపమును కనుగొనునో అప్పుడు ముక్తజీవుఁడగును. ఇట్టివాడే ప్రజాపతి వాక్యమునందు ప్రతిపాదింపఁబడుచున్నవాడు కాని సంసారియగు బద్ధజీవుఁడు కాజాలడు.

దహరాకాశమైతేనో-సత్యకామత్వాది కల్యాణ గుణములు మఱుగు పడనిదియు సహజములగు అపహతపాప్మత్వాది లక్షణములు గలదియు నగును కావున నిట బద్ధజీవుఁడుకాని ముక్తజీవుఁడుకాని దహరాకాశముగా నిరూపింపఁబడుచు లేదని సారాంశము.

సూ. "అన్యార్థశ్చ పరామర్శః" ౧-౩-౧౯

అట్లు ఐనచో జీవుని పరామర్శ యెందుకనఁగా ?

"అస్మా చ్ఛరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే" అనుచో దహరాకాశశబ్దముతో పరంజ్యోతిగా నిర్దేశింపఁబడు పరమాత్మ నాశ్రయించియే తన రూపమును పొందుట యను జీవ

మహిమను చాటుటకయ్యే జీవపరామర్శ చేయఁబడినది కాని దహరా కాశము జీవుఁడనుటకు కాదని సూత్రార్థము.

సూ. "అల్ప శ్రుతే రితి చేత్తదుక్తమ్" ౧-౩-౨౦

"దహరాకాశము మిక్కిలి సూక్ష్మమగుటఁజేసి అందు పరమాత్మ నివసించుట పొసగదని శంకించునెడ "వ్యోమవచ్చ" అను సూత్రముయొక్క వివరణయందు ఆకాశమువలె సర్వమును వ్యాపించువాడు పరమాత్మయని నిర్వచింపఁబడినదని సూత్రార్థము.

సూ. "అనుకృతే స్తస్యచ" ౧-౩-౨౧

జీవాత్మ దహరాకాశ మనఁదగు పరంజ్యోతియగు పరమేశ్వరు ననుసరించుట శ్రుతియందు కనఁబడుచున్నయది.

"నైనం సేతు మహోరాత్రే తరతో న జరా న మృత్యు ర్నశోకో న సుకృతం, న దుష్కృతం, సర్వే పాప్మానోఽతో నివర్తంతే, అపహత పాప్మా హ్యేష బ్రహ్మలోకః, తస్మాద్వా ఏతం సేతుం తీర్త్వా అంధః సన్ననంధో భవతి, విద్ధః సన్నవిద్ధో భవతి, ఉపతాపీ సన్ననుపతాపీ భవతి, తస్మాద్వా ఏతం సేతుం తీర్త్వా అపి నక్త మహారేవాభి నిష్పద్యతే, సకృ ద్విభాతో హ్యేష బ్రహ్మలోకః"

"సర్వావధియగు దహరాకాశము నహోరాత్రములుగాని జరా మృత్యు దుఃఖములుగాని సుకృత దుష్కృతములుగాని ఆశ్రయింపవు. పాపములన్నియు తొలగును కావున నీ దహరాకాశము అపహతపాప్మ యనఁబడును. ఇట్టి దహరాకాశమును కనుగొనినవాడు గ్రుడ్డివాడైనను చూపుగలవాఁడగును. బాధితుఁడైన నబాధితుఁడగును. పరితాపము కల వాడైనను లేనివాడగును. మరియు ప్రకాశము లేనివాడైనను కలవా డగును. బ్రహ్మలోకమనఁదగు నిట్టి దహరాకాశము సకృత్ సాక్షాత్క రించునెడల ఎప్పుడును మఱుగుపడునది కాదు."

అనుచో దహరాకాశము బొత్తుగా పాపములు లేనిదై ఎల్లకాలము ప్రకాశము కలిగియుండుటఁజేసి యద్దానిని పొందినవారికి పాపకార్యము

లగు సంధత్వాదులు లేకుండుటయు నిరంతర ప్రకాశము ఏర్పడుటయు గమనింపఁదగినవి.

కావున దహరాకాశద్రష్టలకు నపహత పాప్మత్వాది ఫలములు చేకూరుటచే దహరాకాశముతో సమానమగు ప్రతిపత్తియను యనుకృతి సంభవించుచున్నయది.

ఇందువలన నిట్టి యనుకృతి - జీవేశ్వర భేదమునందే పొసగునది కావున దహరాకాశము జీవుఁడు కాదని సారాంశము.

సూ. "అపి చ స్మర్యతే" ౧-౩-౨౨

మఱియు స్మృతులయందు నిద్విషయము బాగుగా నిరూపింపఁబడినది.

"ఈశ్వరః సర్వభూతానాం-హృద్దేశేఽర్జున తిష్ఠతి" గీతావాక్యము.

"అర్జునా ? ప్రాణులందరి హృదయమున దహరాకాశమునందు పరమేశ్వరుఁడు మహాలింగ స్వరూపముతో నివసించువా"డని గుర్తెరుగుము !

"తమేవ చాద్యం పురుషం ప్రపద్యే" గీతావాక్యము.

"సర్వప్రథముఁడగు నా మహాపురుషునే నేను శరణుఁబొందుచున్నాను."

"తతోఽవ్యయాత్మా సహరిః - స్వహృత్పంకజశాయినమ్,
దర్శయామాస దేవానాం - మురారి ర్లింగమైశ్వరమ్"

వామన పురాణము.

"నిత్య స్వరూపముగల నారాయణుఁడు కమలమువంటి తన హృదయమున నివసించు శివలింగమును దేవతలకు చూపెట్టినవాడయ్యెను"

"అథవా పరమాత్మానం - పరమానంద విగ్రహమ్ ।
గురూపదేశా ద్విజ్ఞేయం - పురుషం కృష్ణపింగళమ్॥
బ్రహ్మ బ్రహ్మపురే గార్గి ! - దహరాజ్ఞ ఖ మధ్యమే ।
అభ్యాసాత్ సంప్రపశ్యంతి - సంత స్త్వంచ తథా కురు॥"

"సర్వాతీతమగు ఆనందము స్వరూపముగా గలిగి కృష్ణపింగళ వర్ణము గల పరిపూర్ణుఁడగు పరమాత్మను బ్రహ్మపుర మనఁదగు హృదయ కమలములోని దహరాకాశ మధ్యయందు నిత్యశివారాధనముఁ దగు క్రమాభ్యాసమువలన సత్పురుషులు కనుఁగొనువారు కావున నో గార్గి! నీవుగూడ నట్లు చేయుము!" అని యాజ్ఞవల్క్యుఁడు స్వధర్మపత్నియగు గార్గికి నుపదేశించినవాడు.

ఇట్టి హృదయకమల స్థితమగు స్వరూపమును గురూపదేశమున గాన నగుననియు గురూపదిష్టుఁడు క్రమాభ్యాసమునఁజేసి బ్రహ్మదర్శనముఁ జేయఁజాలుననియు సారాంశము.

ప్రమితాధికరణము

ఉపాస్యమైన దహరాకాశము మహాలింగ స్వరూపంబని ఛాందోగ్యమున నిర్ణయింపఁబడినది. ఇట్టి యంశమునే ధృవపఱచు కఠవల్లీ విద్య యందలి యనువాదమును తెలుపున దీ ప్రమితాధికరణము.

సూ. "శబ్దా దేవ ప్రమితః" ౧-౩-౨౩

కఠవల్లీవాక్యము

"అంగుష్ఠమాత్రః పురుషో - మధ్య ఆత్మని తిష్ఠతి,
ఈశానో భూతభవ్యస్య - న తతో విజుగుప్సతే"

"భూత భవిష్య ద్వర్తమాన ప్రపంచమును శాసించువాడును ఈశాన శబ్ద రూఢివాచ్యుఁడును అంగుష్ఠమాత్రుఁడు నగు పరమాత్మ - జీవాత్మలో నుండువాడు. కావున స్వహృదయమున నంగుష్ఠమాత్రమగు శివలింగ మును కనుగొనినందువలన నిజరూపజ్ఞానము కలవాడగును" అనగా పర మాత్మ దర్శనము ఐన పిమ్మటనే జీవునకు నిజ రూపము మఱుగుపడజాల దనియు నిరాయాసముగా గోచరించుననియు వివేకము.

ఇట నంగుష్ఠమాత్రుఁడు పరమాత్మయా? జీవాత్మయా అను సందేహమును పురస్కరించుకొని ప్రశ్నింపఁబడుచున్నయది.

ప్రశ్న : జీవాత్మయని చెప్పనగును. ఎందుకనఁగా?

"స విశ్వరూప స్త్రిగుణ స్త్రివర్త్మా - ప్రాణాధిపః సంచరతి స్వకర్మభిః,
అంగుష్ఠమాత్రో రవితుల్యరూపః - సంకల్పాహంకార సమన్వితో యః"

"విశ్వమునందలి దేవ మనుష్యాది రూపములను వరుసగా పొందు వాడగుటచే విశ్వరూపుఁడనియు సత్త్వ రజ స్తమోగుణముల నధిష్ఠించి యుండువాడగుటఁజేసి త్రిగుణుఁడనియు స్వర్గ మర్త్య పాతాళము లందు సంచరించువాడగుటవలన త్రివర్మ యనియు ప్రాణవాయువు నింద్రియ ములను నియమించు కతన ప్రాణాధిపుఁడనియు పేర్కొనఁబడు జీవాత్మ-స్వకృతకర్మవశమున ననేక జన్మలఁ బొందుచుండువాడు. మరియు బొటన వ్రేలంతవాడై సూర్యుఁ డాకసమునవలె స్వదేహమునందుఁ బ్రకాశించుచు సంకల్పముతోడ నహంకారముతోడను ప్రవర్తించువాడు."

ఈ వాక్యమునందు జీవాత్మ యంగుష్ఠమాత్రుఁడని ప్రసిద్ధము గదా! "మధ్య ఆత్మని" అనుచో దేహము నడుమ నుండువాడని యర్థము గావున పరమేశ్వరుఁడు సర్వవ్యాపకుఁడగుటఁజేసి పరిచ్ఛిన్నమగు అంగుష్ఠ మాత్రత్వము (పరమాత్మకు) పొసగకుండును కాదా?

ఉత్తరము : ఇట నంగుష్ఠమాత్రుఁడు పరమేశ్వరుఁడే యని చెప్పుట సమంజసము! "ఈశానో భూతభవ్యస్య" అనుచో సర్వేశ్వరత్వ లక్షణము గల ఈశాన శబ్దము ప్రతిపాదింపఁబడినందున "అంగుష్ఠమాత్ర" పదమును పరమాత్మ పరముగా నిరూపింపవలసియున్నది.

"సర్వైశ్వర్య సంపన్నః సర్వేశ్వరః శంభు రాకాశమధ్యే" ఇత్యాది శ్రుతివాక్యములు శివునకు గల సర్వేశ్వరత్వ లింగమును సమర్థించుచున్నయవి. మఱియు భూతభవ్యశబ్దములతో నిర్వచింపఁబడు ప్రపంచము స

చితము కానిదగుటఁ జేసి యసంకుచితమైన జగమును శాసించు నధికారము పరమేశ్వరునకే ఉపపన్నంబగునది.

ఈశాన శబ్దము "ఈశ్వరః శర్వ ఈశానః" అను నిఘంటువాక్యముఁ బట్టి పరమేశ్వరునకు నభిధానశ్రుతి రూపమగునది.

"శాసించువాడు" అను యౌగికార్థము ననుసంధించు భూతభవ్య పదముండుటఁ జేసి ఈశాన పదము శివపరము కాదనునెడ - శబ్దమును వినుటతోడనే స్ఫురించు శివపరమైన రూఢ్యర్థమును గ్రహించుట యని వార్యంబగునది.

భూతభవ్య జగమును శాసించుట యను లక్షణము "ఈశానో భూత భవ్యస్య" అను వాక్యముఁ దగు నర్థమును కనుగొనిన పిమ్మట బోధపడును గావున శబ్దశ్రవణమాత్రమునఁ ద్వరలో ప్రబోధమును కలిగించు ఈశాన శబ్దమువలననే ఇష్టార్థసిద్ధి యేర్పడునని సూత్రగతమైన ఏవకారము విశద పఱచుచున్నయది.

ఇఁట శ్రీభాష్యకారులు :—

"ఈశానో భూతభవ్యస్య" అను వాక్యమువలననే యని "శబ్దాదేవ" అనుదానికి నర్థముఁ జెప్పినవారు. "దేహేంద్రియాదులను నియమించు జీవుఁడు" అను నర్థమును నిరాకరించుటకు "భూత భవ్యస్య" అను పదము ప్రయోగింపఁబడినదని వారి యాశయము.

ఇదియు సరికాదు, ఎట్లనఁగా ?

భూతభవ్యశాసన లింగము ఈశాన శబ్దముకన్న దుర్బల మను నుద్దేశముతో "శబ్దాదేవ" అను నేవకారమును సూత్రకారుఁడు నుపయోగించినవాడు.

ఈశాన శబ్దమువలననే యని చెప్పునెడ విష్ణుపర్వతము సమర్థనీయము కాజాలదని భావించి ఈశత్వముఁ జెప్పు శబ్దమువలన యని యౌగికార్థమును పరిగ్రహించిరి.

ఇట్లు శ్రీవారు శ్రమపడి చెప్పిన సందర్భము ఘట్టకుటీ ప్రభాత న్యాయముగా నీశాన శబ్దవాచ్యుండగు పరమేశ్వరునే సమర్థించుచున్నయది.

ఏతత్సూత్రముఁ దక్క నితర సూత్రములలో బ్రహ్మమునకు విశేష నామధేయము లేమింజేసి ప్రకృత సూత్రములోని "ఈశాన" యను విశేషాభిధానముతో మొత్తము మీమాంసయందలి "సత్" "ఆత్మ" "బ్రహ్మ" ఇత్యాదిశబ్దములు ఛాగపశున్యాయమున శివపరములగునని విశదమగుచున్నం దున బ్రహ్మమీమాంసా శాస్త్రము శివేతర దేవతలఁ బ్రతిపాదించునది కాదని తెలియునది.

అంగుష్ఠమాత్రత్వము పరమేశ్వరున కెట్లు పొసగునను యాశంకకు సమాధానముగా దిగువ సూత్రము నుదాహరించినవారు.

సూ. "హృద్యపేక్షయాతు మనుష్యాధికారత్వాత్" ౧-౩-౨౪

వస్తుతః పరమేశ్వరుఁడు పరిచ్ఛేదము (కొలత) లేనివాడేయైనను మానవ హృదయము అంగుష్ఠమాత్ర మగుటఁజేసి పరమేశ్వరుఁడు నంగుష్ఠ మాత్రుఁడని చెప్పఁబడినది. ఉపాసనాశాస్త్రము ముఖ్యముగా మానవులఁ గూర్చి విధింపఁబడినందున మానవ హృదయమంతటి స్వరూపమును పరమ కరుణాసంపన్నుడగు పరమేశ్వరుఁడు మానవులు గావించు నుపాసనలు సిద్ధించుటకై దాల్చువాడు.

గజ తురగాదుల హృదయము ఏకవిధ పరిమాణము లేనిదగుటచే మానవ హృదయము అంగుష్ఠమాత్ర మగుటచేతను పరమాత్మ యంగుష్ఠ మాత్రుఁడని చెప్పఁబడెను.

బొటన వ్రేలుతో సరిదూగునది శివలింగ మగుటఁజేసి హృదయ లోని దహరాకాశము లింగస్వరూపమగుట నుపాసకుల హృదయ పరమేశ్వరుఁడు జ్యోతిర్లింగ స్వరూపముతో విరాజిల్లువాడని చునది.

ఇయ్యది నిర్గుణ బ్రహ్మవాదములకును విరుద్ధము. ఎట్లనఁగా? "ఈశాన" అను నభిధానము ఇందు విశదీకరింపఁబడుటచే లింగస్వరూపంబగునని నిరూపింపఁబడినందునను ఎట్టి నామరూపములు లేనట్టి నిర్గుణ బ్రహ్మమును పూర్వోక్త నామరూపములు సమర్థించునవి కాజాలవు గదా!

దేవాధికరణము

"ప్రమితాధికరణమున పరమేశ్వరోపాసనయందు మనుష్యులకు మాత్రము అధికారము కలదని "మనుష్యాధికారత్వాత్" అను సూత్రము వలన సూచింపఁబడినదిగదా! ఐతే "తతో దేవా రుద్రం నాపశ్యన్, తేదేవా రుద్రం ధ్యాయంతి" అను నథర్వశిరోవాక్యమున తెలియఁబడు దేవతలు చేయు పరమేశ్వరోపాసన మెట్లు పొసగు"నను ఆ శంకకు సమాధాన మీ సూత్రము.

సూ. "తదుపర్యపి బాదరాయణః సంభవాత్" ౧-౩-౨౫

ప్రశ్న: కర్మాచరణము ననుసరించి ఆ యా రూపములను తాత్కాలికముగా పొందుచు సహజమైన ఒకానొక ఆకారము లేనివారగుటచే విగ్రహము గలవారే పూజా స్తోత్ర ధ్యానాదుల నొనర్ప నర్హులగుటఁ జేసియు దేవతలకు శివోపాసనముఁ జేయు సామర్థ్యము లేదని విశదమగునది. మఱియు దేవతల నివాసము శివపదంబు నొకటే యగుటచే వారు పరమేశ్వర స్థలమును కోరువారు కారు. ఇంతియేగాక నుపనయన సంస్కార పూర్వక వేదాధ్యయనము వారికి విధింపఁబడకుండుటవలన వేదముఁ జదువనిది వేదార్థమును విచారించుట వలనుపడదు గావున వేదార్థ పరామర్శ లేనిది వేదాంత శ్రవణముకూడదు గావునను (దేవతలకు) బ్రహ్మజ్ఞానము సంభవింపదుగదా! ఇత్యాది సందర్భమువలన వారికి బ్రహ్మోపాసనమునం దధికారము లేదని యంగీకరింపవలయును కాదా?

ఉత్తరము: దేవతలును బ్రహ్మోపాసనమునం దధికారము గలవారు. ఎట్లనఁగా? పరమేశ్వర పదప్రాప్తి యనఁబడు మోక్షము నవ్వారికిని

కావలసినదేను; ఉభయుల నివాసమొక్కటి కాకాలదు. స్వర్గశబ్దము సుఖ వాచకంబైనను ప్రకరణవశమున విశేషార్థమును తెలుపునది.

పరబ్రహ్మంబగు శివుని స్థానమైతేనో పునరావృత్తిరహితము నిరతిశయము నగు సుఖము స్వరూపముగా కలదియగును. తారతమ్యము అవధి మున్నగు వికారములతో కూడిన సుఖముగల స్థలమున నుండు దేవతలు - అనవధికము అనుత్తమము నగు పరమేశ్వర స్థానమును కోరుట సహజముగదా! దేవతలకు వేదార్థము వేదాధ్యయన మవసరములేకయే స్ఫురించునది. అథవా పూర్వజన్మమున చదువఁబడిన వేదముఁ దగు నర్థమును విస్మరింపనివారగుటచే శివోపాసనమునకు వలయు పాండిత్యము కలుగువారు దేవతలని చెప్పవలెను. మఱియు శాస్త్రము దేవతా మానవ సాధారణముగా బ్రహ్మోపాసనమును విధించునట్టిది కావున దేవతలకును పరమేశ్వరోపాసనయం దధికారము గలదని తేటపడుచున్నయది.

సూ. "విరోధః కర్మణీతి చేన్న, అనేక ప్రతిపత్తే ర్దర్శనాత్"
౧-౩-౨౭.

ప్రశ్న: అనేక ప్రదేశములందు నొకే సమయమున గావింపఁబడు యజ్ఞయాగాది సత్కర్మలలో నాహ్వానింపఁబడు దేవతలకు ఒకానొక విగ్రహము కలదని యంగీకరించునెడ నవ్వారికి సర్వత్ర నొకే తడవ యజ్ఞాది సన్నిధి సరిపడనిదగుటచే కర్మాచరణమున విరోధము ఏర్పడునుగదా?

ఉత్తరము: సౌభరి మున్నగువారు విగ్రహము కలవారైన నేక కాలమున ననేక ప్రదేశములందు ప్రవేశించుట సుప్రసిద్ధము. మఱియు బ్రహ్మాది దేవతలు - శరీరేంద్రియాదులు కలవారై ఆయా స్థానములందు భోగ భేదములతో నివసింతురని వేదమూలకములగు పురాణేతిహాసములందు విశదీకరింపఁబడినది.

ఇందుకు మహాభారత వచనము తార్కాణముగా తెలియఁదగు

శ్లో॥ ఆత్మనో వై శరీరాణి - బహూని మనుజేశ్వర ।
యోగే కుర్యా ద్బలం ప్రాప్య - తైశ్చ సర్వాం మహీ

"యోగిపురుషుఁడు యోగబలమున బహు శరీరములలో ప్రవేశించి సమస్త భూమండలమును సంచరించువాఁడు."

సూ. "శబ్ద ఇతిచేన్నాతః ప్రభవాత్ ప్రత్యక్షానుమానాభ్యామ్"

౧-౩-౨౭.

ప్రశ్న : మీరు చెప్పినట్లు కర్మవిరోధము లేకున్నను ఇంద్రాది వైదిక శబ్దమునకు విరోధము సంభవించును. ఎట్లనఁగా ? దేవతలు విగ్రహము కలవారని యంగీకరించునెడ నవయవములు కలిగియుందురని చెప్ప వలసివచ్చును. అట్టితఱి "ఏద్ది సావయవమో అద్ది యనిత్యము" అను నియమము ననుసరించి దేవతల శరీరములు నిత్యములు కాజాలవని బోధపడును. కావున జనన మరణాదులు నవ్వారికి ననివార్యము లగుచున్నయవి. ఐతే దేవతలు జన్మించుటకు ముందు మరణించిన తరువాతను ఇంద్రాది వైదిక శబ్దములు సార్థకములు కాకుండును. అథవా అనిత్యములని చెప్పవలసి వచ్చును. పౌరుషేయములుగూడ నగును. పౌరుషేయములని యంగీకరించునెడ విధి నిషేధ వాక్యములు ప్రమాణములు కాజాలవు. ఇట్టి వాక్యములందు చెప్పఁబడిన సత్కర్మలున్ను ఫలప్రదములు కాకుండును.

ఇత్యాది సందర్భము ననుసరించి వైదికశబ్ద విరోధములను పోనాడుటకై దేవతలు విగ్రహము లేనివారనియే నిరూపింపవలసియుండును కాదా ?

ఉత్తరము : ఇంద్రాది వైదికశబ్దములు వ్యక్తివాచకము లగునెడ మీరు చెప్పినట్లు అర్థరాహిత్యము అనిత్యత్వాదులును చేకూరునని మేము నంగీకరింతుము. గవాదిశబ్దములవలె నింద్రాది శబ్దములును తత్తదాకారములను మాత్రము చెప్పునట్టివి. మఱియు వేదప్రోక్తములగు ఇంద్రాది శబ్దముల యుచ్చారణమాత్రమున నింద్రాది వ్యక్తులు సృజింపఁబడువారు.

కుమ్మరి తనలో స్ఫురించు ఘటాది శబ్దములవలన ఘటాద్యాకారములను స్మరించి ఘటాదులను నిర్మించునట్లు బ్రహ్మదేవుఁడును పూర్వ

కల్పములందు ఇంద్రాది దేవతలు నశించగా పిమ్మట కల్పాదులలో వైదిక ఇంద్రాది శబ్దములవలన తత్తదాకార విశేషములను భావించి మరియొక ఇంద్రాది దేవతలను పుట్టించువాఁడు. కావున ఇంద్రాది వ్యక్తులు నశించినను ఇంద్రాద్యాకారములు నశింపనందున తత్తద్వాచక శబ్దములన్నియు నిత్యములగునవి. ఇందువలన వైదికశబ్దమునకు ఎట్టి విరోధంబు గానరాదని తెలియునది. ఏతన్నిర్వచనమునకు దిగువ శ్రుతి స్మృతులు ప్రమాణము లగుచున్నయవి.

"వేదేన రూపే వ్యాకరోత్, సతా-సతీ ప్రజాపతి స్సభూరితి వ్యాహారత్సభూమి మసృజత" శ్రుతివాక్యము.

"చతుర్ముఖుఁడు వేదగత శబ్దములతో వ్యక్తులఁ దెలుపు నామరూపముల నేర్పఱచెను. ఎట్లనఁగా ? ప్రజాపతి "భూః" అని యుచ్చరించుట తోడనే భూమిని పుట్టింపఁగలిగెను."

శ్లో॥ సర్వేషాం చ సనామాని - కర్మాణిచ పృథక్ పృథక్,
వేదశబ్దేభ్య ఏవాదౌ - పృథక్ సంస్థాశ్చ నిర్మమే॥

"ప్రజాపతి - వేదగతములైన శబ్దములనుండియే దేవ మానవాది వ్యక్తులకుఁ దగు నామరూపములను వేరువేరు కర్తవ్యములను నివాసములను నిర్మింపఁగలిగినవాడయ్యెను."

సూ. "అత ఏవచ నిత్యత్వమ్" ౧-౩-౨౯

ప్రశ్న : వేదము నిత్యము అపౌరుషేయంబగునేని విశ్వామిత్రుడు మున్నగువారు మంత్రద్రష్టలని చెప్పుట పొసగదుగదా !

ఉత్తరము : బ్రహ్మదేవుఁడు - పూర్వకల్పములందు నశించిన విశ్వామిత్రాదుల యాకృతి విశేషములను వైదికశబ్దాధారముగా స్మరించి తాదృశ స్వరూపములుగల విశ్వామిత్రాదులను శక్తివిశేషములతో కూ వారిగా ప్రకృత కల్పములందు పుట్టించువాడు. కావుననే విశ్వామిత్ర మహర్షులు గురుసన్నిధిని వేదాధ్యయనము లేకయే సర్వమంత్రః

జనువువారగుదురు. ఇట్టితఱి విశ్వామిత్రాదులు మంత్రద్రష్టలని చెప్పుట సమంజసంబగును. మరియు వేదనిత్యత్వాదులకు ఎట్టి భంగమున్ను చేకూరఁ జాలదు.

సూ. "సమాన నామరూపత్వా చ్చావృత్తా వప్యవిరోధో దర్శనా త్స్మృతేశ్చ" ౧-౩-౩౦

ప్రశ్న : మహాప్రళయమున వేదము బ్రహ్మాదిదేవతలున్ను నశింతురు గావున ఇంద్రాది వైదిక శబ్దములు నిత్యములెట్లగును ?

ఉత్తరము : ప్రకృత సృష్టియందు దేవమానవాది విశేష వ్యక్తులు పూర్వ సృష్టిలోగల నామరూపములతో సమానములగు నామరూపములు కలిగియుందురు. అందువలన వేదనిత్యత్వ విరోధమేమియు లేదు. ఎట్లనఁగా? సర్వజ్ఞుఁడు, సర్వశక్తిమంతుఁడు, విద్యాధిపతి, ఆదికర్తయు నగు పరమేశ్వరుఁడు - పూర్వ పూర్వ ప్రపంచమును స్మరించియే మరియొక ప్రపంచమును నిర్మించువాడు. మరియు వేదములఁగూడ పూర్వరచనానుకూల ప్రగతి యుండునట్లు పుత్రకల్పుండగు చతుర్ముఖున కుపదేశించువాడు.

ఇందుకు ప్రమాణములు.

"సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్,
దివంచ పృథివీం చాంతరిక్ష మథో సువః" శ్రు.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం - యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" శ్రు.

శ్లో॥ అపఏవ ససర్జాదౌ - తాసు వీర్య మవాసృజత్,
తదండ మభవ ద్ధైమం - సహస్రాంశు సమప్రభమ్॥
తస్మిన్ జజ్ఞే స్వయం బ్రహ్మ - సర్వలోక పితామహః,
బ్రహ్మాణం విదధే పూర్వం - వేదా నస్మై ప్రయచ్ఛతి॥ స్మృతి.

ఇత్యాద్యుపపత్తివలన ప్రాకృత ప్రళయానంతర సృష్టియందును వేద నిత్యత్వము భంగపడుట లేదని విశదమైనది.

సూ. "మధ్వాదిష్వసంభవా దనధికారం జైమినిః" ౧-౩-౩౦

సూ. "జ్యోతిషి భావాచ్చ" ౧-౩-౩౧

మధువిద్య మున్నగువానియందు వస్వాదిదేవతలు ఉపాస్యులై ప్రాప్యులగుటఁజేసి దేవతలకిట్టి యుపాసనలయందు అధికారము లేదనియు "జ్యోతిషి" అనఁగా బ్రహ్మోపాసనయందు మాత్రము అధికారము కలదనియు జైమిని మహర్షిగారి యభిప్రాయము.

ఇఁక స్వమతము నీ క్రింది సూత్రముతో చెప్పుచున్నవారు.

సూ. "భావంతు బాదరాయణోఽస్తిహి" ౧-౩-౩౨

మధువిద్యాదులందును వస్వాదిదేవతలకు నధికారము గలదని వేదవ్యాసుఁడు నిర్వచించెను. ఎట్లనఁగా? వస్వాది దేవతలు వస్వాది దేవతాంతర్యామియగు బ్రహ్మము నుపాసించుట యుక్తమగునది. మరియొక కల్పమునందు వస్వాది దేవతారూపము లభించుట తదుపాసనమునకు ఫలంబగునని గుర్తెరుగవలెను.

"అసౌ వా ఆదిత్యో దేవమధు" అను వాక్యము మొదలుకొని ఆదిత్య వస్వాది నామరూప కృత్యములుగల బ్రహ్మము ఉపాస్యంబని యుపదేశింపఁబడినది. తరువాత "తత్తదూర్ధ్వ ఉదేతి నైవోదితో నాస్తమేతి" ఇత్యాది వాక్యముతో నామరూప క్రియలు లేనట్టి సూక్ష్మంబు నగు బ్రహ్మము ధ్యేయంబని నిరూపింపఁబడినది. ఏతద్ద్వివిధోపాసనఫలము - కల్పాంతరమున వస్వాది దేవత్వప్రాప్తియు పిమ్మట బ్రహ్మప్రాప్తియు నగుచున్నవి.

సహస్ర చతుర్యుగ కాలము బ్రహ్మదేవుని దినమగును. మరియు నంతియే కాలము రాత్రియగును. అట్టితటి స్వర్గమర్త్య పాతాళములు మాత్రము నశించును. మహర్లోకాదులు నశింపవు. ఇట్లు చతుర్ముఖుని శత వర్షములు గడచిన పిమ్మట నగు నూరు వత్సరముల కాలము ప్రాకృత ప్రళయ మనఁబడును. ప్రాకృత ప్రళయమున ప్రకృతిమాత్రము శేషించును. బ్రహ్మదేవుని దైనిక ప్రళయమున వేదములు లోపించవు కాని ప్రాకృత

ప్రళయమున - వేదములు, బ్రహ్మాండము, బ్రహ్మదేవుఁడును లోపించినను వేదపూర్వస్థితి ననుసరించి స్మృతి - పరమేశ్వరున కుండుటఁజేసి వేదనిత్యత్వమున కెప్పుడును భంగమును చెప్పరాదని సారాంశము.

అపశూద్రాధికరణము

"వ్యాద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్" అను సూత్రమున మనుష్యులకు బ్రహ్మోపాసనమందు సాధారణముగా అధికారము కలదని యేర్పడగా వారిలో విశేషము నీ సూత్రముతో చెప్పుచున్నవారు.

సూ. "శుగస్య తదనాదర శ్రవణా త్తదాద్రవణాత్ సూచ్యతేహి" ౧-౩-౩౩

ఈ సూత్రమును నిర్వచించుటకై ఛాందోగ్యమునం దొక యాఖ్యాయికను గాననగును. ఎట్లనఁగా? జానశ్రుతి యనఁబడు క్షత్రియ మహారాజు - స్వరాష్ట్రమున గ్రామములలో నగరములందును మార్గములలో నడవులయందును పుణ్యతీర్థములయందు నన్యప్రదేశము లందంతటను బాటసారులకు ననాథులకును శీతోష్ణాదిబాధలు తగ్గుటకు వస్త్రముల నన్నోదకములను లభింపఁజేయుటకై యనేక భవనములను కట్టించెను. ఇవ్విధము కర్మయోగముతో దురితక్షయముఁ గాంచిన జానశ్రుతికి బ్రహ్మజిజ్ఞాస కలుగవలెనని మహర్షులు కొందరు హంస రూపముఁదాల్చి మహారాజు నిద్రించు రాత్రివేళ మేడలోని కేతెంచి క్రిందివిధము సంభాషించిరి.

అందు మొదటి హంసను రెండవ హంస "భల్లాక్షమా?" అని సంబోధించి "ఈ జానశ్రుతి గావించిన అన్నదానాది పుణ్యముల ప్రభావము స్వర్గపర్యంతము వ్యాపించినది. అట్టి పుణ్యఫలమునందు నీకు నపేక్ష కలిగెనేని దహించిపోవుదువు" అనఁగా మొదటిహంస "ఈ మహారాజు రైక్వ మహర్షివలె గొప్ప ప్రభావము గలవాఁడని భావింతువా? నిజముగా రైక్వుఁడే బ్రహ్మజ్ఞుఁడగువాడు. మానవ సామాన్యస్థితి నతిక్రమించి

బండిపై సంచరించుచుండును. జానశ్రుతి యైతేనో సుకృతికాని బ్రహ్మజ్ఞుఁడు కాడుగదా! అందువలన నీతని మహిమ రైక్వుని ప్రతిభవలె దహించునదికాదు” అని సంభాషించెను.

రెండవ హంస - ఎవఁడా రైక్వుఁడు? ఎట్టివాడు?

మొదటి హంస - ప్రాణులందరి సుకృతములు నవ్వారి విజ్ఞానంబు నెవని కర్మ సముచ్చితమగు జ్ఞానములో చేరునో నట్టి మహానుభావుఁడే రైక్వుఁడనఁబడును. ఈతని జ్ఞానప్రభావము సహింపరానిది కాని యీ అకించనుఁడగు జానశ్రుతియొక్క మహిమ శ్రేష్ఠము కాజాలదు.

ఇట్లు వక్కాణించి మహర్షులు సౌధమునుండి వెడలగా నద్దాని నంతయు నాకర్ణించిన జానశ్రుతి యా రాత్రి నతికష్టముగా గడపి యొకా నొక రాజభటునకు రైక్వ లక్షణములఁ దెలిపి యాతని తోడ్కొని రమ్మనెను.

ఒకానొకచో తన మేను గోకుచు బండిక్రింద నుండు రైక్వునిగాంచి యాతని పలుకరింపఁజాలని రాజదూత రాజ సన్నిధి నేతెంచి రైక్వుని సమాచారము నెఱిగింపగా రాజు స్వయముగా బయలుదేరి రైక్వునిఁజేరి యిట్లు ప్రార్థించెను.

“ఆరువందల ఆవులను కంఠహారమును వడిగల గుఱ్ఱములతో కూడిన రథమును తమకు సమర్పించెదను. నాయందనుగ్రహము గలవారై తమ యుపాస్యదేవతను గురించియు ఉపాసనా పద్ధతి నుపదేశింపుడు!”

రైక్వుడు - ఈ హారము రథము గోవులును నీకే యుండుగాత! ఇట్టి యల్పధనముతో సంతృప్తిఁబడయజాలను. మఱియు గృహస్థుడను కాకుండుటఁజేసి యివ్వానిని కాపాడుటకు వలయు సౌకర్యము లేకున్న యది. స్వార్థమునకై సరిపడని ధనము నర్పింపఁజూచు నీకు బ్రహ్మవిద్యానిష్ఠ యేర్పడునది కాదు.

జానశ్రుతి - గోసహస్రంబును కంఠహారాదులను వివాహమునకై కన్యను నివసించుటకై గ్రామమును సమర్పించెదను కావున నన్ననుగ్రహింపుడు!

రైక్వుఁడు - జానశ్రుతే! నీ చెప్పినవన్నియు తీసికొనిరమ్ము! ఏతత్సమర్పణముద్వారా నన్ను బ్రహ్మవిద్యోపదేశాభిముఖుని గావించితివి! ధన్యుడవైతివి;

ఋషులు - హంసరూపముతో గావించిన స్వనింద నాకర్ణించిన జానశ్రుతికి శుక్ - అనగా దుఃఖము కలిగినందున రైక్వుని గురించి యా ద్రవణము (వడివడిగా బయలుదేరుట) సంభవించుటచే జానశ్రుతి మహారాజును రైక్వుఁడు "శూద్ర" యని సంబోధింపవలసివచ్చెను. కాని జాతిఁ బురస్కరించుకొని కాదు. ఐతే శూద్రులు ఉపనయన సంస్కారము లేని వారగుటచే వారికి వేదాధ్యయనాధికారము గానరానందున బ్రహ్మోపాసనమునకు వలయు బ్రహ్మగుణ పరిజ్ఞానము లేకుండును. పురాణేతిహాసములైతేనో వేదోపబృంహణములగుటచే వేదముద్వారా బ్రహ్మజ్ఞాన సాధనములగునట్టివి. శూద్రులకు పురాణ శ్రవణమువలన కలుగు జ్ఞానము పాపక్షయమును మాత్రము గావించును. విదురుఁడు ధర్మవ్యాధుఁడు మొదలగువారు బ్రహ్మనిష్ఠులెట్లైరనఁగా? అవ్వారికి పూర్వజన్మలం దేర్పడిన విజ్ఞానము నిండుగా నుండుటచే బ్రహ్మోపాసనార్హత కలిగియుండిరని తెలియవలెను.

సూ. "క్షత్రియత్వావగతేశ్చ" ౧-౩-౩౪

ఇఁట జానశ్రుతిమహారాజు - క్షత్రియుఁడని విదితమగును. ఎట్లనఁగా? రైక్వజానశ్రుతుల సంవాదము ప్రారంభమైనపుడు - జానశ్రుతి పౌత్రాయణుఁడని పేర్కొనఁబడినది. "జనశ్రుతి మహారాజు కుమారుఁడు జానశ్రుతి యనఁబడుననియు పుత్రుఁడనఁబఁడుగువాని గోత్రమునందు జన్మించినవాడు పౌత్రాయణుఁడగుననియు" నిర్వచనము.

యాచకులకు విరివిగా అన్నవస్త్రాదుల నొసగుటయు వసతి గృహములను నిర్మింపఁజేయుటయు రైక్వమహర్షికి కన్యా గ్రామ రథాశ్వ గజములను సమర్పించుటయు అంతఃపుర రక్షకుఁడగు క్షత్తయనువానిఁ బిలచుటయు క్షత్రియుని లక్షణములని గమనింపవలెను.

సూ. "ఉత్తరత్ర చైత్రరథేన లింగాత్" ౧-౩-౩౫

సంవర్గ విద్యయందు రైక్వజానశ్రుతి సంవాదానంతర సందర్భమున బ్రాహ్మణ క్షత్రియులకు సంబంధము కనఁబడుచున్నయది. ఎట్లనఁగా ? అభిప్రతారి యనఁబడు చైత్రరథుఁడు కాపేయుఁడను బ్రాహ్మణుని యాజకునిగా నెన్నుకొనెను. చిత్రరథ వంశీయులైన రాజులకు కాపేయులగు బ్రాహ్మణులు పరంపరగా యాజకులైరని శ్రుతియందు గమనింపనగును.

ఇందువలన రైక్వుఁడు బ్రాహ్మణుఁడనియు జానశ్రుతి క్షత్రియుఁడనియు ఇవ్వారికి గురుశిష్య సంబంధము సమంజసంబగుననియు "శూద్ర" యని సంబోధింపఁబడిన మాత్రమున జానశ్రుతి శూద్రుఁడు కాజాలడనియు సారాంశము.

సూ. "సంస్కార పరామర్శా త్తదభావాభిలాపాచ్చ" ౧-౩-౩౬

ఇద్దానికి చాంధోగ్యమునగల కథానిక నుదాహరణముగా గ్రహింపనగును. సత్యకాముడు అనువానికి తండ్రి పిన్నతనముననే గతించినందున తన గోత్రమేమిటో తెలిసికొనవలెనని కోర్కె యుదయింపగా నొకప్పుడు గురుకులవాసమును గావింపఁదలచి "అమ్మా ! మన గోత్ర మెద్ది" అని ప్రశ్నించెను.

అట్టితఱి వానితల్లి "నాయనా ! చిన్నదాననై యున్నపుడు పతి పరిచర్యఁజేయుచు యువతినై యున్నపుడు పతి యనుగ్రహమున నిన్నుఁబడసితిని. కావున మన గోత్రము నడుగుటకు వఱయు నవకాశము నీమధ్య లభింపలేదు. నా పేరు జాబాలయందురు. ఐతే గురుసన్నిధి కేగినపుడు నేను సత్యకాముడను జాబాలుడనని వచింపుము!" అనఁగా సత్యకాముఁడు బయలుదేరి గౌతముఁడను మహానుభావునాశ్రయించి యిట్లు ప్రార్థించెను.

"పూజ్యులైనతమసన్నిధిని బ్రహ్మచర్యాశ్రమమునుగడుపువాడను"

"నీగోత్రమెద్ది" యని గౌతముఁడు ప్రశ్నింపగా "నా తల్లిగూడ చెప్పనందున గోత్రము నాకు తెలియలేదు. ఆమె జాబాలయని పేర్కొనఁబడుచున్నయది" అని సత్యకాముఁడు వచింపగా గౌతముఁడు "వీడు యథార్థమును చెప్పుచున్నందున బ్రాహ్మణుఁడే కావచ్చు"నని నిశ్చయించి

సత్యకామునకు నుపనయన సంస్కారముఁగావించి తన గోసమూహములో కృశించియున్న నాల్గునూర్ల ఆవులను కాపాడుచుండు"మని యాజ్ఞాపించెను. అప్పుడు సత్యకాముఁడు గురునాజ్ఞ శిరసావహించి నాల్గునూర్ల ఆవులు వేయియగువరకు తమ సన్నిధికి రానని ప్రతిజ్ఞఁజేసి సమృద్ధమగు ఒకానొక యరణ్యమునకు నవ్వానిఁ గొంపోయి పోషించుచు కొన్ని వత్సరములఁ గడుపగా సత్యకాముని గురుశుశ్రూషవలన సంతసించిన నలుగురు దేవతలు - ఋషభ, అగ్ని, హంస మద్గు=అనువారు సత్యకామునకు సాక్షాత్కరించి పదునారు కళలతో నిండియుండు బ్రహ్మవిద్య నుపదేశించిరి. తరువాత సత్యకాముఁడు వేయిఆవులఁ గైకొని గౌతముని సమీపింపగా గౌతముఁడు సత్యకాముని ముఖవైఖరిఁ గమనించి "ఎవరు నీకు బ్రహ్మవిద్య నుపదేశించి" రని ప్రశ్నించెను. "దేవతలు ప్రసన్నులై నాకు బ్రహ్మవిద్య నుపదేశించిరి కాని యంతమాత్రమున సంతృప్తిఁజెందువాడను కాను. తాము మరల నను గ్రహింపు"డని ప్రార్థింపగా గౌతముఁడు దేవతలు చెప్పినట్లుగానే షోడశకళా సమన్వితముగా బ్రహ్మవిద్య నుపదేశించినవాడు".

ఈ సందర్భమున నుపనయన సంస్కారము పరామర్శింపఁబడుటవలన "న శూద్రే పాతకం కించిన్న చ సంస్కార మర్హతి" "శూద్రునకు మాంస భక్షణాది దోషములేదు గావున నాతడు ఉపనయనాది సంస్కారములఁ బొందవలసిన యవసరము గానరాదు" అను ప్రమాణమువలనను శూద్రునకు నుపనయన సంస్కారము లేనందున వేదాధ్యయనము తత్పూర్వక బ్రహ్మవిచారంబు ననర్హము లగుచున్నవి.

సూ. "తదభావ నిర్ధారణే చ ప్రవృత్తేః" ౧-౩-౩౭

సత్యకాముఁడు యథార్థమును వచించినవాడు కావుననే శూద్రుఁడు కాడని నిశ్చయించి యుపనయనమును గౌతముఁడనుశాసించి బ్రహ్మవిద్యోపదేశమునఁ బ్రవృత్తుడయ్యెను.

ప్రశ్న : శిశువునకు నుపనయనము లేకున్నను వేదాధ్యయన నిషేధము వికల్పితమా ? నిర్ధారితమా ? "న బ్రహ్మాభివ్యాహారే దన్యత్ర

స్వధ్యాయనాత్" "పితృమేధమునందు దక్క నితరకర్మలందు ననుప నీతుఁడు వేదము నుచ్చరింపరాదు" అను ప్రమాణము ననుసరించి కల్పితంబని తెలియును గదా! అందువలన శూద్రునకు ననుపనీతునకు పాకయజ్ఞాదులందు వేదోచ్చారణము నిషేధింపఁబడుచున్నది కాని బ్రహ్మవిద్యోపయుక్త మహావాక్యాది శ్రవణమునఁగాదని యంగీకరింపవలెనుగాదా?

ఉత్తరము :

సూ. "శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్" ౧-౩-౩౮

"తస్మా చ్ఛూద్ర సమీపే నాధ్యేతవ్యమ్" అను ప్రమాణము శూద్రునిచెంత వేదముఁ జదువఁగూడదని తెలుపుచున్నందున వేదశ్రవణమునకుఁగూడ నధికారములేని శూద్రునకు వేదపఠనమునకు నధికార మెక్కడినుండి వచ్చును ?

సూ. "స్మృతేశ్చ" ౧-౩-౩౯

"అథహాస్య వేదముపశృణ్వత స్త్రపుజతుభ్యాం శ్రోత్రప్రతిపూరణముదాహరణే జిహ్వాచ్ఛేదో ధారణే శరీరభేదః"

"శూద్రుఁడు వేదమును వినినచో నవ్వాని చెవిని సీసము లక్క కటిగించి పోయవలెను. వేదము నుచ్చరించిన యెడల నాలుకఁ గోయవలెను. హృదయమున కొంత నిలిపినచో శరీర వియోగమును గావింపవలెను" అను స్మృతిప్రమాణము శూద్రునకు వేదాధ్యయనాదులను తొలగించినది. వేదపఠనాదులకు వలయు నర్హత లేమింజేసి వేదార్థమును విచారించుట యుక్తంబగుటలేదు. వేదార్థమును విచారింపనిది ధర్మాధర్మ నిర్ణయముకాదు గావున ధర్మానుష్ఠానము సంభవింపఁజాలదు. ధర్మానుష్ఠానములేనిది చిత్తశుద్ధి కలుగఁజాలనిదగుటచే వేదాంత విచారంబు ననుపయుక్తంబగునది.

కంపనాధికరణము

సూ. "కంపనాత్" ౧-౩-౪౦

ఇవ్విధము ప్రసంగవశమున బ్రహ్మవిద్యాధికారమును నిరూపించి ప్రకృతమగు శివతత్త్వముఁ గూర్చి వాక్రుచ్చుచున్నవారు.

కఠవల్లియందు అంగుష్ఠ ప్రమితపురుష ప్రకరణమున "యదిదం కించ జగత్సర్వం ప్రాణఏజతి నిఃసృతమ్, తం మహద్భయం వజ్రముద్యతం, య ఏతద్విదు రమృతాస్తే భవంతి" "ఈ చరాచరమంతయు ప్రాణము నుండి బయటపడి జీవించుచున్నది. ప్రాణమువలన నగు భయము ఎత్తఁబడిన వజ్రాయుధమువలె ప్రాణులనందరిని స్వకార్య తత్పరులఁ జేయుచుండును. ఇట్టి ప్రాణము నెవరు కనుగొందురో వారు ముక్తు లగుదురు"

ఇఁట భయపెట్టునది పరమేశ్వరుఁడా? ఇతరమా? అని సంశయము.

ప్రశ్న : సకలజగమున కభయము నొసగు మధుర స్వభావము గలవాఁడు పరమకారుణికుఁడు నగు పరమేశ్వరుఁడు జగత్కంపన హేతువు కాజాలడు. కావున నిట వజ్రశబ్దము వినఁబడుటచే వజ్రాయుధము కంపన హేతువని చెప్పనగును. అథవా ప్రాణవాయువు జగత్కంపన హేతువు కాదగును. ప్రాణవాయువు దేహచలనమునకు కారణమగుటచే తత్ప్రయుక్తముగా నీ జగచ్ఛరీరమంతయు కదలుచుండును. మరియు వాయువు ముందుగా నేర్పడు మెఱపు, తరువాత నుపయోగింపఁబడు వజ్రాయుధము మహాభయకారణము కానగును. "వాయురేవ వ్యష్టి ర్వాయురేవ సమష్టిరప పునర్మృత్యుంజయంతి య ఏవం వేద" అను శ్రుతివాక్యంబు - వాయు విజ్ఞానమువలన నమృతత్వము చేకూరునని తెలుపుచున్నందున వాయువైనను జగచ్ఛాసకము కాదగును కాదా?

ఉత్తరము: సకలజగత్కంపన హేతువుపరమేశ్వరుఁడేను;ఎందుకనఁగా? పరమేశ్వరుఁడు శాసకుఁడగుటచే నాతని శాసనభయమువలననే నిషిద్ధములను విడనాడి విహితముల నాచరించువార మగుదుము. వాయ్వాదులును పరమేశ్వరుని శాసనమువలన భయపడుచు తమతమ కర్తవ్యములను నెరవేర్చుచుందురు గదా! "భీషాఽస్మాద్వాతః పవతే" ఇత్యాది శ్రుతివాక్యము లిందుకు ప్రమాణము లగుచున్నయవి.

పరమేశ్వరుఁడు పరమకారుణికుఁడై కల్యాణమూర్తియైనను శాసకుడగుటఁజేసి భయకారణుఁడు నగువాడు. సకల జగదధికారియు పరమేశ్వరుఁడేను.



మహారాజపోషకులు :

బ్రహ్మశ్రీ, లోకారాధ్యులైన, అంబారిపేట విశ్వనాథారాధ్యులవారు,

సౌ. వారి సతీమణి, (మెదక్ జిల్లా) లక్ష్మీపురము,

నవనవోన్మేష ప్రోత్సాహము గలవారు, మత్సహోదరప్రాయుల

జ్యోతిరధికరణము

సూ. "జ్యోతి ర్దర్శనాత్" ౧-౩-౪౧

విషయవాక్యము - (ఛాందోగ్యము - ప్రజాపతి విద్య)

"ఏష సంప్రసాదోఽస్మా చ్ఛరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుప సంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే, స ఉత్తమః పురుషః"

"ఈ జీవాత్మ-శివోపాసనా పూర్ణతనుగాంచి కడపటి శరీరమునుండి బయలువెడలి పరమేశ్వరు నాశ్రయించి నిజరూపము నావిష్కరింపఁజేసి కొనును. అట్టి పరంజ్యోతియే ఉత్తమ పురుషుఁ డనఁబడుగును."

ఇఁట ముక్తప్రాప్యమగు పరంజ్యోతి-పరమేశ్వరుఁడా? మూర్త్యాత్మ యగు నారాయణుఁడా? అని సందేహము.

ప్రశ్న: ఛాందోగ్యమున ప్రజాపతి విద్యయందుగల ఈ వాక్యమున పరంజ్యోతి పురుషోత్తమ శబ్దముచే నిర్దేశింపఁబడినది. కావున ముక్త ప్రాప్యుఁడు నారాయణుఁడే యని బోధపడును. మరియు భగవద్గీతల యందు "ద్వావిమౌ పురుషౌ లోకే - క్షర శ్చాక్షర ఏవచ, క్షరః సర్వాణి భూతాని - కూటస్థోఽక్షర ఉచ్యతే" "జీవాత్మ - క్షరుఁడనియు, అక్షరుఁ డనియు రెండు విధములు గలిగియుండువాడు. సంసారియగు సామాన్య ప్రాణి - క్షరుఁడనఁబడును. సంసారబద్ధుఁడు కానివాడై ముక్తుఁడగు వాడు - అక్షరుడనఁబడును" "ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః, యో లోకత్రయ మావిశ్య - బిభర్త్యవ్యయ ఈశ్వరః" "క్షరాక్షర పురుషులకన్న వేరగు నుత్తమ పురుషుఁడు పరమాత్మ యనఁబడును. ఇట్టి పరమేశ్వరుఁడు లోకత్రయమునఁ బ్రవేశించి జగమును వహించువాడు" "యస్మాత్ క్షర మతీతోఽహ మక్షరాదపి చోత్తమః, అతోఽస్మి లోకే వేదేచ - ప్రథితః పురుషోత్తమః" "ఎందువలన క్షరాక్షర పురుషుల నతిక్ర

మించినవాడనో అందువలన లోకమునందును వేదమునను పురుషోత్తముఁడ నని ప్రసిద్ధుఁడనైతిని" ఇట్లు భగవానుఁడు ఉపదేశించెను. మఱియు "దేవకీ నందనః శౌరిః - శ్రీపతిః పురుషోత్తమః" "హరిర్యథైకః పురుషోత్తమః స్మృతః - మహేశ్వర స్త్ర్యంబక ఏవ నాపరః" ఇత్యాదిని పురుషోత్తమ పదము విష్ణుపరముగా వ్యవహరింపఁబడుటను ముక్తప్రాప్యమగు పరంజ్యోతి నారాయణుఁడే యగును కాదా ?

ఉత్తరము : ఇట ముక్తప్రాప్యమగు పరంజ్యోతి - పరశివుఁడే యగుచున్నవాడు. ఎందుకనఁగా ? పరశివప్రాప్తి యగువానికే పునరావృత్తి యుండజాలదని బహుప్రమాణములు చాటుచున్నయవి. తదితరుల నాశ్రయించువారికి పునర్జన్మాదులెట్లు లేకుండును ? పురుషోత్తమ శబ్దము నారాయణునియందు పురుషులనఁబడు జీవాత్మలకన్న నధికుఁడను నర్థముతో రూఢి గలిగియున్నదని గ్రహింపవలెను. బ్రహ్మమేధమునందు "వేష్టితుం పురుషోత్తమమ్" అనుచో పురుషోత్తమ శబ్దము పరమేశ్వర పరముగా నిరూపింపఁబడినది.

పురుషోత్తమ పద రూఢ్యర్థము - శివేతర ప్రాప్తివలన జన్మరాహిత్యము కలుగఁజాలదను నర్థమునకు విరుద్ధమగుటను జన్మరాహిత్యమును కలుగఁజేయు సామర్థ్యము నారాయణాది మూర్త్యాత్మలయందు లేకుండుటను పురుషోత్తమ పదమునకు యౌగికార్థమును పరబ్రహ్మపరముగా నిర్ణయింపవలెను.

"అతోఽస్మి లోకే వేదేచ - ప్రథితః పురుషోత్తమః" అను గీతావాక్యముఁ దగు సమన్వయము - "ఊర్ధ్వమూల మధఃశాఖ - మశ్వత్థం ప్రాహు రవ్యయమ్" అను వచనముతో సంసార వృక్షమును పేర్కొని "తతః పదం తత్ పరిమార్గితవ్యం - యస్మిన్ గతా న నివర్తంతి భూయః" పునరావృత్తి లేకుండుటకై సర్వాతీతమగు పరబ్రహ్మము నుపాసింపవలెనని

చెప్పియు "తమేవ చాద్యం పురుషం ప్రపద్యే" సర్వోత్తముఁడైన పురుషునే నేను ధ్యానించుచున్నాననియు భగవానుఁడగు శ్రీకృష్ణుఁడు వాక్రుచ్చినవాఁడు.

ఇట్లు ముముక్షువులకు శ్రీకృష్ణునకు నుపాస్యుఁడుగా చెప్పఁబడిన పరమ పురుషుడే క్షరాక్షరోభయాతీతుండగునని "ఉత్తమః పురుషస్త్వన్యః" అను శ్లోకముతో వర్ణింపఁబడినవాఁడు. ఇట్టి సందర్భము ననుసరించు "యస్మాత్ క్షర మతీతోఽహమ్" అను శ్లోకంబును పరశివు నెట్లు ప్రతిపాదింపకుండును ?

భగవద్గీతలందు భగవానుఁడు "శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్" అను న్యాయము ననుసరించి యభేదభావనా దార్ఢ్యముతో పురుషోత్తముడనుగా ప్రఖ్యాతిఁ బొందితినని చెప్పిన వాక్యము లోకమునందును వేదమునందున నుపపాదింపఁబడినది కావున ముక్తప్రాప్యమగు పరంజ్యోతి-పరమేశ్వరుఁడేను.

అర్థాంతరత్వాదివ్యపదేశాధికరణము

సూ. "ఆకాశోఽర్థాంతరత్వాది వ్యపదేశాత్" ౧-౩-౪౨

"ఆకాశో హవై నామ నామరూపయో ర్నిర్వహితా, తే యదంతరా తద్బ్రహ్మ, తదమృతం, స ఆత్మా" ఛాందోగ్యము.

ఇఁట చెప్పఁబడిన ఆకాశము - పరమేశ్వరుఁడా ? ఆకాశమా ? జీవాత్మయా అని సందేహము !

ప్రశ్న : ప్రాణులందరికి నవకాశమును కలుగఁజేయునదై నామ రూపములఁ నేర్పఱచునట్టి యాకాశము ఇఁట ప్రతిపాదింపఁబడుచున్నదని చెప్పవలెను. అథవా "అనేన జీవేనాఽత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అను ప్రమాణము ననుసరించి జగద్గతములైన నామరూప

ములను జీవాత్మద్వారా వ్యక్తపఱచువాడు పరమాత్మయని తెలియుటచే జీవాత్మయని యంగీకరింపనగును కాదా ?

ఉత్తరము : ఇఁట నాకాశ శబ్దముతో పరమేశ్వరుఁడే నామరూపముల నేర్పరచువాడుగా ప్రతిపాదింపఁబడుచున్నవాడు. ఎందుకనఁగా ? అమృతత్వాదులగు పరమేశ్వర ధర్మములు భూతాకాశమునకు సంభవింపఁజాలవు. జీవాత్మకు నమృతత్వాది ధర్మములు పొసగకుండును. కావున పరమేశ్వరుఁడే ఆకాశ మగునని గ్రహింపవలెను.

"ఓయీ? తత్త్వమస్యాది వాక్యములయందు జీవేశ్వరులకు నైక్యము చెప్పఁబడుచున్నందున జీవునికన్న వేరు పరమాత్మయని యఁగీకరింపరాదు గదా" యను నాశంకకు సమాధానము దిగువ సూత్రము !

సూ. "సుషుప్త్యుత్క్రాంత్యో ర్భేదేన" ౧-౩-౪౩

"ప్రాజ్ఞేనాఽఽత్మనా సంపరిష్వక్తో న బాహ్యం కించనవేద నాంతరమ్"

"ప్రాజ్ఞేనాఽఽత్మనాఽన్వారూఢ ఉత్సృజన్ యాతి"

"గాఢనిద్రయందు పరమాత్మతో నేకీభవించువాడగుటచే నింద్రియ చేష్టితములను మనోవ్యాపారమును జీవాత్మ యెంతమాత్రము గురుతెఱుగఁజాలకుండును. మఱియు జీవుఁడు శరీరమును విడచుతఱి పరమాత్మచే నధిష్ఠింపఁబడినవాడై లోకాంతరములకు వెళ్ళును."


ఇవ్విధము సుషుప్తియందు ఉత్క్రాంతియందును జీవుఁడు-బాహ్యాంతర విషయజ్ఞానము లేనివాడగుటయు అట్టితఱిని పరమేశ్వరుఁడు జీవభిన్నుడుగా ప్రాజ్ఞశబ్దముచే చెప్పఁబడుటయు జీవేశ్వరాద్వైతమును సమర్థించుటలేదు. కావున పరమాత్మయే ఇఁట నాకాశమగును.

సూ. "పత్యాది శబ్దేభ్యః" ౧-౩-౪౪

"సర్వస్య వశీ సర్వస్యేశానః సర్వస్యాధిపతిః" ఇత్యాది వచసు వినఁబడు పత్యాది శబ్దములవలన పరమాత్మ జీవభిన్నుడని బోధపడు.

యది. ఇక్లే "స న సాధునా కర్మణా భూయాన్ నో ఏవాసాధునా కనీయాన్ ఏష సర్వేశ్వర ఏష భూతాధిపతి రేష భూతపాలః" ఇత్యాది వాక్యములు - తరువాత నుపయుక్తములై యున్నయవి. "పశూనాం పతయే వృక్షాణాం పతయే" ఇత్యాది వాక్యములవలనను పరమేశ్వరునకు జగదాధిపత్యము ప్రసిద్ధంబగుచున్నది కాని జీవాత్మ కెచటను గానరాదు కావున జీవభిన్నుండగు పరమేశ్వరుఁడే ఆకాశమనఁబడుచున్నవాడు.

ఇయ్యది ప్రథమాధ్యాయగత తృతీయపాదము.



మహారాజపోషకులు:

కీ॥ శే॥ శ్రీ దొంతుల గుండయ్య శ్రేష్ఠిగారు, దొంతుల లక్ష్మీబాయి (దంపతులు)

నివాసము - వాసవీ భవన్, దేవీరోడ్, నిజామాబాద్. (ఆం. ప్ర.)

కాశీ క్షేత్రమున సంవత్సరము నివసించి సమస్త తీర్థములను సేవించి వైశ్య శిఖామణులుగా కీర్తి గడించిన పుణ్య సతీపతులు.

శ్రీ పార్వతీరాజరాజేశ్వరాభ్యాన్నమః

శ్రీ నీలకంఠ భగవత్పాదారాధ్యకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్రభాష్యము.

(ఆంధ్రీకరణము)

ప్రథమాధ్యాయగత చతుర్థపాదము

తృతీయపాదమున స్పష్టాస్పష్ట బ్రహ్మలక్షణములను ప్రతిపాదించు వాక్యములు పరామర్శింపఁబడినవి. ఇందు నస్పష్ట బ్రహ్మలక్షణములు గల వేదాంత వాక్యములు కొన్ని విచారింపఁబడుచున్నయవి.

సూ. "ఆనుమానిక మప్యేకేషా మితిచేన్న, శారీర రూపక విన్యస్త గృహీతేః, దర్శయతి చ" ౧-౪-౧

కఠశాఖీయులు పఠించు సందర్భములో గల యవ్యక్తము సాంఖ్యుల ప్రధానము కాజాలదు. ఎందుకనఁగా? రథికుఁడు రథము మొదలగు రూపకములలో చేరు శరీరము అవ్యక్తమనఁబడుగును. శ్రుతియందు నిట్లే చెప్పఁబడినది యని సూత్రార్థము.

కఠశాఖీయుల పాఠము—

"ఇంద్రియేభ్యః పరాహ్యర్థా - అర్థేభ్యశ్చ పరం మనః,
మనసస్తు పరాబుద్ధి - ర్బుద్ధే రాత్మా మహాన్ పరః ।
మహతః పర మవ్యక్త - మవ్యక్తాత్ పురుషః పరః,
పురుషా న్నపరం కించిత్ - సా కాష్ఠా సా పరాగతిః॥

ఇఁట మహత్తునకన్న నతీతముగా చెప్పఁబడిన నవ్యక్తము కపిల తంత్రోక్తమగు ప్రధానమా? శరీరమా? అని సంశయము.

ప్రశ్న : ప్రధానమనఁదగును. ఎట్లనఁగా? "మహత్తు అవ్యక్తము పురుషుఁడు" అను పదములు సాంఖ్యశాస్త్రమునందే ప్రసిద్ధములైనవి. అవ్వానినే ఈ శ్రుతియందు పేర్కొనుటవలన పరమపురుషుని ప్రసక్తియే

లేదని చెప్పవచ్చును. కావున సాంఖ్యమగు ప్రధానమేగాని శరీరము కాజాలదు.

ఉత్తరము : ఈ సందర్భమునకంటెఁ బూర్వమునందు "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు, బుద్ధింతు సారథిం విద్ధి - మనః ప్రగ్రహమేవచ । ఇంద్రియాణి హయానాహు - ర్విషయాంస్తేషు గోచరాన్" "ఆత్మను రథికునిగాను శరీరమును రథముగాను బుద్ధిని సారథిగాను మనస్సును పగ్గముగాను ఇంద్రియములను గుఱ్ఱములుగాను విషయములను మార్గములుగాను గ్రహింపుము!" వశీకరణమునకై రథికరథాది రూపకములను నిరూపించుతఱి పరిశిష్టమగు సూక్ష్మశరీరము - అవ్యక్త శబ్దముతో గ్రహింపఁబడినది. ఇంద్రియములు మొదలుకొని పరపురుషునివరకు చెప్పఁబడిన తత్త్వములలో ఒకదానిని మరియొకదానియందు నియమింపవలెనను యభిప్రాయముతో "ఇంద్రియములకన్న శ్రేష్ఠములు విషయములు" అను క్రమము చెప్పఁబడినది.

ఏతదనంతరమున్ను శ్రుతియందు ప్రతిపాదింపఁబడిన యంశమును గాననగును.

"యచ్ఛే ద్వాఙ్మనసీ ప్రాజ్ఞ - స్తద్యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని,
జ్ఞాన మాత్మని మహతి - నియచ్ఛే త్తద్యచ్ఛే చ్ఛాంత ఆత్మని"

మనస్సునందు వాగాది ఇంద్రియములను విషయములనుండి మఱల్చి నియమింపవలెను. బుద్ధియందు మనస్సును ఆత్మయందు బుద్ధిని పరమాత్మలో ఆత్మను నిగ్రహింపవలెను. గుఱ్ఱములఁబోలు ఇంద్రియములకన్న మార్గసన్నిభములగు విషయములు ప్రబలములగునవి. జితేంద్రియుఁడును విషయములు దరినుండునేని ఇంద్రియములను వశపఱచుకొనఁజాలఁడనియు మనస్సు చంచలమగునెడల విషయములు ఇంద్రియదూరములైన నుపయోగము లేదనియు బుద్ధి నిశ్చయాత్మకము కాదేని ప్రబలమైన మనస్సుగూడ ప్రయోజనకారి కాజాలదనియు సర్వంబు జీవేచ్ఛాధీనమగుటఁజేసి బుద్ధికంటె నతీతుఁడు జీవాత్మయనియు జీవుడు చేయు పురు

పార్థ ప్రవృత్తులన్నియు శరీరము నాశ్రయించి యుండుననియు పరమేశ్వరుఁడు సర్వాంతర్యామియగుటఁజేసి ఇంద్రియ మనో బుద్ధ్యాత్మ శరీరముల కన్న నతీతుఁడగుననియు భావము.

ఓయీ ? ప్రధాన మనఁగా అవ్యక్తమని ప్రసిద్ధము; ఇట శరీరమని యెట్లు చెప్పవలెనను యాశంకకు సమాధానముగా దిగువ సూత్రము

సూ. "సూక్ష్మంతు తదర్హత్వాత్" ౧-౪-౨

సూక్ష్మమనఁగా ప్రధానము. అద్దాని స్థూలరూపము శరీరమనఁదగును. అవ్యక్తమే కార్యరూపముగఁది యగునపుడు శరీరమగునది. కావున నిట శరీరము అవ్యక్త శబ్దముతో చెప్పఁబడుచున్నదని భావము.

మఱియొకరీతిని ప్రతిపాదించుచున్నవారు

సూ. "తదధీనత్వా దర్థవత్" ౧-౪-౩

ఆత్మ శరీరాదులు పరమేశ్వరాధీనములగుటచే యుపాసన నెరవేరుటకు సార్థకములగుచున్నయవి. అంతర్యామియగు పరమాత్మ ఆత్మాది సర్వంబును ప్రేరేపించువాఁడగుటఁజేసి యుపాసనోపాయములగు ఇంద్రియాదుల వశీకరణమునందు పరాకాష్ఠయగువాఁడు; మరియు ప్రాప్యుఁడగుట వలన పరాగతియగువాఁడున్ను; ఇందువలన నవ్యక్తము శరీరంబే యగుచున్నయది.

వశీకరింపఁదగినవాని కన్నిటికిని పరమేశ్వరుఁడు చివరి యవధియగుటచేతను తదర్థము వశీకార్యముల నన్నిటిని పేర్కొనవలసివచ్చుటవలనను వశీకార్యములలో ఒకానొక పదముతో శరీరమును నిరూపింపవలసియుండుట నవ్యక్తపదముతో శరీరము గ్రహింపఁబడియున్నయది.

సూ. "జ్ఞేయత్వావచనాచ్చ" ౧-౪-౪

ఇట ప్రధానము సాంఖ్యమగుచో జ్ఞేయత్వము చెప్పఁబడియుండెడిది. అవ్విధము లేనందున కపిలప్రోక్తమగు అవ్యక్తము కాజాలదని తెలియవలెను.

సూ. "వదతీతి చేన్న, ప్రాజ్ఞోహి ప్రకరణాత్" ౧-౪-౫

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం-తథాఽరసం నిత్య మగంధ
వచ్చయత్,
అనాద్యనంతం మహతః పరం ధృవం-నిచాయ్య తం మృత్యు
ముఖాత్ప్రముచ్యతే"

"శబ్దస్పర్శ రూపములు లేనిదియు వినాశరహితమగునదియు రస శూన్యము నిత్యము గంధరహితము నగునదియు ఆద్యంతరహితము మహతః పరము శాశ్వతము నగు తత్త్వమును గుర్తెరుగునెడ సంసారబంధ విముక్తుఁడగును." అను మంత్రమునఁ ప్రధానము జ్ఞేయముగా చెప్పఁబడిన దనుట సమంజసము కాజాలదు. ఎందుకనఁగా? "యచ్ఛే ద్వాఙ్మనసీ ప్రాజ్ఞః" అను వాక్యము మొదలుకొని పరమేశ్వరుని ప్రకరణము గానం బడుచున్నందున నేతత్పూర్వము ప్రాజ్ఞుడే యుదాహరింపఁబడుటను గమ నింప నగును. కావున నవ్యక్తము శరీరమే యగునది.

సూ. "త్రయాణా మేవ చైవ ముపన్యాసః ప్రశ్నశ్చ" ౧-౪-౬

ఈ ప్రకరణమునందు - ఉపాస్య ఉపాసక ఉపాసనలనఁబడు మూడు జ్ఞేయములని మాత్రము చెప్పుటయు అవ్వానిఁగూర్చి ప్రశ్నించుటయు గమనింపఁదగినవి.

ఇందుకు నొక యుపాఖ్యానము గలదు.

వాజశ్రవుఁడను మహర్షి - ఒకానొక యజ్ఞమును గావించి బ్రాహ్మ ణులకు ముదుసలి ఆవులను దక్షిణగా నిచ్చుచుండగా తత్పుత్రుడగు నచి కేతుఁడు అయోగ్యములగు యజ్ఞదక్షిణల నిచ్చుచున్నందున తన తండ్రి చేయు యజ్ఞము అనర్థహేతువగునని శంకించి "నాయనా? నన్నెవరికి నొసగుదు"వని పలుమారులు ప్రశ్నించినందున వాజశ్రవుడు కోపగించి "నిన్ను మృత్యువునకు సమర్పింతు"నని చెప్పిన వచనము ననుసరించి మృత్యులోకమునకు వెళ్ళి తద్ద్వారమున నుపవాసముతో మూడు రాత్రులు పడియుండెను. అట్టితఱి మృత్యుదేవత ప్రవాసమునుండి యేతెంచి

"బ్రాహ్మణుఁడు నిరాహారుడై ద్వారమునందు వేచియున్నవాడ"ని నచికేతునిగూర్చి భయపడినవాడై తచ్ఛాంతికొరకు మూడు వరముల నడుగుమని వక్కాణించెను.

అట్టితటి నచికేతుఁడు దిగువ విధముగా మూడు వరముల నడిగినవాడు.

౧. తన జనకునకు మంచి మనస్సు కలుగుటయు.

౨. తనకు అగ్నివిద్య లభించుటయు.

౩. "శరీరమునుండి యుత్క్రాంతిఁ జెందిన జీవాత్మ యెట్టివాడు" అను ప్రశ్నకు సమాధానముఁ బడయుటయు.

పై వరములలో రెంటిని మృత్యుదేవత ప్రసాదించి మూడవ వరము నిచ్చునపుడు "పరమాత్మ - ఐహికాముష్మిక ధర్మమునకంటెను అధర్మమునకంటెను భూతభవిష్యద్వర్తమాన కాలమునకంటెను విలక్షణమైన స్వరూపము గలుగునది యనియు దేవతలకును తెలియరానట్టిదనియు ఇట్టి పరబ్రహ్మమును పొందుటకై ప్రణవాది మహా మంత్రములతో పరమేశ్వరు నుపాసించి తదనుగ్రహమును తనపై ప్రసరింపఁజేసుకొనవలెననియు జీవాత్మ - ముక్తస్థితియందును పరబ్రహ్మముతో నైక్యము నొందక వేరుగా నుండువాడనియు" వక్కాణించెను.

సూ. "మహద్వచ్చ" ౧-౪-౭

"బుద్ధే రాత్మా మహాన్ పరః" అనుచో గల ఆత్మశబ్దముఁ దగు సాహచర్యమువలన మహచ్ఛబ్దముతో జీవాత్మ చెప్పఁబడువాడు. జీవుఁడు వస్తుతః అణువైనను ఇట "మహాన్" కావగును కాని కపిలతంత్రసిద్ధమగు ప్రధానము కాజాలనట్లు నవ్యక్త శబ్దమునకును "శరీర" మను నర్థముఁ జెప్పుటయే సమంజసంబగునని సిద్ధాంతము.

చమసవదధికరణము

"ఒకచో ప్రధానమే కారణముగా వినఁబడుచున్న" దను ఆశంకకు సమాధాన మీ యధికరణము.

సూ. "చమస వ దవిశేషాత్" ౧-౪-౮

"అజా మేకాం లోహితశుక్ల కృష్ణాం - బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః,
అజో హ్యేకో జుషమాణోఽనుశేతే - జహాత్యేనాం భుక్తభోగా మజోఽన్యః" శ్వేతాశ్వతరము.

జన్మలేనిదగుట "నజ" యని చెప్పఁబడు ప్రకృతి యిట సాంఖ్యుల యభిమతమైనదియా ? మరి యొకటియా ? అని సందేహము.

ప్రశ్న : సాంఖ్యసిద్ధమగు ప్రకృతినే యిట జగత్కారణముగా చెప్పవలసియున్నది. ఎందుకనగా ? "అజాం" అను పదము - జన్మరాహిత్యమును, "బహ్వీః ప్రజాః సృజమానాం" అను వాక్యము - సర్వజగత్కారణత్వమును "లోహిత శుక్ల కృష్ణాం" అనునది - రక్త శ్వేతకృష్ణ వర్ణములతో గుర్తింపఁబడు రజ స్సత్వ తమోగుణముల సంబంధమును, చెప్పుచున్నవి గావున మరియొక ప్రకృతి జగత్కారణమగునని నిరూపింప నశక్యము కాదా ?

ఉత్తరము : సాంఖ్యతంత్రోక్తమగు ప్రకృతి యిట జగత్కారణ మగునని చెప్పరాదు. జన్మరాహిత్య మాత్రమున సాంఖ్యప్రకృతియే అని భావింపఁ జెల్లునా ? "అర్వాక్ బిల శ్చమసః" "క్రిందు రంధ్రము గలది చమసము" అనుచో విశేషము నిర్దేశింపఁబడనందున "ఇదం తచ్ఛిరః" అను వాక్యమువలన "చమసము శిరస్సు" అగునని గుర్తింపఁబడినట్లు శ్వేతాశ్వతరోపనిషత్ప్రతిపాదితమైన ప్రకృతి - సర్వసాధారణమగునది యనియే విశదమైనది. అందువలన తంత్రప్రకృతిమాత్రము జగత్కారణము కాజాల దని భావము.

ఐతే ఇట చెప్పఁబడిన ప్రకృతి యెట్టిది? అను శంకకు నుత్తరము దిగువ సూత్రము.

సూ. "జ్యోతి రుపక్రమాత్తు తథా హ్యధీయత ఏకే" ౧-౪-౯

జ్యోతియనఁగా పరమేశ్వరుఁడు, ఉపక్రమమనఁగా కారణము, పరమేశ్వరుఁడు కారణముగా గల ప్రకృతి - యిట నిరూపింపఁదగినది. ఎందుకనఁగా? తైత్తిరీయశాఖవారు - పరమేశ్వరాశ్రయయగు ప్రకృతి గల మంత్రములను దిగువ విధము చదువుచున్నవారు. ఎట్లనఁగా?

"అణోరణీయాన్, మహతో మహీయాన్" అను వాక్యముతో పరమేశ్వరుని ప్రశంసించి "సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" ఇత్యాదిని ప్రాణవాయువు ఇంద్రియములు అంతఃకరణము మొదలగు ప్రపంచము- పరమేశ్వరునివలన నావిర్భవించునదగుటచే ప్రకృత్యాది సర్వంబును పరమేశ్వరాత్మక మగునని నిరూపించుతటి "అజామ్" అను మంత్రము పఠింపఁబడినది. కావున "తంత్రసిద్ధ ప్రకృతి కాజాల" దను వాదము సమంజసంబైనది.

ఓయీ? మీ ప్రకృతి - పరమేశ్వరకారణిక యగునెడ పరమేశ్వరుని కార్యమగుగదా! అట్టితటి "అజ" యను పదము ఎట్లు ఉపయుక్తంబగు నను ప్రశ్నకు సమాధాన మీ సూత్రము.

సూ. "కల్పనోపదేశాచ్చ మధ్వాది వదవిరోధః" ౧-౪-౧౦

కల్పన యనఁగా సృష్టియగును.

"ఛందాంసి యజ్ఞాః క్రతవో వ్రతాని - భూతం భవ్యం యచ్చ వేదా వదంతి,
అస్మా న్మాయీ సృజతే విశ్వమేతత్ - తస్మిం శ్చాన్యో మాయయా సన్నిరుద్ధః"

"ఛందస్సులు, యజ్ఞములు, యాగములు, వ్రతములు, భూత భవిష్యద్వర్తమాన కాలకృత్యములు, మరియు వేదములు చెప్పుచున్న

ప్రపంచమంతయు పరమేశ్వరు నాశ్రయించియుండు మాయనుండి యావిర్భవించునది. జీవాత్మయైతేనో మాయచే కట్టుబడినవాడై సంసారి యగువాడు."

"మాయాంతు ప్రకృతిం విద్యా - న్మాయినం తు మహేశ్వరమ్"

"ప్రకృతి - మాయయనియు, మహేశ్వరుఁడు మాయ నధిష్ఠించి యుండువాడనియు గురుతెలుగవలెను."

ఈ రెండు మంత్రములయందు మాయ - అజయైనను మహేశ్వర కార్యమైనది యని ప్రతిపాదింపఁబడినందున విరోధ మేమియు గానరాదు. ఎట్లనఁగా ?

మాయ - ప్రాకృత (మహా) ప్రళయమున తన నామరూపముల (స్థూలత్వము)ను విడనాడి యచిద్వస్తురూపిణియైనను సూక్ష్మ రూపముతో మహేశ్వరుని శరీరముగా నుండునగునదగుటఁజేసి "అజ" యని చెప్పఁబడును. సృష్టికాలమున నామరూపములుగలది యగుటకతన పరమేశ్వరుని కార్యమనఁబడుచున్నయది. ఇందువలన మాయానిత్యత్వమునకు ఎట్టి భంగము కలుగఁజాలదని భావము.

ఇందుకు దృష్టాంతము - "సూర్యుఁడు సృష్టి సమయమున వసువు మొదలగు దేవతలకు భోగ్యుడగుకతన మధువనఁబడుగును. ప్రళయమున సూక్ష్మరూపము గలిగియుండువాడగుటఁజేసి వస్వాది దేవతా భోగ్యుఁడు కానందున తద్గత ఉదయాస్తమానంబులు నుండజాలవు" ఇట్లు మధు విద్యయందు నిరూపింపఁబడిన విధముగా మాయ - పరమేశ్వర కార్యమైనను ప్రళయమున సూక్ష్మ రూపిణియై నిత్యయనంబడునని సారాంశము.

సంఖ్యోపసంగ్రహాధికరణము

కాపిల తంత్ర ప్రసిద్ధములగు పంచవింశతి తత్త్వములు శ్రుతుల యందు గానఁబడుచున్నవిగదా ? అను నాశంకకు సమాధాన మీ యధికరణము.

సూ. "న సంఖ్యోపసంగ్రహాదపి, నానాభావా దతిరేకాచ్చ"
౧-౪-౧౧

"యస్మిన్ పంచ పంచజనా - ఆకాశశ్చ ప్రతిష్ఠితః,
తమేవ మన్య ఆత్మానం - విద్వాన్ బ్రహ్మామృతోఽమృతమ్" శ్రు.

ఇంట "పంచ పంచజనాః, అను పదముతో తెలుపఁబడు తత్త్వములు - సాంఖ్యసిద్ధములగు పంచవింశతి తత్త్వములా? శ్రుతిసిద్ధములా? అని సంశయము.

ప్రశ్న : పంచవింశతిసంఖ్య - సాంఖ్యశాస్త్రమునందు ప్రసిద్ధమగుటచేతను అట్టిది "పంచ పంచజనాః" అనుచో విశద మగుటవలన నిట సాంఖ్యతత్త్వములే కాదగునవి.

ఉత్తరము : "పంచ పంచ" అని పంచవింశతి సంఖ్యఁ గ్రహించుటవలనఁ గూడా తాంత్రిక తత్త్వములు కాజాలవు. ఎందుకనగా? "యస్మిన్" అను యచ్ఛబ్దము - తత్త్వములు పరమేశ్వరాధీనము లని తెలుపుచున్నందున నియ్యవి సాంఖ్యాభిమతతత్త్వములు కావని విశదమగుచున్నయది. మఱియు ఆకాశమును వేరుగా గ్రహించుటచే తత్త్వములు నిరువదియారు కావలసివచ్చును. కావున నిట పంచవింశతి తత్త్వప్రసక్తియే లేదని గ్రహించునది. "దిక్ సంఖ్యే సంజ్ఞాయామ్" అను ప్రమాణము ననుసరించి పంచజనులనఁబడునవి కొన్ని తత్త్వములు "సప్త సప్తర్షయః" అను దాని వలె పేర్కొనఁబడుచున్నవి.

ఐతే అయ్యవి ఎట్టివి? అనునెడ

సూ. "ప్రాణాదయో వాక్యశేషాత్" ౧-౪-౧౨

"ప్రాణస్య ప్రాణముత చక్షుష శ్చక్షుః శ్రోత్రస్య శ్రోత్ర మన్నస్యాన్నం మనసో యే మనో విదుః" అను వాక్యశేషము ననుసరించి త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వా ఘ్రాణము లనఁబడు పంచజ్ఞానేంద్రియములని యే చెప్పవలెను.

ఇట ప్రాణవాయుసంబంధమున స్పర్శప్రయుక్తమైన త్వగింద్రియమును, అన్నమయపృథివీగత గంధమును రసమును గ్రహించు జిహ్వా ఘ్రాణములను గ్రహించునది.

పంచజ్ఞానేంద్రియములనుటకు మరియొక ఉపపత్తిఁ జెప్పుచున్నారు.

సూ. "జ్యోతిషైకేషా మసత్యన్నే" ౧-౪-౧౩

"అన్నస్యాన్నం" అను పదము కాణ్వశాఖీయుల పాఠమునందు లేకున్నను "తందేవా జ్యోతిషాం జ్యోతి రాయు ర్హోపాసతే అమృతమ్" అను నుపక్రమ వాక్యమున పరమేశ్వర బోధకమైన జ్యోతిః శబ్దముండుటఁ జేసి "పంచ పంచజనాః" అను పదమునకు పంచేంద్రియములనియే చెప్పవలసి యుండును.

విషయ ప్రకాశకములగుటచే ఇంద్రియములు జ్యోతిస్సులనఁబడును. ఇట్టి జ్యోతిస్సులఁ గూడఁ బ్రకాశింపఁజేయు పరమాత్మ "జ్యోతిషాం జ్యోతిః" అని నిర్దేశింపఁబడిన సందర్భము ననుసరించి యుపయుక్తమైన "పంచ పంచజనాః" అను దానికి జ్ఞానేంద్రియములని యర్థముఁ జెప్పుట సమంజసంబగుచున్నయది.

సూ. "కారణత్వేన చాకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః" ౧-౪-౧౪

"అసద్వా ఇద మగ్ర ఆసీత్" "సృష్టికిమున్ను జగము అసత్తు (నామరూపవిభాగముఁ జేయరానిది) గా నుండెను" తద్దేదం తర్హ్యవ్యాకృత మాసీత్" "సృష్టిపరం పరతో వెలయుచున్న నీ ప్రపంచము-వ్యాకృతము (విభాగార్హము)గా పూర్వము లేకుండెడిది" మరియు "ఆకాశో హవై నామరూపయో ర్నిర్వహితా" "ఆకాశము-జగద్గతములైన నామ రూపములను ప్రకాశింపఁజేయునది."

ఇఁట జగత్కారణమును విశేషించి చెప్పకుండుటఁజేసి విశేష మెద్ది యను ఆకాంక్షకు సమాధానమును "ఆత్మా వా ఇద మేక ఏవాగ్ర ఆసీత్" అను వాక్యమునఁగల ఆత్మశబ్దము ననుసరించి పరమేశ్వరుఁడే జగత్కారణ మగు" నని నిరూపింపవలసి యుండును.

ఆకాశాదులు - కార్యవర్గములో చేరునవి యైనను ఆత్మశబ్దనిర్దేశము వలన పరమేశ్వరుఁడే జగత్కారణమగునని నిర్ధారింపఁబడినట్లు నీ సందర్భము నను విశేషవాక్య నిర్దిష్టములగు పంచ జ్ఞానేంద్రియములే ప్రతిపాదింపఁదగి యున్నయవి.

ఇట్లు పంచజ్ఞానేంద్రియములను సమర్థింప నలవియైనను తాంత్రిక తత్త్వముల నేల గ్రహింపరాదను నాశంకకు సమాధానము దిగువ సూత్రము.

సూ. "సమాకర్షాత్" ౧-౪-౧౫

"అసద్వా ఇద మగ్ర ఆసీత్" అనుచో "సోఽకామయత బహు స్యామ్" అనుచో చెప్పఁబడిన పరమేశ్వరు నాకర్షించుటవలనను పూర్వ నిర్దిష్టమగు అవ్యాకృతమును "స ఏష ఇహ ప్రవిష్ట ఆనఖాగ్రేభ్యః" అనుచో ననువదించుట వలనను పరమేశ్వరుఁడే యని యవగతమైనట్లు ఇటఁ గూడ "పంచ పంచజన" శబ్దముతో జ్ఞానేంద్రియపంచకము నాకర్షించుటఁ జేసి పంచజన పదమునకు నింద్రియార్థముఁ జెప్పుట-సమంజసంబగుచున్నయది.

జగద్వాచిత్వాధికరణము

సూ. "జగద్వాచిత్వాత్" ౧-౪-౧౬

సాంఖ్యతత్త్వమును ప్రతిపాదించు ప్రసంగము నిరాకరింపఁ బడినది. ఇఁక నీ యధికరణంబున "పరమేశ్వరునికన్న వేరువాఁడు జీవాత్మ" యను నంశము నిర్ధారింపఁబడుచున్నయది.

విషయ వాక్యమును కౌషీతకీ బ్రాహ్మణోపనిషదమునందు "బ్రహ్మతే బ్రువాణి" అని యారంభించి "యో వై బాలాక! ఏతేషాం పురుషాణాం కర్తా, యస్య వై తత్ కర్మ, స వై వేదితవ్యః" "బాలా కుఁడా? ఈ సూర్యచంద్రాదిపురుషులకు కర్తయు సృజ్యమాన జగమునకు

కారణంబు నగు మహాపురుషుఁడు తెలియఁదగినవాఁడు" అని బాలాకునకు నజాతశత్రువనఁబడు కాశీరాజు యుపదేశించెను.

ఇఁట తెలియఁదగినవాఁడు పరమేశ్వరుఁడా ? జీవాత్మయా ? అని సంశయము.

ప్రశ్న : "య ఏవైష ఆదిత్యే పురుష స్తమేవాహ ముపాసే. య ఏవైష చంద్రమసి పురుషో య ఏవైష విద్యుతి" "సూర్యమండలము నందు చంద్రమండలమునందు మెఱపునందును గల పురుషు నుపాసించు వాఁడను" అని కాశీరాజునకు బాలాకి చెప్పియున్నవాఁడు. ఐతే విషయ వాక్యమునఁ గల కర్మ శబ్దమునకు "అపూర్వము" అను నర్థముఁ జెప్పి సూర్యచంద్రాది పురుషులు - జీవునకు నపూర్వము (అదృష్టము) ద్వారా భోగోపకరణము లగుటఁ జేసి యీ యర్థము సకల కర్మ సంబంధము లేనట్టి పరమాత్మయందు పొసగకుండుటను సూర్యచంద్రాది కర్తృత్వము జీవు నందు నుపయుక్త మగుటవలనను జీవాత్మయే తెలియఁదగియున్నవాఁడని చెప్పవలెను కాదా ?

ఉత్తరము : విషయ వాక్య గతమగు కర్మశబ్దము - ఏతచ్ఛబ్దమునకు సమానాధికరణ మగుటచేతను "క్రియత ఇతి కర్మ" అను వ్యుత్పత్తి ననుస రించియు కర్మశబ్దమునకు "జగము" అను నర్థముఁ జెప్పవలెను. అపూర్వ మని చెప్పరాదు. ఐతే జగము కార్యముగా గలవాఁడు పరమాత్మ యగు గాని జీవాత్మ కాజాలఁడు గదా ! సకలజగత్కర్తృత్వము పరమేశ్వరునిదే యగును.

ఇందుకు ప్రమాణములు.

"చక్షోః సూర్యో అజాయత, చంద్రమా మనసో జాతః" "సూర్యా చంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్" "పరమేశ్వరుని నేత్రము నుండి సూర్యు డుదయించెను. మనస్సునుండి చంద్రుఁ డావిర్భవించెను" "పరమేశ్వరుఁడు పూర్వమువలె సూర్య చంద్రాది ప్రపంచము నంతయు నిర్మించినవాఁడు."

"ఛందాంసి యజ్ఞాః క్రతవో వ్రతాని - భూతం భవ్యం యచ్చ వేదా వదంతి, అస్మా న్మాయీ సృజ్యతే విశ్వమేతత్ - తస్మిం శ్చాన్యో మాయయా సన్నిరుద్ధః"

"మాయాంతు ప్రకృతిం విద్యా - న్మాయినంతు మహేశ్వరమ్"

"ఛందస్సులు యజ్ఞములు యాగములు వ్రతములు భూత భవిష్యద్వర్తమానములు మున్నగు జగమును మహేశ్వరుఁడు మాయ నధిష్ఠించియే సృజించువాడు కాని మాయాబద్ధుఁడు కాజాలడు. జీవుఁడై తేనో మాయా మోహపరవశుఁడై జగమునఁ బ్రవర్తించువాడు."

"మాయ జగన్మూలమనియు మాయావిశిష్టుఁడగు మహేశ్వరుఁడు జగత్కర్తయనియు గురుతెలుగవలెను."

ఇఁట భూతభవిష్యద్వర్తమాన జగము కార్యమనియు ఇట్టి కార్యము నంతయు అనితరసాధారణమగు మహేశ్వరశబ్దముచే చెప్పఁబడు శంకరుఁడే నిర్మించువాడనియు ప్రతిపాదించు శ్వేతాశ్వతర వాక్యద్వయము పురోవాదమగుటచే ననువాద రూపమగు "యోవై బాలాక ?" అను వాక్యము నందలి కర్మ శబ్దమునకు యౌగికముగా "జగము" అను నర్థముఁ జెప్పవలసి వచ్చును. కావున ననంకుచిత జగత్కర్తృత్వము జీవాత్మకు సంభవింపని దగుటచేత నిట పరమాత్మయే ప్రతిపాదింపఁదగినవాడు.

బాలాకుఁడు స్వయముగా నేతెంచి కాశీరాజును గురించి "బ్రహ్మతే బ్రువాణి" అని ప్రారంభించి సూర్యచంద్రాది పురుషులను ప్రతిపాదించగా నవ్వారు బ్రహ్మము కాజాలరని కాశీరాజు నిరాకరించి ఈ ఆదిత్యాది పురుషులకు కర్తయు సకల జగత్స్రష్టయు నగువాడే బ్రహ్మంబగుననియు ఇట్టి పరమాత్మను కనుగొనినవాడు పూర్వీకులగు అజ్ఞానుల నందరి నతిక్రమించి ప్రాణులందరిపై యధికారమును నిజరూప సంపదను పొందువాడనియు బాలాకునకు నుపదేశించినవాడు.

సూ. "జీవముఖ్యప్రాణలింగాన్నేతిచేత్తద్వ్యాఖ్యాతమ్" ౧-౪.

"ఈ యుపనిషదమున జీవుని ముఖ్యలక్షణమగు భోక్తృత్వము మరియు నముఖ్యమగు ప్రాణవాయుస్థితియు కనఁబడుటవలన నిట పరమాత్మ - ప్రతిపాదింపఁబడుచులేడు" అని చెప్పకూడదు. ఇట్టి యాశంకకు ఇదే భాష్యమున మొదట ప్రతర్దన విద్యయందు "శివోపాసనము మూడు విధములైనదను నుపపత్తి ననుసరించి జీవలింగములన్నియు పరమేశ్వరుని యందు సమర్థింపఁదగినవి" యని సమాధానము నిరూపింపఁబడినదని సూత్రార్థము.

జీవప్రతిపాదక వాక్యములు

"శ్రేష్ఠి స్వైర్భుంక్తే, యథా వా స్వాః శ్రేష్ఠినం భుంజంత్యేవమే వైష ప్రాజ్ఞ ఆత్మా ఏతై రాత్మభిర్భుంక్తే, ఏవమేవైత ఆత్మాన ఏత మాత్మానం భుంజంతి"

"ఒకానొక ధనికుఁడు - తన పరివారజనము నుపయోగించుకొను వాడు. పరివారజనంబును శ్రేష్ఠిగారి నాశ్రయించి జీవించును. ఇట్లే సుకృతియగు ఒకానొక జీవుఁడు సూర్యచంద్రాదుల సాహాయ్యమున భోగ్యముల ననుభవించువాడు. సూర్యచంద్రాది జీవాత్మలున్ను పుణ్యాత్మ నాశ్రయించి సంతృప్తిపడువారు"

"యదా సుప్తః స్వప్నం న కంచన పశ్యతి, అథాస్మిన్ ప్రాణఏవైకధా భవతి" "పురుషుఁడు ఎట్టి స్వప్నమును గాంచని గాఢనిద్రఁ జెందినపుడు ప్రాణవాయువు మాత్రము ఏకరూపముతో జీవదేహమున సంచరించుచుండును.

ఐతే ఇటఁగూడ పూర్వాపరములను పరామర్శించునెడల పరమేశ్వరుఁడే యని విశదమగును.

"బ్రహ్మతే బ్రువాణి" అని యుపక్రమము. "యస్య చైతత్కర్మ" అను వాక్యముతో మధ్యన పరమేశ్వరునికి సకల జగత్కర్తృత్వము ప్రతిపాదింపఁబడినది. ఉపసంహారమునందును "సర్వాన్ పాప్మనోఽపహత్య

సర్వేషాంచ భూతానాం శ్రైష్ఠ్యం స్వారాజ్య మాధిపత్యం పర్యేతి, య ఏవం వేద" "శివోపాసనఁ జేయువాఁడు - పాపముల నన్నిటిని పోఁగొట్టు కొని ప్రాణులందరిలో శ్రేష్ఠుఁడై స్వారాజ్యము (శివసాయుజ్యము)ను పొందువాఁడగును" శివోపాసన ఫలము స్వారాజ్య ప్రాప్తియని నిరూపింపఁ బడినది.

ఇట్లు ఈ ప్రకరణము బ్రహ్మ పరమగుచుండుటఁజేసి జీవముఖ్య ప్రాణలింగములు శివపరము లగుననియే సమర్థింపవలసియుండును.

దిగువ సూత్రమున రెండవపక్షము నుదాహరించినవారు

సూ. "అన్యార్థంతు జైమినిః ప్రశ్నవ్యాఖ్యానాభ్యా మపి చైవ మేకే" ౧-౪-౧౮

శరీరేంద్రియాది భిన్నజీవుని ప్రతిపాదించుట జీవభిన్న పరమాత్మను కనుగొనుటకే యని జైమిని భావించెను. ఇట్లే మరియొక శాఖవారు ప్రశ్నోత్తరములతో నివ్విషయమునే నిరూపించినవారని సూత్రార్థము.

"తౌహ సుప్తం పురుష మాజగ్మతు స్తం హాజాతశత్రు రామంత్ర యాం చక్రే బృహన్! పాండరవాస! సోమరాజన్ !"

"బ్రహ్మమీమాంస గావించు - అజాతశత్రువు బాలాకుఁడును నిద్రించు ఒకానొక పురుషుని సమీపించి "గొప్పవాడా? ఉదకము లధిక ముగాగల శరీరమే నివాసముగా కలవాడా? చంద్రునివలె ప్రకాశించు వాడా? సమ్రాట్టువలె సర్వాధికారము గలవాడా?" అని యజాత శత్రువు సంబోధించెను.

"స తూష్ణీ మేవ శిశ్యే, తదుహ ఏనం యష్ట్యా వ్యాచిక్షేప, స తత ఏవ సముత్తస్థౌ" "ఐన నా పురుషుఁ డట్లే నిద్రించుచుండెను. కావున నజాతశత్రువు బెత్తముతో కొట్టినందున నా పురుషుఁడు దిగ్గున లేచిన వాఁడు."

ఇఁట ప్రాణనామధేయములతో నాహ్వానించినను లేవకుండుటను యష్టిఘాతముతో నుత్థితుఁడగుటను గమనించినచో ప్రాణాదులకన్న వేరుగా

జీవాత్మ కలడని విశదమగును కావున నిట్టి జీవుఁడు స్వాతిరిక్త పరమాత్మ నాశ్రయించువాడనియు బోధపడును.

ఇవ్విషయమునఁ బ్రశ్నోత్తర వాక్యములు.

"క్వైష ఏతత్ బాలాకే ? పురుషోఽశయిష్ట ? క్వ వా ఏతదభూత్ ? కుత ఏతదాగాత్ ?"

"గాఢనిద్రఁ జెందునపుఁడు పురుషుఁ డెందు విశ్రాంతిఁ జెందువాడు ? ఎటనుండెను ? ఎచ్చోటికి వెళ్ళినవాడు ?"

"యదా సుప్తః స్వప్నం న కంచన పశ్య త్యథాస్మిన్ ప్రాణ ఏవైకథాభవతి"

"సతా సౌమ్య ! తదా సంపన్నో భవతి"

"నిద్రించువాడు ఎట్టి స్వప్నమును గాంచకుండుకటి నీ శరీరమునందు ప్రాణమొక్కటియే ఏకరూపముగా సంచరించుచుండును."

"సౌమ్యుడా ? పురుషుఁడు గాఢనిద్రితుడైనపుడు పరమేశ్వరునితో నేకీభవించి శివానందము ననుభవించును."

ఈ సందర్భమున వాజసనేయులు నిట్లే ప్రశ్నోత్తరముల నుదాహరించిరి.

"యత్రైష ఏతత్సుప్తోఽభూ ద్య ఏష విజ్ఞానమయః పురుషః క్వైష తదాఽభూత్ ? కుత ఏతదాగాత్" ప్రశ్న వాక్యము.

"యత్రైష ఏతత్సుప్తోఽభూద్య ఏష విజ్ఞానమయః పురుష స్తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞాన మాదాయ య ఏషోంత ర్హృదయ ఆకాశ స్తస్మిన్ శేతే" ఉత్తరము.

"విజ్ఞాన ప్రచురుఁడైన జీవాత్మ - ఎట సుషుప్తిఁ జెందెను ? ఎచట నుండెను ? ఎచ్చోటికి వెళ్ళినవాడు ?

"విజ్ఞానమయుఁడగు జీవుఁడు సుషుప్తియందు కర్మజ్ఞానేంద్రియముల సామర్థ్యమునంతయు తనలో నిమిడ్చుకొని హృదయములోని చిదాకాశమునందు విశ్రాంతిఁ జెందువాడు."

ఇందువలన జగత్కర్తయగు పరమేశ్వరుఁడే ఇఁట ప్రతిపాదింపఁ దగినవాడని సారాంశము.



మహారాజపోషకులు:
శ్రీ సి. వి. కొండారెడ్డిగారు
ఆంధ్రభాషాలంకారభూతులు, (పూర్వనివాసము కడపజిల్లా,)
ప్రస్తుతము - ప్రభుత్వ అటవీశాఖ ప్రముఖ ఉద్యోగము, ఆదిలాబాద్.

వాక్యాన్వయాధికరణము

సూ. "వాక్యాన్వయాత్" ౧-౪-౧౯

"నవా అరే పత్యుఃకామాయ పతిః ప్రియోభవతి, ఆత్మనస్తు కామాయ పతిః ప్రియోభవతి" మొదలుకొని "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" వరకు

బృహదారణ్యకమున మైత్రేయీ బ్రాహ్మణమునందు వినఁబడు చున్న సందర్భము—

"యాజ్ఞవల్క్య మహర్షి - స్వయముగా సన్న్యసింపఁదలచి తన భార్యలైన మైత్రేయికి కాత్యాయనికిని స్థిరచరాస్తినంతయు పంచియిచ్చెద ననఁగా- మైత్రేయి "ధనముతో మోక్షము చేకూరునా" అని ప్రశ్నింప

సంసారుల జీవితమువలె నీ జీవితముసాగుననియు మోక్షమునకు ధనముతో నవసరము లేదనియు- యాజ్ఞవల్క్యుఁడు చెప్పెను. "మోక్షము నొసగఁ జాలని ధనము నాకెందులకు ? పూజ్యులైన తాము గుర్తెఱిగిన తత్త్వ మునుగురించియే ఉపదేశింపు"డని మైత్రేయి మరల ప్రశ్నింపగా" భార్యకు భర్త ప్రియుండగుట - భార్యకుగల కామమువలననే యనియు భర్త యొక్క కామమువలన కాదనియు ఒక భర్తయే కాదు, భార్య, కుమా రులు, మిత్రులు, పశువులు మున్నగునదంతయు పురుషుని భోగముకొరకే యనియు" యాజ్ఞవల్క్యుఁడు బోధించి పత్న్యాది సర్వభోక్త ఆత్మయని యుపక్రమించి "పరమాత్మ - చూడదగినవాడు, వినఁదగినవాడు, ధ్యానింపఁదగినవాడు" అని యుపదేశించెను. మరియు ఆత్మవిజ్ఞానముతో సర్వవిజ్ఞానము కలుగుననియు "రగులుకొనిన నిప్పునుండి వేరుగా పొగ బయలుదేరునట్లు గొప్పదైన పరబ్రహ్మమునుండి ఋగ్యజుః సామాధర్వణ వేదములు, పురాణములు, విద్యలు, ఉపనిషదములు, శ్లోకములు, సూత్ర ములు, వ్యాఖ్యానములు, యజ్ఞయాగములు, ఆహారపానీయములు, ఇహ పరలోకములు, ప్రాణులందరును నిట్టూర్పుగా నావిర్భవించునవి"యనియు నామరూపాత్మక సకల ప్రపంచమునకు కారణము బ్రహ్మంబనియు అంత ర్బహిస్సులందు నిజరసముతో ఘనీభవించిన ఉప్పురాయివలె విజ్ఞానపరి పూర్ణుఁడగు జీవాత్మ - పంచభూతాది నిర్మితశరీరమునుండి నిర్గమించి యవ్వాని ననుసరించియే యుండును. కాని ఇట్టి దశయందు జీవునకు ఎట్టి తెలివి యుండఁజాలదనియు ఆత్మవిజ్ఞానమువలననే మోక్షము చేకూరు ననియు వక్కాణించెను.

ఇఁట "ఆత్మా వారే ద్రష్టవ్యః" అనుచో గల ఆత్మశబ్దము - పర మేశ్వరవాచకం బగునది. అమృతత్వమును కోరు మైత్రేయికి ఆత్మదర్శన మును ఆత్మదర్శనమువలన నమృతత్వము చేకూరునని యుపదేశించుట వలనను దర్శనీయ ఆత్మయే నామరూపాత్మక సకల ప్రపంచ కారణమని ప్రతిపాదించుటఁ జేసియు సైంధవ ఘనేత్యాది నిరూపిత జీవుండై తేనో

దేహాకార పరిణత పంచభూతోపాధికములగు ఉత్పత్తి వినాశములు కలిగి యుండువాడని చెప్పుటవలనను "ఆత్మావారే ద్రష్టవ్యః" అను వాక్యముతో ప్రశంసింపఁబడు ఆత్మయే "మహద్భూత మనంత మపారమ్" అనుచో గల మహదాది శబ్దములు బ్రహ్మపరములగుటవలనను పరమేశ్వరుండగునని నిర్ధారింపనగును.

ప్రశ్న : "ఆత్మనస్తుకామాయ" ఇత్యాది సందర్భమున భోగప్రీతి యుక్తుఁడగు సంసారి చెప్పఁబడుటచే నిట జీవాత్మ ప్రశంసింపఁదగినవాడని విశదమగుచున్నది కాదా ?

ఉత్తరము : పరమేశ్వరుఁడే ఇట ప్రతిపాదింపఁదగినవాడు. ఎందు కనఁగా ? "అమృతత్వస్య తు నాఽశాస్తి విత్తేన" "మోక్షమునకు ద్రవ్యముతో నవసరములేదు" "ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్" "పరమేశ్వరుని గురించి శ్రవణముఁ జేయుచు మననము గావించి ధ్యానము నాచరించి సాక్షాత్కారము నొనర్చుకొనునెడ నీ జగమంతయు విదితమగును" "ఇదం సర్వం యదయమాత్మా" "ఈ ప్రపంచమంతయు పరమేశ్వరాత్మకము" "యేనేదం సర్వం విజానాతి - తం కేన విజానీయాత్" "జీవాత్మ - స్వాంతర్యామియగు పరమేశ్వరునివలన జ్ఞానశక్తి గలవాడై ఈ చరాచరమునంతయు కనుగొనఁజాలును. అట్టి పరమేశ్వరుని సాక్షాత్కరించుకొనుటకు పూర్వోక్తములైన శ్రవణమననాదులు దక్క నితరమగు నుపాయ మెద్దియు గానరాదు" అను వాక్యములన్నియు పరమేశ్వరునియం దన్వయించుటఁ జేసియు జీవుఁడు - పతిజాయాది శబ్దములతో అనువదింపఁబడుటవలనను పరమేశ్వరుఁడు ద్రష్టవ్యుఁడుగా ప్రతిపాదింపఁబడుటచేతను విరోధమేమియు గానరాదు.

పతిజాయాద్యనురాగము మోక్షమునకు భంగకరమగుటచే ముముక్షువు పతిజాయాదులందు విరాగము కలవాడై శ్రవణమననాదులతో పరమేశ్వరుని దర్శింపవలెనని సారాంశము.

ఐతే జీవశబ్దముతో పరమేశ్వరు నభిధానించుట యెట్లు పొసగునను ఆశంకకు దిగువసూత్రములందు మతాంతర సమాధానములను వ్రాసిచ్చినవారు.

సూ. "ప్రతిజ్ఞాసిద్ధే ర్లింగ మాశ్మరథ్యః" ౧-౪-౨౦

"ఆత్మని ఖల్వరే దృష్టే" ఇత్యాది వాక్యమునఁ జెప్పఁబడిన "ఏక విజ్ఞానముతో సర్వవిజ్ఞానము కలుగు"నను ప్రతిజ్ఞ-సిద్ధించుటకు జీవుఁడు పరమేశ్వరుని కార్యమగుటచే పరమేశ్వరునికన్న వేరువాడు కాదను నంశమును తెలుప నుద్దేశించి జీవశబ్దముతో పరమేశ్వరుఁడు సమర్థింపఁబడెనని ఆశ్మరథ్యుఁడు భావించెను.

సూ. "ఉత్క్రమిష్యత ఏవంభావా దిత్యౌడులోమిః" ౧-౪-౨౧

జీవాత్మ - సంసారిదశయందు పరమేశ్వరభిన్నుఁడైన నంతిమశరీరమునుండి నిష్క్రమించి ముక్తుఁడగుతఱి పరమేశ్వరరూప స్వభావములు గలవాడగుటఁజేసి జీవాత్మ శబ్దముతో పరమేశ్వరుఁడు ప్రతిపాదింపఁబడెనని ఔడులోమి యభిప్రాయము.

సూ. "అవస్థితే రితి కాశకృత్స్నః" ౧-౪ ౨౨

"య ఆత్మని తిష్ఠన్" ఇత్యాది శ్రుతివాక్యములయందు జీవునిలో పరమేశ్వరుఁ డంతర్యామిగా నుండువాడని చెప్పఁబడుటఁజేసి పరమేశ్వరుఁడు - జీవశబ్దవాచ్యుండయ్యెనని కాశకృత్స్న మహర్షి సంభావించెను.

ఇద్దియే సూత్రకారుని యభీష్టంబని తెలియనగును. మొదట నిరువురి యభిప్రాయముల నుపన్యసించి వారిరువురికి భిన్నముగా కాశకృత్స్నుని యభిమతమును నిరూపించినందునను మరియొక యభిమతమునుచెప్పకుండుటను వైవిధము నిర్ణయింపఁబడుచున్నయది.

శ్రుతులనేకము లివ్విషయమునే సమర్థించుచున్నయవి.

అథర్వశిరోపనిషదమున చేతనాచేతనములన్నిటియందు ప్రవేశించుటఁ జేసి పరమేశ్వరుఁడు సర్వశబ్దవాచ్యుఁడగునని చెప్పఁబడినది.

ప్రథమఖండమునందు "దేవా హవై స్వర్గం లోక మగమన్, తే దేవా రుద్రమపృచ్ఛన్ కోభవానితి" బ్రహ్మావిష్ణ్వాదిదేవతలుఃపరశివనివాస మనఁదగు మహాకైలాసముఁ జని నీవు ఎట్టివాడవని పరమేశ్వరుని ప్రశ్నించిరి. అట్టితఱి మహాదేవుఁడు "సోఽబ్రవీదహ మేకః ప్రథమమాసమ్, వర్తామిచ భవిష్యామిచ, నాన్యః కశ్చిన్మత్తో వ్యతిరిక్తః" "సృష్టికి మున్ను నేనొకఁడ నుంటిని. సృష్టిసమయమందు నుండువాడను, ప్రళయకాలమునను నేనే యుండువాడను. నేనుదక్క మరియొకఁడు కాలత్రయాబాధ్యుడుగా నుండజాలడు" అని యుపదేశించినవాడు.

మఱియు నదే యథర్వశిరమునందు

"సోఽంతరా దంతరం ప్రావిశద్దిశశ్చాంతరం సంప్రావిశత్, సోఽహం నిత్యానిత్యోఽహమ్, బ్రహ్మోహమ్, ప్రాంచః ప్రత్యంచోఽహమ్, దక్షిణాంచ ఉదంచోఽహమ్, అధశ్చోర్ధ్వంచ దిశశ్చ విదిశశ్చాహమ్, పుమా నపుమాన్ స్త్రియశ్చాహమ్, సావిత్ర్యహమ్, గాయత్ర్యహమ్, త్రిష్టుప్ జగత్యనుష్టుప్ చాహమ్, ఛందోఽహం గార్హపత్యోఽహం, దక్షిణాగ్ని రాహవనీయోఽహమ్, సత్యోఽహం గౌరోఽహం గౌర్యహమ్, జ్యేష్ఠోఽహం శ్రేష్ఠోఽహం, వరిష్ఠోఽహమాపోఽహం, తేజోఽహ మృగ్యజుస్సామాథర్వాంగిరసోఽహం, అక్షరమహం క్షరమహం గుహ్యోఽహం గోప్యోఽహం, అరణ్యోఽహం పుష్కరమహం, పవిత్రమహం, అగ్రంచ మధ్యంచ బహిశ్చ పురస్తాజ్జ్యోతిరిత్యహమేకః, సర్వేచ మామేవ, మాం యోవేద, స సర్వాన్ దేవాన్ వేద."

"పరమేశ్వరుఁడు - స్థూలశరీరాంతరమగు సూక్ష్మశరీరములో ప్రవేశించియుండువాడు. అన్ని దిశలలోను ప్రవేశించెను. నిత్యుఁడను; అనిత్యుడను; బ్రహ్మంబునగుదును; ప్రాంచుడను; పాశ్చాత్యుడను; దాక్షిణాత్యుడను; ఉదీచ్యుడను; దిగువను పైననుండువాడను; దిశలు; విదిశలు, పురుషుఁడు, నపుంసకుఁడు, స్త్రీ, ఇవ్వాని స్వరూపముగలవాడను; సావిత్రి గాయత్రి త్రిష్టుప్ జగతి అనుష్టుప్ అనఁబడు ఛందస్సుల నగు

వాడను; గార్హపత్య దక్షిణా ఆహవనీయములనఁబడు అగ్నిత్రయముఁ దగు స్వరూపముగలవాడను; సత్యరూపుడను; గౌరీస్వరూపుడను; శంకరుఁడను; మరియు దేవమానవ పశుపక్ష్యాదిచరాచరముకన్న నతీతుఁడ నగుటఁ జేసి మిక్కిలి గొప్పవాఁడ నగుదును; జలతేజస్సులు, ఋగ్యజుః సామాథర్వణంబులును తురాతురంబులును నా రూపంబులేను; రహస్యంబును అతిరహస్యంబును అరణ్యము పుష్కరము పవిత్రము అగ్రమధ్యములు అంతర్బహిస్సులు సర్వాగ్రమునందు వెలుగొందు జ్యోతిస్సును నేనే యగుదును. జీవాత్మలందరు నన్నే ఆశ్రయించువారు. ఇవ్విధము భావించువాడు దేవతలనందరిని కనుగొనఁ జాలు వాడగును'' అనియు చెప్పిన వాడు.

ద్వితీయఖండమునందును

''యోవై రుద్రః స భగవాన్ యశ్చ బ్రహ్మా తస్మై వై నమో నమః'' అను వాక్యము మొదలుకొని ప్రతిపాదింపఁబడిన విషయము - బ్రహ్మ విష్ణు మహేశ్వర ఉమా వినాయకాది సర్వశబ్దవాచ్యత్వము పరమేశ్వరునకు పొసగునని విశదీకరించుచున్నది కావుననే సర్వాంతర్యామి యగును.

మఱియు శ్రుతులన్నిటిఁ దగు సామరస్యమును విచారించునెడ చిదచిత్తులన్నిటిలో నంతర్యామిగా ప్రవేశించుటఁ జేసి పరమేశ్వరుఁడు సర్వస్వరూపుఁడనియు సర్వశబ్దవాచ్యుఁడనియు చెప్పఁబడును. ఇందువలన కాశకృత్స్నమహర్షిగారి మతమే శ్రుతులకు అభియుక్తసూక్తులకు ననువైన దనుట సమంజసంబగుచున్నయది.

పూర్వోక్తమతత్రయంబున అశ్మరథ్యుని పరమేశ్వరకార్యము జీవుఁడను వాదము ''నాఽఽత్మా శ్రుతేర్నిత్యత్వాచ్చ తాభ్యః.'' (సూ.౧౨-౩-౨) అనునధికరణమునందు నిరాకరింపఁబడుటను ''ముక్తిదశయందు ఆగంతుక రూపంబేర్పడు'' నను ఔడులోమి వాదము ''సంపద్యావిర్భావః స్వేన

శబ్దాత్'' సూ. ౧-౪-౪ అను నధికరణమునందు ఖండింపఁబడుటవలనను కాశకృత్స్నని మతమే సూత్రకారుని యభీష్టంబని తెలియుచున్నయది.

ఇవ్విషయమునే మనుస్మృత్యాది ప్రమాణములు చాటుచున్నవి.

అథర్వశిరోగత ద్వితీయఖండమున

"ఘృతాత్పరం మండమివాతి సూక్ష్మం జ్ఞాత్వా శివం సర్వభూతేషు గూఢమ్" "శివుడు నెయ్యిలోని చిన్నపూసవలె నతిసూక్ష్మ స్వరూపుడు కావుననే ప్రాణులందరిలో దాగియున్నవాడని భావించవలెను"

"ఏష దేవో విశ్వకర్మా మహాత్మా - సదా జనానాం హృదయే సన్నివిష్టః "ప్రపంచమే కార్యముగాగల గొప్ప దేవుఁడు ప్రాణుల హృదయములలో నెల్లపుడు నెలకొనియుండువాడు."

"యో రుద్రో అగ్నౌ వప్స్వయ ఓషధీషు యోరుద్రో విశ్వాభువనా వివేశ" "అగ్నియందు నుదకమందును ఓషధులలోను సమస్తలోకముల లోను ప్రవేశించియుండు రుద్రునకు నమస్కారము."

ఇత్యాది శ్రుతివాక్యములు నంతర్యామి బ్రాహ్మణాదులయందు పంచభూతసూర్యచంద్ర చేతనాంతర్యామిగా నష్టమూర్తిత్వము పర మేశ్వరునకు కలదని ధృవపఱచుటచే సర్వశరీరములుగలవాడని విశదమగు చున్నయది.

మహాభియుక్త సూక్తులనఁగా స్మృతులు పురాణములు నగును. అవ్వానిలోని మానవ ధర్మశాస్త్రము (మనుస్మృతి) దగు నుపసంహారమున "ప్రశాసితారం సర్వేషామణీయాంస మణోరపి। రుక్మాభం స్వప్నధీ గమ్యం - విద్యాత్తు పురుషం పరమ్" అనుచో సర్వనియామకుఁడగు పురు షుని ప్రశంసించి "ఏనమేకే వదంత్యగ్నిం - మరుతోఽన్యే ప్రజాపతిం। ఇంద్ర మేకే పరే ప్రాణ మపరే బ్రహ్మ శాశ్వతమ్" అనుచో పలువేద భాగములయందు చెప్పఁబడిన అగ్ని మున్నగు శబ్దములతో వ్యవహరించు టను పేర్కొనియు పైవాని విరోధమును పోనాడుటకై "ఏష సర్వాణి

భూతాని - పంచభి ర్వ్యాప్య మూర్తిభిః । జన్మవృద్ధిక్షయై ర్నిత్యం-సంసార యతి చక్రవత్" అను శ్లోకమున పరమేశ్వరుఁడు పంచమూర్తులు గలవాడై ప్రాణులందరిని జన్మస్థితిలయములతో సంసారచక్రమున భ్రమింపఁజేయు నని చెప్పఁబడుటచే ప్రజలను నియమించు రాజువలెగాక నియామ్యము లన్నిటిలో ప్రవేశించియుండువాడని తెలియనగును.

"కొందరు అగ్నియందురు. మరికొందరు ప్రజాపతి యందురు." ఇత్యాది ప్రతిపాదనము శివశరీరములగు అగ్న్యాదుల శబ్దములతో శివుఁడే నిరూపింపఁబడినవాడని సారాంశము. పంచమూర్తులనఁగా ఆకాశాది పంచభూతములు, అథవా తదభిమానముగల సద్యోజాతాది పంచబ్రహ్మము లని గ్రహించునది.

ప్రశ్న : "ఓయీ ? మానవధర్మశాస్త్ర ప్రారంభమున - ఈ జగ మంతయు నామరూప నిర్వచనములేక యుండుటచే నూహింపరానిదిగాను నిర్దేశింపఁజాలనిదిగాను నిద్రించినదానివలె తమోమాత్రమై యుండెడిది. అట్టితఱి నవ్యక్తుడైన భగవానుఁడు ఆకాశాది పంచమహాభూతములను రచించు ప్రభావము గలవాడై స్వయముగా వెలువడి కొంత తడవాలో చించియు ప్రజలనందరిని పుట్టింపఁదలచి మొదట జలమును సృజించి యందు తన సిసృక్షారూపమైన వీర్యమును విసర్జించినవాడు. అట్టిది సూర్య ప్రకాశమగు హిరణ్మయాండముగా పరిణమించెను. ఆ యండములోనుండి సర్వలోక పితామహుండగు చతుర్ముఖుఁ డుద్భవించినవాడు" అనియు "ఉదకములు నర (జీవ) సంబంధముగలవి యగుటచే నారము లనఁబడు" ననియు, "నారములు స్థానముగా గలవాడగుటచే నారాయణుఁ డనఁ బఱగు" ననియు చెప్పఁబడుటచే పితామహుని బ్రహ్మాండములోనుండి మొదట పుట్టించిన నారాయణుఁడే జగత్కారణమైన పురుషుఁడని యంగీక రింపవలెను గాదా ?

ఉత్తరము : "తతః స్వయంభూ ర్భగవాన్" అనుచో పితామహుని పుట్టించిన నారాయణుఁడు "ప్రాదురాసీ త్తమోనుదః" అనుచో తమః

ప్రేరకుఁడు మాయాధిష్ఠాతయు నగు పరమేశ్వరునివలన ప్రళయానంతర కాలమున నావిర్భవించినవాడని చెప్పఁబడుటచే పరమశివుడే సర్వకారణ మగువాడని తెలియుచున్నయది.

"తమోనుదః" అను పదము క్విప్ ప్రత్యయముతో పంచమ్యంత మగునది. కాని ఇగుపధ లక్షణముగల కప్రత్యయమునఁ జేసి ప్రథమాంతమై యావిర్భవించినవానికి విశేషణము కాజాలదు. ఈ సందర్భమున మొదట ఉండెనని చెప్పఁబడిన తమస్సును తరువాత జన్మించినవాడు నధిష్ఠించుట పొసగనట్టిది. కావున మానవ ధర్మశాస్త్రోపక్రమోపసంహారములను పరిశీలించినచో పరమేశ్వరుఁడే జగత్కారణంబని తేటపడుచున్నయది.

మఱియు కాత్యాయన గృహ్యసూత్రమున నదీవృక్ష పర్వతాదుల నతిక్రమించుతఱి "నమో రుద్రాయాప్సుషదే స్వస్తి మా సంపాదయ" "జలాదుల నధిష్ఠించియుండు రుద్రునకు నమస్కారము. రుద్రుడా! నాకు శుభమును కలుగజేయుము." "నమో రుద్రాయ వనస్పతిషదే స్వస్తి మా సంపాదయ" "వృక్షాదులను వ్యాపించియుండు శివునకు నమస్కారము. పరమేశ్వరా! నాకు క్షేమము నాపాదించుము" ఇత్యాది శివ నమస్కార మంత్రములు ప్రతిపాదింపఁబడినవి. మఱియు "నమో రుద్రాయేత్యేవ బ్రూయాత్" అని పరమేశ్వరుని నమస్కరించు మంత్రమును సామాన్యముగా విధించి "రుద్రో హ్యేవై తత్సర్వమ్" అను వాక్యముతో "రుద్రుఁడు సర్వాధిష్ఠాత"యని "సర్వోవై రుద్రః" అను శ్రుతి-స్మరింపఁజేయఁబడినది.

ఇట్లు చెప్పుటవలన "సర్వోవై రుద్రః" "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇత్యాదినిగల సర్వశబ్దముఁ దగు సామానాధికరణ్యము సర్వాధిష్ఠాతయు సర్వశరీరకుఁడు నగు వానియందే పర్యవసానముఁ జెందునని తెలియవలసి యున్నది.

అశ్వలాయన సూత్రముననను శివుని ప్రశంసించి "సర్వాణి హ వా ఏతస్య నామధేయాని భవంతి" అను వాక్యముతో నామములన్నియు పరమేశ్వరునియందు పర్యవసానముఁ జెందునని సాక్షాత్తు నిరూపింపఁబడినది.

ఇఁట శ్రీ భాష్యకారులు నారాయణునకు సర్వాంతర్యామిత్వమును ప్రతిపాదించుటద్వారా సర్వశబ్దవాచ్యత్వమును సాధింపఁజూచి కాని ప్రబలశ్రుతులు అనుకూలింపనందున "సర్వభూతాంతరాత్మా" ఇత్యాది

సుబాలోపనిషద్వాక్యమును మాత్ర మాధారముగా గొని కృతార్థులమైతి మని భావింపవలసివచ్చెను. ఐతే సుబాలోపనిషదము పాంచరాత్ర తంత్ర ముల ననుగ్రహించునదగుటచేతను పూర్వోదాహృత శ్రుతుల విరోధము వలనను పరస్పర విరోధముగలవాని సముదాయమున "భూయసాం స్యాత్సధర్మత్వమ్" అను న్యాయము ననుసరించి పెక్కుశ్రుతులకు ప్రామాణ్యా మొదవును గావునను సౌబాలము బాధింపఁబడుటచే పరుల యభిమతము ఈడేరజాలదని గ్రహించునది.

శుద్ధాద్వైతులైతేనో

"నవా రే పత్యుః కామాయ" ఇత్యాది వాక్యములతో జీవాత్మ నువదించి "ఆత్మావా అరే ద్రష్టవ్యః" అనుచో జీవాత్మయే చూడఁదగిన వాడని శ్రుతి చెప్పుచున్నందున జీవబ్రహ్మల కభేదము సిద్ధించినదనియు "అవస్థితే రితి కాశకృత్స్నః" అను సూత్రమునకు "పరమాత్మయే విజ్ఞానాత్మభావముతో నుండువాడ"ను నర్థముఁ జెప్పి స్వాభిమతమును సమర్థింపఁజూచుట - యెంతమాత్రము సంగతము కాజాలదు.

"భేదవ్యపదేశాత్" "అర్థాంతరవ్యపదేశాత్" "సుషుప్త్యుత్క్రాంత్యోర్భేదేన" ఇత్యాది సూత్రములు జీవబ్రహ్మ భేదమును నిర్ణయించుచున్నందున ప్రకృత సూత్రమున నభేదార్థమును నిరూపించుట సమంజసము కాజాలదు.

ప్రకృత సూత్రమున "అవస్థితేః" అను పదమునకు చెప్పఁబడిన అభేదార్థము "స్థితేః" అనుటతోడనే సిద్ధించునుగదా! "అవస్థితేః" అనుచో గల "అవ" అను ఉపసర్గమునకు విశేషార్థముండి తీరవలయును. సూత్రకారునకు నభేదము ఇష్టమగుచో "అభేదాత్" అని వ్రాసియుండెడివాడు. పరపక్షమునను అవోపసర్గము నిరర్థకమై స్వాభిలషితమును సాధించుటలేదు. తత్త్వమస్యాది మహావాక్యములు జీవబ్రహ్మైక్యమును ఆపాతతః బోధించుచున్నను "యస్యాత్మా శరీరమ్" ఇత్యాది వాక్యములుగల యంతర్యామి బ్రాహ్మణము ననుసరించి శరీర శరీరిభావము నంగీకరించునెడ తాదాత్మ్య సంబంధముతో సుసంగతములగునవి."

"తమాత్మస్థం యే౽నుపశ్యంతి ధీరాః" "ద్వా సుపర్ణా" ఇత్యాద్యనంత శ్రుతివచస్సులున్ను జీవబ్రహ్మైక్యమును విరోధించుచున్నయవి.

సూత్రకారుఁడైతే నంతర్యామ్యధికరణమునందు "ఉభయేఽపి భేదేనైవ మధీయతే" అనుచో జీవపరమాత్మలకు భేదమును స్ఫుటముగా నంగీకరించినవాఁడు. ఇట్లు సర్వశ్రుత్యనుగతమగుటచే జీవబ్రహ్మములకు శరీరశరీరిభావము యథార్థముగా నిర్ణయింపఁబడుచున్నయది. కావున వేదార్థమంతయు పరమేశ్వరుని సర్వాంతర్యామిత్వ మనఁబడు మహా విభూతిని వర్ణించునదియే యని గ్రహింపవలెను.

ఇఁక నుపాసనాంగముల యభేదము పారమార్థికమైనదని యంగీకరించి యనేకములైన భేదశ్రుతులు - శ్రుతిసూత్రములలో గానరానట్టి స్వకల్పితంబు నగు నవిద్యను పురస్కరించుకొనిన భేదమును సమర్థించునవనియు, ప్రత్యగాత్మ యొకఁడే కాని యిరువురు కారనియు వక్కాణించి యంతర్యామి బ్రాహ్మణమును తదధికరణమునున్న స్వవచనములతోడనే నిరాకరించి సాధించు ఐక్యార్థము ఎట్టిదో సుధీమంతులు గ్రహింతురుగదా!



మహారాజపోషకులు :
శ్రీ బచ్చు నారాయణ శ్రేష్ఠిగారి ఏకైక పుత్రులు
బచ్చు బాపురావుగారు
నివాసము - ఆదిలాబాద్, ఆం. ప్ర.
సౌమ్య స్వభావుఁడు గురు భక్తిపరాయణుఁడున్ను.

ప్రకృత్యధికరణము

"జన్మాద్యస్య యతః" అను ద్వితీయాధికరణమునందు "యతో వా ఇమాని భూతాని" అను పంచమీ విభక్తిఘటితమగు శ్రుతి నుదాహరించి పరమేశ్వరుఁడు జగదుపాదానమగునని సామాన్యముగా నిరూపింపఁబడి యుండెను. అట్టి జగదుపాదానత్వము నీ యధికరణమునందు విశేషముగా సమర్థించుచున్నవారు.

సూ. "ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాంతానుపరోధాత్" ౧-౪-౨౩

"ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అను ప్రతిజ్ఞను మరియు మృద్ఘట దృష్టాంతము ననుసరించి "ప్రకృతిః" జగదుపాదానకారణము "చ" నిమిత్తకారణంబును పరమేశ్వరుఁడే అని సూత్రార్థము.

"తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః"

"ద్యావాభూమీ జనయన్ దేవ ఏకః" ఇత్యాది శ్రుతులయందు వినఁబడు ఉభయకారణత్వము పరమేశ్వరునకు పొసగునా లేదా యని సందేహము. లోకములో నిమిత్తకారణములగు కుమ్మరి మున్నగునవి మృత్పిండాదుల యుపాదానభావమును పొందనందునను మృత్పిండాదులు కులాలాదుల నిమిత్త భావమును చెందనందునను జగత్కార్యమునుగురించి యుపాదానము నిమిత్తంబు నొకే పరమాత్మ యెట్లు కాదగునని సందేహ బీజము.

ప్రశ్న : పరమేశ్వరుఁడు జగత్సృష్టివిషయమై నిమిత్తకారణంబేను, ఉపాదానమగుట సరిపడుటలేదు. ఘటనిర్మాతయగు కులాలుఁడు తానే మృత్పిండమై ఘటమును చేయడుగదా! సాలెవాడును వస్త్రమై పటము నేర్పరచువాడు కాడు లేక మృత్పిండము కుమ్మరియై కుండఁజేయు టయు సంభవింపదు. నిమిత్తమగు బ్రహ్మమునకు నుపాదానత్వము సమర్థ నీయము కానట్టిది. నిమిత్తమునకు నుపాదానత్వమును కల్పించుటయు

నిష్ప్రయోజనమగునది. అట్లు కల్పింప నవసరములేకయే కార్యనిష్పత్తి కలుగును. కులాలుడు మృత్పిండభిన్నుడైనను ఘటము నిష్పన్నమగు టను గాననగును. ఇందువలన బ్రహ్మము నిమిత్తమేగాని యుపాదానము కాజాలదని యంగీకరింపవలెను **గాదా ?**

ఉత్తరము : ఈ సందర్భమున జగన్నిమిత్తము ఉపాదానంబు బ్రహ్మంబే యని ప్రతిపాదింపబడుచున్నయది. "స్తబ్ధోఽస్యుత తమా దేశ మప్రాక్ష్యో యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మత మవిజ్ఞాతం విజ్ఞాతమ్" ఎద్దానిని వినినచో సర్వము శ్రుతంబగునో ఎద్దానిని భావించినచో సమస్తము భావింపబడునో ఎద్దానిని తెలుసుకొనినచో నంతయు తెలి యునో అట్టి యాదేశము (బ్రహ్మము)నుగూర్చి యాచార్యుని ప్రశ్నిం చితివా ?" ఉద్దాలక మహర్షి - తన కుమారుడగు శ్వేతకేతువును గురు కులమందు వేదాధ్యయనముగావించి రమ్మని నియోగింపగా శ్వేతకేతువు నట్లే గావించి స్వాశ్రమమునకు పాండిత్య గర్వముతో స్తబ్ధుడై యేతెంచు టను గమనించి "బ్రహ్మవిద్యాశ్రవణమును చేయనందున వీడు నవినీతుడ డయ్యె" నని కనుగొని బ్రహ్మవిదునిగా నొనర్పదలచియు "స్తబ్ధోస్యుత" అను వాక్యముతో పై విధము ప్రశ్నించెనని ఛాందోగ్యమున చెప్పబడినది. "జగన్నిమిత్తము ఆదేశించునదియు నగు బ్రహ్మమును కనుగొనినచో చిద చిదాత్మకమగు జగమంతయు తెలియు" నను సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ ననుస రించియు "ఏకమృత్పిండ జ్ఞానముతో మృణ్మయమంతయు విజ్ఞాతంబగు" నను దృష్టాంతము ననుసరించియు బ్రహ్మమునకు నుభయకారణత్వమును సమర్థింపనగును. బ్రహ్మము నిమిత్తమే యగునెడ బ్రహ్మజ్ఞానముతో సకల ప్రపంచ విజ్ఞానము చేకూరకుండును. కులాలుని తెలుసుకొనినచో ఘటాదికార్యము తెలియదుగదా! కాని తదుపాదానమగు మృత్పిండ మును కనుగొనునెడ ఘటాదికార్యము తెలియును గావున నిమిత్తమగు బ్రహ్మము ఉపాదానమగునెడ సర్వవిజ్ఞానము సంభవించుటచేసి బ్రహ్మమే

యుపాదానంబు నగునది. "ఆదిశ్యతే అనేనే త్యాదేశః" అను వ్యుత్పత్తి ననుసరించి ఆదేశమనఁగా బ్రహ్మంబని తెలియనగును.

జగన్నిమిత్త మగునదియే జగదుపాదాన కారణ మగునని దిగువ సూత్రమున హేత్వంతరమును చెప్పుచున్నవారు.

సూ. "అభిధ్యోపదేశాచ్చ" ౧-౪-౨౪

"తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" అనుచో - నిమిత్తము సర్వజ్ఞంబునగు బ్రహ్మమే విచిత్రజగదాకారముగా బహుభవనమును సంకల్పించినట్లు నుపదేశింపఁబడుచున్నది కావున నిమిత్తమునకన్న నుపాదానము వేరు కాజాలదు.

ప్రశ్న : ఓయీ ? "విశ్వాధికో రుద్రో మహర్షిః, హిరణ్యగర్భం పశ్యత జాయమానమ్" అనుచో "విశ్వాతీతుఁడగుటచే జగన్నిమిత్తముగా చెప్పఁబడు పరమేశ్వరుఁడే సర్వజ్ఞుఁడగుటఁజేసి స్వ (అపృథక్ సిద్ధ) భిన్న యగు ప్రకృతియందు తన సంకల్పమువలనఁ బుట్టువాడును సకల దేవతా ప్రథముఁడు నగు హిరణ్యగర్భుని సృష్టిసామర్థ్యమునొసగు నుద్దేశముతో ననుగ్రహదృష్టి నవలోకించువా"డని తెలియుచున్నది. ఇట్టితఱి శివుఁడు ప్రకృతిరూపుఁడై విశ్వాకారుఁడగుట యెట్లు పొసగును ? "మాయాంతు ప్రకృతిం విద్యాత్" అనుచో శ్రుతి - మాయ జగదుపాదాన (ప్రకృతి) మగునని వివరించినది. "తస్మాద్విరాడజాయత విరాజో అధిపూరుషః" అనుచో పురుషుఁడు జగత్ప్రకృతిగా వర్ణింపఁబడినది. అందువలన మాయాపురుషులే ప్రకృతిగా జగద్రూపులగుట సముచితము గాదా ?

ఉత్తరము :

సూ. "సాక్షాచ్చోభయామ్నానాత్" ౧-౪-౨౫

పరమేశ్వరుఁడు ప్రకృతిగా జగద్రూపుఁడనియు నిమిత్తముగా జగదుత్పాదకుఁ డనియు వేదాంత భాగములయందు ప్రత్యక్షముగా నిరూ

పింపఁబడినది. ఎట్లనఁగా ? "విశ్వాధికోరుద్రః" ఇత్యాది వాక్యములతో విశ్వాధికత్వము వినఁబడునట్లు "సర్వోవై రుద్రః" ఇత్యాది వాక్యములతో ప్రకృతి యగుటఁ జేసి విశ్వరూపత్వంబును తెలుపఁబడుచున్నయది.

శతరుద్రీయమునందు "నమో హిరణ్యబాహవే" అను వాక్యము మొదలుకొని "కులుంచానాం పతయే" ఇత్యాది వాక్యమువరకు విశ్వాధిపతి యగుటయు అటుపిమ్మట "నమః పర్ణ్యాయచ పర్ణశద్యాయచ" అను వాక్యమువరకు జగదాకారము గలవాడగుటయు ప్రతిపాదింపఁబడినవి.

ఇందుకు మరియొక శ్రుతిప్రమాణము - "బ్రహ్మవనం బ్రహ్మ సవృక్ష ఆసీత్ బ్రహ్మాధ్యతిష్ఠత్ భువనానిధారయన్" "పరమాత్మ - అరణ్య వృక్షాదిరూపములు గలవాడై చేతనాచేతనాత్మక సమస్త లోకములను ధరించుచు ప్రపంచమునంతయు నధిష్ఠించియుండువాడు" అథర్వశిరము నందును ప్రథమ ద్వితీయ ఖండములలో "బ్రహ్మాహమ్" మొదలుకొని విశ్వాకారత్వము, పంచమ ఖండమున "ఏకోరుద్రో న ద్వితీయాయ తస్థే" ఇత్యాది వాక్యములతో జగదీశ్వరత్వంబును ప్రతిపాదింపఁబడినవి. ఇట్లు శ్రుతులయందు ఉభయకారణత్వము స్పష్టముగా చెప్పఁబడినందున ప్రపంచ స్వరూపుఁడును ప్రపంచాతీతుఁడును ప్రకృతి నిమిత్తంబు పరబ్రహ్మము పరమేశ్వరుఁడును శివుఁడే యగునని నిరూపించుట - సమంజసంబేను; ఇవ్విషయమై ప్రమాణాంతరంబు కలదని దిగువ సూత్రముతో చెప్పుచున్నవారు.

సూ. "ఆత్మకృతేః" ౧-౪-౨౬

"తదాత్మానం స్వయ మకురుత" అనుచో తానే జగదాకారముగా నగుట విశదపఱుపఁబడుటచే శివుఁడే జగదుపాదానము నిమిత్తంబు నగువాడు.

ప్రశ్న : సమస్తదోష లవ కళంకములు బొత్తుగా లేనివాడు, అనంత మంగళగుణరత్నాకరుఁడు, నిరంకుశము నిత్యసిద్ధంబునగు వైభవము

గలవాడు, ప్రపంచాతీతుఁడు నగు పరమశివుఁడు - అజ్ఞానవికారాస్పదము తుచ్ఛంబు నగు ప్రపంచముగా నుండుట యెట్లు పొసగును ?

ఉత్తరము :

సూ. "పరిణామాత్" ౧-౪-౨౭

నిత్యశుద్ధ ఆనందస్వరూపుఁడు నిరతిశయ మంగళ స్వభావము గలవాడు జగన్నిమిత్తంబు నగు పరమేశ్వరుఁడు ప్రకృతిద్వారా జగద్రూపుఁడగుట సముచితంబగుచున్నయది. ఎందుకనఁగా? శివుఁడు చేతనాచేతన రూపముగా పరిణమించు సామర్థ్యము గలవాడు.

ప్రశ్న : పరిణామమనఁగా కారణరూపమునకు వికారము కలుగుట గదా! పూర్వ రూపమును విడనాడి రెండవ రూపము నొందుటయు పరిణామమగును. ఐతే పరమేశ్వరుఁడు అనర్థధర్మమగు పరిణామముఁజెంది తన యపకర్షను చాటుకొనునా ?

ఉత్తరము : నీవనునది నిజమే; నిమిత్తము ఉపాదానమైనను వికారాది స్పర్శ గాకుండునట్లు ఇఁట పరిణామమును గాననగును. "ఓహో! మీరు చెప్పెడు పరిణామము అపూర్వముగా నున్నదే; అద్దానిని వినుటకు మేము తత్తఱపడుచున్నాము" అనినచో వినుడు! చెప్పెదము.

ఇందుకు ప్రమాణము

"యదా తమ స్తన్నదివా నరాత్రి ర్నసన్నచాసచ్ఛివ ఏవ కేవలః, తదక్షరం తత్సవితుర్వరేణ్యం, ప్రజ్ఞా చ తస్మాత్ ప్రసృతా పురాణీ."

"ఎప్పుడు ఈ ప్రపంచము చంద్ర సూర్యాది తేజస్సులు లోపించుటఁజేసి దివారాత్రి విభాగము లేనిదియు నామరూప విశేషరహితమగుటవలన స్థూలసూక్ష్మ చేతనాచేతన సదసత్తుల యేర్పాటు లేనిదియు తమోమాత్రముగా నగునో, అట్టితఱి శివుఁడొక్కఁడే తనతో విభజింపరాని చిదచిచ్ఛక్తులు గలవాడగు కతన కేవలుఁ డనఁబఱగుచు స్వప్రకాశకుఁడై మిగిలియుండు

వాడు. అట్టి శివతత్త్వమే అక్షరమనఁబఱగుచుండును. పూర్వము సృష్టి కాలమున సూర్యునకు తేజస్సు నొసగువాడగుటచే సూర్యాతీతుఁడగును. సూర్యునిలో నుండు ప్రకాశమున్ను శివుఁడేను; తనకు వేఱైన చేతనాచేతన ప్రపంచమును తనలో దాచినవాడు నద్వితీయుఁడు నగు శివునినుండి నిత్య సిద్ధయు ప్రళయతమస్సును తొలగించునదియు మహాస్ఫురణ మనఁదగు నదియు నగు జ్ఞానశక్తి యావిర్భవించినది. అటుపిమ్మట "సోఽకామయత బహుస్స్యామ్" నామరూప విభాగములేని సూక్ష్మచిదచిద్వస్తువులు శరీరముగా కారణావస్థఁజెందిన పరమాత్మ - నామరూప విభాగము కలిగిన సూల చిదచిద్వస్తువులు శరీరముగా కార్యావస్థఁ జెందునని సంకల్పించిన వాడు. తరువాత "ఇదం సర్వ మసృజత యదిదం కించ" స్వశరీరమగు సూక్ష్మ చిదచిద్వస్తువును తననుండి విడదీసి "తత్ సృష్ట్వా తదేవా నుప్రావిశత్" స్వవిభక్తమైన చిదచిద్వస్తువునందు తా నంతర్యామిగా ప్రవేశించియు "సచ్చత్యచ్చాభవత్" నానావిధ సదసత్ ప్రపంచ రూపముతో ననేక రీతులుగా పరిణమించినవాడు. జగద్రూపుఁడగు పరమాత్మ - జగత్కారణమగుటను కార్యమగుటను దిగువ శ్రుతియందు గాననగును.

"మాయాం తు ప్రకృతిం విద్యా - న్మాయినం తు మహేశ్వరమ్"
తస్యావయవభూతేన - వ్యాప్తం సర్వమిదం జగత్" అనుచో

మాయ - సకల జగత్ప్రకృతి (ఉపాదాన) యనియు మహేశ్వరుఁడు ప్రకృతి నధిష్ఠించియుండువాడనియు మాయావిశిష్టుఁడైన మహేశ్వరుని యంశంబు చిచ్ఛక్తిఁదగు కిరణంబు, భోక్తృదశయందు పురుషుఁడు నగువానితో జగము వ్యాపింపఁబడుటయు విశదమగుచున్నయవి. ఎట్లనఁగా? లోకములో కేవలము శరీరమునుండిగాని కేవలము ఆత్మవలనఁగాని వెంట్రుకలు గోళ్ళు పుట్టనట్లు కేవలము శివునినుండిగాని కేవలము మాయవలనఁగాని జగము యావిర్భవింపనట్టిది. కాని శరీరముతోకూడిన జీవాత్మవలన కేశ నఖాదులు ఉదయించునట్లు మాయావిశిష్టుఁడగు మహేశ్వరునివలన సకల చేతనాచేతన ప్రకృతియగు పురుషుఁడు ఆవిర్భవించువాడు. పురుష

స్వరూపుఁడైన శివునివలన నవ్యక్తము చతుర్ముఖుఁడు మున్నగువారు జన్మించువారు. కావుననే "పురుషో వైరుద్రః" అను శ్రుతివాక్యము-పరమేశ్వరుఁడు పురుషరూపుఁడని వక్కాణించినది. అందువలన చిదచిద్విశిష్టుఁడైన పరమేశ్వరుఁడు - సూక్ష్మ స్థూల దశల నొందువాడగుటచే కారణము కార్యంబు నగుట సముచితంబేయగునది. శరీరికి పరిణామిత్వమును భావించునెడ శరీరము పరిణమించునదగుటఁజేసి శరీరవిశిష్టుఁడైన జీవుఁడు-కృశించినవాడను బలిసినవాడను అని సంకల్పించినట్లు పరమేశ్వరుఁడును శక్తిద్వారా పరిణమించువాడైనను శక్తివిశిష్టుఁడగుటచే స్వతః పరిణామము గలవాడని చెప్పఁబడినది.

ప్రశ్న : "ఛందాంసి యజ్ఞాః క్రతవో వ్రతాని - భూతం భవ్యం యచ్చ వేదా వదంతి, తస్మా న్మాయీ సృజ్యతే విశ్వమేత - త్తస్మిం శ్చాన్యో మాయయా సన్నిరుద్ధః" అనుచో మాయాశక్తి - జీవాత్మఁదగు బంధమునకు హేతు వగునని చెప్పఁబడినదిగదా! అద్దియే "మాయాంతు ప్రకృతిం విద్యాత్" అనుచో పరామర్శింపఁబడుచున్నయది. ఇట్టిది సర్వానుగ్రాహకురాలుగా శైవీ చిచ్ఛక్తి యగునని యెట్లు చెప్పనగును?

ఉత్తరము : ఆత్మలకు జీవత్వమును కలుగఁజేసి సకల సంసారనిదానము రోధశక్తియు నగు మాయయందు మలావరణమనఁదగు పాశమను వ్యవహారమును శివాగమములయందు గాననగును.

శ్లో॥ తాసాం మాహేశ్వరీ శక్తిః - సర్వానుగ్రాహికా పరమ్,
పరానువర్తనాదేవ - పాశ ఇత్యుపచర్యతే॥

ఇంతియేగాక నజా మంత్రమునందు మాయ (సర్వసేవ్యురాలైనను) స్వరూపముతో విడువఁదగినదని "జహాత్యేనాం భుక్తభోగా మజోఽన్యః" అనుచో ప్రతిపాదింపఁబడినది.

కూర్మ పురాణమునందును
శ్లో॥ సైషా భగవతీ దేవీ - శంకరార్ధ శరీరిణీ,
శివా సతీ హైమవతీ - యథావ ద్బ్రూహి పృచ్ఛతామ్॥

"శంకరుని సగము శరీరమునందగు పార్వతీదేవి యెట్టిదో మాకు యథార్థముగా వచింపుడ"ను ప్రశ్నకు సమాధానముగా దిగువ శ్లోకములను గాననగును.

శ్లో॥ తస్య సర్వజగత్సూతిః - శక్తి ర్మాయేతి విశ్రుతా,
తయేదం భ్రామయే దీశో - మాయావీ పురుషోత్తమః॥
సైషా మాహేశ్వరీ శక్తిః - సర్వాకారా సనాతనీ,
సైవ రూపం మహేశస్య - సర్వదా సంప్రకాశయేత్॥
సర్వశక్త్యాత్మికా మాయా - దుర్నివారా దురత్యయా॥

పరమేశ్వరుని శక్తి - సర్వజగత్ప్రసూతియై మాయ యనఁబడును. ఇద్దానిని సాధనముగా గొనియే పురుషోత్తముండైన పరమాత్మ - ప్రపంచమును భ్రమింపఁజేయువాడు. సర్వరూపిణి సనాతనియునగు మాయయే మహేశ్వరుని శక్తి యనఁబడుచున్నయది. మరియు మహేశ్వరునికి రూపంబునై ఎల్లకాలము ప్రకాశింపఁజేయునది. సర్వశక్తి స్వరూపురాలైన మాయ నతిక్రమింపను తొలగింప నేరికిని శక్యముకాదు" ఇంకను శ్రుత్యంతరములయందు మహేశ్వరుని శక్తియే పరమాకాశముగా వ్యవహరింపఁబడుచున్నయది. ఇఁక మహేశ్వరుని శక్త్యంశముతో నావిర్భవించిన నారాయణుఁడు - హరివంశమునందు దిగువ విధముగా పేర్కొనఁబడిన వాడు.

విశ్వము నధిష్ఠించియుండు శివుఁడు - ప్రకృత్యతీతుఁడనియు పరమపురుషుఁడైన శివుని మొదటి రూపమగు ఉమాదేవిఁ దగు వ్యక్తమైన భాగము మహావిష్ణువనియు శివాత్మక శక్త్యంశబలమున నారాయణుఁడు బ్రహ్మాది సకల ప్రపంచమును సృజింపఁగలిగెననియు ఏవమాది సందర్భమును పారిజాతాపహరణమునందు నారదుఁడు దేవేంద్రునిఁ గూర్చి వక్కాణించినచో గాననగును.

కూర్మ పురాణమున "కైషా భగవతీ" అను ఋషుల ప్రశ్నమునకు సమాధానమును మహాయోగియగు నారాయణుఁడు స్వమూలరూపమ

శక్తితత్త్వమును ధ్యానించి చెప్పినవాడని కలదు. మఱియు నదే పురాణమునందు శ్రీకృష్ణుని తపశ్చర్యచే సంతుష్టుడై సాక్షాత్కరించిన శివునితో నేతెంచిన పార్వతీదేవి "కుమారా? నీ భక్తి శివునియందు నాయందు ననన్యమైనదని గ్రహించితిని. దేవతా ప్రార్థన ననుసరించి దేవకీ సుతుడవై జన్మించినాడవుగదా! ఐతే మన యిరువురికి సోదర సోదరీ భావముండుటం జేసి భేదమును పాటింపరాదు. జ్ఞానులు అభేదమునే భావింతురు" ఇట్లు నారాయణుండు శక్త్యంశ సంభూతుండైన నెల్లకాలము పురుషుం డనం బఱగుననియు తదితరమంతయు (శక్త్యంశము) స్త్రీప్రాయంబనియు నారసింహపురాణమున వక్కాణింపంబడినది.

సూ. "యోనిశ్చ హి గీయతే" ౧-౪ ౨౭

"ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం - త్రిలోచనం నీలకంఠం
ప్రశాంతమ్,
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం - సమస్త సాక్షిం తమసః
పరస్తాత్"

అను శ్రుతియందు సమస్త ప్రాణుల యుత్పత్తికి కారణమగువాడనియు సమస్త సాక్షి యనియు విశ్వోత్తీర్ణుండనియు ఉమాసహాయుండు, నియామకుండు, త్రిలోచనుండు, నీలకంఠుండు ననియు ప్రశాంతుండనియు పరమేశ్వరుండు ప్రతిపాదింపంబడుచున్నవాడు. ఇందు భూతయోనిత్వము ముఖ్యముగా గమనార్హమగుటచే పరమేశ్వరుండే జగదుపాదానము జగన్నిమిత్తంబు నగువాడని సిద్ధాంతము.

శ్రీ గణేశాయ నమః
ఓం నమఃశివాయ గురవే నమః



బ్ర॥ శ్రీ॥ లోకారాధ్యులైన

తాడికొండ పూర్ణ మల్లికార్జున అయ్యవార్లంగారు

వీరు గుంటూరు మండలములోని తెనాలి తాలూకా ఈమని గ్రా వాస్తవ్యులు. వీరి పూర్వికులు వీరును తరతరాలుగా షట్కాలము అయ నిత్యము శివు నారాధించిన మహానుభావులు. మఱియు శ్రీవారు స్వః భాగ్యసమయమున సంసారలంపటులుగాక ననేక పర్యాయములు పంచాక్షరీ మహామంత్ర పురశ్చరణలఁజేసి యనేక శిష్యబృందములకు లిం

ధారణలఁ గావించి యవ్వారితో శివపంచాక్షరీ పురశ్చరణలఁ జేయించియు "స్వయం తీర్త్వా పరాన్ తారయతి" అను నానుడిని సార్థకమొనర్చిరి. ఇంతియేగాక స్వగ్రామమున మారీ స్ఫోటకాది ఉపద్రవములు కలుగ కుండగా పెక్కు శీతలాది యంత్రములను ప్రతిష్ఠించిరి.

వీరు బాల్యమున సంగీత సాహిత్యములలో గొప్ప పాండిత్యమును సంపాదించి ప్రపన్నులైన శిష్యులకు శివ విజ్ఞాన ప్రబోధములను చేయు చుండెడివారు. అనేక గ్రంథములను రచించిన ప్రతిభాశాలురు. అగస్త్యే శ్వరశతకము, శివభజన కీర్తనలు, తటస్థ గ్రామ పంచరత్నావళి, హరిశ్చంద్ర నలోపాఖ్యాన నాటకము, వీరి రచనలలో ముఖ్యములగునవి. ఇందు కొన్నిమాత్రము ముద్రితములు, వీరు విద్యార్థులకు భోజన సదుపాయముల నేర్పరచుచు విద్యనుచితముగా నభ్యసింపజేసెడివారు. వరంగల్, హనుమ కొండ, అశనపర్తి, ములకనూరు మొదలగు గ్రామములలో శ్రీవారికి వేయి గడప శిష్యసంచారము కలదు. సర్వకాల సర్వావస్థలయందు నిష్ఠా గరిష్ఠులగుటచే నవసానకాలమువరకు నెట్టి యంతరాయము కలుగకుండా నిత్య శివపూజను జరుపుకొనగలిగిరి.

మహాశివరాత్రి దినమున లింగోద్భవకాలమందు (తనకు శివసా యుజ్యము కలుగునని ముందే యెరింగి) శిష్య బృందమును పిలిపించుకొని యవ్వారి సమక్షమున శివసాయుజ్యమును చెందుచున్నానని చెప్పుచు సుఖ ముగా భౌతిక దేహమును విడనాడిన శివయోగులు.

శ్రీవారి ధర్మపత్ని - మీనాక్షమ్మగారు. వీరు కాపురమునకు వచ్చి నప్పటినుండి మహామంత్రోపదేశపాత్రురాలై క్రమముగా శక్తి ఉపాసనా పరులై ఇప్పటివరకు నవరాత్రములయందు నిత్యంబును శ్రీచక్రాది పూజలను యథావిధిగా చేయుచున్నవారు. యజ్ఞములను క్రతువులను శక్తివంచన లేకుండా చేయుచు నుత్సాహపూరితులై దాన ధర్మములను గావించు చుందురు. ఈ గ్రంథమును ముద్రించుటకు తమ భర్తగారిపేరిట 116 రూ. మహారాజపోషక చందాను సమర్పించి తమ యుదారతను వెల్లడించిరి.

శ్రీ వారికి ఐదుగురు కుమారశేఖరులు - శ్రీ పూర్ణానందుడు, నాగనాథుడు, వీరభద్రయ్య, లింగమూర్తి, వటుకభైరవప్రసాద్, అను పవిత్ర నామధేయములతో స్వేచ్ఛాసంపాదిత సౌభాగ్య సమృద్ధిగలవారై స్వవంశ పరంపరాభివృద్ధితోడను మాతృభక్తిగలవారై విరాజిల్లుచున్నవారు.

ఐతే శక్తివిశిష్టుఁడైన సదాశివుఁడు వీరికి వీరి సంతానమునకును చిరాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిని నిరంతరము కలుగఁజేయుగాత! మరియు ఆచంద్రతారార్కము మీనాక్షమ్మగారి యుదార కీర్తి విలసిల్లుగాత యనియు శ్రీ రాజరాజేశ్వరిని ప్రార్థించువాడను.

ఇట్లు
గ్రంథకర్త
నిర్మల శంకరశాస్త్రి.

సర్వవ్యాఖ్యానాధికరణము

సూ. "ఏతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః" ౧-౪-౨౮

"జన్మాద్యస్యయతః" అను సూత్రము మొదలుకొని పై సూత్రము వరకు (౧౩౨ సూత్రములుగల యధికరణములయందు) వేదాంత వాక్యములను వ్యాఖ్యానించుటవలన బ్రహ్మలక్షణ ప్రతిపాదక వేదాంత వాక్యములు, కర్మకాండలో నంతర్భూతములైన పురుషసూక్త శతరుద్రీయాది మంత్ర బ్రాహ్మణ భాగములు, స్మృతులు, ఇతిహాసములు, పురాణములు, ఆగమములు, అభియుక్తసూక్తి విశేషంబులును వ్యాఖ్యాతప్రాయములైనవని తెలియవలెను. సూత్రములో "వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః" అను ద్విరుక్తి - అధ్యాయ పరిసమాప్తిని సూచించునది. (అథాతో బ్రహ్మజిజ్ఞాసా" సూత్రమును కలుపుకొని ప్రథమాధ్యాయాంత సూత్రమువరకు ౧౩౪ సూత్రములగును.)

ఇట్టి కర్మప్రకరణపఠితములైన పురుషసూక్త శతరుద్రీయాదులకు స్మృతీతిహాస పురాణాదులకున్ను తాత్పర్యము అనఁబడు లింగముఁ దగు సమన్వయముతో బ్రహ్మబోధకత్వము కలదా లేదా అని సందేహము. ప్రకరణభేదము - సంశయమునకు కారణము.

ప్రశ్న : కర్మప్రకరణముఁ జెందిన పురుషసూక్తాదులు - అనుష్ఠాత యగు జీవాత్మను నిరూపించుట సముచితమని తోచెడిని. నిత్యముక్తుఁడగు పరశివుని బోధించుటలో ప్రయోజనము గానరాదు. స్మృతి పురాణాదులును ఒకే విషయమును చెప్పుటలేదు. ఎట్లనఁగా? అవ్వానిలో కొన్ని చతుర్ముఖబ్రహ్మను మరికొన్ని విష్ణుమూర్తిని తదితరములు రుద్రుని దేవేంద్రుని శక్తిని అగ్నిని సూర్యుని అన్యాన్య దేవతలను పరమాత్మగా ప్రతిపాదించినవి. కావున నియ్యవి బ్రహ్మబోధకము లగునని చెప్పుట యెట్లు పొసగును ?

ఉత్తరము : పురుషసూక్తాదులయందు బ్రహ్మలక్షణములు కనఁబడుటచే నయ్యవి బ్రహ్మ బోధకంబు లగుచున్నయవి. "తస్మా ద్విరాడ జాయత" "ఆదిత్యవర్ణం తమసస్తు పారే" "తమేవం విద్వా నమృత ఇహ భవతి" అనుచో సకలకారణత్వము తమసః పరత్వము అమృతహేతుత్వము మున్నగు పరమేశ్వరుని లక్షణములు విదితములగుచున్నందున నిట పురుష శబ్దముతో పరమేశ్వరుఁడే ప్రతిపాదింపఁబడుచున్నవాఁడని తెలియవలెను. శతరుద్రీయమునందును పరమేశ్వరుఁడు సాక్షాత్ జగదధిపతి యనియు జగదాత్మకుఁడనియు నీలగ్రీవాదిలక్షణములు గలవాఁడనియు వక్కాణింపఁ బడినది కావున పరమాత్మ - పురుషసూక్తాది బోధ్యుండనుట సమంజసంబేను.

ప్రశ్న : పరమేశ్వరుఁడు నిఖిల మాంగళ్యగుణ రత్నాకరుఁడగుటచే శతరుద్రీయమునందు చెప్పఁబడుట - యుక్తము కాజాలదు. ఎందుకనఁగా? ప్రారంభముననే "నమస్తే రుద్ర మన్యవే" అను వాక్యమున హేయగుణ మనఁదగు క్రోధము రుద్రునకు సంబంధించునని విదితమగుచున్నదిగదా!

ఉత్తరము : ఇట్లు భావింపఁగూడదు. ఇఁట మన్యుశబ్దము యజ్ఞ వాచకంబగునది. అథవా క్రోధవాచకమగునని చెప్పినను దోషమేమియు లేదు. ప్రకృతి గుణమగు క్రోధమును దుష్టనిగ్రహార్థము స్వేచ్ఛగా పరిగ్రహించుటచే పరమేశ్వరునియందు ఇద్దాని సంబంధమును భావింపరాదు. పురాణాదులున్ను తాత్పర్యలింగవశమున బ్రహ్మవిష్ణ్వాది శబ్దవాచ్యుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తిమంతుఁడు సర్వాధికుఁడు ఇతరులకు సాధ్యముకాని వైభవము గలవాడు బ్రహ్మశబ్దార్థమునకు విశ్రాంతిస్థాన మగువాడు వేదాంత వాక్యము లన్నిటిఁదగు సామరస్యముతో కూడిన సమన్వయముఁ జెందిన తాత్పర్యమునకు పర్యవసానమగువాడు ఉమా సహాయుఁడు పరమేశ్వరుఁడు నగు శివునిఁగూర్చి బోధకంబులగుట - సమంజసంబగుచున్న యది. "కర్మప్రకరణమగుటచే శివప్రబోధకత్వము కూడ" దనగూడదు. లింగము ప్రకరణమును బాధించునుగదా ! ఇట్టి న్యాయముతో చేతనుని యందు గాని అచేతనమునందు గాని జగత్కారణత్వాదికము వినఁబడు ప్రతి స్థలమునను వేదాది ప్రమాణ వచనములయందును ఆయా రూపములతో శివుఁడే ప్రతిపాదింపఁబడుచున్నవాడని తెలియునది. పురుషార్థములు వికారములు అజ్ఞానము మున్నగు ధర్మములు ప్రతిపాదింపఁబడిన చోట్లయందును పరబ్రహ్మమగు శివుని శరీరమగు చిదచిద్వస్తువే బోధింపఁబడుచున్నదని నిపుణముగా సమర్థించుకొనవలెననియు సర్వంబు సముచితంబగుచున్నయది.

ప్రశ్న : "నమస్తే రుద్రమన్యవ" ఇత్యాది మంత్రశ్రుతమగు రుద్రశబ్దము "రుద్రో వా ఏష యదగ్నిః" అను శ్రుతిప్రమాణముఁబట్టి యగ్నిపరమగుచున్నందున ప్రకరణ బలమునఁ జేసి రుద్రాధ్యాయము - అగ్నిప్రతిపాదకంబగునని చెప్పవలెనుగాదా ?

ఉత్తరము : "దిశాంచ పతయే" ఇత్యాది వాక్యములు పరరుని సర్వాధిపతిత్వము మున్నగు లక్షణములను చెప్పుచున్నందునః రుద్ర శర్వ పశుపతి శివ శంకరాది శబ్దములతోడను శతరుద్రీయమున

నప్పుడే "పరమేశ్వర పరము రుద్రాధ్యాయము" అను నంశము తేటపడు చున్నదిగదా! "రుద్రోవా ఏషయదగ్నిః" అనునది అర్థవాదవాక్య మగుటచే అగ్నిపరమనుటకు ప్రమాణము కాజాలదు.

ప్రశ్న : పురాణములు తాత్పర్యలింగవశమున శివుని ప్రతిపాదించు చున్నవని చెప్పితిరిగదా! అవ్వానిలో కొన్నిటిని బ్రహ్మదేవుఁడు సాత్త్విక స్వభావముతో చెప్పెననియు మరికొన్నిటిని రాజస స్వభావముతోడను తదితరములను తామస స్వభావముతోడను వక్కాణించెననియు కలదు గావున వైష్ణవములు సాత్త్వికములనియు బ్రాహ్మపురాణములు రాజసములనియు శైవములు తామసములనియు గ్రహించునది. అందును పులస్త్యుని వర ప్రభావమున దేవతా పరమార్థమును కనుగొనిన పరాశరమహర్షి వచించిన విష్ణుపురాణము ప్రబల ప్రమాణ మనఁజెల్లును. "విష్ణోః సకాశాదుద్భూతం-జగత్తత్రైవచ స్థితమ్" "విష్ణువునుండియే సమస్త జగము ఉద్భవించినది. ప్రళయమున విష్ణువునందే యుండునది" ఇత్యాది ముఖ్యాంశములు - విష్ణు పురాణమునందు వ్రాయఁబడియుండుటఁజేసి వైష్ణవపురాణములుమాత్రము ప్రమాణములు కావలయునుగదా?

ఉత్తరము : ఇఁట తాత్పర్యలింగమనఁగా? సర్వకారణత్వాదులు పర్యవసానముఁబొందు సమన్వయ మగును. బ్రహ్మవిష్ణు రుద్రులకు పురాణములలో వినఁబడు సర్వకారణత్వము సర్వసంహర్తృత్వము సర్వాంతర్యామిత్వము మున్నగు బ్రహ్మలక్షణములన్నియు సర్వాంతర్యామియగు పరశివునియందే పర్యవసానముఁ జెందునవి.

శ్లో॥ స్మృతయశ్చ పురాణాని - భారతాదీని సత్తమ,
శివమేవ సదా సాంబం - హృది కృత్వా బ్రువంతిహి॥

పరాశర పురాణము.

"స్మృతులు పురాణములు మహాభారతము మున్నగు ఇతిహాసంబులును సాంబశివు నెల్లకాలము మనస్సునందిడుకొనియే ప్రవర్తించునట్టివి."

ఇట్లు పురాణములలో పరస్పర విరోధమును పరిహరింప నంగీకరింపని యెడల భాష్యములయందలి యధికరణములలోని విషయవాక్యములయందు వినఁబడు సర్వకారణత్వాది బ్రహ్మలక్షణములయొక్కయు ప్రాణ ఆకాశ ఇంద్రాది ప్రకరణములయొక్కయు విరోధము దుష్పరిహారంబగునది. శ్రుతులలో గల విరోధమును నిరాకరించి శ్రుతిప్రామాణ్యము నంగీకరించినట్లు పురాణములకుగూడ నవిరోధ ప్రమాణత్వమును నిరూపింపవలసియుండును.

శ్లో॥ పురాణం మానవో ధర్మః - సాంగో వేద శ్చికిత్సితమ్,
ఆజ్ఞాసిద్ధాని చత్వారి - న హంతవ్యాని హేతుభిః॥

''పురాణములు, మానవస్మృతి, సాంగవేదము, ఆయుర్వేదము అను నాలుగు పరమేశ్వరాజ్ఞాసిద్ధము లగుటచే హేతువాదములతో నవ్వానిని ఖండింపరాదు.''

ఇఁక శివపురాణముల యప్రామాణ్యమునకై పరులు చూపిన మాత్స్యపురాణవచనములు "వృత్రాసురుని స్వవాగ్వజ్రమునలె" పరపక్షమునే బాధించుచున్నయవి. ఎట్లనఁగా? పురాణములు బ్రహ్మ విష్ణ్వాదులలో నొకరికన్న నొకరు గొప్పవారని ప్రతిపాదించునవిగదా! అట్టి ప్రతిపాదనము కల్పభేదమును పురస్కరించుకొనిన యుత్కర్షమునకుఁ జెందినదగుటచే ఎట్టి విరోధములేని ప్రామాణ్యము పురాణముల కన్నిటికిని గలదని మాత్స్య పురాణవాక్యములు తెలుపుచున్నయవి. లోకములో వేడి యెక్కువనుండు కాలము గ్రీష్మమనియు చలువ నిండియుండు సమయము హేమంతమనియు వ్యవహరింపఁబడినట్లు సత్త్వాది గుణాతిశయము గలవారిని సాత్త్వికాది పదములతో నిర్దేశించునట్లును కల్పములయందు సాత్త్వికాది విభాగంబును పరమేశ్వరుని శాసనముతో నేర్పడు సత్త్వాది గుణముల యతిశయమునలననే యని గ్రహించునది. కాని ఆయా కల్పములయందు చతుర్ముఖునకు కలుగు గుణోత్కర్షముఁబట్టి సాత్త్వికాది విభాగము కాఁజాలదు. మరియు పరులు చెప్పునది మాత్స్యపురాణ వచస్సు

లందు కంఠరవేణ లేకుండుటయు గమనింపఁదగినది. మాత్స్యమునందే "పురాణం మానవో ధర్మః" అనుచో చెప్పఁబడిన పురాణమాత్ర ప్రామాణ్యమును మరియు శిష్టులందరు పురాణముల నన్నిటిని పరిగ్రహించుటను ఉల్లంఘించి "కొన్ని పురాణములు - భ్రాంతి మూలకము"లని కల్పించుట- వైదికమార్గ ప్రద్వేషమాత్ర విజృంభణమని చెప్పక తప్పదు. పరరీతిని శివ పురాణముల యపకర్షము ఏర్పడుటలేదు. ప్రత్యుత - ఉత్కర్షమునే గాన నగును.

శ్లో॥ సంకీర్ణాః సాత్త్వికాశ్చైవ - రాజసాశ్చైవ తామసాః॥

కల్పములు - సాత్త్వికములనియు రాజసములనియు తామసము లనియు సంకీర్ణములనియు నాలుగు విధములుగా విభజింపఁబడినవి.

శ్లో॥ యస్మిన్ కల్పేతు యత్ ప్రోక్తం - పురాణం బ్రహ్మణా పురా,
తస్య తస్య తు మాహాత్మ్యం - తత్స్వరూపేణ వర్ణ్యతే॥

ఇచట బ్రహ్మదేవుఁడు - పురాణముల నా యా కల్పములయందు రచించినవాడని చెప్పఁబడలేదు కాని ఆ యా కల్పములలో నభివృద్ధిఁజెంది యుండు దేవతా విశేషముఁ దగు మహిమను వర్ణించినవాడని తెలియునది. ఐతే ఎట్టి గుణముతో నే పురాణమును రచించినవాడని యాకాంక్షఁ నెంతమాత్రంబు నిట వీలులేదు. కాని యిద్ది యే దేవతను సమర్థించునను జిజ్ఞాసకు సమాధానముగా దేవతా విశేషము చెప్పఁబడినది. ఇంతియేగాక "సాత్త్వికేష్వథ కల్పేషు" అనుచో సాత్త్వికాది విభాగము కల్పములకే గాని పురాణములకు కాదని విశదమగుచుగదా! మఱియు కల్పభేదమును పురస్కరించుకొని త్రిమూర్తులలో యుత్కర్షాపకర్షములు ఏర్పడుచుండు నని శివపురాణములోని వాయవీయ సంహితయందు గాననగును.

శ్లో॥ క్వచిద్బ్రహ్మ క్వచిద్రుద్రః - క్వచి ద్విష్ణుః ప్రశస్యతే,
నానేన తేషా మాధిక్యం - న్యూనత్వం వా కథంచన।
త త్తత్కల్పాంతవృత్తాంత - మధికృత్య మహర్షిభిః,
తాని తాని ప్రణీతాని - విద్వాం స్తత్ర న ముహ్యతి॥

"బ్రహ్మదేవుఁడు కొన్ని కల్పములయందు, రుద్రుఁడు కొన్నిటి యందు, విష్ణువు మరికొన్నిటియందు ప్రశంసింపఁబడుచున్నవారు. ఇంత మాత్రమున నవ్వారిలో నొకరికి గొప్పదనమును మరియొకరికి చిన్న తనమును భావింపరాదు. కాని మహర్షులు - ఆ యా కల్పముల చివరి సమాచారమును పురస్కరించుకొని కల్పముల విభాగము నేర్పరుపఁజేసి యున్నవారు. అంతమాత్రమున నిక్విషయమై విద్వాంసుఁడు మోహముఁ జెందరాదు."

ఇట్లు పలులుదాహరించిన మాత్స్య పురాణవచనములతోడనే సర్వ పురాణ ప్రామాణ్యమును నెలకొల్పుటవలన నవ్వారి వాదము నిహత మైనదని తెలియునది.

ఒకవేళ బ్రహ్మదేవుఁడు - తమోగుణము నుపాధిగా గొని శివపురాణముల నావిష్కరింపఁజేసెనని యంగీకరించినను అవ్వాని ప్రామాణ్యము సిద్ధించుచున్నయది.

శ్లో॥ జ్ఞాన మప్రతిమం యస్య - వైరాగ్యంచ జగత్పతేః,
ఐశ్వర్యం చైవ ధర్మశ్చ - సహ సిద్ధం చతుష్టయమ్॥

"అసమానమైన జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము, ధర్మంబు అను నాలుగు - బ్రహ్మదేవునికి సహజములైనవి" అనుచో జ్ఞానవిశేషము గలవాడుగా చెప్పఁబడిన చతుర్ముఖుఁడు - తమోగుణమును ఉపాధిగా గొనియు వక్కాణించిన పురాణవిశేషము ప్రమాణము ఎట్లు కాకుండును? తథాపి మనవలె తమోగుణమున తత్త్వజ్ఞానము లేనివాడై రచించిన పురాణములు ప్రమాణములు కావనునెడ పూర్వోదాహృత మాత్స్యపురాణ శ్లోకములకున్ను ఇదియే గతి పట్టునుగదా!

శ్లో॥ పురాణం సర్వశాస్త్రాణాం - ప్రథమం బ్రహ్మణా స్మృతం
అనంతరం తు వక్త్రేభ్యో - వేదా స్తస్య వినిర్గతాః॥
మత్స్య
బ్రాహ్మమేవ కృతే చాద్యే - పురాణం ధర్మసంహిత
అష్టాదశవిధం తచ్చ - కృతం కోటిప్రభేదతః॥

"శాస్త్రము లన్నిటిలో పురాణమును మొదట బ్రహ్మదేవుఁడు స్మరించినవాఁడు. అటుపిమ్మట నాతని ముఖములనుండి వేదములు బయలు పడినవి."

"ఆద్య సమయమున కృతయుగమునందు శతకోటి శ్లోకములతో పురాణము ఒక్కటిగా నుండెను. తరువాత ఋషులు పదునెనిమిది విభాగ ములతో కోటి గ్రంథముగా సంగ్రహించిరి."

ఇంకను దిగువ ప్రమాణములను చూడనగును.

"యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" శ్రుతి

ఇఁటగల చ శబ్దము పురాణములను శివాగమసంహితలను తెలుపునది.

"తస్మై వేదాన్ పురాణాని - దత్తవా నగ్రజన్మనే"

కూర్మ పురాణము.

ఇఁక పరమేశ్వరుఁడే వేదాది సకలవాఙ్మయకర్త యనుటకు దిగువ శ్రుతి పురాణ వాక్యములను గమనింపనగును.

"అస్య మహతో భూతస్య నిశ్వసితమేతత్, యదృగ్వేదో యజు ర్వేదః సామవేదోఽథర్వవేద ఇతిహాస పురాణమ్" శ్రుతి.

శ్లో॥ ఆదికర్తా కవిః సాక్షాత్ - శూలపాణి రితి శ్రుతిః,
భూయః సభగవాన్ ధ్యాత్వా - చిరం శూలవరాయుధః॥
అసృజ త్సర్వశాస్త్రాణి - మహాదేవో మహేశ్వరః,
ఇత్యేతాః శంకరప్రోక్తా - విద్యాః శబ్దార్థ సంయుతాః॥

రాజధర్మవచనము.

విద్యాస్థానముల కన్నిటికిని పరమేశ్వరుఁడే కర్తయని పై ప్రమా ణముల వలన విశదమగుచున్నందున బ్రహ్మదేవుఁడు తమోగుణముగలవాఁడై కొన్ని పురాణములను రచించెననియు అందువలన నయ్యవి ప్రమాణములు కావనియు శంకించుటకు ఎంతమాత్రము అవకాశము లేదు.

ఇఁక చతుర్ముఖుఁడు సత్త్వాది గుణము ప్రధానముగాగల దేవతను ప్రతిపాదించుటలో న్యూనత యేమియు గానరాదు. సాత్త్వికములుగా పరులచే నామోదింపఁబడిన పాద్మాది పురాణములయందు గల శివరాఘవ సంవాదమున తదితర ప్రకరణములయందును లింగపురాణాదులకన్న నధికముగా శివోత్కర్షము ప్రతిపాదింపఁబడినందున సాత్త్వికాది పురాణ విభాగము మృగతృష్ణవలె నిరర్థకమగుచు పరులకు వృథాఽఽయాస ఫలకమగుచున్నయది.

పరాశర సంహితారూపమైన విష్ణుపురాణము ప్రబల ప్రమాణమని చెప్పు నంశము - వాయుసంహితా రూపమగు శివపురాణమునకు గల ప్రాబల్యమును సమర్థించుచున్నయది. ఎట్లనఁగా ?

శివ మహాపురాణము-సర్వజ్ఞత్వ వైరాగ్యాది గుణసంపన్నుఁడైన పితామహునిచే వక్కాణింపఁబడినది. అందు పరతత్త్వమును తెలియగోరి పరస్పరము వాదించుకొనిన షట్కులీన మహర్షులు బ్రహ్మసభలో ప్రవేశించి "పూజ్యుఁడా! గొప్పదైన అజ్ఞానాంధకారము మమ్మావరించి యున్నందున పరతత్త్వమును కనుగొనఁజాలకుంటిమి. చిత్రకృత్యుండైన ఏ మహానుభావుఁడు జగమును పుట్టించెను? మరియు నియ్యది ప్రళయమున నెవనియందు విశ్రాంతిఁజెందును?" అని జగత్కారణమగు పరదైవమునుగూర్చి సామాన్యముగా ప్రశ్నించిరి. అట్టితటి పితామహుఁడు-స్వపీఠమునుండి లేచినవాడై శివధ్యానముఁగావించి "రుద్రుఁడు" అను పదము నుచ్చరించుచు ఆనందాంబుధిని గ్రుంకులిడి కృతాంజలియై ఇట్లు సంభాషించెను.

శ్లో॥ యస్మా త్సర్వమిదం బ్రహ్మ - విష్ణు రుద్రేంద్ర పూర్వకం,
సహ భూతేంద్రియైః సర్వైః - ప్రథమం సంప్రసూయతే॥
కారణానాం చ యో ధాతా - ధ్యాతా పరమకారణం,
న సంప్రసూయతే ఽ న్యస్మాత్ - కుతశ్చన కదాచన॥

"బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఇంద్రాది దేవతలు సకల ప్రాణులు ఇంద్రియములు అన్నియు ఎవనివలన మొదట నావిర్భవించినవో అట్టి శివుఁడే కారణములకు కారణమగువాడు మఱియు ఎప్పుడును తానెద్దాని వలనను జనించువాడు కాడు గావుననే పరమ కారణమనఁబఱగును."

వేదాంతములయందు ననేక శాఖలలో నధికముగా నభివర్ణింపఁబడిన శివుని నానావిధ వైభవమును ఇట్లు ప్రశంసించి చిత్రకృత్యముగల పర శివుఁ డీ జగమును పుట్టించెననియు మరల తనలోనే లీనముఁ జేసుకొను ననియు శివుఁడే సకలకారణమగు పరదైవంబనియు వక్కాణించినందున శివ మహాపురాణమే ప్రబల ప్రమాణమని విశదమగుచున్నయది.

ఇఁక విష్ణుపురాణమున - శిష్యుఁడైన మైత్రేయుని ప్రశ్నకు మున్నె నవ్వాని హృదయమును కనుగొనిన పరాశరుఁడు పూర్వసిద్ధమగు శిష్య భక్తిని పెంపొందింపఁదలచి విష్ణుపారమ్యము నభివర్ణించినవాడని కలదు. శివపురాణమునం దైతేనో ప్రశ్నించినవారు పెక్కురగుటచే నొకానొకని యుద్దేశము ననుసరింపకయే బ్రహ్మదేవుఁడు సమాధానము నొసగుట గమ నింపఁదగియున్నది.

వేద పురాణ వాక్యములన్నియు శివునియందు తాత్పర్యము గలిగి యున్నవని సూతసంహిత - చాటుచున్నయది.

శ్లో॥ కానిచిత్ వేదవాక్యాని - బ్రాహ్మణా వేదవిత్తమాః ।
రుద్రమూర్తిం సమాశ్రిత్య - శివే పరమకారణే॥
పర్యవస్యంతి విప్రేంద్రా - స్తథా వాక్యాని కానిచిత్ ।
విష్ణుమూర్తిం సమాశ్రిత్య - బ్రహ్మమూర్తించ కానిచిత్॥
ఆగ్నేయమూర్తి మాశ్రిత్య - శ్రుతివాక్యాని కానిచిత్ ।
సూర్యమూర్తిం మునిశ్రేష్ఠా - స్తథైవాన్యాని కానిచిత్॥
ఏవం మూర్త్యభిధానేన - ద్వారేణైవ మునీశ్వరాః ।
ప్రతిపాద్యో మహాదేవః - స్థితః సర్వాసు మూర్తిషు॥

మఱియు "సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ" అనుచోఁ గల జగదాత్మకత్వము సూర్యునియందుగాక "స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే" అను ప్రమాణముఁబట్టి మహేశ్వరునియందే నుపపన్నంబగునని తెలియవలెను. అట్లే "ఇంద్రో రాజా జగతో య ఈశే" అనుచోఁ గల జగదీశ్వరత్వము దేవేంద్రునియందుగాక "ఇంద్రస్యాత్మానం శతధా చరంతమ్" అను శ్రుతి ననుసరించి పరమేశ్వరునియందే సమర్థింపఁబడునని గ్రహించునది.

"ఆపో వా ఇదగ్ం సర్వమ్" ఇత్యాది సందర్భములయందుగల పరత్వముగూడ శివునియందే పర్యవసానముఁ జెందునది. ఐతే శరీరాది నిర్వచనములు గల చోట్లయందు శరీరాది నిరూపణమునందే తాత్పర్యము కాని తదంతర్యామియగు శివుని నిరూపించుట కాఁజాలదు. జీవ విషయమున్ను ఇట్టిదేను; జీవాత్మకు సంసారమున విరక్తి యేర్పడి శరీరాదులపై హేయభావమును కలుగఁజేయుటకుమాత్రము చేతనాచేతన పరామర్శగల ప్రకరణములు ఉపయోగించునని తెలియునది.

"యం పృథివీ న వేద, యస్య పృథివీ శరీరమ్" ఇత్యాదినిగల పృథివ్యాది పదములు - పరమేశ్వరునిచే నియమింపఁబడు పృథివ్యాది దేవతలనే బోధించును. కాని తదంతర్యామిని బోధింపవు. ఎందుకనఁగా? శివుఁడు పృథివ్యాద్యంతర్యామియైనను అవ్వానిచే తెలియఁబడకుండువాడని తదనంతరమే చెప్పఁబడినది.

ఈ యధికరణమునందును నారాయణ పరత్వము సమర్థింప నలవి కానిది. ఎట్లనఁగా? నారాయణునకు నవాంతర సృష్టియందు కల్పాంతరమున కారణత్వము చెప్పఁబడినను ఆదిసృష్టిఁ జెందిన సర్వకారణత్వము ఉపపన్నము కాఁజాలదని గ్రహించునది. త్రిమూర్తి జనకుఁడగువాఁడే సర్వకారణుఁడగునని వివేకము. మూర్తిద్వయ జనకుఁడగువాడు సంకుచిత కారణుఁడు కాదగును. బ్రహ్మోపనిషదమున "అకారం బ్రహ్మాణం నాభౌ, ఉకారం విష్ణుం హృదయే, మకారం రుద్రం భ్రూమధ్యే, ఓంకారం

సర్వేశ్వరం ద్వాదశాంతే" బ్రహ్మ విష్ణు రుద్రాతీతము తురీయంబునగు శివ తత్త్వమే సర్వకారణముగా సహస్రారమునందు ధ్యానింపఁదగినదని ప్రతిపాదింపఁబడినది. మఱియు మైత్రేయోపనిషదమునందు "తమో వా ఇద మేక మాస, తత్పరేణేరితం విషమత్వం ప్రయాతి" ఇత్యాది వాక్యమున "ఆదిసర్గమునకన్న మున్ను తమస్సే నుండెడిది. అట్టి తమస్సు (ప్రకృతి) పరమాత్మచే ప్రేరేపింపఁబడి సంచలనము కలది యగును.

అట్టితఱి ప్రకృతివిశిష్టుఁడైన మహేశ్వరుని రజోగుణాంశము బ్రహ్మగాను సత్త్వ గుణాంశము విష్ణువుగాను తమో గుణాంశము రుద్రుఁడుగా నావిర్భవించినవి." అని వ్రాయఁబడినది. ఇట్టి నాలుగవ తత్త్వము శివుఁడనుటకు మాండుక్యోపనిషదము మరియొక నిదర్శనము.

"శివ మద్వైతం చతుర్థం మన్యంతే, స ఆత్మా, స విజ్ఞేయః"

బ్రహ్మోపనిషద్గతమైన సర్వేశ్వరపదము - శివునికి అసాధారణ వాచకమగునది. "బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాః సంప్రసూయంతే" అను నథర్వశిఖా వాక్యంబు శివునకు మూర్తిత్రయ కారణత్వమును స్పష్టముగా వక్కాణించినది.

మఱియు మహాభారతమున అనుశాసనికమునందు

శ్లో॥ స ఏష భగవానీశః - సర్వ తత్త్వాది రవ్యయః,
సర్వతత్త్వవిధానజ్ఞః - ప్రధాన పురుషేశ్వరః॥
సోఽసృజ ద్దక్షిణా దంగాత్ - బ్రహ్మాణం లోకసంభవం,
వామపార్శ్వా త్తతో విష్ణుం - లోకరక్షార్థ మీశ్వరః
యుగాంతే చైవ సంప్రాప్తే - రుద్రం ప్రభు రథాసృజత్॥

"సర్వతత్త్వాదియు అవ్యయుఁడును సర్వతత్త్వ విధానజ్ఞుఁడును ప్రకృతి పురుష నియామకుఁడు నగు పరమేశ్వరుఁడు - తన కుడి భాగము నుండి లోకస్రష్టయగు బ్రహ్మదేవుని పుట్టించెను. ఎడమవైపునుండి లోక రక్షకుఁడగు విష్ణువు నావిర్భవింపఁజేసినవాడు. హృదయమునుండి లోక ప్రళయంకరుడైన రుద్రు నావిష్కరింపఁజేసెను."

శాంతిపర్వమున

శ్లో॥ యం విష్ణు రింద్రః శంభు శ్చ - బ్రహ్మా లోకపితామహః,
స్తువంతి వివిధైః స్తోత్రైః - దేవదేవం మహేశ్వరమ్॥
త మర్చయంతి యే శశ్వత్ - దుర్గాణ్యతితరంతి తే॥

"బ్రహ్మా విష్ణు రుద్రాదులు అనేక స్తోత్రములతో దేవదేవుఁడైన మహేశ్వరుని ప్రార్థించుచుండురు. అట్టి శివు నారాధించువారు తమ సర్వవిధ సంకటములను దూరమొనర్పఁజాలువారు" ఇఁట త్రిమూర్తులు శివుని ప్రార్థించుట - తమను కాపాడుటకే యని గ్రహించునది. మఱియు నదే శాంతిపర్వమున త్రిమూర్తులను సూర్య చంద్రాది జగమునంతయు సంహరించి తమోమయముగాను నామరూప విభాగరహితముగా నొనర్చువాడు శివుఁడే యని నిర్ధారింపఁబడినది.

ఇందువలన "యతోవా ఇమాని భూతాని జాయంతే" ఇత్యాదిని ప్రబోధితమైన బ్రహ్మము శివుఁడే యని విశదమైనది.

శివపురాణమునందును

శ్లో॥ తస్మాత్త్రయ స్తే కథ్యంతే - జగతః కారణత్రయం ।
కారణత్రయమేతత్తు - శివః పరమకారణమ్॥

స్కాంద మహాపురాణమున

శ్లో॥ బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ - పరతత్త్వ విభూతయః ।
ఏషాం త్రయాణా మధికః - సర్వకారణ మీశ్వరః॥

"బ్రహ్మా విష్ణు మహేశ్వరులు ముువ్వురును పరమేశ్వరుని విభూతి యనఁబఱగుచు జగమునకు నవాంతరకారణ మగువారు. శివుఁడైతేనో త్రిమూర్తులకు నధిష్ఠాతయై పరమ కారణమగువాడు."

ప్రశ్న : మహోపనిషదమున "ఏకో హవై నారాయణ ఆసీత్" అని చెప్పఁబడినందున "బ్రహ్మా విష్ణు రుద్రేంద్రాః సంప్రసూయంతే"

అనుచో గల విష్ణు జన్మము స్వేచ్ఛాఽఽవిర్భావమని యంగీకరింపవలెను గదా ?

ఉత్తరము : అటులగునెడ "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే" అనుచో చతుర్ముఖుఁడును సృష్టికి పూర్వము కలవాడని యున్నందున తదుత్పత్తిని గూడ స్వేచ్ఛాఽఽవిర్భావముగా చెప్పవలెనుగదా ! వస్తుతః "బ్రహ్మా విష్ణు రుద్రేంద్రాః సంప్రసూయంతే" అను ప్రమాణమును పురస్కరించుకొని "ఏకో హవై నారాయణ ఆసీత్" అనుచో "ఆసీత్" అను పదమునకు "రోహితో లోహితా దాసీత్" "శక్తే రాసీత్ పరాశరః" ఇత్యాదినివలె నుత్పత్త్యర్థమును చెప్పవలసియుండును. బ్రహ్మ రుద్రాదులు జన్మించుటకు పూర్వము నారాయణుఁ డొకఁడు సర్గాద్యసమయమున పరమశివునివలన నావిర్భవించినవాడని చెప్పుట సమంజసంబగునది.

ఇఁట ఆసీత్పదమునకు పుట్టుకయను నర్థము పొసఁగుచున్నందున ఏక పదమునకు "తనతో సమానముగా పుట్టువాడు మరియొకఁడు లే"డను నర్థమును చెప్పవలసియుండును.

ఒకవేళ ఏదేనొకరీతిగా ఆసీత్పదమునకు సత్తామాత్ర మను నర్థముఁ జెప్పినను "ఏష వావ ప్రథమోయజ్ఞః" అనుచో జ్యోతిష్టోమయాగమునకు ప్రాథమ్యము నిరూపితమైనను "దర్శపూర్ణమాసాభ్యా మిష్ట్వా సోమేన యజేత" అను శ్రుత్యంతరము జ్యోతిష్టోమయాగప్రాథమ్యమును సంకోచ పరచినట్లు పరమశివమూర్తి - త్రిమూర్త్యతీతుండనియు సర్వమూలం బనియు తెలుపు పెక్కు వాక్కుల విరోధమును పోనాడుటకు "ఏకోహవై నారాయణః" ఇత్యాది విష్ణుపర వాక్యములకు "నారాయణుఁ డొక్కడే పరశివునివలన నావిర్భవించినవాడై సర్వమునకు ముందుండె" నను నర్థమును చెప్పవలెను.

ఇందుకు మను ధర్మశాస్త్రమున నుపక్రమమును చూడనగును.

శ్లో॥ ఆసీదిదం తమోభూత - మప్రజ్ఞాత మలక్షణమ్,
అప్రతర్క్య మనిర్దేశ్యం - ప్రసుప్త మివ సర్వతః॥

తతః స్వయంభూ ర్భగవా - నవ్యక్తో వ్యంజయన్నిద,
మహాభూతాది వృత్తౌజాః - ప్రాదురాసీ త్తమోనుదః
అభిధ్యాయ శరీరా త్స్వాత్ - సిసృక్షు ర్వివిధాః ప్రజాః,
అప ఏవ ససర్జాదౌ - తాసు వీర్య మవాసృజత్॥
తదండ మభవ ద్ధైమం - సహస్రాంశు సమప్రభమ్,
తస్మి జ్జజ్ఞే స్వయం బ్రహ్మ - సర్వలోకపితామహః।
ఆపో నారా ఇతి ప్రోక్తా - ఆపో వై నరసూనవః,
తా యదస్యాయనం పూర్వం - తేన నారాయణః స్మృతః॥

"సృష్టికి మున్ని జగము - నామరూపవిభాగము లేనిదిగా నూహింప నలవిగానిదిగా నిదమిత్థమని నిర్దేశింపరానిదిగా నంతట నిద్రించినట్లుగా తమోమయమై యుండెడిది. అట్టితటి నారాయణుఁడు తనను తాను ప్రకటించునో యనునట్లు పంచమహాభూతములు మున్నగు బలముగలవాడై ప్రళయతమస్సుఁ దొలఁగించు పరశివునివలన నావిర్భవించువాడు. పిమ్మట కొంతతడవు విచారించి తన శరీరమునుండి నానావిధ ప్రాణులను పుట్టింపఁ దలచినవాడై మొదట జలమును సృజించి యందు సిసృక్షయను స్వప్రభావమును నెలకొల్పగా సూర్యసన్నిభము సువర్ణమయము నగు అండము ఉదయించెను. సర్వలోక పితామహుఁడగు బ్రహ్మదేవుఁడు ఆ యండము నుండి శివేచ్ఛావశమున జన్మించినవాడు. ఇట్లు బ్రహ్మదేవునికన్న మున్ను జన్మించిన మహాపురుషుఁడు - ప్రప్రథమము పుట్టించిన జలములు నారములనఁబడుగుటచే నవ్వానియందు పడుకొనియుండుటఁ జేసి నారాయణుఁడుగా పేర్కొనఁబడుచున్న వాడు."

ఇఁట "తమోనుదః" అను పదమును ప్రథమాంతముగా భావించి నారాయణపదమునకు విశేషణముగా చెప్పరాదు. ఎందుకనఁగా? "ఆసీదిదం తమోభూతం" అనుచో సర్గాదిని సమస్త జగమును తమోమయముగా ప్రతిపాదించి "తతః స్వయంభూర్భగవాన్" అనుచో "అనంతరము భగవానుఁడు జన్మించె"నని చెప్పుటవలన పూర్వసిద్ధమగు తమస్సును

తరువాత నుదయించిన నారాయణుఁడు నధిష్ఠించియుండఁజాలడని తెలియ నగును. కావున "తమోనుదః" అనుదానిని పంచమ్యంతముగా నిర్ణయించి శివపరముగా నిరూపించుట సమంజసంబగునది.

మఱియు మనుస్మృతి - ఉపసంహారమునను

శ్లో॥ ప్రశాసితారం సర్వేషా - మణీయాంస మణోరపి,
రుక్మాభం స్వప్నధీగమ్యం - విద్యాత్తు పురుషం పరమ్॥
ఏష సర్వాణి భూతాని - పంచభి ర్వ్యాప్య మూర్తిభిః,
జన్మవృద్ధిక్షయై ర్నిత్యం - సంసారయతి చక్రవత్॥

"చరాచర ప్రాణులను శాసించువాడును అణువుకంటె నణువగు వాడును బంగారు వన్నెగలవాడును సుషుప్తియందు సాక్షాత్కరించువాడు నగు పరమ పురుషుని ధ్యానింపవలసియుండును. ఇట్టి దేవుఁడు పృథివ్యాది పంచభూతముల నధిష్ఠించియుండు సద్యోజాతాది పంచమూర్తులతో సమస్త ప్రాణులను వ్యాపించి సృష్టి స్థితిలయముల నిమిత్తముగా సంసార చక్రమునందు నెల్లకాలము భ్రమింపఁజేయుచుండువాడు."

ఇఁట సర్వభూతవ్యాప్తి యనఁబడు అసాధారణ లక్షణము శివునిదే యగుటఁజేసి తమోఽధిష్ఠాత శివుఁడే కాదగినవాడని తెలియునది. నారాయణుఁడు హిరణ్యగర్భజనకుఁడైనను ఆదిసృష్టిని శివునివలన జన్మించువాడనియు ఆదిసర్గకర్త సర్వకారణంబు నగువాడు శివుఁడే యనియు పై సందర్భమువలన విశదమైనది.

ఇటులనే యోగయాజ్ఞవల్కీయ ధర్మశాస్త్రమునందు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ధారణమునుగురించి చెప్పిన తరువాత దిగువ విధము శివుని ధారణము ధ్యానంబు నిరూపింపఁబడినవి.

శ్లో॥ ఆకాశే వాయు మారోప్య - హకారేణ సమన్వితమ్,
బిందురూపం మహాదేవం - వ్యోమాకారం సదాశివమ్॥
శుద్ధ స్ఫటిక సంకాశం - బాలేందుకృతశేఖరమ్,

పంచవక్త్రధరం సౌమ్యం - దశబాహుం త్రిలోచనమ్॥
సర్వాయుధోద్యతకరం - సర్వభూషణ భూషితమ్,
ఉమా౽ర్ధదేహం వరదం - సర్వకారణ కారణమ్॥
చింతయే చ్చిత్తవిన్యస్తం - ముహూర్త మపి ధారయేత్,
స ఏవ ముక్త ఇత్యుక్త - స్తాంత్రికేష్వపి శిక్షితైః॥

"వాయుతత్త్వమును హకారముతోగూడ నాకాశమందారోపించి హృదయములోని చిదాకాశమునందు శివుని బిందుస్వరూపునిగాను శుద్ధ స్ఫటికమువలెఁ బ్రకాశించువానిగాను చంద్రశేఖరునిగాను ఐదు ముఖములు పదిచేతులు మూడు కన్నులుగల సౌమ్యునిగాను పాశుపత సుదర్శన వజ్రాది మహాయుధములను కరములఁ దాల్చువానిగాను దివ్యాలంకార భూషితునిగాను అంబికాదేవియే సగము శరీరము గలవానిగాను భక్తాభీష్ట ముల నొసగువానిగాను సర్వకారణ కారణునిగాను ముహూర్తకాలమైనను నిలుపుకొని ధ్యానింపవలెను. ఇట్టివాడే ముక్తుఁడగునని మంత్ర తంత్ర ద్రష్టలగు మహానుభావులు వక్కాణించియున్నవారు."

ఇఁట నుమాపతిని త్రిమూర్త్యతీతునిగా నంతర్ధారణముఁ జేయుట ముక్తిహేతువగుటయు తన్మూలముగా మహాదేవుఁడు సర్వకారణుఁ డనఁ బఱగుటయు ముఖ్యాంశము లగుచున్నవి.

మరియు నదే యోగయాజ్ఞవల్క్యయమున

శ్లో॥ ఏతదుక్తం భవత్యత్ర - గార్గి! బ్రహ్మవిదాం వరే,
బ్రహ్మాది కార్యరూపాణి - స్వే స్వే సంహృత్య కారణే।
యుక్తచిత్త స్తథా౽౽త్మానం - ధారయే త్పరమేశ్వరే॥

"బ్రహ్మవిదులలో శ్రేష్ఠురాలవైన గార్గీ! సావధానముగ నాల కింపుము. ఇవ్విషయమున సారాంశమును చెప్పుచున్నాను. బ్రహ్మాది కార్యరూపములను స్వ స్వకారణములగు విష్ణ్వాది రూపములయందు నుప సంహరించి స్థిరచిత్తముగలవాడై తన (జీవాత్మ)ను పరమేశ్వరునియందు నిలుపవలెను."

ఇత్యాది ప్రమాణసంపత్తిచే "ఏకోహవై" అనుచో గల ఆసీత్పదము-నారాయణుని ప్రథమోత్పత్తిని చెప్పుననియు సుబాల నారాయణోపనిషదాదులయందు గల నారాయణుని జగత్కారణత్వము నవాంతర సృష్టి విషయకముగా సమర్థింపనగు ననియు తేటపడుచున్నయది.

ప్రశ్న : ఓయీ ! భవత్సమర్థనము సర్వ శ్రుతులకు విరుద్ధము కానప్పుడుగదా అంగీకారమగును. ఎట్లు అంగీకారము కాదందువేని వినుము.

"యో బ్రహ్మాణం" "యో దేవానాం" అను మంత్రములలో దేవతలకు మున్న బ్రహ్మదేవుఁడు పరశివునివలన నుదయించి "యజుర్భ్యో విష్ణుం" ఇత్యాది వాక్యములఁబట్టి విష్ణు రుద్రులను పుట్టించెనని తెలియుచున్నది. అట్లే "అండం హిరణ్మయం మధ్యే సముద్రం రుద్రస్య వీర్యాత్ ప్రథమం సంబభూవ, తత్ర బ్రహ్మా విష్ణుర్జాతో జాతవేదాః" ఇత్యాది శ్రుతులయందు "రుద్రసంజ్ఞస్య దేవస్య - రూపే మూర్తిః ప్రజాయతే, తేన క్షిప్తం రసే వీర్యం - పరమూర్త్యభిమానినా। తదండ మభవ ద్వీర్యం- సహస్ర కిరణప్రభమ్, విష్ణు స్తత్ ప్రావిశ త్సాఙూత్ - మమశక్తేస్తు వైభవాత్। పున ర్నారాయణాఖ్యాంమే - నియోగాత్ ప్రాప్తవానసౌ" అను వాసిష్ఠ లైంగాది పురాణ వాక్యములయందును రుద్రుఁడు బ్రహ్మ విష్ణువులను పుట్టించెనని విదితమగును. మఱియు మహోపనిషదాది ప్రమాణములు - నారాయణునిచే బ్రహ్మ రుద్రులు తదితరమంతయు సృజింపఁబడెనని చెప్పుచున్నవి. కావున సర్వకారణ వస్తువును నిర్ణయించుట యసాధ్యమని తోచెడిని.

ఉత్తరము : ఇవ్విషయమున పూజ్యుడైన వాయువు దిగువ విధము వక్కాణించెను.

శ్లో॥ తపసా తోషయిత్వా తం - పితరం పరమేశ్వరమ్,
బ్రహ్మనారాయణౌ పూర్వం - రుద్రః కల్పాంతరే ఒ సృజత్॥
కల్పాంతరే పునర్బ్రహ్మ - రుద్రవిష్ణూ జగన్మయః,

విష్ణుశ్చ భగవాం స్తద్వత్ - బ్రహ్మాణ్డ మసృజత్ పునః॥
నారాయణం పునర్బ్రహ్మా - బ్రహ్మాణం చ పునర్భవః,
ఏవం కల్పేషు కల్పేషు - బ్రహ్మా విష్ణు మహేశ్వరాః॥
పరస్పరస్మా జ్జాయంతే - పరస్పర జయైషిణః,
త త్తత్ కల్పాంత వృత్తాంత - మధికృత్య మహర్షిభిః।
ప్రభావః కథ్యతే తేషాం - పరస్పర సముద్భవః॥

పూర్వము ఒకానొక మహాకల్పమున రుద్రుఁడు తన తండ్రియగు పరశివుని తపస్సుతో సంతోషింపఁజేసి తదనుగ్రహమున బ్రహ్మా విష్ణువులను పుట్టింప సమర్థుఁడయ్యెను. మఱియొక మహాకల్పమున చతుర్ముఖుఁడు నట్లే శివానుగ్రహపాత్రుఁడై రుద్రవిష్ణువులను జన్మింపఁజేసినవాడు. ఇంక నొక మహాకల్పమున నారాయణుఁడు పరమేశ్వరు నారాధించి బ్రహ్మ రుద్రాది ప్రపంచము నావిర్భవింపఁజేసెను. మరల బ్రహ్మదేవుఁడు నారాయణుని రుద్రుఁడు బ్రహ్మదేవుని పుట్టించిరి. ఇట్లు త్రిమూర్తులు ఒండొరులను జయింపఁదలచి ఆ యా కల్పములయందు పరస్పరము (ఒకరివలనమఱియొకరు) జన్మించుచుందురు. కావున మహర్షులు ఆ యా కల్పముల నమసరించి త్రిమూర్తుల ప్రభావమును ప్రశంసించియున్నవారు."

ఇట్లు త్రిమూర్తులలో గల కార్యభావము కారణభావంబు తత్తత్కల్పములను పురస్కరించుకొనినదగుటచే సర్వ ప్రమాణములకు విరుద్ధము కాదనియు "నారాయణాత్ బ్రహ్మాజాయతే" ఇత్యాది సందర్భమున నారాయణుఁడు బ్రహ్మ రుద్రాది జనకుఁడని చెప్పుట యవాంతర సృష్టిఁ జెందినదనియు ఇట్లే సర్వకారణవాక్యముల నవిరోధముగా సమర్థించుకొనవలెననియు తెలియునది. ఒకవేళ నిట్లు కాదనినచో "శివ ఏవ కేవలః" "ఏకోహవై నారాయణ ఆసీత్" "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే" ఇత్యాది వాక్యములు పరస్పర విరుద్ధములుగా భాసించుటఁజేసి యప్రమాణములు కావలసివచ్చును.

"ఏవ మపి చతుర్ముఖునివలన రుద్రుఁడు జన్మించినవాడను సంశము శ్రుత్యంతరములయందు సుప్రసిద్ధమగుటచే శివునకు సర్వకారణత్వము భంగపడు" నని శంకింపఁగూడదు.

శ్లో॥ తతాప పరమం ఘోరం - తతో విప్రా శ్చతుర్ముఖః ।
సృష్ట్యర్థం బ్రహ్మణ _స్తస్య - భ్రువో ర్ఘ్రాణస్య మధ్యతః॥
అవిము క్తాభిధా ద్దేశాత్ - స్వకీయా త్తు విశేషతః ।
త్రిమూ ర్తీనాం మహేశస్య - ద్విజా వేదాంతవి త్తమాః॥
అంశభూతో మహాదేవః - సర్వదేవ నమస్కృతః ।
అర్ధనారీశ్వరో భూత్వా - ప్రాదురాసీత్ కృపానిధిః॥

సూతసంహిత.

"వేదాంతవిదులైన విప్రులారా! చతుర్ముఖుఁడు తాజేయఁదలచిన సృష్టి కొనసాగుటకై ఘోరతపము నాచరింపగా మహేశ్వరుఁడు తన యంశముతో పితామహుని కనుబొమలు ముక్కునడుమ స్వకీయమగు అవిముక్త ప్రదేశమునుండి యర్ధనారీశ్వరుఁడుగా నావిర్భవించినవాడు. అట్టితఱి కరుణానిధియగు మహాదేవుని దేవతలందరు నమస్కరించిరి."

మఱియు నీ యంశమునే పరాశరుఁడు రాజధర్మమునందు సంగ్రహముగా వచించెను.

శ్లో॥ సృష్ట్యర్థం బ్రహ్మణః పుత్రో - లలాటా దుత్థితః ప్రభుః॥

శిలాదుఁగూర్చి దేవేంద్రుఁడు లింగపురాణమునందు

శ్లో॥ తస్య హృత్కమలస్థస్య - నియోగా దంశజో విభోః,
లలాటం తస్య నిర్భిద్య - ప్రాదురాసీత్ ప్రభో ర్ముఖాత్॥

"రుద్రుఁడు - స్వహృదయకమలమున నివసించు శివుని యాదేశమునఁజేసి బ్రహ్మదేవుని లలాటమును భేదించి బ్రహ్మ ముఖమునుండి యావిర్భవించినవాడు." అని వక్కాణించెను.

ఇట్లే వాయుసంహితయందు

శ్లో॥ నిర్దిష్టః పరమేశేన – మహేశో నీలలోహితః ।
పుత్రో భూత్వాఽనుగృహ్ణాతి – బ్రహ్మాణం బ్రహ్మణోఽనుజః॥

"పరమేశ్వరుని నియోగమువలన నీలలోహితుఁడైన మహేశ్వరుఁడు పుత్రుఁడుగా జన్మించి బ్రహ్మదేవు ననుగ్రహించినవాడు." మఱియు "త్వామేవ పుత్ర మిచ్ఛామి" అని ప్రార్థించిన చతుర్ముఖు ననుగ్రహించుటకు నాతని లలాటమునుండి రుద్రుఁ డావిర్భవించెనని యాదిత్య పురాణాదులయందు కలదు. మహేశ్వరుఁడు మహాప్రళయమువరకు నుండువాఁడగుటను అవాంతర కల్పములయందు పునః పునః జన్మింపని వాఁడగుట వలనను ప్రతి అవాంతరకల్పమునఁ జెప్పఁబడిన మహేశ్వరుని యావిర్భావము తదంశ విశేషమును గురించినదని యవశ్య మంగీకరింపవలెను.

"తస్య లలాటా త్త్ర్యక్షః శూలపాణిః పురుషోఽజాయత"
"బిభ్రత్సర్గం బ్రహ్మచర్యం తపః" శ్రుతి.

శ్లో॥ తతః పార్శ్వే వృషాంకస్య – బ్రహ్మచారీ వ్యవర్తత,
పింగాక్ష స్తపసా శ్రేష్ఠో – బలవా న్నీలలోహితః॥
ద్రోణపర్వము.

కూర్మపురాణమునందు

శ్లో॥ అహంచ భవతో వక్త్రాత్ – కల్పాంతే ఘోరరూపధృక్,
శూలపాణి ర్భవిష్యామి – క్రోధజ స్తవ పుత్రక ! ॥

"ప్రళయకాలమున భయంకర రూపముతో త్రిశూలపాణినై నీ ముఖమునుండి యావిర్భవింతును కావున నన్ను నీ క్రోధమునుండి పుట్టినవాఁడందురు." అని పరమేశ్వరుఁడు వక్కాణించుటచే పురాణాదులయందు చెప్పఁబడిన రుద్రుని యావిర్భావమును ఐచ్ఛిక అంశావతారముగా భావించుట సమంజసంబగుచున్నయది. ఐతే నొకానొకచో బ్రహ్మ విష్ణువులకన్న రుద్రుఁడు తక్కువవాఁడని చెప్పఁబడిన యంశము – రామకృష్ణాద్యవతారములు దశరథ వసుదేవాదులకన్న నికర్షములగునని లోకదృష్టి

నంగీకరింపఁబడినట్లు స్థాణ్వాది శబ్దములతో తెలుపఁబడు రుద్రుని యంశవిశేషములగూర్చి యని గ్రహింపనగును.

బ్రహ్మ విష్ణువులు మాత్రము స్వమూల రూపములతోడనే రుద్రుని కన్న తక్కువవారనుటకు శ్రుతి ప్రమాణమును గాననగును.

"పరా త్పరతరో బ్రహ్మా - తత్పరా త్పరతో హరిః,
తత్పరా త్పరతో హీశః" శివసంకల్పోపనిషత్తు.

మఱియు "యో దేవానాం ప్రథమం పురస్తాత్ - విశ్వాధికో రుద్రో మహర్షిః,
హిరణ్యగర్భం పశ్యత జాయమానం - స నో దేవః శుభయా స్మృత్యా సంయునక్తు"

అను నారాయణోపనిషద్వచనముఁబట్టియు "బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాః సంప్రసూయంతే" అను అథర్వశిఖావచనమువలనను "బ్రహ్మ విష్ణువులు ఒకరినొకరు పుట్టించుకొనువార"ని చెప్పుటయు ముఖ్యాంశము కాజాలదు.

ఇందుకు మరియొక ప్రమాణము - ఆదిత్య పురాణమున గానఁబడుచున్నయది.

శ్లో॥ ప్రవిష్టో బ్రహ్మణో దేహం - తత్ర దర్శనలాలసః,
విస్మితః కమలాకాంతో - నిర్జగామ విధే ర్ముఖాత్॥
సహస్రశీర్షా పురుషః - పున ర్బ్రహ్మాణ మబ్రవీత్,
విధే త్వమద్య మద్దేహం - ప్రవిశ్యాఽఖి విలోకయ॥
చరాచరాత్మకాన్ లోకాన్ - సదేవాసుర మానుషాన్,
తతో విరించి ర్భగవాన్ - సుందరం కమలాపతేః॥
ప్రవిశ్య సకలాన్ లోకాన్ - దృష్ట్వాఽభూత్ విస్మితో విధిః,
నాపశ్య న్నిర్గమద్వారం - పిహితం చక్రపాణినా॥
తతోఽసౌ నాభిచక్రస్య - నాభిమార్గ మభిందత,
నిర్గత స్తేన మార్గేణ - బ్రహ్మా బ్రహ్మవతాం వరః॥

"నారాయణుఁడు నొకప్పుడు బ్రహ్మదేహమునఁ బ్రవేశించినవాడై యందలి విశేషములనుగాంచి విస్మితుడై విధిముఖమునుండి సహస్ర శీర్షత్వాది లక్షణములుగల పురుషుడుఁగా బయటపడెను. అట్టితటి చతుర్ముఖుని గురించి "నీవిప్పుడు నా శరీరమున త్వరగా చొఱఁబడి యందలి దృశ్యములను గాంచు"మని నారాయణుఁడు నుడువగా బ్రహ్మదేవుఁడు సుందరమగు హరి శరీరమునఁ బ్రవేశించి చరాచర లోకముల నన్నిటి నవలోకించి యచ్చెరువునొందెను. తరువాత వేదవిద్వరుఁడైన చతుర్ముఖుఁడు హరి దేహమునుండి వెళ్ళుటకు మార్గమును (నారాయణుఁడు తన శరీరమునంత నాచ్ఛాదించియుండుటచే) గాంచనందున నాభిచక్రమును భేదించి నాభి మార్గముగుండా బయటికి నేతెంచెను."

ఇత్యాది సందర్భమువలన "అనేక స్థలములయందు చెప్పఁబడిన నారాయణుని జననము వాస్తవము కాదనియు స్వేచ్ఛావతారకృతమగుటచే విలక్షణమైన దనియు రుద్రుఁడు పితామహుని పుత్రుఁడనియు ఒకప్పుడు నారాయణునిచేతను సృజింపఁబడెననియు" పరులు ఆర్భాటించునది వైదికజన పరిగ్రాహ్యము కాజాలదని విశదమైనది.

"అజాత ఇత్యేవ కశ్చి ద్భీరుః ప్రపద్యతే" "రుద్ర యత్తే జనిమ చారు చిత్రమ్" అను మంత్రములయందు జన్మరహితుఁడుగా నిరూపింపఁబడిన మహేశ్వరుఁడు - బ్రహ్మ విష్ణు ప్రార్థన ననుసరించి పరశివ ధ్యానమునకై శ్రేష్ఠమగు నవిముక్త ప్రదేశమునుండి యావిర్భవించుట కర్మమూలకము కాదని తెలియవలెను.

ఇఁక "నమోవిష్ణవే బృహతే కరోమి" అనుచో బృహత్తుగా చెప్పఁబడిన విష్ణువు "జాతో బృహ న్నభిపాతి తృతీయమ్" అనుచో జన్మవంతుఁడుగాను పురాణాములయందు గర్భవాసమునుండి మనుష్యమాత్రుఁడుగా నుదయించినవాడుగాను చెప్పఁబడినందున నారాయణుని జననము స్వేచ్ఛావతారకృతముగాక కర్మమూలక మగునని బోధపడును. అకర్మవశ్యత్వాది లక్షణములు నారాయణునిగూర్చి యెచటను ప్రతిపాదింపఁ

బడలేదు. ప్రత్యుత కర్మవశ్యత్వాదులు విష్ణువునకు గలవని యుత్తరరామాయణమున ఏబది యొకటవ సర్గమున దూర్వాసుఁడు దశరథ మహారాజు నుద్దేశించి దిగువ విధము వక్కాణించిన సందర్భమును పరిశీలింపగా తేటపడుచున్నయది.

శ్లో॥ శ్రుణు రాజన్ పురావృత్తం - తథా దేవాసురే యుధి,
దైత్యాః సురై ర్భర్త్స్యమానాః - భృగుపత్నీం సమాశ్రితాః॥
తయా దత్తాభయా స్తత్ర - న్యవస న్నభయా స్తదా,
తయా పరిగృహీతాం స్తాన్ - దృష్ట్వా క్రుద్ధః సురేశ్వరః॥
చక్రేణ శితధారేణ - భృగుపత్న్యాః శిరోఽహరత్,
తత స్తాం నిహతాం దృష్ట్వా - పత్నీం భృగుకులోద్వహః॥
శశాప సహసా క్రుద్ధో - విష్ణుం రిపుకులార్దనమ్,
యస్మా దవధ్యాం మే పత్నీ - మవధీః క్రోధమూర్ఛితః॥
తస్మా త్త్వం మానుషే లోకే - జనిష్యసి జనార్దన,
తత్ర పత్నీవియోగం త్వం - ప్రాప్స్యసే బహువార్షికమ్॥
ఇతి శప్తో మహాతేజాః - భృగుణా పూర్వజన్మని,
ఇహాగతో హి పుత్రత్వం - తవ పార్థివసత్తమ॥
రామ ఇత్యభివిఖ్యాత - స్త్రిషు లోకేషు మానద,
తత్ఫలం ప్రాప్స్యతేవాఽపి - భృగుశాపభవం మహత్॥

"పూర్వము దేవతలకు రాక్షసులకును ఘోర యుద్ధము జరిగెను. అట్టితటి రాక్షసులు దేవతల యుద్ధాటోపమును సహింప నలవిగాక భృగు మహర్షిగారి భార్య నాశ్రయించి ఆమె యొసగిన అభయమువలన భృగ్వాశ్రమమునందు నిర్భయులై నివసించిరి అందువలన విష్ణువు కోపోద్రిక్తుడై భృగుపత్నిశిరమును తీక్ష్ణమైన తన చక్రముతో ఖండించెను. అట్లు నిహతురాలైన తన భార్యను భృగుమహర్షిగాంచి హఠాత్తు క్రుద్ధుఁడై శత్రు సంహారకుఁడైన నారాయణుని దిగువ విధము శపించెను. "క్రోధమూర్ఛితుడవై అవధ్యురాలగు నా భార్యను సంహరించితివి గావున మనుష్య

లోకమున జన్మించి యనేక వత్సరములు భార్యా వియోగమును పొందు దువుగాత" ఇట్లు పూర్వ జన్మమునందు గొప్ప ప్రభావముగలవాడై నను భృగు మహర్షిచే శపింపఁబడినవాడగుటఁజేసి యిందు నీకు పుత్రుఁడై మూడు లోకములలో "రాము"డని ప్రసిద్ధిఁబొందియు భృగు శాపజన్య మైన ఫలము ననుభవింపగలవాడు."

శ్రీ సుదర్శనాచార్యచరణు లివ్విషయమునే దిగువ విధము విశదీకరించినవారు.

శ్లో॥ ఇచ్ఛావతార మురశాసన గర్భవాసః - స్యాచ్చే దుదాహరణ
మేష విమర్శనీయః,
గర్భే వసామి పరివేష్ట్య జరాయుణా౽హం - మాసాన్ బహూ
నితి మహేశ్వర కస్యకామః॥

శ్లో॥ ఇచ్ఛా౽పి నూన మనుయాతి పురాకృతాని - కర్మాణి శంకర!
శుభాశుభలక్షణాని,
ఇచ్ఛా౽వతార వచనాని తు భారతాదౌ - నారాయణస్య గుణవాద
ముదాహరంతి॥

"నారాయణుని గర్భవాసము - ఇచ్ఛావతారమునకు నిదర్శనమగు నెడల నియ్యంశము విచారణీయమగునుగదా! మహేశ్వరా! స్త్రీ గర్భము నందు జరాయువుతో కప్పఁబడి పెక్కు నెలలు నివసింతునను వాంఛ యెవనికి జనించును? ఐన నిట్టి వాంఛ పూర్వకృతములైన శుభాశుభకర్మల ననుసరించి కలుగునట్టిది. కావున "విష్ణు జన్మము స్వేచ్ఛావతారకృత" మని మహాభారతాదులయందు చెప్పఁబడిన వాక్యములు అర్థవాదము లగునని గుర్తెరుగవలెను."

ఇవ్విధము శ్రుతి స్మృతి పురాణాది ప్రమాణములవలనను న్యాయములఁబట్టియు పరమశివుఁడు త్రిమూర్తికారణుఁడగుటఁజేసి సర్వకారణుఁ డనియు బ్రహ్మ విష్ణు రుద్రులు త్రిమూర్తి జనకులగుటచే నవాంతర కారణులనియు నారాయణమున "విశ్వాధికో రుద్రో మహర్షిః" అనుచో

మరియు శ్వేతాశ్వతరమున "యదా తమస్తన్న దివా న రాత్రిః న స న్నచాస చ్ఛివ ఏవ కేవలః" అనుచోటను విశ్వాధికుఁడగుటచే పరమేశ్వరుఁడే సర్వకారణుఁడుగా చెప్పఁబడినవాడనియు విశదమగుచున్నయది.

ప్రశ్న : నారాయణమునందలి మూఁడవయధ్యాయమున "వేదాహమేతం పురుషం మహాంతమ్" అను పురుషసూక్తగతమంత్రము నుదాహరించుట నారాయణుని పురుషసూక్త ప్రతిపాద్యత్వముఁ దగు ప్రత్యభిజ్ఞానమగుటచే నారాయణంబును విష్ణుపరమగునని యంగీకరింపవలెను గదా ?

ఉత్తరము : ప్రత్యభిజ్ఞానమనఁగా రెండుచోట్లఁ బరామర్శవలన తడవుగా నేర్పడునది; అద్దానికన్న నభిధానశ్రుతులు ప్రబలములగునవి గదా! "క్షరం ప్రధాన మమృతాక్షరం హరః" "శివ ఏవ కేవలః" "మాయినంతు మహేశ్వరమ్" అనుచో హర శివ మహేశ్వరాది ప్రబలాభిధానము లుండుట వలన నారాయణము శివపర మగునని తెలియుచుండగా ప్రత్యభిజ్ఞానము ఎట్లు ఉపయోగించును? ఒకవేళ ప్రత్యభిజ్ఞానమే ప్రబల మనునెడ "యాతే రుద్ర శివా తనూః" "యా మిషుం గిరిశంత హస్తే" ఇత్యాది రుద్రాధ్యాయగత మంత్రములు నారాయణమునందు వినఁబడుటచే, మంత్రోపనిషదమునందలి "వేదాహ మేతమ్" ఇత్యాది మంత్రముల ప్రత్యభిజ్ఞానము పుంసూక్తమునందు నుండుటఁ జేసి పుంసూక్తంబును శివపర మగునని తేటపడుటచేతను "అభివృద్ధికాములకు మూలమే నష్టమైన" దను న్యాయము సిద్ధించుట పరులకు హాస్యాస్పదమైనదిగదా! ప్రత్యుత పురుష సూక్తము నారాయణ పరమగునని చెప్పనలవికాదు. మహాపురుష నారాయణాది శబ్దములు విష్ణువున కసాధారణము లగునని చెప్పుటయు స్వాభిమాన విలసిత మగునట్టిది.

శ్లో॥ బ్రహ్మా నారాయణాఖ్యోఽసౌ – కల్పాదౌ భగవాన్ యథా,
నారాయణాఖ్యో భగవాన్ – బ్రహ్మా లోకపితామహః॥

విష్ణుపురాణము.

ఆశ్వలాయనస్మృతియందును

శ్లో॥ తస్మా దండా దభూ త్సృష్టా - శివాత్మా చతురాననః,
సర్వలోకస్య నిర్మాతా - బ్రహ్మా విశ్వసృజాం పతిః॥
స చాప్సు శయనాదేవ - శివాత్మా స్వేచ్ఛయా చిరమ్,
నారాయణాఖ్యా మభజత్ - శక్తిరూపః ప్రజాపతిః॥

"బ్రహ్మాండమునుండి బ్రహ్మదేవుఁడు జన్మించినవాఁడు; మఱియు చతుర్ముఖుఁడు శివుఁ డంతర్యామిగా కలవాఁడై విశ్వనిర్మాతల కధిపతి యగుటఁజేసి లోకమునంతయు నిర్మించెను. ఒకప్పుడు శివప్రేరితుఁడై స్వేచ్ఛావిలాసమున నుదకములయందు చాలకాలము పరుండినందున శక్తి రూపములలో చేరిన బ్రహ్మదేవుఁడు నారాయణుఁ డను పేరు గలవాఁ డయ్యెను."

కూర్మ పురాణమునందును

శ్లో॥ బ్రహ్మస్వరూపిణం దేవం - జగతః ప్రభవాప్యయమ్" అనుచో పితామహుని పేర్కొని "ఆపో నారా ఇతి ప్రోక్తాః" అనుచో నారాయణపదము బ్రహ్మదేవునిఁ జెప్పునని సమర్థింపఁబడినది. మఱియు నందే "నారా అప్యయనం యస్మా - త్తేన నారాయణః స్మృతః" అనుచో నారాయణపదము శివపర మగునని నిర్ధారింపఁబడినందున నారాయణాది శబ్దములు విష్ణ్వసాధారణము లగునని చెప్పుటకు నవకాశము గానరాదు.

మహచ్ఛబ్దము - భవాది శివాష్టకమున పఠింపఁబడి "అథాష్టభి ర్నామభిః" ఇత్యాది బోధాయన సూత్రమునందు శివనామముగా పేర్కొనఁ బడినది. మఱియు సాంబపురాణమునందు

శ్లో॥ పూజ్యతే యత్సురై ర్నిత్యం - మహాంశ్చైవ ప్రమాణతః,
ధాతు ర్మహేతి పూజాయాం - మహాదేవ స్తతః స్మృతః॥

"దేవతలచే పూజింపఁబడువాఁడును గొప్ప స్వరూపము గలవాఁడును "మహ" అను ధాతువు పూజార్థకమగుటచే శివుఁడు మహాదేవుఁ డనబఱగు

చున్నవాడు." అనుచోటను శివపరముగా నిర్దేశింపఁబడుటచే "పురుషం మహాంతమ్" అనుచో పురుష శబ్దమునకు విశేషణముగా వ్యవహరింపఁ బడుటచేతను మహాచ్ఛబ్దము శివపరమగునని యంగీకరింపవలెను. కావున పురుష మహాపురుషాది శబ్దములు శివునకు నసాధారణము లగుచుండగా నట్లంగీకరింపక పురుషాది శబ్దములు విష్ణ్వసాధారణములఁగునని యెచటను చెప్పఁబడని యంశము నంగీకరించుట - యప్రామాణికమతావలంబనమూలమగు బుద్ధివైపరీత్యము కాని వేరొండు గాదు.

శివాది శబ్దములు నొకే యుపనిషదమునందు కలవని చెప్పునెడ దిగువ శ్రుతులయందు తదితర సర్వోపనిషదములందును శివాభిధానములను గాననగును.

"ఈశావాస్య మిదగ్ం సర్వమ్" ఈశావాస్యోపనిషదము.

"ఈశానో భూతభవ్యస్య" కఠోపనిషదము.

"శివ మద్వైతం చతుర్థం మన్యంతే" మాండూక్యము.

ఇఁక మంత్రోపనిషదము విష్ణుపరమని సమర్థింపఁ బ్రారంభించి "అజాత ఇత్యేవం" అను మంత్రమున శివుని యసాధారణ లక్షణములలో చేరిన దక్షిణ ముఖత్వము నారాయణునకు చెప్పనలవి కానిదని భావించి ఛిద్రవృశ్చికదంశిత చోరునివలె మౌనముతో పలాయనమును చేయవలసి వచ్చెను. విష్ణు సహస్ర నామములలో గల హర శివ శంభు మహేశ్వరాది పదములు - అభిదానకోశ స్మృతులఁబట్టి శివపరములే యగునవి. అట్లే లైంగాదిత్య భారతాదులయందు గల శివ సహస్రనామములలో కొన్ని విష్ణునామములు పేర్కొనఁబడినంత మాత్రమున హాని యేమియు లేదు.

హరివంశమునందు - శ్రీకృష్ణుని కైలాసయాత్రా సందర్భమున శివుఁడు కృష్ణ నుద్దేశించి చెప్పిన ప్రమాణమును దిగువ గాన నగును.

శ్లో॥ నామాని తవ గోవింద - యాని లోకే మహాంతి చ,
తాన్యేవ మమ నామాని - నాత్ర కార్యా విచారణా॥

ఇట్లు చెప్పుటవలన విష్ణుపరమైన నామధేయ మొక్కటియు లభింప కుండుటచేతను గణపత్యాంజనేయాది సహస్ర నామములలో సకల దేవతల నామధేయము లున్నందునను "సర్వాణి హవా ఏతస్య నామధేయాని" అను ఆశ్వలాయన వాక్యము "శ్రేష్ఠ నామధేయములన్నియు శివవాచ కంబు లగు" నని తెలుపుచున్నందునను పరులు మౌనము నవలంబింపవలసి వచ్చునుగదా!

మఱియు

శ్లో॥ లింగమూర్తిం మహాజ్వాలా - మాలాసంవృత మవ్యయమ్,
లింగస్య మధ్యే రుచిరం - చంద్రశేఖరవిగ్రహమ్॥
వ్యోమమార్గే తథా లింగే - బ్రహ్మాణం హంసరూపిణమ్,
విష్ణుం వరాహరూపేణ - లింగస్యాథ స్త్వధోముఖమ్॥
బ్రహ్మాణం దక్షిణే తస్య - కృతాంజలిపుటం స్థితమ్,
వామే విష్ణుం మహాబాహుం - కృతాంజలిపుటం తథా॥
మధ్యే లింగం మహాఘోరం - మహాబ్ధే రంభసి స్థితమ్,
ధ్యాత్వా ప్రదోషసమయే - సర్వసిద్ధి మవాప్నుయాత్॥

ప్రళయకాల సముద్రమున నుదక మధ్యమున జ్వాలామాలాసమావృతము, అవ్యయము భక్తులుగానివారికి భయముఁ గొలుపునదియు నగు మహాలింగ స్వరూపమును బ్రహ్మ విష్ణువులుగాంచిరి. అందు బ్రహ్మదేవుఁడు హంస రూపముతో లింగాగ్రమును కనుగొనఁగోరి యాకాశమార్గమున నూర్ధ్వభాగమునకు పోవుచుండెను. నారాయణుఁడు లింగాంతమును గుర్తెరుగఁదలచి వరాహ రూపముతో భూమిఁ ద్రవ్వి సప్త పాతాళములఁ దెసఁ జనుచుండెను. ఐతే నట్టితటి లింగమధ్యమున మనోహరమైన చంద్రశేఖరమూర్తి - లింగాగ్రాంతములను కనుగొనఁజాలని విధి విష్ణువులకు గాన వచ్చెను. అట్టి మహాలింగమును ప్రదోషకాలమున స్మరించువారు ఐహిక ఆముష్మిక అభీష్టసిద్ధులఁ బడయఁజాలుదురు."

ఇత్యాది ప్రమాణ సంపత్తి ననుసరించి "యమంతః సముద్రే కవయో వయంతి" "అంభస్యపారే" ఇత్యాద్యనువాకములున్ను శివపరము లగుననియే విదితమగుచున్నయది.

ప్రశ్న : ఓయీ! నీ సమర్థనమును చూడఁ జూడ మిగుల నచ్చెరు వగుచున్నది. పురుషసూక్తము విష్ణుపరము కాదందువేని ఉత్తరనారాయ ణమున "హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ" అనుచో గల లక్ష్మీపదమునకు గతి యేమి?

ఉత్తరము : ఓహో! అదియా నీ బాధ; పై వాక్యమున ప్రథమ మగు హ్రీః పదము అంబికావాచక మగుటఁజేసి లక్ష్మీపదమును తదను సారముగా సమర్థింపవలసియుండును. ఇందుకు వాయు సంహితయందు ప్రమాణమును గాననగును.

శ్లో॥ తత్ర మాహేశ్వరీ లక్ష్మ్య - మూర్తి ర్మూర్తిమతః ప్రభోః,
తస్యాంకమండలారూఢా - శక్తి ర్మాహేశ్వరీ పరా॥
మహాలక్ష్మీ రితి ఖ్యాతా - శ్యామా సర్వమనోహరా॥

"శక్తి రూపములలో మాహేశ్వరి యనఁబడు లక్ష్మీమూర్తి - సహజ స్వరూప లావణ్యముగల సదాశివుని యంకమునం దాసీనురాలై శ్యామ వర్ణము గలిగి సర్వ మనోహర రూపముతో విరాజిల్లుచుండును. ఈమెయే మహాలక్ష్మి యనఁబడును."

ఇఁట లక్ష్మీపదము విష్ణుపత్నీవాచకము కాదనియు ప్రత్యుత శివాం కము నధిష్ఠించు మహాలక్ష్మిని బోధించుననియు విశదమగుటచే నుత్తర నారాయణమునకు సరిపడు పురుషసూక్తంబును శివపరమగు ననుటలో ఎట్టి సందేహలేశము లేదు సరిగదా!

మఱియు "అంభస్యపారే" అను మంత్రము ననుసరించి "పురుషస్య విద్మ - సహస్రాక్షస్య మహాదేవస్య ధీమహి" "ఏష హి దేవః ప్రదిశోఽను సర్వాః" "విశ్వత శ్చక్షు రుత విశ్వతో ముఖః" ఇత్యాది మంత్రముల

ప్రత్యభిజ్ఞానము పురుషసూక్తమునందు కలదు గావున "ప్రజాపతి శ్చరతి గర్భే అంతః" అనుచో గల ప్రజాపతి శబ్దము "యస్మాత్ పాతి ప్రజాః సర్వాః - ప్రజాపతి రితిస్మృతః" అను లింగపురాణ వాక్యము ననుసరించి శివపరంబగుటయు, హిరణ్యగర్భపదము "హిరణ్యరేతా హుతభుక్ - రేతోఽభూ దస్య గర్భగః, తస్మా ద్ధిరణ్యగర్భోఽసౌ - పురాణేఽస్మి న్నిరుచ్యతే" అను ప్రమాణముఁబట్టి శివపరంబగుటయును గమనింపఁదగినవి.

"హిరణ్యగర్భః శత్రుఘ్నః" అను విష్ణు సహస్ర నామములలోని హిరణ్య గర్భపదంబును విష్ణుపరము కాదని పై యంశమువలన తేటపడును. మఱియు శత్రుఘ్నపదము - నారాయణునకు కొందరు శత్రువులు మరి కొందరు మిత్రులు కలరని తెలుపుటచే విష్ణువు సర్వేశ్వరుఁడు కాజాలడని తెలియుచున్నయది.

ప్రశ్న : "సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్" అనుచో ధాతృపదము ఉపక్రత మగుటచే నుపసంహారగత మహేశ్వరాది పదములను శివేతరపరముగా నన్వయింపవలెనుగాదా ?

ఉత్తరము : ధాతృపదము నారాయణునియందు రూఢముకాదు సరిగదా! చతుర్ముఖుని చెప్పునందువేని ఉపసంహారగతములగు ననేక పదములు - ఉపక్రమమును బాధింమనని "ఆకాశోఽర్థాంతరత్వాత్" అను నధికరణములోని న్యాయము ననుసరించి బోధపడుచున్నయది. ఎట్లనఁగా? ఆకాశపదము - ఉపక్రమగతమైనను నామరూప నిర్వహణము అమృతత్వము మున్నగు పెక్కు ధర్మములు తరువాత నుండుటచే భూతాకాశ పరముగాక బ్రహ్మపరమగునని నిర్ణయింపఁబడినట్లు నుపసంహారగతములైన రుద్రమహేశ్వరా ద్యనేక పదముల ననుసరించి యుపక్రమగతమైన ధాతృపదంబును శివపరమగుననియే సిద్ధాంతము.

ప్రశ్న : ఓయీ ! "సహస్రశీర్షం దేవమ్" ఇత్యాద్యనువాకమున "నారాయణ పరంబ్రహ్మ" అనుచో నారాయణుఁడు పరమాత్మయని తెలియుచున్నది గదా ?

ఉత్తరము : "దీపో జ్యోతిః పరంబ్రహ్మ" అనుచో చెప్పఁబడినట్లు నీఁట నుపాసకుని ప్రశంసించు సందర్భముండుటఁ జేసి "నారాయణ పరం బ్రహ్మ" అనునంత మాత్రమున పరబ్రహ్మత్వము నారాయణునకు సిద్ధింపఁ జాలదని గ్రహింపవలెను. ఇదే యుపనిషదమున "దహ్రం విపాప్మం - పరవేశ్మభూతమ్" అనుచో దహ్రోపాసనము నుల్లేఖించి "యో వేదాదౌ స్వరః ప్రోక్తః" అనుచో మహేశ్వర శబ్దవాచ్యుండైన పరశివు నుపాసింప వలెనని నిరూపింపఁబడినది. ఐతే "ఈ యుపనిషదము విష్ణు పరముగాక శివ పరమగునని చెప్పునెడ "నారాయణము" అను సంజ్ఞ - చెల్లకుండు" ననినచో వినుము. "వామదేవ్యమగు సామవేదము" అను నానుడివలె నారాయణుఁడను ఋషి కనుగొనిన దగుటచే నిద్దానికి నారాయణమను సంజ్ఞ యేర్పడినదని తెలియుము.

ప్రశ్న : "పద్మకోశ ప్రతీకాశమ్" ఇత్యాది వాక్యమున ప్రతిపాదింపఁబడిన హృదయము నారాయణునిది కాదుగదా! ఉపాసకులగు నితరులదై యుండవలెను. అట్టి హృదయమున నివసించు నారాయణుఁడు ఉపాస్యుఁడగునని తేటపడును గదా ?

ఉత్తరము : ఈ సందర్భమున "అనంత మవ్యయం కవిగ్ం సముద్రేఽంతం విశ్వశంభువమ్" ఇత్యాదిని నారాయణుని ప్రశంసించి, తరువాత "పద్మకోశ ప్రతీకాశమ్" అని చెప్పఁబడిన హృదయము నారాయణునిదే ఐయుండవలెను.

ప్రశ్న : ఐతే మీ ప్రసంగమువలన నారాయణుఁడు శివోపాసకుఁడని తెలియుచున్నది. అట్లగునెడ "నారాయణ పరంబ్రహ్మ" ఇత్యాదిని చెప్పఁబడిన పరబ్రహ్మత్వము నారాయణునకు పొసగకుండును గదా ?

ఉత్తరము : "నారాయణ పరంబ్రహ్మ" ఇత్యాది వాక్యము - ఉపాసకుఁడగు నారాయణుని ప్రశంసించినదగుటచే నర్థవాద మగునది. ఐతే నారాయణుఁడు ధ్యాత ధ్యేయము అను వివేకములేనట్టి సమాధ్యవస్థ

యందు పరబ్రహ్మమగు శివునితోడ నేకీభావమును పొందుటఁజేసి లోకమున గరుడోపాసకుఁడు తా గరుత్మంతుడ నని భావించునట్లు" పరబ్రహ్మత్వాది లక్షణములు కలవాడుగా శ్రుతిచే ప్రశంసింపఁబడుచున్నవాడు. కావుననే "నారాయణం మహాజ్ఞేయమ్" అనుచో "మహాత్ జ్ఞేయం యస్య తమ్" అను వ్యుత్పత్తి ననుసరించి మహచ్ఛబ్దముతో చెప్పఁబడు పరబ్రహ్మము జ్ఞేయము (ఉపాస్యముగా) గా కలవాడు నారాయణుఁడని తెలియుచున్నందున నారాయణుఁడు మహాజ్ఞానియు శివోపాసకుఁడు నగు ననుట యనివార్యము గదా!

ప్రశ్న: అట్లైనచో "స బ్రహ్మ స శివః స హరిః సేంద్రః సోఽక్షరః"

ఇత్యాదివాక్యమున బ్రహ్మశివాదులు - ఉపాస్యుని విభూతికోటిలో చేరినవారని చెప్పఁబడినందున నిట నుపాస్యుఁడు శివునికన్న నితరుడు కావలసివచ్చును. ఒకవేళ నాతడే శివుఁడని చెప్పునెడ "స శివః" అను విభూతివాక్యము సంగతము కాకుండును గదా?

ఉత్తరము: ఇఁట హరిబ్రహ్మాదిప్రాయ పాఠము ననుసరించి చెప్పఁబడిన శివశబ్దమునకు కాలరుద్రుఁడను నర్థమును ప్రతిపాదింపవలెను. మఱియు "స హరిః" అనుటవలనను హరి యుపాస్యుని విభూతి యనియు ప్రత్యుత ఉపాసకుఁడే యనియు తెలియుచున్నందున దహ్రవిద్యయందు నుపాస్యుఁడు శివుఁడే యని నిర్ధారింపవలెను. ఇంతియేగాక నీ యుపనిషదమున శివుఁడే యుపాసింపఁదగినవాడని విశదపఱచుటకు శివరూపమును "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ - పురుషం కృష్ణపింగళమ్" అను మంత్రమభివర్ణించినది. ఒకవేళ నారాయణుఁడే యుపాస్యుఁడగునెడ తద్రూపమును శ్రుతి చెప్పవలసియుండెను. అట్లు చెప్పనందున శివుఁడే హరిబ్రహ్మాది సర్వోపాస్యుఁడనుట వజ్రలేప మగునది.

మఱియు నిట ప్రారంభమున దహరవిద్యను తరువాత నంతరాదిత్యవిద్యను తదనుసారము గాయత్రీవిద్యను ప్రతిపాదించి నీ విద్యాత్రయంబు

నొకచోట నుపసంహరింపఁబడినది. ఇఁక నంతరాదిత్య విద్యయందు "నమో హిరణ్యబాహవే హిరణ్యవర్ణాయ హిరణ్యరూపాయ హిరణ్యపతయేఽంబికాపతయ ఉమాపతయే పశుపతయే నమః" ఇత్యాది మంత్రములు - ఉమాపతియు హిరణ్యస్వరూపము గలవాడు నగు శంకరు నుపాస్యునిగా చెప్పినందున దహరవిద్యయందు నారాయణు నుపాస్యునిగా నెట్లు నిరూపింపనగును ? ఇందువలననే పై మూడు విద్యలలో నుపాస్య రూపమును సమర్పించుటకు "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ" అను మంత్రము బయలు పడినదనియు శివేతర దేవతల నుపాస్యులుగా భావింపరాదని తెలుపుటకు "శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వమన్యత్ పరిత్యజ్య" అను నథర్వ శిఖావచనము విరాజిల్లుచున్నదనియు తప్పక నంగీకరింపవలసివచ్చినది.

మఱియు నిట "సద్యోజాతం ప్రపద్యామి" ఇత్యాది పంచబ్రహ్మ మంత్రములతో గూడిన "ఊర్ధ్వాయ నమః, ఊర్ధ్వలింగాయ నమః" అను లింగసూక్తము పరులు వచింపరానిదియు వినఁగూడనిదియు నగుటచే నీ యుపనిషదము శివపరమగుననుటలో ఎట్టి సందియము గానరాదు.

ఇఁక పురుషసూక్తము విష్ణుపరమగునను వాదమును విచారింతము.

పురుషసూక్తము విష్ణుపూజనమున వినియోగింపఁదగినదను నంశమును దృఢీకరించుటకు ముద్గలోపనిషదము విష్ణుపరముగా పుంసూక్తమును సమర్థించినంత మాత్రమున శ్రుతిలింగాదులచే తెలుపఁబడు యథార్థము బాధింపబడదు గదా! అట్లు కానిచో "అపశవో వా అన్యే గో అశ్వేభ్యః పశవో వై గో అశ్వాః" అనుచో గో వృష భాశ్వములు పశువులగునని శ్రుతి వివరించినందున నట్టి యర్థమే సర్వత్ర గ్రాహ్యమనునెడ "అగ్నీషోమీయం పశు మాలభేత" అనుచో గల పశుశబ్దంబు గో వృషభాశ్వములను బోధింపవలసివచ్చుటచే గొప్ప యనర్థము సంభవించును కావున శ్రుతి నిర్ణీతమగు గో వృషభాద్యర్థము నుపేక్షించి "అగ్నీషోమీయమ్" ఇత్యాదివి పశుశబ్దమునకు ఛాగ (మేక) మను నర్థమును గ్రహించినట్లు పురుష

సూక్తాంతమున "నాన్యఃపంథా అయనాయ విద్యతే" "మోక్షమునకు మరియొక మార్గములేదు" అను వచనమును చెప్పుటచేతను "ఉతామృతత్వస్యేశానః" అను సూక్తి ఈశానపద ఘటితమగుటవలనను పుంసూక్తము శివపరమనక తప్పదు.

ఇందువలననే ఈ భాష్యమునందు "శబ్దాదేవ ప్రమితః" అను సూత్రముతో నొప్పుచున్న యధికరణమున "అంగుష్ఠమాత్రః పురుషః" అనుచో తెలుపఁబడు పురుషుఁడు ఈశానపదశ్రుతిమాత్రమున పరబ్రహ్మ మగునని భగవానుఁడగు బాదరాయణుఁడు నిర్వచించినవాడు.

ప్రశ్న : ఓయీ ! పురుషసూక్త ప్రారంభమున "సహస్రశీర్షా పురుషః" అను వాక్యమందు నారాయణాసాధారణమగు పురుష శబ్దము వినఁబడుచున్నదిగదా ! అద్ది "పురుసంజ్ఞే శరీరేహి-శయనాత్ పురుషో హరిః" ఇత్యాది పురాణ వచనములయందు హరి నామధేయముగా చెప్పఁబడినది. కావున నుపక్రమగతమైన పురుషశబ్దముఁబట్టి యియ్యది విష్ణుపరమనఁ జెల్లును కాదా ?

ఉత్తరము : నీవు చెప్పినట్లు పురుష శబ్దము "పురుషో హవై నారాయణోఽకామయత" ఇత్యాదిని విష్ణుపరముగా ప్రతిపాదింపఁబడినను "పురుషా వాత్మా మానవౌ" అను నిఘంటువుఁబట్టి పురుష శబ్దమునకు గల శక్తి - ఆత్మసామాన్యమునం దేర్పడుటచే ప్రత్యేకముగా విష్ణువునందు కల్పింప వలను పడదుగదా !

ప్రశ్న : అరుణకేతుకమునందు "పూర్వ మేవాహ మిహాసమ్" అను కూర్మాకృతిలో గల నారాయణుని వచనముఁబట్టి తత్పురుషస్య పురుషత్వమ్" అను వాక్యము ననుసరించియు "సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ భూత్వోదతిష్ఠత్" అను ప్రమాణమువలనను నారాయణుఁడే పురుష శబ్దవాచ్యుఁడని చెప్పవలెనుగాదా ?

ఉత్తరము : ఓయీ ! నీవు చూపిన అరుణకేతుకమున "కూర్మః పురుషో భూత్వోదతిష్ఠత్" అనుచో పురుషుఁడు కానివానికి పురుషభావము ప్రదర్శింపఁబడినందున "సహస్రశీర్షా పురుషః" ఇత్యాదిని గల పురుషశబ్దము విష్ణుపర మనఁ జెల్లదు. అట్లు కాదేని పూర్వమునను విష్ణువు పురుషశబ్దముతో వ్యవహరింపఁబడవలసియుండెను. అట్టితఱి "పురుషో భూత్వా" అను వచనము సార్థకము కాకుండును. ఇంతియేగాక "సవై శరీరే ప్రథమః- సవై పురుష ఉచ్యతే, ఆదికర్తా స భూతానాం - బ్రహ్మాగ్రే సమవర్తత" అనుచో పురుషశబ్దము చతుర్ముఖునియందు నుపయోగింపఁబడినందున పురుషశబ్ద శ్రుతితోడనే దేవతావిశేషమును నిర్ణయింప నలవికాదు సరిగదా!

"పురుశబ్దే శరీరే" ఇత్యాది పౌరాణిక వ్యవహారముకన్న "పురుషో వై రుద్రః" ఇత్యాది శ్రౌతవ్యవహారము ప్రబలమగుటచే పురుషశబ్దమునకు గల విశేష శక్తి - పరశివునియందే యేర్పడుచున్నయది.

మఱియు

శ్లో॥ పురుషో నామ సంపూర్ణః - శివః సత్యాదిలక్షణః,
సాంబమూర్తిధరో నాన్యో - రుద్రోఽజో విష్ణురేవహి॥
ఈశో వృక్ష ఇవ స్తబ్ధో - య ఏకో దివి తిష్ఠతి,
తేనేద మఖిలం పూర్ణం - పురుషేణ మహాత్మనా॥

"పురుషుఁ డనఁగా సంపూర్ణ స్వరూపుఁడు సచ్చిదానందమూర్తియు అంబికాసహితుఁడు నగు శివుఁ డగును. తదితరులైన బ్రహ్మ విష్ణ్వాదులు పురుషశబ్దవాచ్యులు కాజాలరు. మరియు నా పురుషుఁడు చెట్టువలె దివ్యాంతరితమున నిశ్చలుడై నిలచువాడు. మహాప్రభావసంపన్నుఁడు సమస్త జగమును శాసించువాడు నగు పురుషునిచే ప్రపంచమంతయు నిండియుండినది." ఇత్యాది పురాణవాక్యములవలనను "వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేక స్తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్" ఇత్యాది శ్రుతివాక్యములవలనను పురుషపదము శివపరమగు ననుటలో సందియము గానరాదు.

"పురుష ఏవేదగ్ం సర్వమ్" అను వాక్యమునకు "సర్వో హ్యేష రుద్రః" అను వాక్యము వివరణమగుటచేసి పూర్ణత్వోపాధికమగు పురుషత్వము శివునియందే నిర్ధారితమగునది. ఇందువలననే "పురుషస్య విద్మ సహస్రాక్షస్య మహాదేవస్య ధీమహి" "పురుషం కృష్ణపింగళమ్" "త మీశానం పురుషం దేవ మీడ్యమ్" ఇత్యాది వాక్యములు పురుషశబ్దమును శివునియందే వ్యవహరించుటచేసి నారాయణపరముగా నుదాహరింపకుండుటను "వేదాంతేషు యమాహురేక పురుషమ్" "వేదాంతము లన్నిటియందు గల పురుషశబ్దము శివైకాంతిక మగు"నని యభియుక్తులు వక్కాణించినందువలనను "పరాత్పరం పురిశయం పురుష మీక్షతే" ఉపాస్యమును గురించిన ఏతాదృశ వాక్యములలో గల పురుషపదము శివున కసాధారణ మగుచున్నయది.

ఇట్లు చెప్పుటవలన పుంసూక్తమునందలి పురుషపదమును వినుటతోడనే శివపరత్వము బోధపడునని విశదమైనది. ఇక పురుష సూక్తము విష్ణుపూజనోపయుక్తమగుటచే విష్ణుపరమగునను నంశము గ్రాహ్యము కాజాలదు. ఎందుకనగా? "యజేత్ పురుషసూక్తేన - ధనదం విశ్వరూపిణమ్" ఇత్యాదిప్రమాణములు కుబేరపూజనమునందు శివారాధనమునందున్ను పురుషసూక్తమునకు వినియోగమును తెలుపుచున్నందున పుంసూక్తము శివపరంబగుననుట వజ్రలేపంబగునది.

ఇందువలన "పుంసూక్తము విష్ణుపర మగునని మంత్రోపనిషదాదులను నారాయణపరములుగా సమర్థించుటను పూర్తిగా నిరసింపనైనది. ఇంతియేగాక ప్రసిద్ధశ్రుతులయందు విష్ణుస్వరూప వర్ణనము గానరాకుండుటను "ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్" "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ పురుషం కృష్ణపింగళమ్, ఊర్ధ్వరేతం విరూపాక్షమ్" ఇత్యాద్యనేకశ్రుతులయందు పరమేశ్వరుని యసాధారణరూపము సభ్యస్తముగా ప్రదర్శించుటచేతను ఔపనిషదుడగు పురుషుడు-ఉమాసహాయత్వాది స్వరూపలక్షణములు గలవాడుగా గుర్తింపబడుట

వలనను కారణప్రకరణగతమైన నారాయణ పదము విష్ణ్వసాధారణమైనను "ఆకాశ స్తల్లింగాత్" అను నధికరణన్యాయము ననుసరించి పరమేశ్వర పరముగా వ్యాఖ్యానింపఁబడుట సమంజసంబగుటను పరులకు పాంచరాత్ర ములు దక్క తదితర శ్రుత్యాదిప్రమాణములు ప్రబలములు కాజాలవని విశదమైనది.

మఱియు శివనామమును స్మరించుటను శివచరణమును సేవించుటను విడనాడువారికి భర్గపదఘటిత గాయత్రీమంత్రమును జపించుటయు "రుద్రోవా ఏష యదగ్నిః" అనుచో రుద్రమూర్తిగా వినఁబడు అగ్ని నుపాసించుటయు జాగ్రద్దశయందు శివలింగదర్శనాదికమును ప్రయత్న ముతో పరిహరించిన వారికి సుషుప్తిలో శివలింగానుసంధానము నని వార్యము లగుటచే పరుల కివ్విషయమున కింకర్తవ్యతావిమూఢత్వ మేర్పడుచున్నయది.

జీవాత్మ-ప్రత్యహము సుషుప్తిలో హార్దబ్రహ్మముఁ జెందుననియు, అట్టి బ్రహ్మము అంగుష్ఠ మాత్ర మనియు, అంగుష్ఠపరిమాణము శివలింగ మునకు సరిపడుటఁ జేసి యద్ది శివలింగ మగుననియు శ్రుతులు నిరూపించు టయే గాక "లింగే సుషుప్తిః" అనుచో హంసోపనిషదము హృదయాంత ర్వర్తి యగు శివలింగమునందు చేతనుఁడు విశ్రాంతిఁ జెందునపుడే సుషుప్తి చేకూరునని కంఠరవమున నిర్ణయించినది. ఇందువలన శివద్వేషులకు సుషు ప్తియు పరిహరింపఁదగిన దగుటయు "ప్రాణానాం గ్రంథిరసి రుద్ర" అనుచో ప్రాణసముదాయము రుద్రుఁడని చెప్పినందున ప్రాణధారణాత్మక జీవనంబు నవ్వారికి పరిగ్రాహ్యము కాకుండుటయు మొదలగు పెక్కు విరోధములు గానంబడుటచే వేదాది వాఙ్మయమంతయు శివపర మగు నను నంశము నిర్వివాదంబగుచున్నయది.

ఓం తత్సత్ - పార్వతీరాజరాజేశ్వర
చరణారవిందార్పణ మస్తు.

ఇ య్యా ది

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్ర భాష్యములో

ప్రథమాధ్యాయాంత ఆంధ్రీకరణము

స మా ప్త ము.

పరాభవ సంవత్సర మాఘశుద్ధ పంచమి, శాలివాహనశకము ౧౮౮౮



గ్రంథకర్తగారి జనకులు

కీ॥ శే॥ శివయోగి శ్రీ నిర్మల రామనాథారాధ్యులవారు,

(నిర్మల)

శ్రీ

ఏతద్భాష్యాంధ్రానువాదమునకు ముద్రణమునకున్ను తమ వాగ్దానముల నందజేసిన మహోదారులు

మాహేశ్వరులు :

బ్రహ్మశ్రీ విద్వాన్, కామర్సు చంద్రమౌళిశాస్త్రిగారు,

సౌ॥ కామర్సు కమలాదేవియు అచ్చుపేట

,, శివయోగిశ్రీ రామగిరి శంకరారాధ్యులవారు ,,

,, లోకారాధ్య ముత్యంపేట బసవయ్య ఆరాధ్యులవారు ,,

,, ,, ముదిగొండ రాజమౌళి ఆరాధ్యులవారు ,,

,, ,, మూలంపల్లి శివలింగారాధ్యులవారు ,,

(శ్రీ రాజశేఖరశాస్త్రిగారి సౌమరస్యముతో)

మూలంపల్లి భ్రమరాంబగారు ,,

,, ,, చప్పి రాజశేఖరసిద్ధాంతి, గణేశశర్మలు ,,

,, ,, డాక్టరు కాశేశ్వరం మల్లయ్యగారు ,,

,, ,, అంబారిపేట విశ్వనాథారాధ్యులవారు ,,

సౌభాగ్యవతి కామాక్షీదేవియు ,,

,, ,, మానకొండూరు భద్రయ్యగారు ,,

ముదిగొండ జగదాంబగారు శంకర్ బాగ్, సికింద్రాబాదు

,, ,, మూలంపల్లి విశ్వనాథయ్యగారి కుమారుడు

రాజమల్లయ్యగారు అచ్చుపేట

కోణసముద్రం శంకరమ్మగారు ,,

ముదిగొండ అన్నమ్మగారు ,,

,, ,, తాటికొండ విశ్వనాథం (వీరమౌళి) గారు ఆరమూరు

,, వే॥ వెలేటి చంద్రయ్య అవధానులుగారు అచ్చుపేట

,, లోకారాధ్య పాకోళ్ళ శేఖరయ్యగారు ,,

,, ,, చప్పి వీరయ్యగారు ,,

,, ,, మూటకోడూరు రాజమౌళిగారు (కీ॥ శే॥) ,,

ముదిగొండ రాజమౌళిగారి కొంపల్లి సుశీలగారు ,,

బ్రహ్మశ్రీ లోకారాధ్య కామర్సు మల్లికార్జున సిద్ధాంతిగారు దుబ్బాక

,, ,, ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మగారు, కృష్ణా పత్రికాధిపతులు, శైవప్రముఖులు, ఉదార హృదయులున్ను జాంబాగ్‌రోడ్, హైద్రాబాదు

,, ,, కాచాపురం పార్వతీశంగారు రాజంపేట

,, దత్తరావు దేశపాండేగారు సిరికొంత, ఆర్మూరుతాలూకా

,, లోకారాధ్య కాచాపురం వీరయ్యగారు రాజంపేట

,, ,, చాగంటి శంకరశాస్త్రిగారు, హైకోర్టువకీలు, మహారాజపోషకులు హైద్రాబాదు

,, ,, మూలంపల్లి సుందరయ్యగారు (కీ॥ శే॥) లచ్చుపేట

,, ,, విడమర్తి రాజేశ్వరరావుగారు మడ్‌ఫోర్టు, సికింద్రాబాదు

,, ,, ఆకిరేపుల మల్లేశ్వరరావుగారు అమీర్‌పేట

,, ,, తాడికొండ పూర్ణమల్లికార్జున అయ్యవార్లంగారి మీనాక్షమ్మగారు చిక్కడపల్లి, హైద్రాబాదు

,, ,, కొంపల్లి కోటిలింగముగారు వరంగల్

,, ,, పులిపాక కేదారలింగంగారు ,,

,, ముదిగొండ మల్లయ్యగారు (గణార్చనపరులు) ,,

,, వై. కోదండ రామశాస్త్రిగారు ,,

,, వైద్య సీతారామయ్యగారు ,,

,, ,, చాగంటి భాస్కరలింగ శాస్త్రిగారు ,,

,, ,, తాడికొండ లింగమూర్తి శాస్త్రిగారు ఈమని

,, ,, ముదిగొండ చిన్నవీరభద్రయ్యగారు వరంగల్

వైశ్యశిఖామణులు తదితరులున్ను

శ్రీయుత దొంతుల రాజయ్య, ఆంజయ్య శ్రేష్ఠిగారలు (స్వపితృ ప్రీత్యర్థము) వాసవీభవన్, దేవీరోడ్, నిజామాబాదు

,, చిటికేసి నర్సిములు శ్రేష్ఠిగారు నిర్మల

శ్రీయుత చీకోటి రామన్న శ్రేష్ఠిగారు — మరిపడిగె, సిద్దిపేటతాలూకా
,, బిచ్చు నారాయణశ్రేష్ఠి మరియు బాపురావుగారు — ఆదిలాబాదు
,, సి. వి. కొండారెడ్డిగారు — జంగ్లాత్ కార్యాలయము, ఆదిలాబాదు
,, వైశ్యసంఘమువారు — రుద్రంగి, జగిత్యాల తాలూకా
,, లింగాల నారాయణరావుగారు — రుద్రింగి
,, వంకమామిడి లింగయ్యశ్రేష్ఠిగారు — సత్యనారాయణవీధి, హైదర్‌బస్తీ, సికింద్రాబాదు
,, నరాల సత్యనారాయణ, వెంకయ్యగుప్తగారు — మారుతీ బీడీఫ్యాక్టరీ, దూదిగాం మరియు నిర్మల
,, అరుగుల గంగాధర శ్రేష్ఠిగారు — కమల్ బీడీ కార్యాలయము, నిర్మల
,, పబ్బా శంకరయ్య శ్రేష్ఠిగారు — శ్రీరామా పవర్ ప్రెస్, సికింద్రాబాదు
,, మరిపెల్లి శంకరయ్య శ్రేష్ఠిగారు — సికింద్రాబాదు
,, కె. పరమయ్య — బి. విశ్వనాథం అండ్ కంపిని, జాంబాగ్, హైద్రాబాదు
,, జె. రాంచంద్రయ్య — టి. వెంకట్రామయ్య అండ్ కంపిని, జాంబాగ్, హైద్రాబాదు
,, వంగపల్లి లచ్చయ్య శ్రేష్ఠిగారు — కంచరిబజారు, సికింద్రాబాదు
,, గోలి శంకరయ్య శ్రేష్ఠిగారు — మోండామార్కెట్, సికింద్రాబాదు
,, రుమాళ్ళ నారాయణ శ్రేష్ఠిగారు — మారేడుపల్లి, సికింద్రాబాదు
,, శేషన్నా చెన్నావార్ అండ్ కంపిని, కైలాసమార్కెటు, పొగాకుబజారు, సికింద్రాబాదు
,, వంగపల్లి వీరయ్య శ్రేష్ఠిగారు — సికింద్రాబాదు
,, అత్తెవల్లి భద్రయ్యగారు — ,,
,, కొటిక వీరమణెమ్మగారు — బార్కాస్, ,,

కెప్టను, డాక్టరు బి.వి. రావుగారు, అశోక్‌నగర్ 1-10-56, హైద్రాబాదు-20

,, అరుణార్తుల శంకరయ్యశ్రేష్ఠిగారు — జనరల్ బజార్, సికింద్రాబాదు
,, బొల్లం లింగయ్య శ్రేష్ఠిగారు — వరంగల్
,, పిడ్డంసెట్టి రామనాథం శ్రేష్ఠిగారు

శ్రీయుత గునిసెట్టి నాగలింగం శ్రేష్ఠిగారు	వరంగల్
,, ఆకారపు చెన్న విశ్వేశ్వరరావుగారు	,,
,, చెరుపూరి మంకయ్యలింగంగారు	,,
,, కొండూరి కుమారయ్యగారు	,,
,, చందా విశ్వనాథంగారు	,,
,, తడుక బాలరాజయ్య అండ్ సన్స్	సుభాన్‌రోడ్, సికింద్రాబాదు
,, చిదిరా రాజలింగంగారు	వరంగల్
,, గందె రాజయ్యగారి లింగయ్యగారు	,,
,, తోట చంద్రశేఖరంగారు	,,
,, బ్రహ్మదేవర ఆనందంగారి సోమలింగంగారు	,,
,, తోట జగన్నాథం సన్‌గారు	,,
,, ఉప్పల శివచిదంబరయ్యగారు	,,
,, పోలా కృష్ణమూర్తిగారు	,,
,, పెద్ది కైలాసంగారు	,,
,, పోలా విశ్వనాథంగారు	,,
,, కందికట్ల శంకరలింగంగారు	,,
,, గందె రాజమౌళిగారు	,,
,, విడియాల పుల్లయ్యగారు	,,
,, తోట బుచ్చిలింగం, ఇరుకుళ్ళ సోమలింగంగారలు	,,
,, రామిణి రాజమౌళిగారు	,,
,, కందిమళ్ళ లింగయ్యగారు	,,
,, నాగభండి చెన్నకిష్టయ్యగారు	,,
,, వెవిసెట్టి చంద్రశేఖరంగారు	,,
,, తాటికొండ నాగయ్యగారు	,,
,, గందె రామలింగంగారు	,,

శ్రీయుత గునిసెట్టి దుర్గయ్యగారు	వరంగల్
,, ఆకారపు గురుచరణంగారు	,,
,, పోలా వెంకటనారాయణగారు	,,
,, పాలకుర్తి లింగమూర్తి బ్రదర్స్, కరీంబాద	,,
,, మద్ది సోమయ్యగారు	,,
,, తోట కైలాసంగారు	,,
శ్రీమతి గుండా రంగమ్మగారు	,,
శ్రీయుత అనంతుల కేదారిగారు	,,
,, ఇరుకుళ్ళ శ్రీశైలంగారు	,,
,, పుల్లూరు కనకయ్యగారు	,,
,, రవ్వ లింగయ్యగారు	,,
,, మాదారపు విశ్వనాథంగారు	,,
,, పెద్ది దుర్గయ్యగారు	,,
,, ఉప్పల విశ్వనాథంగారు	,,
,, గుండా శంకరయ్యగారు	,,
,, పరిమళ్ళ సర్వయ్యగారు	,,
,, ఉప్పల చంద్రమౌళి బ్రదర్స్‌గారు	,,
,, చిదిరా సోమశేఖరంగారు	,,
,, కుంచం శివరాజయ్యగారు	,,
,, గుండా వీరభద్రయ్యగారు	,,
శ్రీమతి భోనగిరి చండికాంబగారు	,,
శ్రీయుత పసుపర్తి చంద్రయ్యగారు	,,
,, తోట వీరేశలింగంగారు	,,
,, కంఠంపాటి రామనాథంగారు	,,
,, పోలా వెంకట పాపయ్యగారు	,,

శ్రీయుత రవ్వ విశ్వనాథంగారు	వరంగల్
,, గుండా రాజయ్యగారి వెంకట్రాజంగారు	,,
,, కామరవెల్లి లింగమూర్తిగారు	,,
,, రాచర్ల రాజలింగంగారు	,,
,, వెనిసెట్టి సోమలింగం శ్రేష్ఠిగారు	అచ్చుపేట
,, ఇంగు గుండయ్యగారు	,,
,, చాల్లేటి నాగవీరయ్యగారు	,,
,, యాద నరహరిగారు	,,
,, యాద దుబ్బయ్యగారు	,,
,, పొలాస దుబ్బయ్యగారు	,,
,, బొందుగుల భూమయ్యగారు	,,
,, ఇంగు రాజయ్యగారు	,,
,, పెద్ది సిద్ధయ్యగారు	,,
,, మజ్జి సుబ్బారావుగారు	విజయవాడ
,, ఏగయ్యగారు	పులిచేరు, నెల్లూరుజిల్లా

వాగ్దానములను అందజేయవలసినవారు

బ్రహ్మశ్రీ లోకారాధ్య మానకొండూరు భద్రయ్యగారు	అచ్చుపేట
,, ,, మానకొండూరు గంగయ్యగారు	,,
,, ,, పాకోళ్ళ శేఖరయ్యగారు	,,
,, ,, గూడూరు సిద్ధరామేశ్వరశర్మగారు	,,
,, ,, వెలేటి చంద్రయ్య అవధానిగారు	,,
,, ,, పెరిసెపల్లి శంకరయ్యగారు	వేములవాడ
శివయోగి బ్ర॥ లో॥ గౌతమ వీరభద్రఅయ్యవార్లంగారు	దువ్వ
బ్రహ్మశ్రీ లోకారాధ్య అత్తులూరు కాశీనాథారాధ్యులవారు	వేములవాడ

శ్రీయుత చీకోటి రామన్న శ్రేష్ఠిగారు	మరిపడిగె
బ్రహ్మశ్రీ లోకారాధ్య కీ॥ శే॥ ఘట్టేపల్లి నాగమల్లయారాధ్యులవారు,	
,, ,, ఘట్టేపల్లి భద్రయ్య శంకరయ్యగార్లద్వారా	సిద్ధిపేట
,, ,, కాచాపురం వీరయ్యగారు	రాజంపేట
శ్రీయుత ఉప్పల గౌరీశంకర్ గుప్తగారు (రాజయోగి)	సికింద్రాబాదు
,, పల్లూరి నారాయణశ్రేష్ఠి	లష్కర్ బజార్, వరంగల్
బ్రహ్మశ్రీ లోకారాధ్య శివపురం సుబ్బారావుగారు	సికింద్రాబాదు
,, ,, మూలంపల్లి రాజమల్లయ్యగారు	లచ్చుపేట
శ్రీయుత పడిశాల వీరభద్రశ్రేష్ఠిగారు	వరంగల్
,, చందా కాంతయ్యశ్రేష్ఠిగారు	,,
,, ఉప్పల విశ్వనాథంగారు	,,
,, రామిణి రాజమౌళిగారు	,,
,, నాగభండి చెన్నకిష్టయ్యగారు	,,
,, రాచర్ల రాజలింగంగారు	,,
,, పసుమర్తి చంద్రయ్యగారు	,,
,, తోట వీరేశలింగంగారు	,,
,, రవ్వ లింగయ్యగారు	,,
,, రవ్వ విశ్వనాథముగారు	,,
బ్రహ్మశ్రీ లోకారాధ్య కామర్సు మల్లికార్జున సిద్ధాంతిగారు (సౌ॥ కామర్సు గంగమణిగారిద్వారా)	దుబ్బాక

ప్రకటన

శ్రీ నిర్మల శంకరశాస్త్రి గారిచే వ్రాయఁబడి ముద్రింపఁ జేయఁబడిన గ్రంథములు

1. విదుర మహానీతి (మహాభారతాంతర్గతము) ప్రథమభాగము, సంస్కృత శ్లోకములకు తెలుగు.
2. వైదికమత సామరస్యము-శివాద్వైత సిద్ధాంతము (తెలుగు వచనము)
3. సహస్ర కమలార్చన, తెలుగు.
4. శివపూజా మంత్రార్థము-లఘు శివపూజా విధానముతో.
5. నీలకంఠ భాష్యము, చతుఃసూత్రి, ఆంధ్రానువాదము.

అముద్రితములు

1. గురుశిష్య సంవాదము, తెలుగు.
2. శివ పంచాక్షరీ పురశ్చరణ విధానము, తెలుగు.
3. గీతా తాత్పర్య నిర్ణయము, తెలుగు.

ఇంకను ఇతర రచనలు కలవు

—: వివరములకు :—

శ్రీ నిర్మల శంకరశాస్త్రి
184, సర్వమంగళాభవనము,
నెహ్రూనగర్, (మారేడుపల్లి)
సికింద్రాబాదు-ఆం. ప్ర.

శ్రీ నిర్మల శంకరశాస్త్రి
సోమవారంపేట
నిర్మల
ఆదిలాబాదు జిల్లా-ఆం. ప్ర.

నీలకంఠ భాష్య ద్వితీయభాగము దొరుకు స్థలములు

శ్రీ నిర్మల శంకరశాస్త్రి,
184, సర్వమంగళాభవనము
నెహ్రూనగర్, సికింద్రాబాదు.

శ్రీ నిర్మల రామనాథశర్మ,
184, బ్రహ్మానందభవనము
నెహ్రూనగర్, సికింద్రాబాదు.

శ్రీ నాగేంద్ర బుక్‌డిపో
కింగ్స్‌వే, సికింద్రాబాదు.

శ్రీరామా బుక్ డిపో
మార్కెట్‌స్ట్రీట్, సికింద్రాబాదు.

శ్రీ కొండా శంకరయ్య
పుస్తకముల వ్యాపారము
సికింద్రాబాదు - హైద్రాబాదు - వరంగల్.